
భాగవతము

# భాగవత కథ-3



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంథాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొంణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ

# భాగవత కథ

## (శ్రీ మద్భాగవత దర్శనము)

## తృతీయ భాగము

హిందీ మూలము

శ్రీ౧౦౮ ప్రభు దత్త బ్రహ్మచారి మహారాజు

ఆంధ్రానువాదకులు, శ్రీరామ శరణ్

శ్రీ కుందుర్తి వేంకట నరసయ్య

శ్రీ వేంకటేశ్వరార్ష భారతీ ధర్మసంస్థ

హైదరాబాదు.

రించును. పదునెనిమిది పురాణములలో భాగవతమొకటి. ఇది శ్రీ మద్భాగవతమా, దేవీ భాగవతమా, అను విషయమున పండితులలో వివాదమున్నది. కాని పలువురది శ్రీ మద్భాగవతమే యని భావించుచున్నారు. ఇది యెంతమనోహరమో, భాషా భావము లందంత క్లిష్టమైనది. అందుచేతనే "విద్యావతాం భాగవతే పరీక్షా" అను నానుడి యేర్పడుటయు, పోతరాజు "భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు శూలికైనఁ దమ్మిచూలికైన" నని చెప్పుటయు సంభవించినది "భగవతః ఇదమ్" (భగవంతునికి సంబంధించునది) అని భాగవత శబ్దమునకు వ్యుత్పత్తి. ఇందు భగవన్మాహాత్మ్య బోధకములైన విషయములు కథలు అనేకములుండును.

సర్గము, ప్రతిసర్గము, వంశము, మన్వంతరములు, వంశానుచరితము అను పంచలక్షణములు పురాణమునందుండును. శ్రీ మద్భాగవతము పురాణమగుటచే నిందా పంచలక్షణములును కలవు. వీనితో పాటిందు శ్రీమన్నారాయణునికి సంబంధించిన ఏక వింశత్యవతారములును (21) వర్ణింపఁబడియున్నవి. "యదాయదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత" "పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం, ధర్మ సంస్థాప నార్థాయ సంభవామి యుగే యుగే" అని శ్రీ మద్భగవద్గీతలో భగవంతుఁడు చెప్పినట్లాతఁడు ధర్మసంస్థాపనము కొఱకును, సాధురక్షణ, దుష్టశిక్షణముల కొఱకును భూమిపై నవతరించుచుండును. ఆ యవతారముల విషయమే శ్రీ మద్భా

గవతము నందు ప్రపంచింపఁబడినది. మత్స్యకూర్మాద్యవతారములన్నియు నవతార ప్రయోజనములను నిర్వహించిన మాట వాస్తవమేయైనను "కృష్ణస్తు భగవాన్ స్వయ" మ్మను సూక్తి ననుసరించి యిందు దశమస్కంధమున శ్రీ కృష్ణుని జన్మాది వృత్తాంతములు విపుల తరముగా వివరింపఁబడినవి. భాగవత తారహారమునకు దశమస్కంధము తరళ ప్రాయము.

శ్రీ మద్భాగవతమున కర్మజ్ఞాన విషయములు కూడ ప్రతిపాదింపఁబడినను భక్తికే అందు ప్రాధాన్యము. మోక్ష ప్రాప్తి కదియే పరమసాధనమని యిది బోధించును. అందలి కథోపాఖ్యానము లన్నియు భక్తిమహత్త్వ ప్రతిపాదనము నందే పర్యవసించును. జగద్గురు శ్రీ శంకరాచార్యులవారు కూడ భక్తిని నిరసింప లేదనుటకు "మోక్షసాధన సామగ్ర్యాం భక్తి రేవ గరీయసీ" అని వివేకచూడామణిలో చెప్పియుండుట నిదర్శనము. సత్యముకూడనంతే. కలియుగము నందలి జనులు కర్మజ్ఞాన మార్గముల నవలంబింపఁజాలని వారగుటచే భక్తినే ఆశ్రయింపవలయును. సంసార సాగరతరణమున భక్తియే నిరపాయమైన నౌక. వ్యాసభగవానుఁడు భాగవతము నిగమ కల్ప తరువు నుండి జాఱిన ఫలమని చెప్పియుండెను. అది కల్పతరువువలె భక్తులకు సర్వాభీష్టముల సిద్ధింపఁ జేయును.

వ్యాసుఁడు సంస్కృతమున రచించిన శ్రీ మద్భాగవతమును మహా భక్తుఁడును, కవిపుంగవుఁడునైన బమ్మెర పోతరాజు గద్య పద్యాత్మకముగా తెలుఁగున కనువదించెను. అతఁడు

రచించిన భాగవతము నందలి కొన్ని భాగము లే కారణము చేతనో శిథిలమగుటచే వాని నతని శిష్యులలో శిష్యులోయైన గంగన, సింగన, నారయ యను వారు పూరించిరి. అయినను తెలుగున భాగవతము మాట వినంతనే పోతరాజే తలంపునకు వచ్చును. ఆంధ్ర దేశమున నతని భాగవతమున కున్నంత ప్రచారము మరే గ్రంథమునకును లేదనుటలో నతిశయోక్తి లేదు. అందుకతని పద్యములందలి ధారాశుద్ధియు నానృతో దృశ్యమైన మాధుర్యమును కారణములు. అందలి పద్యము లొండో, రెండో నోటికి రాని అక్షరాస్యుండు మొన్న మొన్నటి వఱకు ఆంధ్ర దేశమున నుండెడి వాడు కాడు. కాలవైపరీత్యముచే నిప్పుడందలి పద్యములను కంఠగతము లొనరించుకొను వారి సంఖ్య చదువుకొన్న వారిలోనే చాల తక్కువైనది. పోతరాజు సంస్కృత భాగవతమును యథాతథముగా నాంధ్రీకరించి యుండలేదు. భక్తిభావ భరితమైన భాగముల నాతడు పెంపొందించి యుండెను. అది గాక పద్యకావ్యముల నర్థము చేసికొనగలవా రిప్పుడెందఱో యుండరు. అందుచే సంస్కృత భాగవతమునకు రెండు మూడు వచనానువాదములు కూడ వెలసినవి. భాగవతమువంటి ఉత్తమ గ్రంథమెంత అధికముగా ప్రచారము పొందిన లోకమున కంత మేలు కలుగును.

తపోనిష్ఠాగరిష్ఠులు, యోగిపుంగవులు, భక్తశిఖామణులునైన శ్రీశ్రీశ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు జగద్విఖ్యాతమైన శ్రీ భాగవతము నందలి విషయములను కథాదృష్టాంతానుభవ

పూర్వకముగా సరళసుందరమైన హిందీ భాషలో నలుపది సంపుటములుగా వచన రూపమున రచించి యుండిరి. అది హిందీ భాషాభిజ్ఞుల అదృష్టము. వానిని భక్తవరేణ్యులు శ్రీ రామశరణ్ కుందుర్తి వేంకటనర్సయ్య గురుపుంగవులు సర్వసుబోధమైన భాషలో తెలిగించి యుండిరి. భక్తిప్రధానమైన శ్రీ మద్భాగవతమును భక్తవరేణ్యుడైన పోతరాజాంధ్రీకరించుటవలన నాంధ్రలోకమున కెంత మహోపకారము జరిగినదో భక్తచూడామణులైన శ్రీ ప్రభుదత్తబ్రహ్మచారి గారి హిందీ గ్రంథమును భక్తిరమ్ములైన శ్రీ కుందుర్తి గురుపుంగవులాంధ్రీకరించుట వలన నంతమహోపకారము జరిగినది. ఆ గ్రంథమునకు శ్రీ మద్భాగవతదర్శనమును పేరు సార్థకము. అది రెండు సార్లు ముద్రితమైనది. కాని ప్రతులిప్పుడు లభ్యములగుట లేదు. అది చూచి నిత్యధర్మకార్యపరాయణులును వదాన్యశేఖరులునైన భక్తులొకరా సంపుటములను పునర్ముద్రించుట వలన లోకమునకు మేలు కలుగునని అందుకు సంకల్పించిరి. వారు సిద్ధసంకల్పులు. వారి సంకల్పబీజము వృక్షమై యిప్పుడీ గ్రంథముల రూపమున ఫలించినది. ఆంధ్రులాఫలమును ఆస్వాదించి ఆనంద పారవశ్యము పొందుదురనుటలో సందేహము లేదు.

ఆ భక్తులే శ్రీ వేంకటేశ్వరార్షధర్మ భారతీధర్మసంస్థను స్థాపించి దాని పక్షమున అష్టాదశ మహా పురాణములను తెలుగు లిపిలో తాత్పర్య సహితముగ ముద్రించి ఆంధ్రులకు మహోపకారము చేయుచున్నారు. ఈ భాగవతకథా సంపుటములు కూడ శ్రీ వేంకటేశ్వర ఆర్షభారతీ ధర్మసంస్థ పక్షముననే ముద్రింపబడుచున్నవి.

శ్రీ వేంకటేశ నామ్నా
భారత సంస్కృతిప్రవర్ధనార్థాయ
సంస్థాపితేయం ధర్మ
సంస్థార్షా జయతు భగవతః కృపయా.

— దివాకర్ల వేంకటావధాని

నిగమకల్పతరో ర్గళితం ఫలం
శుకముఖాదమృతద్రవ సంయుతం
పిబత భాగవతం రస మాలయం
ముహురహో రసికా భువి భావుకాః

— సంస్కృత భాగవతము

లలితస్కంధము కృష్ణ మూలము శుకా
లాపాభిరామమ్మమం

జులతాశోభితమున్ సువర్ణ సుమన
స్సుజ్ఞేయమున్ సుందరో

జ్జ్వల వృత్తమ్ము మహాఫలమ్ము విమల
వ్యాసాలవాలమ్మునై

వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వు
ర్విన్ సద్ద్విజశ్రేయమై

- శ్రీ మదాంధ్ర మహాభాగవతము

# విషయసూచిక


| వివరములు | పేజీ నెం. |
|---|---|
| ధర్మరాజు అశ్వమేధయాగము చేయఁదలచుట | 1 |
| మరుత్తుని యజ్ఞధనము : ధర్మజుని అశ్వమేధము | 9 |
| విదురుఁడు | 24 |
| హస్తినాపురమునకు విదురాగమనము | 32 |
| ధృతరాష్ట్రునకు విదురుని వైరాగ్యోపదేశము | 41 |
| విదురునితోఁగూడి ధృతరాష్ట్రుఁడు వెడలుట | 50 |
| విపరీత ధర్మములఁగని ధర్మజుడు చింతించుట | 67 |
| ధర్మజునకు కనఁబడిన అపశకునములు | 90 |
| ద్వారావతినుండి అర్జునాగమనము | 96 |
| ప్రభు కృపను అర్జునుఁడు వర్ణించుట | 104 |
| ఖాండవ దహనమునఁ గృష్ణకృప | 112 |
| జరాసంధ వధ సమయమునఁ గృష్ణునికృప | 124 |
| ద్రౌపది వలువలూడ్చునపుడు కృష్ణకృప | 136 |
| దూర్వాసశాపమునుండి రక్షించిన విధము | 139 |
| పశుపతితో యుద్ధము — కృష్ణకృప | 151 |
| లోకపాలురద్వారా అస్త్రప్రాప్తి | 158 |
| దేవేంద్రుని అర్ధసింహాసనము లభించుట | 166 |
| నివాతకవచుల జంపునపుడు కృష్ణకృప | 168 |
| గోధనహరణ సమయమునఁ గృష్ణకృప | 175 |
| మహాభారత యుద్ధములోఁ గృష్ణకృప | 182 |
| అయ్యో ; హరిచే రథమును తోలించితిని గదా : | 192 |




బాలపరీక్షిత్తు కృపునికడకరుగుట (పేజీ 8)




రాజసూయయాగము చేయుటయెట్లని భయపడుచున్న ధర్మరాజునకు
కృష్ణుడు ధైర్యము చెప్పుట (పేజీ 9)



నారదుడు మరుత్తుని కడకు వచ్చుట (పేజి 16)



శూలమునందు గ్రుచ్చబడిన మాండవ్యుని రాజు దర్శించుట

(పేజీ 28)



విదురుడు హస్తినాపురమునకు వచ్చుట (పేజీ ౩౬)



విదురుడు ధృతరాష్ట్రునకు వైరాగ్యమునుపదేశించుట (పేజీ 44)



గాంధారీ విదురులతో ధృతరాష్ట్రుడు మహాప్రస్థానమునకరుగుట

(పేజీ 53)



గాంధారీ ధృతరాష్ట్రులు దావాగ్నిలోపడి భస్మమగుదురని
నారదుడు తెల్పుట (పేజీ 66)



ధర్మరాజు దుర్నిమిత్తములుగని చింతించుట (పేజీ 71)



ద్వారకనుండి అర్జునుడరుదెంచుట (పేజీ 97)



అగ్ని బ్రాహ్మణ రూపమున కృష్ణార్జునులకడకు వచ్చుట (పేజీ 116)



ఖాండవ దహన సమయమున కృష్ణకృప (పేజీ 119)



దుశ్శాసనుడు ద్రౌపది చీరలూడ్చుటకు యత్నింప అవి కృష్ణకృపచే
మరల వచ్చుచుండుట (పేజీ 134)

శ్రీరామ

# భాగవతకథ

## ధర్మరాజు అశ్వమేధయాగము చేయఁదలఁచుట

౪౧

శ్లో॥ ఆహూతో భగవాన్ రాజ్ఞా, యాజయిత్వా ద్విజైర్నృపమ్।
ఉవాస కతిచిన్మాసాన్ సుహృదాం ప్రియ కామ్యయా॥

—శ్రీ మద్భాగవతము ౧ స్కం. ౧౨అ. ౩౫ శ్లోకము

"మఱియు ధర్మనందనుండు ...... .... సమాయత్త యజ్ఞోపకరణుండై సకలబంధుసమేతంబుగఁ గృష్ణుని నాహ్వానంబు చేసి పురుషోత్తము నుద్దేశించి మూఁడు జన్నంబులు గావించెఁ దదనంతరంబ కృష్ణుండు బంధు ప్రియంబు కొఱకుఁ గరినగరంబునఁ గొన్ని నెల లుండెను."

—శ్రీమదాంధ్ర భాగవతము.

మానవుఁడు తన కోరిక నెఱవేరనప్పుడు దుఃఖమును జెందు చుండును. విషయభక్తుల కోరికలు నెఱవేరవు. విషయాసక్తుని కోరికలు నెఱవేరవు సరిగదా, యింకను పెరుగును విషయాసక్తుఁడు గాక భగవద్భక్తుడైన వానికి కోరిక లుండనే యుండవు. ఆతనికి స్వతంత్రేచ్ఛ యుండనేయుండదు. అతఁడు తన కోరిక లన్నిటిని భగవదిచ్ఛలో సమ్మిళితము కావించును. భగవత్ప్రేరణచే నేదైన నిచ్ఛ పొడమునెడల

నదియెంత కఠినమైనదైనప్పటికిని తనయొద్ద నేవిధమగు సాధనములేక పోయి నప్పటికిని అది నెఱవేరితీరును. ఎవని సంకల్పముచే నీ చరాచర సృష్టి అయినదో అట్టివానికి ఈ సాంసారిక సాధారణ సామగ్రుల నెఱవేర్చు టెంతపని?

పరీక్షిన్మహారాజు మిక్కిలి గారాబముతో లోపల వెలుపల నత్యంత ప్రేమతో శుక్లపక్ష క్షపాకరునివలె దినదినాభి వృద్ధి చెందు చుండెను. రాణివాసములో నతఁడొక్కఁడే పసిబిడ్డఁడును, వంశాకుర మును. అందువలన నింటిలోని స్త్రీలందఱును దమ ప్రేమనంత నాతని పైనే పెట్టుకొనిరి. కన్నులు రెప్పలవచేలెనాతఁడు మిక్కిలి జాగరూకత తోఁదన తల్లి, నాయనమ్మ, ముత్తవ్వ, పినతల్లి, పెదతల్లి మొదలగు వారలచేఁ బెంపఁబడు చుండెను. వాని కేదైన కష్టము సంభవించెనా రాణివాసమంతయు శోకాచ్ఛాదితము కాఁగా, వివిధోపచారములచేతను, వివిధోపాయముల ద్వారమునను దానిని శాంతింపఁ జేయుచుందురు. పారాయణము, దేవతార్చనము చేయించుచుందురు. లోభివాడు తన సొత్తునెట్లు రక్షించుకొనునో, అట్లే అతనిని, వారు రక్షించుచుండి రను నదియే దీని సారాంశము.

పంచపాండవుల కాతడు బహిః ప్రాణము. అవసరపడినప్పుడు యుధిష్ఠిరుఁడు అతని నంతఃపురమునుండి తెప్పించుకొని, తనయొడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని గంటలకొలఁది యాతని నాడించుచుండును. బాలకుఁడగు పరీక్షిత్తు సభలోనికి వచ్చినప్పుడెల్లను అచ్చట నుండు వారల నందఱను ప్రత్యేకముగ నేకాగ్రముగఁ జూచుచుండెడివాఁడు. పుట్టినది మొదలిట్లే నలువైపులను మిక్కిలి ధ్యానపూర్వకముగఁ జూచు చుండుటనుగాంచి, యాతఁడిట్లెందులకుఁ జూచుచున్నాడా యని యుధిష్ఠి

రుఁడాశ్చర్య పడుచుండెను. అతఁడంతఃపుర స్త్రీలనుగూడ "ఈతఁడంతః పురము లోపలఁగూడ నిట్లే చూచుచుండునా?" యని యడిగెను.

దాసీజనము చేతులుజోడించి యిట్లనిరి:- "దేవా! ఈతఁ డంతః పురములో మిక్కిలి సౌమ్యముగ నుండును. తన తల్లివంక నైనను సరిగాఁ జూడఁడు. కాని బయటకు రాఁగానే యెవఁడైన నతని యెదుటకు వచ్చెనా వానిని మిక్కిలి జాగరూకతతోఁ దదేకదృష్టితోఁ జూచుచుండును."

ధర్మరాజునకు బాలుఁడిట్లెందులకుఁ జూచుచున్నాఁడా యను నాశ్చర్య మెక్కుడయ్యెను. అతఁడు విద్వాంసులగు బ్రాహ్మణులను, జ్యోతిష్కులను, పండితులను, బురోహితులను బిలిపించి దీనికి కారణ మేమని యడిగెను. అంత వారిట్లనిరి :— "ఈతఁ డెవరినో వెదకు చున్నాఁడు."

"ఎవరిని వెదుకుచున్నాఁడో? తన తండ్రినా? లేక ఎవరైన దేవతనా? ఋషినా?" అని ధర్మరాజనెను.

బ్రాహ్మణు లిట్లనిరి :—"మహారాజా! ఈతఁడు తండ్రిని జూడనే చూడలేదు. ఈతఁడొకానొకనిని గర్భములోఁ జూచినాఁడు. ఈ మానవు లలోఁదనను గర్భములో రక్షించినవాఁడెవఁడో యని యాతఁడు వెదకు చున్నాఁడు. మనుష్యులలో నాతఁడు వానిని గానక క్రొత్తగా వచ్చిన వారిలో నెవడైననట్టి వాఁడు లభించునేమోయని వెదకుచున్నాఁడు అందఱను బరీక్షించుటచేతనే యీతనికి 'పరీక్షిత్' అను పేరు సార్థకము కాఁగలదు. 'విష్ణురాతుఁడు' అను పేరు చాల కొలదిమందికే తెలియును; కాని పరీక్షిత్తనునామ మందఱనోట నాట్యమాడును." ధర్మరాజున కాశ్చర్యమయ్యెను. ఆ దినమునుండి యాతనిని బరీక్షిత్తని పిలుచు

యుంచెను. తా నట్లు పిలుచుటచే నందఱు నట్లే పిలుచుచుండిరి. అప్పటి నుండి యాతఁడు పరీక్షిన్నామముచేఁ బ్రసిద్ధిఁ జెందెను.

శత్రువులు మడిసిరి. పోయినరాజ్యము మరల ధర్మజునకులభించినది. భూమిమీఁదఁగల రాజులందఱును దనకు వశమైరి. వంశాభివృద్ధిని గలిగించు మనుమఁడుకూడ పుట్టినాఁడు. అంత ధర్మరా జిట్లాలోచించెను:— "నేను కులసంహారము గావించితిని. జాతిద్రోహ పాపమంటినది. బంధు మిత్రాదులను జంపితిని. కావున దీనికిఁ గొంచెము ప్రాయశ్చిత్తము జరగవలయును." ఇట్లాలోచించి యాతఁడు వ్యాస, ధౌమ్య, కృపాచార్యాది కులపూజ్య పురోహితులను, ఇతర జ్ఞానులను, మునులను, ఋషులను, వేదజ్ఞులగు బ్రాహ్మణులను బిలిపించి తన మనోభావమును వెల్లడించి "ఈ జాతి ద్రోహ పాపమునకు నేనే ప్రాయశ్చిత్తమును జేసికొనవలసియుండు"నని యడిగెను.

అంత బ్రాహ్మణులు విచారించి యిట్లనిరి :— "రాజా! శస్త్రమును గైకొని యుద్ధము చేయుటకు వచ్చిన శత్రువును జంపుట క్షత్రియునకుఁ బాపముకాదు. ఇదిగాక యుద్ధములో ననేకములగు పాతకములు, ఉప-పాతకములు లభించుచుండును. యుద్ధము పూర్తియైన తర్వాత రాజు అశ్వమేధ యజ్ఞమును జేసిన నాతఁడు సర్వపాపముల నుండియు విముక్తినిజెంది నిష్పాపి కాఁగలఁడు. నీవుకూడ నొక యశ్వమేధ యజ్ఞమును జేసి యుద్ధజనిత దోషముఁ బోఁగొట్టుకొని నిష్పాపి కమ్ము. వాస్తవమునకు నీ విప్పుడును నిర్దోషివే కాని నీ విప్పుడు లోకసంగ్రహము కొఱకును, ధర్మ మర్యాద కొఱకును జేయఁదలఁచిన దంతయుఁ జేయుము. అది చాల మంచిది."

ధర్మరాజు దుఃఖితుఁడై యిట్లనెను:- "బ్రాహ్మణులారా! నా పాపము యుద్ధము చేసిన యితర రాజుల పాపమునకు మించినది. నేను ముఖ్యముగ మూఁడు ఘోరపాపము లొనర్చితిని. మొదటిది నా బాంధవులను, కులగోత్రికులను జంపితిని; రెండవది అవధ్యులగు భీష్మద్రోణాది గురుజనములఁ బొలియించితిని; మూఁడవది మూర్ధాభిషిక్తులును, ధర్మాత్ములు నగు వేలకొలఁది రాజన్యుల వధియించితిని. ఈ విధముగ బంధువధ, గురువధ, రాజవధ యను నీమూఁడు మహాపాతకములు నా మూలమున జరిగినవి. కావున మీరు నాచే మూఁ డశ్వమేధయాగములను జేయింపుడు"

ధర్మజుని యీ వచనములను విని యందఱు నైకకంఠమున 'సాధు సాధు' అనిరి. బ్రాహ్మణు లానందమున నిట్లనిరి:- "ధర్మావతారా! ఇది మీ కనురూపముగనే యున్నది. మీలో పాపము లేనేలేదు. లేకున్న నింకఁ బోవలసిన దేమున్నది? కాని, మూఁడు యజ్ఞములచే మీ కీర్తి సమస్త భూమండలమున నింకను వ్యాపింపఁగలదు. మీ యభిప్రాయము, చాల బాగున్నది. మే మందఱము నుత్తమ పద్ధతిని మీ యజ్ఞములను బూర్తి చేయించెదము. సమస్త యజ్ఞములకు నధిపతి యగు శ్రీకృష్ణుని మీరు పిలిపింపుఁడు. యజ్ఞము లన్నియు నాతని ప్రసన్నతకొఱకే చేయఁబడు చుండును. అయన విచ్చేయుటే యజ్ఞమునకు సర్వశ్రేష్ఠమగు సిద్ధిగాఁ దలఁచు చుందురు. అతఁడు విచ్చేసెనా నీ యజ్ఞములు నెఱవేరినట్లే."

ధరణీసురుల యాజ్ఞచే ద్వారకనుండి తిరిగివచ్చిన, ధనంజయునిఁ బురోహితుఁడగు ధౌమ్యునితో ధర్మరాజగు యుధిష్ఠిరుఁడు వాసుదేవుని దోడ్కొని వచ్చుటకు మరల ద్వారకాపురికిఁ బంపెను. పాండవాగ్రజుని సందేశమును వినుటతోడనే వాసుదేవుఁడు బంధుమిత్ర పరివార సమేత

ముగా మరల హస్తినాపురమునకు విచ్చేసెను. నగరమున మరల నానందము వెల్లివిరిసెను. నగరవాసులందఱును నారాయణుని దర్శింప నుత్కంఠతో నుండిరి. మిక్కిలి వైభవముతో మేళతాళములతో ధర్మరాజు వాసుదేవునకు స్వాగత సత్కారములు కావించెను. బహుమానముతో నాతనిని సభాభవనమునకుఁ గొనితెచ్చెను. అచ్చట పురోహితులు విధ్యుక్తముగ విశ్వేశ్వరు నర్ఘ్యపాద్యాదులచేఁ బూజించిరి. ధర్మరా జాతనిఁ గుశల ప్రశ్న కావించెను శ్రీకృష్ణుఁడుకూడ ధర్మరాజు యొక్క రాజకోశ, మంత్రి, పురోహి, తాంతఃపుర, సేనా, నగరాదులను గూర్చి కుశలప్రశ్న కావించెను, ఇంతలోనే సహదేవుఁడు బాలకుఁడగు పరీక్షిత్తును దీసికొనివచ్చెను. చిన్నవాడై నప్పటికిని శ్రీకృష్ణునిఁ జూడఁగానే అతడు వేగముగ ఱంకనుండి దూఁకెను. సహదేవుడెంతగ వారించుచున్నను నాతఁ డాగలేదు. బాలకుని యీ హఠమునుగాంచి దూరమున నుండియే ధర్మరాజిట్లనెను:- "సహదేవా! వీనిని విడిచిపెట్టుము, ఏమిచేయునో చూతము"

ధర్మజుని యాజ్ఞచే సహదేవుఁడు వానిని సభాస్థలిని క్రింద వదలెను. అతఁడు మిక్కిలి వేగముగ మోఁకాళ్ళమీఁదఁ బాఱకాడుచు శ్రీకృష్ణుని వైపునకుఁ జరచర పోయి, సింహాసనమును సమీపించి యాతని పాదములను బట్టుకొని యొడిలోనికెక్కి కూర్చుండి, తదేక దృష్టితోఁ జూచుచుండెను. అందఱును బాలకుని యీ పనినిఁ గుతూహలముతోఁ జూచుచుండిరి. బాలకుఁడు మాటిమాటికి వాసుదేవుని జూచి యానందించుచుండెను. అతడు భగవానుని శ్రీహస్తములను గాంచి యాశ్చర్యముద్రను బెట్టుకొని చూచుచుండెను.

అంత ధర్మరాజు వ్యాసునిఁ గాంచి యిట్లడిగెను:- "స్వామీ! ఈ కుఱ్ఱఁడు భగవన్ముఖారవిందమును గాంచి ప్రసన్నుడై కరకమలములను గాంచి యాశ్చర్యచకితుడగుట యేల?"

వ్యాసభగవానుఁ డిట్లనెను :- "రాజా! ఈతఁడు గర్భములో గదనుగొని తనను రక్షించునప్పుడు కమలాక్షుని గాంచెను. ఇప్పుడు ముఖమును జూచి గుర్తించి, చేతులలో గదను గానక యాశ్చర్యచకితుఁ డగుచున్నాడు. వాసుదేవుఁడు మరల గదాధారిగఁ గనఁబడి తన చతుర్భుజ రూపమును జూపెనా యీతఁ డత్యంత ప్రసన్నతఁ జెంద గలడు."

వ్యాసధర్మజులు చెప్పినమీఁదట శ్రీకృష్ణుఁడు చతుర్భుజరూప మున శంఖ చక్ర గదా పద్మములతో దర్శనమొసంగెను. ఆ రూపమును జూడఁగానే బాలకుఁ డత్యంతాహ్లాదమున భగవానుని గౌఁగిలించుకొనఁగా వాసుదేవుఁడాతని ముద్దాడి లాలించెను.

ఇఁక నశ్వమేధ సన్నాహమును జేయఁదొడఁగిరి. ధర్మరా జిట్ల నెను:-"వాసుదేవా! నేను సర్వోత్కృష్టమగు నశ్వమేధ యజ్ఞమును జేయఁబూనిననంగతి నీకు విదితమే. ఇంతకు, ఒక్కటికాదు మూఁడు యజ్ఞములు చేయఁదలఁచినాను. యజ్ఞయాగాదులకై రాజులకు ధనము ప్రజల పన్నుల మూలముననైన రావలయును, లేదా దండము మూలముననైన రావలయును. నేను విశేషముగఁ బ్రజలపైఁ బన్నుల విధించి ద్రవ్యమును సేకరింపను. దండమున ద్రవ్యసంచయముఁ జేయు కోరికయు నాకు లేదు. అన్యరాజన్యులనుండి ధనమును గొందమన్న వారు భారతయుద్ధములోఁ దీవ్రముగఁ బోరి చాల నష్టపడిరి. కౌరవులు తమ కోశమునంతను యుద్ధములో వ్యయము కావించిరి. ద్రవ్యము లేక నా యజ్ఞము సాంగోపాంగముగ నెఱవేరుటెట్టులా యని నా చింత. నాకున్న ద్రవ్యము నీవే. నీవు వచ్చితివి కావున మాయజ్ఞము నెఱవేరి నట్లే. ఇప్పుడు నీ వెట్లు చేయింపఁదలఁచిన నట్లు చేయింపుము. ఇఁక నిశ్చింతుఁడనైతిని." ఇట్లని తన సర్వభారమును శ్రీకృష్ణునిపై నుంచి, తన కోరికను గృష్ణార్పణము కావించి, ధర్మరాజు మెదలకుండెను

ధర్మరాజు మెదలకుండిన తర్వాత వాసుదేవ భగవానుఁ డాత నితో నిట్లనెను :- "మహారాజా! నీవు దేనిని గూర్చియుఁ జింతింప వలదు. నేను నీ మనోరథము లన్నింటినిఁ బూర్తి కావించెదను. నీవు వసుంధరాధిపతివైతివి. నీకు ధనమున కేమి కొదువ ? రాజు పాపి యైనప్పుడు, ఆ పాపకారణమునఁ బృథ్వి తన రత్నముల నన్నిటిని దాఁచుకొనును. పాపియు, నీచుఁడును, నధర్మాత్ముడును నగు రాజు ధనమునకుఁ బరుల నపేక్షింపవలయును. అట్టివాఁడు ప్రజలపైఁ బన్నులపై, బన్నులు వేయుచుండును, ఋణము లడుగుచుండును. ప్రజల బాధించుచుండును. అయినను వానికి డబ్బు లభింపదు. బుద్ధి, సిద్ధి, సమృద్ధి భావానుసారముగ నుండును. ధర్మాత్ముఁడగు రాజున కీ పృథ్వి కామధేను వగును. (వసుం+ధరా యనఁగా వసుం=ధన మును, ధరా=ధరించునది అను నీ యర్థము సార్థకము కాగలదు.) నీకు ధనమున కేమి కొదువ ? పూర్వకాలమునఁ గరంధమ మహారాజు నకు మరుత్తను యశస్వియగుఁ బుత్రుఁడుండెడివాఁడు. అతఁడు తన కులగురువగు సంవర్తకుని సాహాయ్యముచే నొక మహాయజ్ఞమును గావించెను. అట్టిదాని నింతవఱ కెవఁడును జేయ లేదు; ఇఁకఁ జేయఁగలవాఁ డుండఁడు. ఆ యజ్ఞములో యజ్ఞసామగ్రి యంతయు సువర్ణమే. ఇంతయేల? భవన ప్రాకారాదులన్నియు సువర్ణమయములే. ఆ యజ్ఞములో బ్రాహ్మణులకు వారెత్తలేనంతగ సువర్ణము దాన మొసంగెను. దాని నచ్చటనే విడిచివచ్చిరి. అచ్చట సువర్ణ యజ్ఞసామ గ్రిని ఎద్దుబండ్లు, ఏనుగులు, ఒంటెలు మోయవలసివచ్చెను."

ధర్మరాజిట్లనెను :- "వాసుదేవా ! బ్రాహ్మణులు విడిచి వెళ్ళిన మిగిలిన యజ్ఞసామగ్రిపై మన కధికార మేమున్నది ? దానితో యజ్ఞముచేయుట ఉచితమా?"

వాసుదేవుఁ డిట్లనెను :- "రాజా! నీవు సమస్తధరాతలమునకుఁ జక్రవర్తివి. భూమిపైఁ గల వన, కానన, పర్వత, వృక్ష, ధాతువు లన్నిటిమీఁద మీ కధికారము కలదు. ఆ ధనముపై నీకు సంపూర్ణ స్వత్వమున్నది. నీవు శివునిఁ బూజించి నిశ్శంకుఁడవై యా ధనమును దెప్పించుకొని, దానితో యజ్ఞసంభారము లన్నిటి వేర్పఱచుకొని యజ్ఞములను బూర్తి కావించుకొనుము."

ధర్మరాజిట్లనెను :- "వాసుదేవా! మీయాజ్ఞ యగు నెడల ననుచితమైనను నుచితము కాఁగలదు. విధి నిషేధము లేర్పఱచిన వాఁడ వీవేకదా! నేను మరుత్తుని యజ్ఞవృత్తాంతమును, అతని కింతటి ధనప్రాప్తి యెట్లు కలిగినదియు సంపూర్ణముగఁ వినఁదలఁచుచున్నాను. దానిని వినినమీఁదట నా ధనమును దెచ్చుకొని యజ్ఞారంభమును గావించెదను."

"రాజా! మరుత్తుని చరిత్రము నంతను సత్యవతీ నందనుఁడగు వ్యాసభగవానుఁడు చెప్పఁగలఁడు." అని పలికి శ్రీకృష్ణుఁడు మౌనము వహించెను.

## మరుత్తుని యజ్ఞధనము : ధర్మజుని అశ్వమేధము

౪౨

శ్లో॥ తదభ్యపేత మాఽఽక్ష్య భ్రాతరోఽచ్యుత చోదితాః ।
ధనం ప్రహీణ మాజహ్రు రుదీచ్యాం దిశి భూరిశః॥
తేన సంభృత సంభారో ధర్మపుత్రో యుధిష్ఠిరః।
వాజిమేధై స్త్రిభి ర్భీతో యజ్ఞైః సమయజ ద్ధరిమ్ ॥

—శ్రీభాగ ౧ స్కం. ౧౨ అ-౩౩ ౩౪, శ్లో.

ధర్మనందనుఁడు బంధుసంహారదోషంబు వాయుకొఱకు నశ్వమేధయాగంబు సేయందలంచి ప్రజలవలనం గరదండంబుల నుపార్జితంబయిన విత్తంబు చాలక చిత్తంబునఁ జింతించునెడ నచ్యుత ప్రేరితులై భీమార్జునాదులు తొల్లి మరుత్తుండను రాజు మఖంబుచేసి పరిత్యజించి నిక్షేపించిన సువర్ణ పాత్రాదికంబైన విత్తం బుత్తర దిగ్భాగంబు వలన బలవంతులై తెచ్చిన నా రాజసత్తమ మూడు సమాయత్త యజ్ఞోపకరణుండై సకల బంధు సమేతంబుగఁ గృష్ణుని నాహ్వానంబుచేసి పురుషోత్తము నుద్దేశించి మూఁడుజన్నంబులు గావించె."

—శ్రీమదాంధ్రభాగవతము

అసత్యముకంటె సత్యము శ్రేష్ఠమైనది. ఐశ్వర్యోపభోగము కంటెఁ ద్యాగము శ్రేష్ఠమైనది విరోధముకంటె క్షమ శ్రేష్ఠము. అధర్మముకంటె ధర్మము శ్రేష్ఠము. తాను జేయు సమస్తకర్మలు శ్రీకృష్ణ పదారవిందముల కర్పించుటయుఁ, దన భారమంతయు నాతనిపై వేయుటయు సర్వ శ్రేష్ఠమైనది. దీనికి మించిన సర్వశ్రేష్ఠమగు కార్యము లోకమున నింకొకటి లేదు. మహాభాగులగు పాండవులిట్టే యొనర్చిరి.

యజ్ఞమునకు విపుల ద్రవ్యమవసరము. సాధారణ ద్రవ్యముతో నశ్వమేధయాగము వంటిది కాఁజాలదు. పాండవుల కడ నంతటి ద్రవ్యము లేదు. కోశమంతయు రణయజ్ఞమందు వ్యయమయ్యెను. శ్రీకృష్ణుఁడు హిమాలయమున గంధమాదన పర్వత శిఖరమందుఁ గల మరుత్తుని యజ్ఞశేషధనమును దెచ్చుట కాజ్ఞ యీయఁగా ధర్మజుఁడు సమీపంబునఁ గూర్చుండిన వేదవ్యాసుని గూర్చి యిట్లడిగెను :—
"ప్రభూ! ఈ మరుత్తుఁడెవరు ? ఈతని కింతటి వైభవ మెట్లు కలిగినది ? ఈతని కింతటి విపుల ధనరాశి యెట్లు ప్రాప్తించినది ? అతఁ

దట్లు దాని నచ్చట నేల విడిచి వచ్చెను ? మీరు నా యీ ప్రశ్నల కతి సంక్షేపముగఁ బ్రత్యుత్తర మిచ్చునెడల నా సోదరులను బంపి శ్రీకృష్ణునాజ్ఞచే నా ధనమును నా సోదరులచేఁ దెప్పించెదను."

ధర్మజు డిట్లడుగఁగా వక్తలలో శ్రేష్ఠుఁడును, సత్యవతీ పరాశర నందనుఁడునగు వేదవ్యాసుఁ డిట్లు చెప్పఁ దొడఁగెను :— "రాజా! వినుము. పరమయశస్వియు, మహేంద్రైశ్వర్యము కలిగినట్టియు మరుత్తుని చరిత్రమునుగూర్చియు, ఆతని విపుల విత్తమును గూర్చియు చెప్పెదను. నీవు నీ సోదరులతో సావధాన పూర్వకముగ వినవలయును.

పూర్వకాలమునఁ బ్రతాపశాలియగు రాజు కరంధము డనువాఁడు కలఁడు. నీకు ధౌమ్యుఁడు, కృపాచార్యుఁడెట్లు పురోహితులుగా నుండిరో అట్లే యాతనికిని వేదవేత్తయు, సర్వశాస్త్రపారంగతుఁడు నగు అంగిరుఁడను మహాముని పురోహితుఁడుగ నుండెను. అంగిరుఁడే ఆతనికి సమస్త దేవఋషి పితృకార్యములు చేయించుచుండెను. అంగిరున కిద్దరు పుత్రులు. పెద్దవాఁడు బృహస్పతి, రెండవవాఁడు సంవర్తుడు. బృహస్పతిని దేవేంద్రుడు తన పురోహితునిఁగఁ జేసికొనెను. అన్నదమ్ములలోఁ గొంచెముగ విరోధముండును. రాజా! అన్నదములలోను, బితాపుత్రులందును, మిత్రులలోను, సంబంధులలోను పరస్పరము విరోధము కలుగుచునేయుండును. దీనికి ముఖ్యమగు కారణము ఐశ్వర్యము, యశస్సు మున్నగు ఇంద్రియ విషయములుగ నుండును. భోగలాలసచే నైశ్వర్యమందాంధుఁడై మానవుఁడు తన బంధువులను గూడ తిరస్కరించుచుండును. విప్రవరుఁడగు సంవర్తుఁడు శ్రేష్ఠుఁడగు తనసోదరునితో విరోధముఁ బెంచుకొనఁదలఁపలేదు. ఆతఁడు తన సర్వస్వమును త్యజించి విశ్వనాథపురియగు వారాణసికి వెళ్ళి దిగంబర వేషముతో భూతేశ్వరు నారాధించుచు, సందుగొందులలో నున్మత్తునివలెఁ జరించుచుండెను.

ఇప్పుడు అంగిరోముని ద్రవ్యమునకు, అతని కులపరం పరాగత యాజమాన్యమునకును ఉత్తరాధికారి బృహస్పతి యయ్యెను. కరంధమ మహారాజు తర్వాత నాతని పుత్రుఁడు మరుత్తుడు సింహాసనాసీనుఁడయ్యెను. తన తండ్రి కరంధమున కెట్లు దేవర్షి పితృ కార్యములు చేయించుచుండెడివాఁడో అట్లే బృహస్పతియు మరుత్తునకు దేవర్షి పితృకార్యములు చేయించుచుండెను. మరుత్తు డతిబలవంతుఁ డును, గుణవంతుఁడును, ఐశ్వర్యవంతుఁడు నయ్యెను. అతని యైశ్వర్య మునుగాంచి దేవేంద్రుఁడు కూడ స్పర్ధవహించెను. రాజా! ముక్తిమార్గ మున కీ ఈర్ష్యారూపమగు దోషమే గొప్ప విఘ్నము. భూమి మీఁద నుండు జీవులు మొదలుకొని బ్రహ్మలోకజీవుల వఱకిదే దోషము కనఁ బడుచున్నది.ఒకవృత్తిలో నుండువారు వారిలో శ్రేష్ఠునిఁగాంచి ద్వేషించు చుందురు. ఇద్దరు విద్వాంసులు పరస్పరము వారి యశస్సునుగాంచి యీసు కొనుచుందురు. ధనవంతుఁడు ధనవంతునిఁ జూచియు, స్వర్గము లోని దేవతలు తమకంటె నధికసుఖము నెందువారలనుజూచియు మండి పడిపోవుచుందురు. ఈ దోష కారణమున జీవుఁడు భగవత్పాదపద్మముల కడకుఁ జేరఁజాలడు. ఈ ఒక్క దోషము నశించెనా జీవుఁడు నిత్యశుద్ధ, ముక్తపురుషుడు కాఁగలడు. దేవేంద్రుఁడుకూడ మరుత్తుని గాంచి యసూయ చెందుచుండెను. అతఁడిట్లు తలంచెను:— "నేను స్వర్గమునకును, సమస్త దేవతలకును ప్రభువను. అయినను మర్త్యలోకాధిపతి యగు మరుత్తుని యైశ్వర్యము నాకు లేదు. వీని ధర్మకార్యముల కెట్లు విఘ్నము కలిగింతును? లేకున్న నీతఁడు నాతో పోటీ చేయుటయేగాక యింద్రపదమునుగూడ లాగుకొనఁగలఁడనుటలో నాశ్చర్యమేమియును లేదు."

ఇట్లాలోచించి యీర్ష్యావశమున నింద్రుఁడు తన గురువగు బృహస్పతిని బిలిపించి యిట్లనెను:— "దేవగురూ! మీరు మరుత్తునకు దేవర్షి పితృకార్యములను జేయించుట అపవల వలయును. ఇది నా కప్రతిష్ఠ. మీరు దివ్యులగు దేవతలకు గురువులయ్యు నొక మర్త్యునకు ధర్మకార్యములు చేయించుచున్నారు. మీరు దేవగురువులని పిలువఁబడు చును మనుష్యులకుఁ బురోహితులని పిలువఁబడుట అవమానముగ లేదా? చూడుఁడు, నేను రెండుమాటలు చెప్పెదను. నేను బులిపుచ్చకపు మాటలు పలుకుట యెఱుగను. మీరు నాకు పురోహితులుగ నుండఁదలఁచు నెడల మరుత్తునికార్యము లేవియును జేయింపరాదు. మీ కాతని పౌరోహిత్యమే ప్రియమగునెడల నొక్క నమస్కారము. మీకు మాకు రామ్‌రామ్. మీకీ రెండు పక్షములలో నేది యిష్టమో తెలుపుఁడు."

బృహస్పతి చాల చిక్కులోఁబడెను. అతఁడు రెండు వైపులను చిక్కెనని తలఁచెను. ఇంద్రవాక్యములను విని యావిషయమునఁ జాల విచారించెను. చివరకు దేవ పురోహితుఁడుగానే యుండి రాజపౌరోహిత్యమును వదలుకొనుటకే నిర్ణయించుకొనెను. ఇట్లు నిర్ణయించుకొని యాతఁడిట్లనెను:—"దేవేంద్రా! నీకు మరుత్తునికి సాటియేమికలదు? నీవు స్వర్గాధిపతివి, అతఁడు మరణశీలురగు మానవులకు రాజు. నీవజరుఁడవు. అమరుఁడవు, యజ్ఞభాగ భోక్తవు. మరుత్తుఁడు మరణ ధర్మము కల వాఁడు. వానికొఱకై నేను నిన్నెట్లు వీడఁగలుగుదును? దేవేంద్రుని పూజ్య పురోహితుఁడు మరణశీలుఁడగు మరుత్తునకుఁ బురోహితుఁడై సుక్రువములను బట్టి యజ్ఞమును జేయించుచున్నాఁడను నపకీర్తి నాకింతవరకు వచ్చినప్పటికిని శీల సంకోచముచేతను, కులపరంపరాగతమగు వృత్తియగుటచేతను నేనట్లు చేయించుచుంటిని. ఇఁక నీవు వలదనిన నేనేల చేయించెదను? ఇప్పుడు వారు వచ్చి నన్నడిగిన నిఁక నా పని నావలనఁ గాదని చెప్పివేసెదను."

ఇంద్రుడీ ప్రత్యుత్తరమును విని చాల సంతోషించెను. జీవులేల తమ ప్రతిస్పర్ధి పరాభవమును గాంచి ప్రసన్నులగుదురో తెలియదు. మరుత్తుని యుత్తమైశ్వర్యమును భ్రష్టము కావించితినని యింద్రుఁడనుకొనుచుండెను. ఏ విషయమైనను ఎన్నాళ్ళో దాఁగదు. ఈ విషయమును విని మరుత్తుడు చాల దుఃఖించెను. ఇదివఱ కెవరును జేయనంత వైభవముగ యజ్ఞము జేయఁ సంకల్పించి యాతఁడు తన కులగురువగు బృహస్పతి దగ్గఱకువెళ్ళి. యభిప్రాయమును దెలిపెను. రాజు వాక్యములను విని బృహస్పతి యిట్లనెను :- "రాజా! నీకు మేలగుఁగాక! నీవు నావలన యజ్ఞాదుల నెఱవేర్చుకొను నాశను వదలుకొనుము. నేను నీచేత నేవిధమగు పుణ్యకార్యమును జేయింపను. ఇఁక నీ పనులన్నియు నింకెవరిచేతనైనఁ జేయించుకొనుము."

రాజు వినయముతో నిట్లనెను :- "స్వామీ! మీరిట్లు పలుకుచున్నారేల? మఱియొక బ్రాహ్మణునిచే నేనెట్లు పౌరోహిత్యము చేయించుకొందును? కుల పరంపరాగతుఁడగు తన పురోహితుఁడుండఁగా మఱియొకనిచేఁ జేయించుకొనిన గొప్ప పాపము సంభవింపఁగలదు అట్టియెడ మిమ్ముల నే నెట్లు పరిత్యజింపఁ గలుగుదును!"

బృహస్పతి యిట్లనెను :— "నీవు నన్ను పరిత్యజించుట యెక్కడ? నేనే నా బుద్ధిపూర్వకముగ నిన్ను పరిత్యజించుచున్నాను."

రాజు మిక్కిలి వినయముతో నిట్లనెను :- ప్రభూ! యజమానుఁడు చేసిన, యే పాపమును గాంచి పురోహితుఁడు వానినిఁ బరిత్యజించుచున్నాఁడు ? నేనే పాపము చేసితినని మీరు పరిత్యజించుచున్నారు ? నాలో మీ రేపాపమును జూచితిరి ?"

బృహస్పతి సరళముగా నిట్లనెను :- "రాజా! నీవు పరమ ధర్మాత్ముఁడవు. నీలో నే పాపమును లేదు. నేను పాప కారణమున నిన్నుఁ బరిత్యజించుటలేదు. నీ వింకొక యోగ్య వేదజ్ఞుఁడగు బ్రాహ్మణునిచే యజ్ఞము చేయించుకొనవలసినదని నేను సంతోషపూర్వకముగ నాజ్ఞాపించుచున్నాను. నేనిది దోషముగ భావింపను. అప్రసన్నుఁడను గాను."

రాజిట్లనెను :- "స్వామీ! మీ రెట్లు వదలఁగలుగుదురు? వంశానుగతముగ మేము మీ పాదములను బూజించితిమి. దైవికముగ యజమానుఁడు ధనహీనుఁడగు నెడల నైశ్వర్య శాలియగు యోగ్య పురోహితుఁడు వానిని వదలరాదు. లేక పురోహితుని వంశములోనివాఁడు విద్యావిహీనుఁడగు నెడల తెలివిగల యజమానుఁడు వానిని వదలరాదు. ఎట్లో యిద్దరును సరిపుచ్చుకొనవలసి యుండును. అదియును గాక, నేనైశ్వర్య హీనుఁడను గాను. మిమ్ములను సర్వ విధముల సేవించుటకు సంసిద్ధుడను."

ఇది విని బృహస్పతి కొంచెము గద్దించుచు నిట్లనెను :- "రాజా! ఉన్నవిషయమిది. నీ యిష్టమువచ్చినట్లు చేసి కొనుము. నేను దేవేంద్రునకుఁ బురోహితుఁడనైతిని. ఇఁక నేనిప్పుడు మరణశీలురగు మానవులకుఁ బురోహితుఁడ నగుట యవమానముగఁ దలఁచుచున్నాను. కావున నాచే యజ్ఞము చేయించుకొనునాశను వదలుకొనుము."

ఇట్లు స్పష్టముగనన్న బృహస్పతి గర్వోక్తులను విన్న రాజునకపారదుఃఖము కలిగెను. అతనికన్నుల నీరు నిండెను గాని యింతలో నాతఁడు కొంచెముగ సంబాళించుకొని యిట్లనెను:- "దేవా! ఇంద్రుని జేయువాఁడవు నీవే కదా! ఇంద్రుఁడు వీఁడని నిశ్చితముగ లేఁడు. మీబోటి బ్రాహ్మణులు నూఱు యజ్ఞములను జేయించిరా వాని కింద్రా

సనము లభింపఁగలదు. నేను మీకు పరంపరాగతుఁడ నగు యజమానుఁ డను, సేవకుఁడను. మీయాజ్ఞానువర్తిని. నాపై మీకును, మీపై నాకును అధికారము కలదు. నేనుమాత్రము వెనుకకు దగ్గను. మీరు నాచేత నూటో రెండునూఱులో మీ యిష్టము వచ్చినన్ని యజ్ఞములను జేయింపుఁడు."

బృహస్పతి యుత్తేజితుఁడై యిట్లనెను:- "రాజా! ఇన్ని మాట లవసరములేదు. నే నిదివఱ కొక్కసారి చెప్పితిని. నీవు ఒకటి చెప్పుము. వేయి చెప్పుము. నేను యజ్ఞమును చేయింపఁజాలను, చేయింపజాలను, ముమ్మాటికి చేయింపఁజాలను. నీవు నీ పని చూచు కొనుము. నీ యిష్టమువచ్చిన వానిచే యజ్ఞము చేయించుకొనుము. నామీద ఆశను బూర్తిగ వదలుకొనుము"

ఇకఁ మాటాడలేదు. అతఁడు దుఃఖితచిత్తముతో బృహస్పతికిఁ బ్రణామము కావించి వెళ్ళిపోయెను. నిరపరాధి యగు తనను దన పురోహితుఁడు అకారణముగఁ బరిత్యజించి నాఁడని యాతఁడు మనస్సులోఁ జాల దుఃఖించెను. ఇంతలోనే యాతనికి "శ్రీకృష్ణగోవింద హరే మురారే, హేనాథ నారాయణ వాసుదేవ!" యను సుమధురనామ సంకీర్తనము వినఁబడియెను. అతఁడు తలయెత్తి చూచునప్పటికి వీణ వాయించుచు హరిగుణ గానము చేయుచు నారదమహర్షి కనఁబడెను. నారదుని గాంచి రాజు శ్రద్ధాభక్తులతో నాతని చరణములు కడిగెను. నారదుఁడు యథోచి తాశీర్వాద మొసంగిన తర్వాత నిట్లడిగెను:- నీ వింత చింతతో నుంటివేల? నీ దుఃఖకారణ మేమో నాకు కొంచెము చెప్పుము."

రాజు ఖిన్నమనస్కుఁడై యిట్లనెను:- "స్వామీ! ఏమి చెప్పు దును? నేను పూర్వజన్మలోఁ జేసిన పాపఫల మేమియో కాని నా గురువు

నిరపరాధియగు నన్ను బరిత్యజించినాఁడు". అని జరిగిన వృత్తాంత మంతయు మొదటి నుండి చివరివరకు చెప్పి యిట్లనెను:— "స్వామీ! నా కుల పురోహితుఁడు నన్నుఁ బరిత్యజించిన నే నెవరిచే యజ్ఞము చేయించుకొనవలయునో మీరే చెప్పుఁడు."

సమస్త జీవకోటియొక్క కల్యాణ సౌభాగ్యములనే కోరు దేవర్షి నారదుఁడు రాజుతో నిట్లనెను:— "రాజా! నీవు భయపడ నేల? నీ యజ్ఞమును నేను పూర్తిగావింపఁజేసెదను. అదియును మీ కులగురువు ద్వారముననే."

కుమిలిపోవుచున్న రాజుమీఁద నమృతవర్షము కురిసినట్లుండెను. అత్యంత హర్షమున రాజిట్లనెను:— "స్వామీ! నా కులగురువగు బృహస్పతి దేవేంద్రుని యైశ్వర్యమును గాంచి యైశ్వర్య మత్తుఁడై నాఁడు. అతని ద్వారా మీరెట్లు నా యజ్ఞమును బూర్తి చేయింపఁ గలుగుదురు?"

ఎవరైనఁ బరస్పరము పోట్లాడుకొనుచుండిన నారదున కానందము. అందుచేఁ నాతఁడిట్లనెను:— "రాజా! న్యాయతః నీకు బృహస్పతి పురోహితుఁడు కాఁడు. నీ తండ్రికి పురోహితుఁడగు అంగిరసునికి ఇద్దరు పుత్రులు. పెద్దవాఁడు బృహస్పతి. రెండవవాఁడు సంవర్తుడు. యజమానులు పంచుకొనిన, నీ వంతునకు న్యాయతః సంవర్తుఁడు పురోహితుఁడు కాగలఁడు. నీ వాయనచేత నీ యజ్ఞమును జేయించుకొనుము."

రాజు దీనతతో నిట్లనెను:— "బులిపుచ్చకపు మాటలేల? నాకు గురుపుత్రు లిద్దరును సమానముగఁ బూజ్యులును, వందనీయులును. ఇద్దరును నాకు పురోహితులే. సంవర్తుఁ డెచ్చటికో దిగంబరుఁడై వెడలి

పోయినాఁడని వినియున్నాను. ఆయనను నే నెక్కడ వెదకి పట్టుకొనఁ గలుగుదును? ఆతఁడు నాకు దొరకెనా నా మనోరథములన్నియు నెఱ వేరినట్లే."

రాజు వాక్యములు విని నారదుఁడిట్లనెను :— "రాజా! బ్రహ్మ జ్ఞానియగు సంవర్త మహాముని జాడ నేను నీకు చెప్పఁగలను. అతడు కాశీపట్టణమునఁ బిచ్చివానివలె దిగంబరుఁడై తిరుగుచుండును."

రాజిట్లనెను :— "స్వామీ! తన్నుదాను మఱుగుపరుచు కొనిన మహామునిని నేనెట్లు గుర్తింపఁగలను?"

నారదుఁడిట్లనెను :—రాజా! నేను నీకు ఉపాయము చెప్పెదను, నీ వొక శవమును గొనిపోయి వారణాసీ పుర ద్వారమున నుంచుము. నగ్నుఁడై యా పీనుఁగును జూడ వచ్చిన యున్మత్త వేషధారియే అంగిరస పుత్రుడఁగు సంవర్తుఁడు. ఆతఁడు నిన్ను వెళ్ళగొట్టఁ బ్రయత్నించును. తా నయోగ్యుఁడనని యనేక విధములఁ జెప్పును.కాని నీవా మోసమునఁ బడవలదు. ఆతఁడేది చెప్పిన నట్లు చేయుము. ఆతఁడు నా విషయ మడిగిన నేను అగ్ని ప్రవేశము చేసితినని చెప్పుము." ఇట్లు చెప్పి నారదుఁడటు నిటు తిరిగి క్షణములో నంతర్ధానమయ్యెను.

మరుత్తునకు చాల సంతోషము కలిగెను. నారదుని ఆదేశాను సారముగా నాతఁడొక పీనుఁగును గొనిపోయి కాశీపురీ బహిర్ద్వారమునఁ బెట్టుకొని కూర్చుండెను. దైవికముగ నచ్చటకు ఉన్మత్తవేషధారియగు సంవర్తుఁ డేతెంచెను. శవమును గాంచి యాతఁడు తిరిగి పోవుచుండెను. ఆతఁడే బ్రహ్మజ్ఞానియుఁ బురోహితుఁడు నగు సంవర్తుఁడని యాతఁడు గ్రహించెను. అన్నిటిని వదలి యాతఁడాతని వెంటబడెను. రాజు తనను వెంబడించుచున్నాఁడని తెలిసికొని సంవర్తుఁడు తన ఉన్మత్తతను బ్రక

టించుచు రాజుమీఁద దుమ్ము చల్లెను. ఒంట్రు బురదను విసరెను. రాజు మీఁద నుమ్మివేసెను. ఇష్టమువచ్చినట్లు తిట్టమొదలిడెను, అయినను రాజాతనిని విడువలేదు.

అంత ముని గంగాతీరమున నొక యేకాంతస్థలమునఁ గూర్చుండెను. రాజు ప్రణామము కావించి చేతులు జోడించి యాతని కెదురుగా నిలుచుండెను. అంత సంవర్తమహాముని యిట్లడిగెను :— "రాజా! నీకు నాజాడ యెవరు చెప్పిరి?"

చేతులు జోడించి దీనతతో రా జిట్లనెను:— "స్వామీ! నారద మహాముని మిమ్ముగూర్చి సర్వ వృత్తాంతమును జెప్పినాఁడు."

అంత ముని ప్రసన్నుఁడై యిట్లనెను:— "నీకు నావలనఁ గావలసిన పనియేమి?" రాజు జరిగిన వృత్తాంతమంతయు నాద్యంతము చెప్పి యిట్లు ప్రార్థించెను :— "ప్రభూ! మీరు నాచే యజ్ఞము చేయింపవలయును. నేను నా కులగురువు ద్వారా యజ్ఞము చేయవలెనని కాంక్షించుచున్నాను."

సంవర్తుఁ డత్యంతాశ్చర్యము వహించి యిట్లనెను:— "నీవు రాజువు నాతోపాటుగా నీవుగూడ పిచ్చివాఁడవైతివా యేమి? నేనున్మత్తుఁడను. ఎప్పుడేది తోఁచిన నట్లు చేయుచుందును. నాకు యజ్ఞములు చేయించుట యేమి తెలియును? నీకీ తలతోఁకలేని మాటలు చెప్పిన దెవరు? నాకు యజ్ఞముచేయించు యోగ్యత కలదని నీకెట్లు విశ్వాసము కలిగినది?"

చేతులు జోడించి దీనతతో రా జిట్లనెను:- "ప్రభూ! మీరు నమస్తమునుఁ జేయఁగలుగుదురు. యజ్ఞము చేయించుటేమి ? నూతన సృష్టియే చేయగల్గుదురు. నేను మీ మోసములోఁ బడను. నాకు నార

డు(డు సత్యము చెప్పినా(డు. ఏమైన( గానిండు. మీరు నా యజ్ఞమును జేయించి తీరవలయును."

ఇంకేమున్నది? ముని మనస్సు కరగెను. అత(డు ప్రసన్ను(డై యిట్లనెను:— "రాజా! నేను నీచే యజ్ఞము చేయించెదను. అట్టి యజ్ఞము నిదివఱకు గొప్పగొప్ప రాజులే కాదు, దేవేంద్రుడు(డుకూడ చేయలేదు. కాని నీ వొక ప్రతిజ్ఞ చేయవలయును. నీ యజ్ఞమును జేయింప మొదలు పెట్ట(గానే ఇంద్ర బృహస్పతు లిద్దఱును మన యిద్దరిమధ్య భేదభావము పుట్టింప( బ్రయత్నించెదరు. వారి ప్రలోభమందు పడక నన్ను పరిత్యజింపకుండిన నీ యజ్ఞమును జేయించెదను."

రా జత్యంత వినయముతో దృఢముగా నిట్లనెను :— "స్వామీ! నే నీ విశ్వనాథపురియగు కాశియందు గంగాభవాని సాక్షిగా అశ్వత్థము క్రింద నిలుచుండి చెప్పుచున్నాను. సాక్షాత్తుగ పితామహు(డగు బ్రహ్మ వచ్చి చెప్పినను మిమ్ములను బరిత్యాగము కావింపను."

ఇది విని సంవర్త మహాముని మిక్కిలి ప్రసన్ను(డై యిట్లనెను:— "రాజా! నీవు చేసిన ప్రతిజ్ఞను జ్ఞాపకముంచుకొనుము. నా యన్నయగు బృహస్పతి మోసపు మాటలను విని నన్ను వదలినయెడల నాత(డు నాకంటె( బెద్దవా(డగుటచే నాతని నేనేమియు నన(జాలను; కాని నీకు సర్వనాశనము కావింతును. నీ ప్రతిజ్ఞను నీవు వదలక నిల(బడి నా వశమందుంటివా నీ కోశము నక్షయము కావింతును. నిన్ను( గాంచి యింద్రుడు(డుకూడ లజ్జితు(డు కా(గలడు. "రాజా! నీకు మేలగుగాక! ఇప్పుడు నీవు తపస్సు చేసి శివుని( బ్రసన్నుని( గావించుకొనుము. అత(డు ప్రసన్ను(డై గుహ్యక, చారణ, గంధర్వులచే రక్షింప(బడు చున్న సువర్ణరాశి నీకీయ(గల(డు. దానితో నేను నీ యజ్ఞమును జేయించెదను."

సంవర్తమహాముని యాజ్ఞనుబొంది రాజు తన తపస్సుచే శివునిఁ బ్రసన్నుని గావించి యక్షయసువర్ణరాశిని బొందెను. సంవర్తమహాముని దానిచే యజ్ఞసామగ్రి నంతను సిద్ధముచేసెను. అతఁ డిట్లాజ్ఞాపించెను:- "మా యజ్ఞములో పాత్రములు, స్తంభములు, భవనములు, వేదులు సకల వస్తువులు సువర్ణమయములే కావలయును. ఇతర ధాతువులతో జేయఁబడినదే కార్యమునకు నుపయోగింపరాదు."

సంవర్తునిద్వారా చేయింపఁబడుచుండిన మరుత్తుని యజ్ఞసమాచారమును వినఁగానే యింద్రునకు తహతహ పుట్టెను. తన గురువగు బృహస్పతి యంగీకారముచే నగ్నిని బంపియు, గంధర్వులను బంపియు రాజునకు, సంవర్తునకు విరోధము కలిగింపవలెనని చాల ప్రయత్నించెను. అతని యజ్ఞమును బృహస్పతియే చేయించునని మాటిమాటికి కబురుచేయుచుండెను. కాని రాజు చలింపలేదు. అతఁడింద్ర బృహస్పతుల మాటలను లక్ష్యపెట్టనేలేదు. చివరకు దేవేంద్రుఁడు యజ్ఞమునకు విఘ్న మాపాదించుటకై స్వయముగ వజ్రము కొనివచ్చెను. అప్పుడు రాజు విచలితుఁడు కాఁజొచ్చెను. అంత సంవర్తుఁ డాతని నోదార్చుచు నిట్లనెను :— "రాజా? నీవు భయపడవలదు. నేను నా మంత్రబలముచే నింద్రుని స్తంభితునిఁ గావించెదను." మహాముని వాక్యములను విని రాజిట్లనెను :— "స్వామీ! ఇంద్రుడు క్రుద్ధుడై యజ్ఞభాగమును గొన రాకుండినఁ జేసినదంతయు వ్యర్థమే కదా?"

దృఢముగ సంవర్తుఁడిట్లనెను:— "రాజా! నీవు చాల తెలివి తక్కువగా మాటలాడుచున్నావు. నీకు నాశక్తి యందు విశ్వాసము లేదు. నేను పిలిచిన రాకుండునంతటి శక్తి యింద్రుని దగ్గఱ ఎక్కడిది? నేను నామంత్రబలముచే నింద్రుని బలవంతముగ లాగుకొని వచ్చెదను." శక్తి సంపన్నుఁడగు సంవర్తుని సాహసము ముందు దేవేంద్రుఁడు తల యొగ్గవలసి వచ్చెను. అతఁడు ప్రసన్నుఁడై రాజు యజ్ఞమునకు

వచ్చి యానందముతో సోమరసపానము గావించి సంతుష్టుఁడై "రాజా! నేను నేకేమి ప్రియము కావింతును?" అని అడిగెను.

రాజిట్లనెను :— "స్వర్గాధిపా! నీవు నాయెడలఁ బ్రసన్నుఁడ వగునెడల నా యజ్ఞమును విధిపూర్వకముగ సమస్త దివ్యైశ్వర్యములతో నెఱవేర్పుము."

ఇంద్రుఁడు "తథాస్తు" అని విశ్వకర్మచే నచ్చట సహస్రాధికములుగ స్వర్ణ మందిరములను, భవనములను గట్టింపఁజేసెను. మరుత్తు డడిగినవారికి అడిగినట్లుగ నొసంగెను. బ్రాహ్మణులకు వారెత్తఁజాలనంతగ బంగారము నొసంగెను. వారు చాలభాగ మచ్చటనే వదలి వెళ్ళిపోయిరి. మరుత్తుడు యజ్ఞమొనర్చిన తర్వాత యజ్ఞసామగ్రుల నన్నిటిని అచ్చటనే వదలిపెట్టి పోయెను. అవి యిప్పటి వఱకును గుహ్యక రాక్షస గంధర్వాదులద్వారా రక్షింపఁబడుచున్నవి. వానిలో నీకు కావలసినవి శ్రీకృష్ణానుమతినిఁ దెప్పించుకొని నీ యజ్ఞములను బూర్తి కావించుకొనుము. మొట్టమొదట శివునిఁ బూజించి ప్రసన్నునిఁ గావించుకొనవలయును; లేకున్న దానిలో నొకకణమైన నెత్త వీలు గాదు."

భగవదాజ్ఞను, వ్యాసానుమతిని గ్రహించి ధర్మరాజు తన సోదరులను బంపెను వారు శివునిఁ బూజించి, ప్రసన్నుని గావించుకొని యా సువర్ణమును వేలకొలఁది బండ్లమీఁదను నేనుఁగులమీఁదను, కంచర గాడిదల మీఁదను వేసికొని తెచ్చిరి.

ఆ విపుల ధనరాశిని కొని పాండవులు హస్తినాపురమునకు వచ్చునప్పటికి అందఱకుఁ బరమాశ్చర్యమయ్యెను. గంగా తీరమున ననేక యోజనముల విస్తీర్ణముగల స్థలము సమముగ నొనర్పఁబడి యజ్ఞము చేయఁబడుచుండెను. బ్రాహ్మణు లిట్లు సలహా నొసంగిరి:— "మహా

రాజా! ఒకయజ్ఞములోనే సమస్త విధులు త్రిగుణీకృతము కావింపుము. మూఁడు రెట్లు దక్షిణలిమ్ము. నీకు మూఁడు యజ్ఞములు చేసిన ఫల మొక్కసారిగనే లభింపఁగలదు." ధర్మరాజట్లే కావించెను. యజ్ఞాశ్వము విడువఁబడెను. అది భూమండల మందంతటను దిరిగి వచ్చెను. అంత యజ్ఞవిధులన్నియు నెఱవేర్పఁబడెను. యజ్ఞపతియే స్వయముగ యజ్ఞము గావించుచుండఁగా దాని సఫలత విషయములోఁ జెప్పవలసిన దేమున్నది?

ధర్మరాజా యజ్ఞములో నంతులేని ధనమును గొనివచ్చి అడిగిన వారికి అడిగినట్లుగ నిచ్చివేసెను. ఏ వేళనైనను ఇష్టము వచ్చినట్లు కోరినవారు కోరినట్లుగఁ దినవచ్చును. త్రాగువారు త్రాగవచ్చును. ఏ వస్తువెవఁడు కావలెననిన నా వస్తువు వాఁడు తీసికొనవచ్చును. దాని కడ్డులేదు. ఈ విధముగ యుధిష్ఠిరుని యజ్ఞము మరుత్తుని యజ్ఞముకంటె మిక్కిలి వైభవముగ జరిగెను. మరుత్తుని యజ్ఞములో నింద్రుఁడు యజ్ఞము చేయింపవచ్చెను. ఈ యజ్ఞములో ఇతని తండ్రికిఁగూడ పితామహుఁడగు శ్యామసుందర కృష్ణుఁడు యజ్ఞముచేయించు పెద్ద యయ్యెను. ఆ కారణమున నా యజ్ఞము అనుపమానమయ్యెను.

ఈ విధముగ యుధిష్ఠిరుని యశ్వమేధయాగములను సాంగో పాంగముగఁ బూర్తిగావించి, యందఱను సంతోషపెట్టుటకై కొంత కాలము శ్రీకృష్ణుఁడు హస్తినాపురములో నుండెను. అంత నందఱకడ ననుజ్ఞగొని ప్రత్యేకముగా నందఱును గలిసికొని యాదవులతోడను, తన ప్రియసఖుఁడగు నర్జునునితోడను శ్రీకృష్ణుఁడు యాదవపాలితమగు ద్వారకాపురికిఁ జనెను.

# విదురుఁడు

౪౩

శ్లో॥ అణిమాండవ్యదర్శమా దండం యథావ దఘకారిషు।
యావద్దధార శూద్రత్వం శాపాద్వర్ష శతం యమః॥
—శ్రీభాగ - ౧ స్కం ౧౩. అ. ౧౫ శ్లో॥

"మాండవ్యమహాముని శాపంబునం దొల్లి యముండు శూద్ర యోనియందు విదురుండై జన్మించియున్న నూఱు వత్సరంబు లర్యముండు యథాక్రమంబునం బాపకర్ముల దండించె."

—శ్రీమదాంధ్రభాగవతము

ఎంతటి తేజస్వియగు తపస్వి యగుఁగాక ! ప్రారబ్ధము ననుభవింపవలసినదే. ప్రారబ్ధ మనుభవింపకున్న నశింపదు. జీవన్ముక్తుఁడైనను శరీరముండగాఁ బ్రారబ్ధ మనుభవింపవలసియే యుండును. కాని అతఁడా సుఖదుఃఖములలోఁగాని, క్రియమాణమగు కర్మలోఁగాని మునిఁగిపోఁడు. ఇది సంచితకర్మలో గలిసి భవిష్యత్ప్రారబ్ధమును నిర్మింపదు. అయినప్పటికి ఈ శరీర మున్నంతవఱకు ప్రారబ్ధకర్మము తప్పదు. మానవులకే కాదు. ఋషులు, మునులు, యక్షులు, కిన్నరులు దేవతలు, ప్రజాపతులు, లోకపాలురు వేయేల అందఱును బ్రారబ్ధమునకు వశులై కార్యములు చేయుచుందురు. వారుకూడ నానావిధములగు నుచ్చనీచ యోనులలోఁ బుట్టవలసియుండును.

విదురుడు సాక్షాత్తుగ యమధర్మరాజనియు, మునిశాపవశమున నాతఁడు నూఱువర్షములవరకు శూద్రుఁడై యుండవలసి వచ్చినదనియు

సూతుఁడు చెప్పఁగానే శౌనకుఁడిట్లడిగెను:—"సూతా! మాండవ్య మహాముని యమధర్మరాజును భూమిమీఁద శూద్రుఁడవై పుట్టుమని శపించుట కాతఁడేమి యపరాధమును గావించెను? ఈ విషయమును దెలిసికొనవలయునని మాకు మిక్కిలి కుతూహలముగనున్నది. ఆ విషయము మాకు చెప్పఁదగునది యగునెడలఁ జెప్పుడు"

శౌనకుని వాక్యములను విని సూతుఁ డిట్లనెను:—"మునులారా! ఎవఁడు ననవసరముగా శాపమీయఁడు, అనుగ్రహింపఁడు. అందఱును దైవమునకు, నదృష్టమునకు నధీనులు. ఎల్లరికి సమస్తమైన వారితో సమస్తకార్యములు, సమస్తకాల నంయోగమున జరుగుచుండును. ఆ సంయోగ కాలము రాఁగానే తనకుఁ దానే జీవులకు దానికి తగిన బుద్ధి కలుగును. వారు దానిననుసరించియే కార్యములందు ప్రవృత్తులగుచుందురు. యముని శాపవృత్తాంతముకూడ చాల మనోరంజకమైనది. దాని నత్యంత సంక్షేపముగ మీకు చెప్పుచున్నాను. మీరందఱు స్వస్థచిత్తముతో శ్రవణము చేయుఁడు.

పూర్వకాలమున మాండవ్యుఁడను పేరుగల మహాముని ఉండెను. ఆతఁడు జితేంద్రియుడు. ధర్మపరాయణుఁడు, తపోనిరతుఁడు, తేజస్వియగు ముని. ఆతని యాశ్రమ ద్వారమున మంచి నీడనిచ్చు వృక్షముండెడిది. దాని క్రింద నాతఁడు మౌనవ్రతియై ఊర్ధ్వబాహువులతోఁ దపస్సు చేయుచుండెను. ఆతనికి బాహ్య జగత్తుయొక్క స్పృహ లేనంతటి సమాధి కలుగుచుండెడిది.

ఒకానొక దినమునఁ గొందఱు దొంగలు రాజుగారింట దొంగతనము చేసి చాల ద్రవ్యమును దీసికొని పాఱిపోవుచుండిరి. ఆ నమయమున రాజభటులకు మెలఁకువవచ్చెను. వారు దొంగల వెంటఁబడి తరిమిరి రాజభటులు దగ్గఱకు వచ్చునప్పటికి దొంగలు అక్కడికి

దగ్గఱగా నున్న మాండవ్యమహాముని ఆశ్రమములో దాగుఁకొనిరి. దొంగిలించినది కూడ ఆ దగ్గఱలో దాఁచియుంచిరి. రాజభటులు ఇంతవఱకు సమీపములో నున్న దొంగ లెచ్చట మాయమైపోయిరో యని చింతించి, మాండవ్య మహామునికడకు వెడలి యిట్లడిగిరి :— "దేవా ! దొంగలు చాలమంది దొంగతనముచేసి యీ ప్రక్కకు వచ్చిరి. మీరు వారిని ఇటువచ్చుట చూడలేదా?"

ముని మౌనముగ నుండెను. అదియునుగాక ధ్యానములో నిమగ్నుఁడై యుండెను. అతనికి దొంగల జాడయుఁ దెలియదు. రాజభటులు వచ్చిన సంగతియుఁ దెలియదు. అంత రాజభటులకు సందేహము కలిగెను. వారాశ్రమములోఁ బ్రవేశించి యన్వేషించిరి. ఒక గోడమాటుననుండి దొంగలు తొంగి తొంగి చూచుటను రాజభటులు కాంచి, వెంటనేపోయి చేతులకు సంకెళ్ళువేసి యిట్లనిరి :- "ఏమిరా ! ఇఁక నెచ్చటికి వెళ్ళఁగలరు? దొంగిలించిన సామానెక్కడ ?"

ఇది వినఁగానే మూర్ఖులుకూడ మౌనులైరి. అంత రాజభటు లిది మౌనుల మోసమని గ్రహించిరి. రాజభటు లిట్లనిరి:- "ఏమిరా ! మీరు దొంగలా? సాధువులా!" చోరులింకను మౌనము వహించిరి. చోరులను కొని సాధువునులను బంధింపఁబోవుట లేదుగదా? అనుకొని రాజభటులు నలువైపులను ధనమునకై వెదికిరి. వెదకఁగా ధనమంతయు దొరకెను. అప్పుడు వారిసందేహము మాయమయ్యెను. వారచ్చటివారందఱు దాంభిక మౌనులని తలఁచిరి. "మౌనము గొప్ప అస్త్రము. దీనిచాటున సమస్త కుకర్మలు దాగిపోవును. వీరందఱు మహాత్ములుకారు, మహా వంచకులని రాజభటులు గ్రహించిరి. వీరందఱకు నాయకుఁడు బయట చేతులెత్తుకొని నిలుచున్నవాఁడే. వీరందఱిది ఒక్కటే పద్ధతి. పగలంతయు మౌనము, రాత్రులంతయు దొంగతనము" అనుచు రాజభటు లా

చోరులతోఁగూడ మాండవ్యమహామునినిగూడ కట్టికొనిపోయిరి. గోధుమలతోఁపాటు పొట్టుకూడ నలిగిపోవును. పూలతోపాటు ముళ్ళుకూడ శివలింగముపైఁబడును. తాంబూలముతోపాటు అవిసెఆకుకూడ రాజు చేతిలోనికిఁబోవును. దుష్టసంసర్గముచే సాధువుకూడ దుఃఖములోఁ బడిపోవును".

మునులారా! ఇప్పటికి కలియుగము వచ్చినది. న్యాయము చేయువారు కూడ దొంగలైనారు. వారుకూడ ఏదోవిధముగ దొంగతనము చేయుచునేయున్నారు. అందువలన నీయుగములో దొంగతన మంత తప్పుగ నుండఁబోదు. ఇంతేకాదు. దొంగతనము కూడ ఒక కళగ నెన్నఁబడఁగలదు. కనుగప్పి దొంగతనము చేయుచుందురు. ఎవరును బట్టుకొనఁజాలకుండునట్లు దొంగతనము చేయవలయును. ఒకవేళఁ బట్టుకొనఁబడినఁ గూడసాక్ష్యము నేర్పాటుచేసి, యది నియమానుసారమగు దొంగతనముకాదని న్యాయస్థానములో రుజువు చేయఁగలవారు కూడ నున్నారు. ఇట్టి విపరీతన్యాయముచే దొంగలు తప్పించుకొనుచుందురు. దొరలు దండింపఁబడుదురు. అయితే మన మేయుగమును గూర్చి మాటలాడుకొనుచున్నామో ఆ యుగములో దొంగతనము చాల అపరాధముగ నెన్నఁబడుచుండెడిది. ఆ రోజులలో దొంగతనమునకు శిక్ష శూలమునఁ గ్రుచ్చుట. దొంగను నడిబజారులో నందఱి యెదుట శూలమునఁ గ్రుచ్చి రాజభటులు వెళ్ళిపోయెదు వారు. గ్రుచ్చఁబడినవాఁడు నెమ్మదిగాఁ జచ్చెడువాఁడు. అంతఁ జండాలురు వాని శవమును గొనిపోయెదువారు.

వీరందఱను రాజభటులు రాజసమ్ముఖమునకుఁ గొనిపోయిరి దొంగలు సొమ్ములోఁ బట్టుపడిరి. కాఁబట్టి అందఱను శూలముల గ్రుచ్చుఁడని రాజాజ్ఞాపించెను. కాని విచారణ చేయనేలేదు. దొంగలతోపాటు

మాండవ్యమహామునిని గూడ శూలమునకుఁ గ్రుచ్చిరి. దొంగలందఱును గ్రుచ్చఁబడఁగానే చనిపోయిరి. కాని మాండవ్యుఁడు తపః ప్రభావముచే నచ్చట శూలముపైనుండి ధ్యానము చేయుచుండెను.

ఒక దినము గడచినది. రెండురోజులైనది. ఋషి అట్లే యుండుటను గ్రహించి భటులు రాజున కిట్లు నివేదించిరి:— "ప్రభూ! ఒక దొంగ మాత్రము అట్లే శూలముమీఁద నింకను బ్రదికి కూర్చుండి యున్నాఁడు. శూల మాతని మలద్వారమునుండి శిరస్సువఱకు పోనట్లున్నది. అతనికి కష్టమేమియు కలుగనట్లున్నది."

ఇది వినగానే రాజునకు సందేహము కలిగెను. ఆతఁడెవఁడో గొప్ప తపస్వియై యుండవలెను. రాజు ఆత్రముతో మంత్రి పురోహితులను గూడుకొని శూల సమీపమునకుఁ బోయెను. పురోహితుఁడు తపస్విని గుర్తించి "మహారాజా! చాల అనర్థము సంభవించినది, ఈతఁడు పరమతేజస్వియుఁ దపోరాశియు నగు మాండవ్యమహాముని." అనెను. రాజాతనిని శూలమునుండి దింపించెను. అంత నాతని విధ్యుక్తముగఁ బూజించి, చేతులుజోడించి అతిదీనతతో నిట్లనెను:— "బ్రాహ్మణోత్తమా! అజ్ఞానినగు నన్ను క్షమింపుఁడు. మహర్షీ! అజ్ఞానమువలన మావలన నీ ఘోరాపరాధము సంభవించినది. ప్రభూ! మీరు నాయెడలఁ బ్రసన్నులు కండు. కోపించి నా రాజ్యపరివారమును భస్మము చేయకుఁడు."

రాజు పలికిన వినయోక్తులను విని మహర్షి యిట్లనెను:— "రాజా! నీకు మేలు కలుగుఁగాక! నీవు చింతింప వలదు. నీమీఁద నా కిసుమంతైన క్రోధములేదు. అందఱు వారివారి కర్మల ననుసరించి సుఖదుఃఖముల ననుభవింతురు. ఈకర్మ ఫలము ననుభవించుటకు నేనేదియో ఘోరపాపము చేసి యుండవచ్చును. నేను బాల్యమునుండియు తపో

నిరతుఁడనైయుంటిని. సదా సదాచారమున వర్తించుచుంటిని. ఎన్నడు హింసయనుమాట నెఱుఁగను. అట్టియెడ నీ దారుణ దుఃఖమేల నే నను భవింపవలసి వచ్చెనా యని నేనాలోచించుచున్నాను. మంచిది. నేను యమధర్మరాజు నడిగెదను."

రాజు ప్రాణములు కుదుటఁ బడెను. అతఁడు ఋషిని గూర్చి భయపడు చుండెను. ఈ తపస్వులు, ఒంటెలు ఎటుమళ్లెదరో యెవరి కిని దెలియదు. వారికెవరిమీఁదనైనఁ గోపము వచ్చెనా యిఁక నెవరి మాటలను వినరు. వారి వాగ్వజ్రమును విడువనే విడుతురు. రాజిట్లను కొనెను:— "అమ్మయ్య! నామీఁదనుండి ఋషి క్రోధము యమరాజు మీఁదికి మరలినది. ఇద్దరు సమర్థులే. పరస్పరము తట్టుకొనఁ గలుగుదురు" అని తలంచి రాజు అర్ఘ్యపాద్యాదులతో మునిని విధ్యుక్తముగఁ బూజించెను. రాజా శూలమును ఋషిశరీరమునుండి యనేక విధములుగ నూడబెరుకఁ బ్రయత్నించెను గాని రాలేదు. అప్పుడతడు ఋషియాజ్ఞచే బయటనున్న శూలమును గోయించెను. కాని శూలము (అణి) ములికి ఋషి శరీరములోనే యిరుకుకొనెను. అందువలన నాతనికి "అణి మాండవ్యుఁడు" అను ప్రసిద్ధి కలిగెను.

ఋషికి కోపము వచ్చుచుండెను. ఆతడు తన తపఃప్రభావమునను, యోగప్రభావమునను యమలోకమునకుఁ జేరుకొనెను. ఋషి వచ్చుటను గాంచి యమధర్మరాజు శీఘ్రముగలేచి యాతనికి స్వాగత సత్కారములఁ గావించి, యర్ఘ్యపాద్యాదులచే నాతనిని బూజించెను. ఆతని పూజను గమనింపకయే ఋషి యముని గద్దించుచు నిట్లనెను:— "యమ రాజు గారూ! మీరు న్యాయశీలములోఁ బ్రసిద్ధులు కదండీ! మీరందఱకు బాపపుణ్యములను బట్టి ఫలముల నొసంగుచుండెదరు కాఁబోలును. ఈ శూలము ప్రయత్నపూర్వముగఁ దీకినను రాలేదే! ఇట్టి శూలదండమును

నా కేపాపకారణమున నిచ్చితిరో కొంచెము దయచేసి చెప్పుడు. నేనేమి పాపము చేసితిని?"

యమధర్మరాజు నిర్ఘాంతపడెను. ఋషి క్రోధముఖమును జూచు నప్పటి కాతని ముఖము వాడిపోయెను. ఓదార్పుతో నాతఁడిట్లనెను:— "బ్రాహ్మణోత్తమా! తమరు వేంచేయుఁడు. తాము స్వస్థచిత్తులు కాఁగానే నేను తమ ప్రశ్నలన్నిటికిని ప్రత్యుత్తరము లిచ్చెదను."

ఋషి శాంతింపలేదు. ఆతఁ డిట్లనెను:— "కాదు, ముందు నాకు చెప్పినఁగాని నేను గూర్చుండను."

వైవస్వతుఁడు వివశుఁడై, నమ్రతతో నిట్లనెను:— "బ్రాహ్మణోత్తమా! బాల్యకాలములో మీరు దర్భమొనతో తూనీఁగను గ్రుచ్చి విడిచి పెట్టితిరి. దాని శరీరము నుండి మీరు దానిని తీయలేదు. కావున నీ యణి (ములికి) నీ శరీరమున మృత్యుపర్యంత ముండఁగలదు."

ఋషి ఒడలెఱుఁగక "ఇదెప్పటి సంగతి?" అనెను.

"మీ బాల్యమున" అని యముఁడనెను.

ఋషి యిట్లనెను:— "బాల్యమున ధర్మాధర్మములు తెలియఁ జాలవు. ఒకవేళ చేసియుండిన నది బాల సులభ చంచలతావశమునఁ జేసియుందును. ఇంత చిన్నదోషమున కింతటి ఘోరదండమా? నీవు శూద్రవృత్తికి సంబంధించిన కార్యమొనర్చితివి. కావున నీవు నూఱు సంవత్సరములు శూద్రుఁడవై భూమిమీఁదఁ బుట్టియుండునట్లుగా నిన్ను శపించుచున్నాను."

యముఁడు కుపితుఁడగు మునిని మధురవచనములతో ప్రసన్నుని గావించి యిట్లనెను:— "స్వామీ! ఏయపరాధమును మీరు నాపై ద్రోసి

తిరో దానిని మీరే చేయుచున్నారు. నాకు నా న్యాయము చేసినందుకిట్టి ఘోరదండమా?"

ముని యాతని యెడలఁ బ్రసన్నుఁడై "ధర్మరాజా! నే నెగతాళికికూడ నబద్ధ మాడను. కావున నీవు భూమిపై శూద్రుఁడవై జన్మింపవలసినదే. నీతల్లి శూద్రయగుటచే నీవు శూద్రుఁడుగ నెన్నఁబడుదువు. కాని నీవు వ్యాసవీర్యమున నుద్భవింపఁగలవు. రాజకులమందు నీవు శ్రేష్ఠుఁడవుగను, మాననీయుఁడవుగను నెన్నఁబడగలవు. అందఱు నిన్ను దేవతగా నాదరింపగలరు. నీ వక్కడకూడ నీ నీతి ధర్మ స్వభావమును వీడవు— నీవు సర్వశ్రేష్ఠుండవగు నీతిజ్ఞుఁడవుగ నెన్నఁబడెదవు. నీ నీతి విద్వాంసులలో గొప్ప యాదరమును బొందఁగలదు. ఇంకొక గొప్ప విశేషమేమన నీవు నంద నందన గోపాలకృష్ణునకు మిక్కిలి ప్రియుఁడ వయ్యెదవు. మనుష్య మానమున నూఱుసంవత్సరములకు పైగా, అనఁగా దేవతామానమున నాలుగైదు నెలలు మాత్రమే శూద్రుఁడవై యుండి పిదప నీ స్వస్థానమునకు రాఁగలవు" అని పలికి ముని యిచ్ఛానుసారముగ లోకములకుఁ బోయెను.

శౌనకుఁ డిట్లడిగెను. "సూతా! న్యాయ మొనర్చు యమధర్మ రాజు లేకపోయిన పాపులకుఁ బాపఫలమును, పుణ్యులకుఁ బుణ్యఫలము నొసంగు వాఁడెవడు? అప్పుడు (దేవతా మానమున నాలుగైదు నెలలు) యమధర్మరాజు పని ఆగిపోయినదా?"

సూతుఁ డిట్లనెను :— "మహర్షీ! ఎప్పుడైన లోకవ్యవహార మాగిపోవునా? వందలకొలది యములు, ఇంద్రులు, కుబేరులు, వరుణులు మారిపోయిరి. వందలసార్లు సృష్టి ప్రళయములు జరిగినవి. యముఁడు శూద్రుఁడుగా, విదురరూపమున నున్నంతవఱకు, నిత్యపితరులలో సర్యముఁడనువాఁడు యముని స్థానము నాక్రమించి న్యాయమును

మరుపుచుండెను. విదుర శరీరమును వదలి మరల తాను యముఁడు కాఁగానే అతడు తన కార్యమును యథారీతిగ మరలఁ జేయసాగెను."

శౌనకుఁ డిట్లు ప్రశ్నించెను :- "సూతా! నీవు చాల అద్భుతమైన కథను జెప్పితివి. విదురుఁడు తన పాంచభౌతిక శరీరము నెట్లు విడిచినాఁడో ఆ కథయంతయు దయచేసి విపులముగఁ జెప్పఁ గోరుచున్నాను."

సూతుఁ డిట్లనెను :- "శౌనకా! మొట్టమొదట నేను మీకు ధృతరాష్ట్రుని సద్గతి కథను వినిపించెదను. ఆ నిమిత్తముననే విదురుఁడు హస్తినాపురమునకు వచ్చెను. అంధుఁడగు తన యన్న ధృతరాష్ట్రుని విదురుఁ డెట్లు ఇంటినుండి వెడలించి తీసికొనివచ్చెనో ఆ వృత్తాంతమును ముందు చెప్పెదను, వినుఁడు."

శౌనకుఁ డిట్లనియె :- "సూతా! నీకెట్లు రుచించిన నట్లుచితమగు రీతిని జెప్పుము."

## హస్తినాపురమునకు విదురాగమనము

౪౪

శ్లో॥ విదుర స్తీర్థ యాత్రాయాం మైత్రేయాదాత్మనో గతిమ్,
జ్ఞాత్వాగాత్ హస్తినపురం తథావాప్త వివిత్సితః॥

—శ్రీ భాగ. ౧ స్కం. ౧౩ అ. ౧. శ్లో.

"విదురుండు తీర్థయాత్రసని మైత్రేయు ముందటఁ గర్మయోగ జ్ఞానాది విషయంబులయిన ప్రశ్నంబులం గొన్నిటింజేసి యతని వలన

నాత్మగతిం దెలిసి కృతార్థుండై హస్తినాపురంబునకు వచ్చిన"

—శ్రీమదాంధ్ర భాగవతము.

దుఃఖములలో మన దగ్గఱ నున్నవారును, విపత్కాలమున మనలను రక్షించినవారు నగు బంధువులు సుఖసమయమున మన దగ్గఱ నన్నచో వారిని మనము ప్రాణముల కంటె నెక్కుడుగఁ బ్రేమించుచుందుము. దుఃఖము స్నేహమును ఉజ్జ్వలముగను, దీక్ష్ణముగను ప్రకాశింపఁ జేయును. బాల్యమునఁ గౌరవులు పాండవుల ననేక విధముల బాధించిరి. నాటినుండి పాండవులను విదురుఁడు రక్షించుచు నప్పుడప్పుడు సమయోచితమైన సలహా నొసంగి తగిన సాయము చేయు చుండెడువాఁడు. ధర్మరాజు రాజైన తరువాత విదురున కేమి సాహాయ్యము లభించెనో తెలిసికొనఁగోరి శౌనకుఁ డిట్లడిగెను:- "సూతా! నీవతి సంక్షేపముగ మహాభారత కథను జెప్పితివి. అశ్వత్థామవలన విడువఁబడిన బ్రహ్మాస్త్రముచేఁ జావకుండ కృష్ణుడు పరీక్షిత్తును గాపాడిన సంగతియుఁ జెప్పితివి. పరీక్షిన్మహారాజు జననము, శ్రీకృష్ణ ద్వారకా గమనము, అశ్వమేధ యజ్ఞముకొఱకు మరల హస్తినాపురమునకు వచ్చుట, అశ్వమేధయాగము సాంగోపాంగముగఁ బూర్తియగుట మొదలగు విషయములన్నియు నీ వతిసంక్షేపముగ గొప్ప మెలకువతోఁ జెప్పితివి. మేమిప్పుడు విదురుని సంగతియేమైనదో, ధృతరాష్ట్రుఁడు హస్తినాపురమున నెంతవఱకుండెనో, పాండవులు పరీక్షిత్తునకు రాజ్యము నెప్పుడు, ఏల యొప్పగించిరో, చివరకు పాండవులు శరీరము నెట్లు వదలిరో, ఈ సంగతులన్నియుఁ జెప్పి, తరువాత పరీక్షిన్మహారాజెట్లు రాజ్య పాలనము కావించెనో, పరోపకారమయమగు శరీరము నాతఁ డెట్లు గంగాతీరమునఁ ద్యాగము కావించెనో చెప్పవలయును"

శౌనకుని ప్రశ్న విని సూతుఁడు మిక్కిలి సంతోషమును జెంది యిట్లనెను:- మహాభాగా! నీవు గొప్ప పుణ్యమయమగు ప్రశ్న మడిగితివి. నీ ప్రశ్నలకు జవాబొసంగు సందర్భమున నాకు పరాత్పరుఁడగు వాసుదేవుని కమనీయ కథలను జెప్పు భాగ్యముకూడ లభించినది. నీ సంప్రశ్నము కారణంబుగ జగన్నాథుని చరిత్రను స్మరించుట సంభవించినది. మంచిది. ఇఁక మీరు సంక్షేపముగ విదుర వృత్తాంతమును వినుఁడు."

దుష్ట దుర్యోధనుని దుర్వ్యవహారమునకు దుఃఖితుఁడై బుద్ధిమంతుఁడగు విదురుఁడు భారతయుద్ధమునకుఁ బూర్వమే తనధనమ్మును గౌరవసభా ద్వారమున నుంచి యుదాసీనుఁడై తీర్థయాత్రార్థమై వెళ్ళిపోయెను. అతఁడు మహాత్ముఁడగుటచే నాతనికేమియు మోహము కలుగలేదు. అతఁడు మరల హస్తినాపురమునకు రాఁదలంప లేదు. కాని తనకంటెఁ బెద్దవాఁడును, బుట్టంధుఁడు నగు ధృతరాష్ట్రుని మేలుకోరి యాతఁడు మరల హస్తినాపురమునకుఁ దిరిగి వచ్చెను. యాత్రా సందర్భమున నాతఁడు వ్రజములో నుద్ధవుని గలిసికొని, అతనిద్వారా శ్రీకృష్ణనిర్యాణ వృత్తాంతమును విని, అతనివలన మైత్రేయమహాముని సమాచారమును దెలిసికొని, హరిద్వారమునకుఁ బోయి, యచ్చట మైత్రేయుని వలన సమస్త సందేహ నివృత్తి కావించుకొని హస్తినాపురమునకు వచ్చెను"

శౌనకుఁ డిట్లడిగెను:— "సూతా! విదురునకు ఉద్ధవుఁడెట్లు తటస్థపడెనో, మైత్రేయుని విదురుఁడేమని ప్రశ్నించెనో మాకుఁ జెప్పదగిన దగుచో విపులముగాఁ జెప్పుఁడు."

సూతుఁ డిట్లు చెప్పెను:- "మునులారా! నే నీ కథలను ప్రసంగాను సారముగ ముందుముందు స్వయముగఁ జెప్పఁ గలను. మీరిప్పుడు

విదురచరిత్రమును, మీదట నాతఁడు హస్తినాపురమున నుండి యేమి చేసినదియుఁ జెప్పెదను-వినుండు."

శౌనకుఁడు తొందరతో నిట్లనెను:- "మంచిది. మీకెట్లు సమంజస మని తోచిన నట్లు చెప్పుడు, దీనిలో భగవత్కథా వర్ణనము విస్తారముగ నుండునని యిట్లు ప్రశ్నించితిమి. ఇప్పుడు విదుర వృత్తాంతమునే చెప్పుము"

శౌనకుని సమ్మతిని సూతుఁ డిట్లు చెప్పఁదొడఁగెను:- "ఉద్ధవుని ఆదేశానుసారముగ విదురుఁడు హరిద్వారమునకుఁ బోయి, అచ్చట ఏకాంతమున శాంతముగఁ గూర్చుండిన మైత్రేయ మహామునిని జాల ప్రశ్నలు వేసెను. వేదవేత్తయు విద్వాంసుఁడు నగు మైత్రేయుఁడు కొన్నిటికి సదుత్తరము లొసంగెను. దానికి విదురుఁడు చాల సంతృప్తి చెంది మిగిలిన ప్రశ్న లడుగఁ దలపఁలేదు. అతడు మధ్యలోనే సంతోషమును జెంది మునికి ప్రణమిల్లి హస్తినాపురమునకు వచ్చెను."

అతఁడు నగరసమీపమునకు రాఁగానే యెవరో చూచి యీ శుభ వార్తను ధర్మరాజున కెఱిఁగించిరి. ధర్మరాజు సంతోషమునకు మేర లేకుండెను. అతఁడు భక్తిభావ పరవశుఁ డయ్యెను. బిడ్డలవలె తమ్ము రక్షించిన ప్రాణాధికుఁడగు పితృవ్యుఁడు నాఁడు వచ్చినాఁడను సంగతి తెలిసికొని హర్షోద్రేకముచే నాతడు పులకించెను.

ధర్మరా జిట్లాజ్ఞాపించెను:- శీఘ్రముగ సమస్త వాహనములు సిద్ధము కావింపుఁడు. పెద్దలు, చిన్నలు, నగరవాసులు అందఱు మా పినతండ్రికి స్వాగతమీయ నేగవలయును. అతఁడు మాకు దైవ సమానుఁడు అతని కందఱును హార్దికస్వాగత మీయవలయును."

ధర్మరాజు ఆజ్ఞాకాఁగానే నగరమంతటను ఆనందకోలాహల ప్రవాహ మువ్వొంగెను. నగరమంతట స్త్రీ పురుషులందఱు స్వాగతమున

కేర్పాట్లు చేయ మొదలిడిరి. సేవకులు శీఘ్రముగఁ బరువిడి వీథులందును, గృహద్వారములను, ముఖ్య ద్వారములను, చౌకులను పతకాదుల తోడను, దోరణములతోడను, అలంకరించిరి. పెద్దలు, చిన్నలు, బాలురు, వృద్ధులు, స్త్రీలు వారివారి రథవాహనములపై నెక్కి నగరము వెలుపలకు విదురునకు స్వాగతమీయ వెడలిరి. చాలామంది కాలినడకనే పరువిడుచుండిరి. దూరము నుండి తపస్వివలె జడలుధరించి, వల్కల వస్త్రమును గట్టుకొని కాలి నడకతో విదురుఁడు వచ్చుట నందఱును గాంచిరి. అందఱును దమతమ వాహనములు డిగ్గి మిక్కిలి వేగమునఁ బరువిడి యాతని గౌఁగిలించుకొని విలపింప మొదలిడిరి. ఆ సమయ మునఁ ధృతరాష్ట్రుఁడు కూడ తన తమ్మునకు స్వాగత మిచ్చుటకు రథము డిగ్గి వచ్చుచుండెను. యుయుత్సుఁడు, సంజయుఁడు, కృపా చార్యుఁడు, ఇతర పాండవులు, బంధువులు చుట్టుకొని నిలుచుండిరి. విదురుఁడు మరల తిరిగివచ్చునను నాశ ఎవ్వరికిని లేదు; కాని హఠాత్తుగా నాతఁడు వచ్చుట చూడఁగానే అందఱకును విపరీతముగు నానందము కలిగెను. అందఱకుఁ బోఁగొట్టు కొనిన విలువగల వస్తువు దొరికిన నెట్లుండునో అట్టి యానందము కలిగెను. ఎన్నటికిని నయము కాదనుకొనిన మొండిరోగము దానికదియే నయమైన నెట్లుండునో అట్లుండెను. గ్రుడ్డివానికి దృష్టి వచ్చినట్లును, చచ్చిన వానికి మరల ప్రాణము వచ్చినట్లును ఉండెను. అందఱును ప్రేమ, నమ్రతలతో విదురు నాలింగనాదులు చేసికొనిరి. అందఱును ప్రేమా శ్రువులను గార్చిరి అందఱు తదేక దృష్టితోఁ దపస్సుచేఁ గృశించిన విదురుని జూడ మొదలిడిరి. విదురుఁ డందఱకు యథోచిత సత్కారము కావించి, పరస్పర కుశలప్రశ్నానంతరము రాజభవనమునకుఁ బోయెను.

రాజభవనమునకుఁ జేరఁగానే ధర్మరాజాతని ఉత్తమాసనమునఁ గూర్చుండఁ బెట్టి యథోచిత పూజలు కావించెను. పాండవకులములోఁ

గల చిన్న పెద్ద స్త్రీలందఱు అనఁగాఁ గుంతి, గాంధారి, ద్రౌపది, సుభద్ర, ఉత్తర, కృపి, పాండవ కౌరవుల కులములోని కోండంద్రు వచ్చి తపస్వియగు విదురుని దర్శించిరి. విదురుఁడు సందర్భానుసారముగ నెవరి నెట్లు కుశల ప్రశ్న వేయవలయునో అట్లు కుశల ప్రశ్న కావించెను. కుంతి ఎండి వాడిన విదురుని శరీరమునఁ జేత నిమురుచు విలపించెను. ఆమె యిట్లనెను :—"ఏమి! విదురా! నీవు మమ్ములను మఱచియే పోయితివా? దుఃఖములో మమ్ములను గనిపెట్టికొనియుంటివి. సుఖమురాఁగానే మమ్ములను జూడకపోవుటచే వెనుకటికంటె నెక్కువ దుఃఖములో నుంటిమి. నీవు బొత్తిగ మారిపోయితివి. గుర్తింప వీలు లేకున్నది. శరీరమంతయు నెండిపోయినది."

విదురుఁడు కన్నీటిని దుడుచుకొనుచు నిట్లనెను :- "వదినా! ఎవరి ననగలము? అంతయు వారి వారి యదృష్టమునుబట్టి యుండును. మానవుఁడు ప్రారబ్ధ సూత్రమున బంధింపఁబడినాఁడు. ప్రారబ్ధ మెచ్చటకు లాగుకొనిపోయిన నచ్చటకు తన కిష్టము లేకున్నను జీవి వెళ్ళితీరవలసినదే."

విదురుని వాక్యములు విని ప్రేమాశ్రువులను రాల్చుచు ధర్మరాజిట్లనెను :— "బాబాయీ! మీకు మేమెప్పుడైన జ్ఞాపకమునకు వత్తుమా ? నిజము పలుకుఁడు. పక్షి తన గుడ్లను దన ఱెక్కలక్రిందఁ బెట్టుకొని పొదిగి కాపాడినట్లు మీరును మమ్ములను రక్షించుచుంటిరి. తోటమాలి తనమొక్కల క్షేమమునే సదా చింతించునట్లును, రైతు క్షేత్రములోని యంకురములను గూర్చియే చింతించునట్లును, లేక లేక కనిన తల్లి తన ఏకైక పుత్రునియెడల కన్నులు పెట్టుకొని చూచునట్లును, మమ్ములను మీరు సర్వదా రక్షించుటలో సావధానులరై యుంటిరి. మీ కృపవలననే మేము పెరిగి పెద్దవారమైతిమి. మీ కృపవలననే శత్రుక్షయము కావించి చతుస్సముద్ర వలయిత సమస్త

భూమండలమునకుఁ జక్రవర్తి నైతిని. దుర్యోధనుఁడు భీమునకు విష మీయనున్నాఁడని చెప్పినది మీరే. కౌరవులు వారణావతములోఁ దల్లితోఁ గూడ కాల్చి చంపఁ బ్రయత్నించి మా కొఱకై లక్కయిల్లు కట్టింపఁగా నీవు దానిలో సొరంగమును ద్రవ్వించి, పడవ వానిని, పడవను సిద్ధముగఁ బంపి మమ్ములను రక్షించితిరి. మీరు మా యెడల దయ తలఁపకుండిన మేముచ్చట మనియయ్యేదు వారమే ఇట్టి మీరు మమ్ము లను వదలి వెళ్ళి పోయితిరి."

విదురుఁ డిట్లనెను :—ధర్మరాజా! ఎవరు ఎవరిని రక్షింపఁ గలుగుదురు! దేవపుత్రులగు మిమ్ములను రక్షించు శక్తి నా కెక్కడిది? మిమ్ములను మీ ధర్మము, మీ సత్యము, మీ సదాచారమే రక్షించినది. ధర్మము నెవరు రక్షింతురో వారిని వారి ధర్మమే రక్షించును భగ వంతుని దగ్గఱ ఆలస్యమైనప్పటికి అంధకార ముండఁజాలదు. దుర్యోధనుఁడు నన్ననేక కువాక్యములు పలికినాఁడు. వానిని వినిన వాఁడు మరల నాతని రాజ్యమున నుండఁజాలఁడు. నేను మీ పక్షమున నుండకుండుట లోకనిందకు భయపడియే. అదియును గాక నే నీ యసహ్య బంధు వధను జూడఁజాలకయే పుణ్యతీర్థయాత్రకు వెడలితిని. దాని మూలమున నాకు పుణ్యము లభించినది. యుద్ధము చూడ నవసరము లేకుండ, విననవసరము లేకుండఁ బోయినది."

ధర్మరాజిట్లనెను :-"మీ యాత్రలో నెట్లు గడిపితిరి ? మీకెట్లు గడచినది ? మీరేదైన వాహనముమీఁద వెళ్ళితిరా లేక కాలినడకనా? ఒక్కరే యుంటిరా? లేక యాత్రికులతో గలిసియుంటిరా ? మాకీ విష యము లన్నియు వివరముగఁ జెప్పవలయును మీ యీ విచిత్ర వేషమును జూచిన నాకు మిక్కిలి కుతూహలము కలుగుచున్నది."

విదురుఁ డిట్లనెను :—"రాజా ! నేనిక్కడనుండి బయలుదేరి నప్పుడు నే నవధూత వేషమును వేసికొంటిని. వస్త్రముల నన్నిటిని తీసి

పాఱవేసితిని. కౌపీనమును ధరించితిని. ఒక బొంతను ధరించితిని. నన్నెవరును గుర్తింపకుండుటకై మొదలి నిండ బూడిద పూసికొంటిని. నే నొంటరిగాఁ దిరుగాడుచుంటిని. యాదృచ్ఛికముగా నేది లభించిన దానిని దిని సంతుష్టి చెందెడు వాఁడను. భూమిమీఁదఁ బరుంటిని. కాలినడకను బుణ్య తీర్థములను, బర్వతములను, నదీనదములను, దేవతాయతనములను, మందిరములను జూచుటకుఁ బర్యటించితిని. ఈ విధముగ నేను భారత వర్షములోని సమస్త ప్రసిద్ధములగు తీర్థయాత్రలను సేవించితిని."

ధర్మరా జిట్లడిగెను :— "బాబాయి! మీ రేయేతీర్థములకు వెళ్ళితిరి?"

విదురుఁడిట్లనెను —"నేను కురుక్షేత్రము, ఇంద్రప్రస్థము మధురాపురి, బృందావనము, శూకరక్షేత్రము, వటేశ్వరము, నైమిశారణ్యము, ప్రయాగ, అయోధ్య, చిత్రకూటము, కాశి, గయ, జగన్నాథపురి, వేంకటాచలము, కాంచి, శ్రీరంగము, చిదంబరము, కుంభకోణము, శ్రీరామేశ్వరము, పండరీపురము, ద్వారక ప్రభాసక్షేత్రము......"

మధ్యలోనే ధర్మరా జిట్లడిగెను :- "మీరు ద్వారకాపురికి ప్రభాసక్షేత్రమునకుఁగూడ వెళ్ళియుంటిరా? అక్కడ మీరు యాదవుల నందఱను గలిసికొనియుండవచ్చును. భగవానుని దర్శనముకూడ అయియుండవచ్చును. అర్జునుఁ డక్కడనే ఉన్నాడు. అతనిని గూడ కలసికొని యుండవచ్చును. మీరు నాకు శ్రీకృష్ణుని వృత్తాంతమంతయుఁ జెప్పవలయును."

విదురుఁడు ప్రభాసక్షేత్రము నుండియే అత్యంత శీఘ్రముగ యోగమార్గమున మధురాపురీ, హరిద్వారముల మీఁదుగా నిచ్చటికి వచ్చియుండెను. యదువంశ క్షయమైన వృత్తాంతము నాతఁడు ఉద్ధవునివలన

వ్రజములో వినియుండెను. వాసుదేవుఁడు దేవతా ప్రార్థనచే స్వధామమునకుఁ జేరెను. కాని విదురుఁడు ఈ దుఃఖ సమాచారమును దాను స్వయముగఁ జెప్పఁదలఁప లేదు. కారణ మాతఁడు స్వాభావికముగ దయాళువు. అతఁడెల్లప్పుడును బాండవులను సంతోషపెట్టు కార్యములనే చేయుచుండును. దీని కొఱకే అతఁ డెల్లప్పుడును బ్రయత్నించుచుండును. అట్టియెడ నిప్పుడాతఁడీదుఃఖ వృత్తాంతమును జెప్పి వారికి బాధయేల కలిగించును? అతఁడిట్లనుకొనెను:— "ఎప్పుడో ఒకప్పు డీసమాచారమును ధర్మరాజు వినఁగలఁడు. అర్జునుఁడు స్వయముగ వచ్చి చెప్పఁగలఁడు. అట్టియెడ నేను సంతసమును జింతగ నేల మార్చవలయును?" అని తలఁచి యాతఁడు యాత్రా వృత్తాంతము సంతను జెప్పెనుగాని యదుకులక్షయ వృత్తాంతములను మాత్రము చెప్పలేదు. అతఁడిట్లనెను:— "నాయనా! నేను బంధువులకడ కెక్కడికిని వెళ్ళలేదు. నా ప్రయోజనము తీర్థయాత్ర చేయుటయే"

ధర్మరా జిట్లనెను:— "మీకు తీర్థయాత్రలచే నేమి పుణ్యము కలుగును? మీరు స్వయముగఁ దీర్థస్వరూపులరు. నిజమే, తీర్థముల వలన మీకు లాభము కలుగఁ గలదు తీర్థములలోఁ బాపులు స్నానము చేసి వానినిఁ గల్మషము కావింతురు. సదా శ్రీహరి నివసించు హృదయముగల మీబోటి పరమ భాగవతోత్తములు వానిలో స్నానముకావించి యా తీర్థముల పాపములను పోఁగొట్టుచుందురు. మీరు స్వయముగఁ దీర్థయాత్రలు చేయఁబోలేదు; కాని తీర్థములను యథార్థ తీర్థములుగఁ జేయుటకు భూమిమీఁదఁ జరించుచుందురు. మీవంటి పరోపకారులగు భగవద్భక్తుల స్వభావమిట్లేయుండును."

ఈవిధముగఁ బరస్పర కుశలప్రశ్నలు శిష్టాచార విషయ ప్రసంగము జరిగిన తరువాత యుధిష్ఠిరుఁడు విదురుఁడుండుటకు మణిమయ భవనము నిచ్చెను. అతని యుపయోగముకొఱకు సమస్త దివ్య

వస్తువుల నొసంగెను. స్వర్గములో దేవతలు సుఖముగనున్నట్లు విదురుఁడుండెను. అతనికి సాంసారిక సుఖ స్పృహ లేదు. భోగవాంఛ లేదు కాని పాండవుల సంతోషముకొఱకును, తన యన్నయగు ధృతరాష్ట్రునకు మేలుచేయఁగోరికతోడను గొంతకాలము ధర్మరాజుదగ్గఱ దివ్య రాజ భోగము లనుభవించుచు నుండెను. సాక్షాత్తుగఁ బ్రాణులను దండించు యమధర్మరాజే ముని శాపవశమున విదురుఁడయ్యెను. ఇట్టి బుద్ధిమంతుఁడగు విదురుఁడు లభింప ధర్మరాజు ఆనందమునకు మేరలేకుండెను. అతఁడు తన సమస్త రాజకార్యములందును విదురుని సలహాను గొనుచుండెను. ఆయన నడిగియే సమస్తకార్యములు చేయుచుండెను.

## ధృతరాష్ట్రునకు విదురుని వైరాగ్యోపదేశము

శ్లో॥ రాజన్ నిర్గమ్యతాం శీఘ్రం పశ్యేదం భయమాగతమ్।
ప్రతిక్రియా న యస్యేహ కుతశ్చిత్ కర్హిచిత్ప్రభో।
స ఏష భగవాన్ కాలః సర్వేషాం నః సమాగతః ॥
— శ్రీ భాగ ౧స్కం. ౧౩ అ. ౧౮. ౧౯ శ్లో॥

"మ॥ కనకాగార కళత్రమిత్రసుత సంఘాత బులన్ ముందటం
గని ప్రాణేచ్ఛలనుండు జంతువుల నేకాలంబు దుర్లక్ష్యమై
యనివార్యస్థితిఁ జంపునట్టి నిరుపాయంబైన కాలంబు వ
చ్చె నుపాంతంబున మాఱుదీనికి మదిం జింతింపు ధాత్రీశ్వరా॥"
— శ్రీ మదాంధ్ర భాగవతము

దుఃఖదినములు గడచుట చాలదుర్లభముగ నుండును. సుఖ దినములు గడిచినట్లే తెలియదు. మన మనేక కార్యములందు మగ్నులమై యుందుము. కాని కాలమును సదా అవ్యగ్ర భావముచేఁ బ్రతీక్షించుచుండవలెను. మనము దారపుత్ర గృహకుటుంబాది చింతలో మునిఁగి యుండుటచే ననవధానుల మగుచుందుము. కాని కాలము సదా సావధానముగ నుండి యంత్యకాలమును గనిపెట్టుకొని యుండును. తామర మీఁద గోఁకుకొనిన సుఖము లభించినట్లు విషయసుఖములలో మనము ప్రవృత్తులమై యుందుము. కాని కాల మప్రమత్తతతో మనల వెంబడించుచుండును. మన మాకాశమునఁ, బాతాళమున, భూమియందు, గృహవనాదులందు, శయ్యాసన వాహనములందు వీనిలో నెక్కడునున్నను, కాలము మనలను వదలదు. అది దాని లెక్కను మఱవదు దాని కెవరి మీఁదను అభిమానములేదు. నీవు నీయుద్దేశ్యమును మఱచినను అది తన పనిని మానదు.

బహుకాలమునకు పాపము పాండవుల కైశ్వర్యము ప్రాప్తించినది. ధర్మరాజు చతుస్సాగర వలయిత వసుంధరకు ఏకచ్ఛత్రాధిపతి యయ్యెను. సోదరులు, సేవకులు, మంత్రులు, అమాత్యులు అతనికి వశవర్తులు. చాలా జాగ్రత్తగ నాతని యాజ్ఞలన్నియు నవిలంబముగఁ బాలింపఁబడుచున్నవి. అశ్వమేధయజ్ఞకారణమున నాతని యశస్సు భువి మొదలు దివి వఱకు వ్యాపించినది. కులదీపకుఁడును, సర్వలక్షణ సంపన్నుఁడు నగు పౌత్రుఁడుకూడ కలిగినాఁడు. ద్రౌపది తన పతులను బరమాత్మగ భావించి, పూజించి, యాదరించుచుండెను. భగవదనుగ్రహమున ధనసంపత్తికి లోటులేదు. పాండవులందఱు మఱియు ధర్మరతిని జెందియుండెను. వారు ధర్మముగ యథేష్టవాంఛలనుభవించుచు తమ యాశ్రితుల మనోరథము లన్నిఁటిని సఫలీకృతము కావించుచుండిరి. ధర్మరాజు ఉదయముననే తన సోదరులతోఁ గూడ తన తల్లి

దంప్రులతో సమానులగు- గాంధారీ ధృతరాష్ట్రుల భవనమునకుఁ బోయి, యింకను వారు శయ్యపై నుండఁగానే వారికి చరణాభి వందనము కావించి, కుశలప్రశ్న కావించి, ఆదర్శ పతివ్రతయగు గాంధారి చరణ కమలములను నమస్కరించును. వారామెను గుంతీదేవికంటె మిక్కిలి ఆదరముతోఁ జూతురు. ధర్మరాజుయొక్క యిట్టి ప్రేమ పూర్వక వ్యవహారమును గాంచి ఆ దంపతు లత్యంత సంతుష్టులై ప్రతిదినము వారికి వివిధములగు నాశీర్వాదముల నొసంగుచుందురు.

ధర్మరాజు చేతులు జోడించుకొని వారిసన్నిధిని నిలఁబడి ప్రతి కార్యమునకు వారి యాజ్ఞను ప్రతీక్షించును. వారి సౌఖ్యమునుగూర్చి యోచించును. కుంతీదేవి తన భవనమును వదలిపెట్టి గాంధారీభవనమునకు బోయెను. ఆమె గాంధారికి తోడికోడలైనను ఆమెను సొంత అత్తవలె నాదరించుచుండును. దాస దాసీజనము లెందఱో ఉన్నప్పటికిని ఆమె గాంధారీ ధృతరాష్ట్రుల పనుల నన్నిటిని తనచేతులతో జేయుచుండును. గాంధారి వలదనినఁ గుంతి కన్నుల నీరు పెట్టుకొని యిట్లనును :- "అక్కయ్యా! ఈ సేవ నాకు చాల అదృష్టమున దొరకినది. నాకిట్టి సౌభాగ్య మెట్లు లభింపఁగలదు?" కుంతీదేవి పలుకునట్టి వాక్యములను విని ఆ వృద్ధదంపతులు లోలోన మిక్కిలి సంతసించుచుందురు.

భీమసేనునిది కొంచెము క్రోధ స్వభావము. అతఁడు ధృతరాష్ట్రుని పూర్వవిషయములను జ్ఞాపకము చేసిన ధర్మరాజు వానినదలించి తనమీఁద నొట్టుపెట్టుకొని యిట్లనును:- "భీమా! నా తల్లిదండ్రుల కంటెను బూజనీయులును, మాననీయులునగు గాంధారీ ధృతరాష్ట్రుల సమ్ముఖమున నిట్టి కఠిన వచనములు పలుకునెడల నిశ్చయముగ నేను రాజ్యమును వదలి యగ్నిప్రవేశము కావించెదను." ఈ భయమున భీమసేనుఁ డేమియు ననెడు వాఁడు కాఁడు. ఈ విధముగఁ బాండవుల

కాలము మిక్కిలి యానందముగ గడచిపోవుచుండెను. వారు తమ యతులైశ్వర్యముచే దేవదుర్లభమగు భోగము లనుభవించుచు రాఁబోవు కాలమును మఱచిరి. కాని కాల మూరకుండునా ? అది పాండవులను సమీపించెను.

పాండవుల కాలము పూర్తికాఁబోవుచున్నదను సంగతి తన దివ్యదృష్టిచే ధర్మావతారుఁడగు విదురుఁడు కనుఁగొనెను. కాలస్వరూపుఁడగు భగవానుఁ డాతని గొనిపోవుటకు వచ్చి, యత్న మొనర్చుచుండెను. అతనికి పాండవుల చింత లేదు. కారణము వారికి శ్రీకృష్ణ కృప కలదు. అతని చింత అంతయుఁ దన యన్నయగు గ్రుడ్డి ధృతరాష్ట్రుని గూర్చియే. అతని నింటిలోఁ జావనిచ్చుట అతని కిష్టములేదు. కాని ధృతరాష్ట్రుఁడు ధర్మరాజు కోరికకు వ్యతిరేకముగఁ బోవఁజాలనంతగ ధర్మరాజు సేవకు అతడు వశీభూతుఁడై యుండెను. నిజమగు శుభచింతకులకు అదలించి, బెదరించి, కఠోరవాక్యములు పలికి, ఏదో విధమునఁ దమవారికి హిత మొనర్చుటయే పని. వా రసంతుష్టులగుదురను భయముచేఁ దమ బాంధవులకును, మిత్రులకును హితమును జెప్పక, ముఖస్తుతి చేయువారు సుహృదులు కాక శత్రువులే యగుదురు. సుహృదుల లక్షణము ఏదోవిధమునఁ దన బంధువులకు మేలుచేయుటయే. విదురుఁడట్టి బంధువే. తన యన్న శీలసంకోచముచే భోగములందును, సంబంధులయందును అధికాసక్తిని జెందియున్నాఁడను సంగతి తెలిసికొని, అతఁడు మధురవాక్కులతో వినఁడని గ్రహించి, కఠోర వాక్కులతోఁ జెప్పఁదలఁచెను.

విదురుఁడిట్లనెను :- "ప్రభూ! నీవిప్పు డిక్కడనేల యిరుకుకొంటివి? నీకు బాహ్యనేత్రములు లేకున్నప్పటికి ప్రజ్ఞానేత్రములు కలవు. నీవు నీయెదుటనున్న కాలస్వరూపుఁడగు భగవాను నెఱుఁగవు ? కాలమిప్పుడు నదుముబిగించిమనలను భక్షించుటకు సిద్ధముగ నున్నది."

ధృతరాష్ట్రుఁడు దుఃఖితుఁడై యిట్లనెను:- "సోదరా! విదురా! నీవు బుద్ధిమంతుఁడవు. సమస్తవిషయములఁ బండితుఁడవు. ఈకాలమును గడుచుట కేదైన నుపాయమును జూడుము. జప, తపో, మంత్ర, యంత్ర, పారాయణాదులలో నేదైన బ్రతిక్రియఁ గావించి దీనిని దాటఁ దలఁచిన ధర్మరాజునకుఁ జెప్పి చేయించుము."

విదురుఁడు తన మాటమీఁద నిలఁబడి యిట్లనెను:- "రాజా! ఈ కాలము దుర్నివారమైనది. దీనిఁ దొలగించుట కుపాయమేమియు లేదు. ఇది స్థిరమైనది. నశించనిది. నీవు నీ మేలు కోరినదైన నీ బంధన రూపమగు గృహమును శీఘ్రముగ వీడి తపోవనమునకుఁ బొమ్ము. అట్లు నీవు వెళ్ళక, యిచ్చటనే అంటిపెట్టుకొని కూర్చుంటివా, యీ దుష్ట కాలము నీ శరీరమును దినివేయఁ గలదు. ఈ సామగ్రులన్నియు నిచ్చటనే యిట్లే పడియుండఁగలవు. అంత్యకాలమునఁ గుటుంబ పరివార చింత పెట్టుకొని చచ్చిన మరల వీరికి పుత్రులమై పుట్టవలసినదే. 'అంతే యామతిః సాగతిః' యను న్యాయమును వినవా?"

ధృతరాష్ట్రుఁ డిట్లనెను:- "విదురా! ఇంకను జావవలెనను కోరిక పుట్టలేదు. ధర్మరాజు నన్నుఁ దన ప్రేమపాశమున గట్టిగ బంధించినాఁడు."

విదురుఁ డిట్లనెను:- "ఛీ! ఛీ! ఇంకను నీకు బ్రదుకు నాశయే కలదు. నీ తండ్రులు, సోదరులు, మిత్రులు పుత్రులు వేయేల నంద ఱును జచ్చిరి. నీ యింద్రియము లన్నియు శిథిలములైనవి. దేహము జర్జరితమై పోయినది. ఇట్లున్నను ఇంకను జీవితాశకలదు. పోనిండు, సొంత యిల్లందమా? కాదు. వేఱొకని పంచకూఁడు తిని, రామ! రామ! నీకు ముసలితనములో బుద్ధి యెట్లు బుగ్గియైనది ? నీ విట్టివాఁడవని నేనను కొనలేదు."

ధృతరాష్ట్రుఁడు మిక్కిలి దీనముగ నిట్లనెను:- "సోదరా! విదురా! నేఁడు నన్నిట్లాడరాని మాటల నేల పలికెదవు? తమ్ముఁడా! నేనంధుఁడను. నా పుత్రులు, పౌత్రులు, బాంధవులు అందఱును జచ్చిరి. ఆ దుష్టులు నన్నెల్లప్పుడు దుఃఖపెట్టుచునే యుండిరి. దుర్యోధనుఁడు నాకెన్నఁడును శ్రద్ధతో సేవచేయలేదు. యథార్థ పుత్రసుఖము నాకు ధర్మరాజు రాజ్యకాలమున లభించినది. నీవిదివఱకుఁ జెప్పనే చెప్పితివి, కులరక్షకొఱకు దుర్యోధనునిఁ బరిత్యజింపుమని; కాని నేను పుత్రస్నేహముచే నట్లు చేయఁజాలక పోయితిని. అతఁడు స్వయముగ దానుజేసిన పాపముచే బంధువులతోఁ జచ్చినాఁడు. ఇప్పుడు నీవు ధర్మరాజు నింటిని పరగృహమని పలికెదవేల? అతఁడు మాతమ్ముఁడగు పాండురాజు కంటె మిక్కిలి సత్కారము చేయుచున్నాఁడు."

విదురుఁ డత్యంత ప్రేమ రోష స్వరమున గద్దించుచు నిట్లనెను:-"రాజా! ఈ మాటలు పలుకుటకు నీవు సిగ్గుపడుట లేదా? ధర్మరాజు చేయునది వాని కనురూపముగనే యున్నది. అతఁడిట్లు చేయుటయే యాతనికి శోభ. అతఁడు ధర్మమర్మములను బాగుగఁదెలిసిన వాఁడు. నీ సేవచే నాతఁడు తన పరలోక సుఖప్రాప్తికి ఉపాయము చూచుకొనుచున్నాఁడు. కాని నీ సంగతి నీవాలోచించుకొనవలయును గదా! నీ వాతనితో నిదివఱకెట్లు మెలఁగితివి? వారణావతములోఁ బాండవులను లక్కయింటిలోఁ దగులబెట్టుమని యాజ్ఞాపించిన సంగతి అప్పుడు నీకు తెలియదా? భీమునకు విషముపెట్టి చంపవలెనని దుష్టుఁడగు దుర్యోధనుఁడు దురాలోచనచేసి లడ్డులో విషము పెట్టి భీమునిచేఁ దినిపించిన సంగతి నీకు తెలియకుండ జరిగినదా? నిండు సభలో సాధ్వియగు ద్రౌపదికి వలువలూడ్చి దుష్టులు నగ్నగఁ జేయఁ దలఁచిననాఁడు నీవు సింహాసనము మీదఁ గూర్చుండి ఱెప్పలార్చుచు మాటిమాటికి 'ఇప్పుడేమి జరిగినది? ఇప్పుడేమి జరిగినఁదని అడుగు

చుంటివే ? అప్పుడు పాండవులు నీ పుత్రులు కాకపోయిరా ? అప్పుడు ద్రౌపది ఎవఁడో మ్లేచ్ఛుని భార్యయా ? ఇంతయేల ! ద్యూత సభ నీ సమ్మతిమీఁదఁగదా రచింపఁబడినది ? పాండవులు రాజ్య, ధనాదులు శకుని మొదలగు దుష్టచతుష్టయముచే నపహరింపఁబడ నారచీరలు ధరించి యడవులఁ బట్టినది నీ సమ్ముఖముననే కదా ! అప్పుడు పాండవులు నీ కొడుకులు కాకపోయిరా? అప్పుడు ప్రయత్నము లేకుండగనే సర్వము లభించినది కావున మాటలాడలేదు. ఇప్పుడో, అందఱును జచ్చిరి కావునఁ బాండవులు కొడుకులైరి, ద్రౌపది కోడలైనది. బెల్ల మనిన మ్రింగుట, చేదనిన నుమియుట. ఛీ! ఛీ! నేఁటికి నీకు పుత్ర స్నేహ ముత్పన్నమైనది. భీముని మనస్సులోని సంగతి నీకు తెలియునా ? ధర్మజుని ఆజ్ఞచే సంకోచవశమున వాఁకిటఁ బడియున్న కుక్కకు వేసినట్లు సమస్త సామగ్రుఁలను నీకు పడవేయుచున్నాఁడు. నీవు నా కొడుకులు నాకు సేవ చేయుచున్నారనుకొనుచున్నావు. రాజా! నీ వత్యంత శోచనీయుఁడవు. నీవింతగా శరీరమును బోషించుకొనుచున్నావు. అది యేనాఁడో ఆకస్మాత్తుగ నిన్ను వదలి వెళ్ళిపోఁగలదు. కావున నీమేలుకై యేదైన చేసికొనుము."

ధృతరాష్ట్రుఁ డిట్లనెను :- "సోదరా ! నీవు యధార్థమునే చెప్పుచున్నావు. పాండవులతో నేను జేసిన వ్యవహారమును దలఁచుకొనిన నా ముఖమును వారికి చూపు యోగ్యతకూడ లేదు. నేనిట్లొనర్చినను బాండవులు నన్ను దండ్రికంటె నెక్కుడుగఁ జూచి సేవించుచున్నారు. అది వారి కనురూపముగనే యున్నది. నేనొనర్చిన దుష్టత్వము నా దుష్ట స్వభావముల కనుకూలముగనే యున్నది. సోదరా ! నే నిప్పుడేమి చేయవలయునో నీవే చెప్పుము ఏపని చేసిన నాకు మేలు కలుగఁ గలదు?"

విదురుఁ డిట్లనెను :- "రాజా ! ఈ శరీరము శ్రేష్ఠమైనదని లోకములోఁ జెప్పుచుందురు. కాని యిది మలమూత్రవు తిత్తి. రోమ రోమములనుండి దీనిలోని మలము సర్వదా బయటకు వచ్చుచుండును. దీనిలో వ్యాధు లసంఖ్యాకములుఁగ నున్నవి. ఈ వ్యాధులవలన వివశుఁడై జీవి యధీరుఁడగును. ఈతఁడు విషయాధీనుఁడై శరీరమం దనురక్తి చెందునట్లు గృహమందనురక్తి చెందును. ఈ జీవి శరీరమే ఆత్మ యనుకొని దానిలో బంధింపఁబడి యుండును. ఇట్లే గృహమందుఁ గూడ మమకారము కలిగియుండును ఇంతగాఁ బెంచి పోషించిన శరీరమును వదలి జీవాత్మ వెళ్ళిపోవఁ బకే యీ యిల్లు, వాఁకిలి, కుటుంబ పరివారదులు. కావున నంత్యకాలము రాకమునుపే బుద్ధిమంతుఁడైనవాఁడు మమతాత్యాగము కావించి, తపోవనమునకో, తీర్థస్థానమునకో పోయి ఆత్మచింతనము - చేసికొనవలయును. అధీరతను పారద్రోలవలయును. ఈ విధముగ నీ శరీరము ప్రయోజనరహితమైనదని తెలిసికొని, మోహబంధమును వీడి, విరక్తభావముతోఁ గుటుంబములోని వారికి తెలియకుండ నుండి భగవచ్చింతనము చేయుచు దానిని వదలినవాఁడు ధీరుఁడని పిలువఁబడును. రాజా! నీవు జ్ఞానివి. జ్ఞానమార్గము ననుసరింపుము. ఈ గృహస్థ మోహజాలమును వీడి తపోవనమునకుఁ బొమ్ము."

ధృతరాష్ట్రుఁ డిట్లనెను :— "విదురా ! అందఱకు నీకువలె జ్ఞానము రాదు. అందఱును వారంతటవారు గృహమునెట్లు త్యాగము చేయఁగలుగుదురు?"

విదురుఁ డిట్లనెను :- కురుకుల తిలకా! త్యాగము లేక కల్యాణము లేదు. ఆసక్తి బంధనహేతువు. కావునఁ దనకుఁదానే కాని, పరుల ఉపదేశము వలనఁగాని, యీ బాహ్య విషయముల యెడల విరక్తినిఁజెంది, హృదయమునుండి సమస్త వాసనలను బారఁద్రోలి,

అచ్చట వాసుదేవుని నిలిపి, యెవఁడు గృహమును వదలి వనమునకుఁ బోవుచున్నాఁడో అతఁడే మానవులలో శ్రేష్ఠుఁడు - అట్లుకాక చివరివఱకు మోహజాలములోఁ బడియుండి, పుత్ర పౌత్ర బంధు మిత్రాదుల ముఖమును జూచుచు, మంచముపైఁబడి యుండి, అచ్చటనే చచ్చిన వానికిని పశుపక్ష్యాదులకును భేదమేమున్నది? కావున రాజా! నీవు నా ప్రార్థనము నంగీకరించి సమస్తమును వదలి పరమపావనమగు నుత్తరఖండ పుణ్యభూమికి తరలుము."

ధృతరాష్ట్రుఁ డిట్లనెను:- "విదురా! ఇంతటి మమతతో నింతటి హితమును జెప్పువారుండుట లోకములోఁ జాల దుర్లభము. నీవు నా సోదరుఁడవే కావు, గురుఁడవు, నాకు దేవతవు అయితే నాయనా! ఈ విషయమును జెప్పుము. ధర్మరాజు నామీఁద నత్యధిక భక్తిశ్రద్ధలు కలవాఁడు. ఆతనితో దీనిని బ్రస్తావించునెడల నాతఁడు నన్నెన్నటికిని బోనీయఁడు. నేను గట్టిగాఁ బట్టుపట్టిన నాతఁడు పసిపిల్లవానివలె నేడ్చుచు, నావెంట రాజ్యాదులను వదలిపెట్టి బయలుదేరును. పాండవులు పెద్దవారై నప్పటికిని నానమ్ముఖమున వారు బాలకులవలెనే వర్తింతురు. నేనేమైనఁ జేయఁగలను, గాని ధర్మరాజు దుఃఖించుట చూడఁజాలను. ధర్మరాజు సంతోష పూర్వకముగ నన్నుఁ దపోవనమునకుఁ బంపునట్లైమైన నుపాయమున్న చూడుము."

విదురుఁడిట్లనెను:- "ప్రభూ! ధర్మరాజెన్నడు నీ కనుమతి యొసంగఁడు. నీవాతనికి చెప్పకయే తెలియకుండ వెళ్ళిపోవలయును."

దుఃఖించుచు ధృతరాష్ట్రుఁ డిట్లనెను:- "విదురా! నన్ను నీవు చూచుట లేదా? ఎంత ముసలివాఁడ నైతినో? జన్మాంధుఁడ నగుటచే నాకు దారి కనఁబడదు. పోనిమ్ము గాంధారి నాకు దారి చూపించునని

నదియు నా మూలమున గన్నులు కలిగియుండియు గ్రుడ్డిదైనది నాకు తపోవన మార్గమును జూపఁగలవారెవరు? గ్రుడ్డివాఁడనగు నాకన్ను బట్టుకొనఁ గలవారెవ్వరు?"

విదురుఁడిట్లనెను:- "రాజా! ఏమి యిట్లు మాటలాడుచున్నావు. నీ కన్నను నేను. సోదరుఁ డగువాఁడు సమస్త కార్యములందును భుజమునకు భుజమొడ్డి సోదరునకు సాయము కావింపవలయును. నేను నీకు దారిచూపి తపోవనమునకుఁ గొనిపోవుదును."

ధృతరాష్ట్రునకు దుఃఖము పొరలి వచ్చెను. అతఁడు చేతితోఁ దడవి తడవి విదురునిఁ గౌఁగిలించుకొనెను. రుద్ధకంఠముతో, గద్గద స్వరముతో నిట్లనెను:- "విదురా! అటునిటు నూగులాడుచు నిలుకడ లేని నాజీవన నౌకకు ఏకమాత్ర కర్ణధారుఁడవు నీవే. ఇఁక నిప్పుడు శీఘ్రముగ మనమిచ్చటినుండి వెళ్ళిపోవలయును."

ఈ విధముగ సోదరు లిద్దరు నిశ్చయము చేసికొనిరి. ఇప్పుడు వా రేదోవిధమున గృహమును వదలి యెవరికినిఁ దెలియకయే వెళ్ళిపోవుటకుఁ బ్రయత్నించుచుండిరి.

## విదురునితోఁగూడి ధృతరాష్ట్రుఁడు వెడలుట

౧౭

శ్లో॥ ఏవం రాజా విదురేణానుజేన। ప్రజ్ఞాచక్షు ర్బోధిత ఆజమీఢః,
ఛిత్వా స్వేషు స్నేహపాశాన్ ద్రఢిమ్నో। నిశ్చక్రామ భ్రాతృసందర్శితాధ్వా॥

— శ్రీమద్భాగవతము ౧ స్కం. ౧౩ అ. ౨౭ శ్లో.

"విదురుండు ధృతరాష్ట్రునకు విరక్తిమార్గం బుపదేశించిన నతండు ప్రజ్ఞాచక్షుండై సంసారంబు దిగనాడి మోహపాశంబువలన నూడి విజ్ఞాన మార్గంబును గూడి దుర్గమంబగు హిమవన్నగంబునకు నిర్గమించెను."

—శ్రీమదాంధ్ర భాగవతము.

మనలను శ్యామసుందర చరణారవిందముల వైపునకు మరలించిన వాఁడే నిజమగు సుహృదుఁడు. మన మనస్సులను సాంసారిక వ్యవహారములనుండి తొలఁగించి హరిభక్తియందు లగ్నము చేయునట్లు చేసినవాఁడు వాస్తవమగు బంధువు. ఆత్మోన్నతికి సాయము కావించు వాఁడే యథార్థ బంధువు. మిగిలిన మిత్రపుత్ర, బంధు బాంధవులు కేవలము బంధన కారణమగుదురు సంసారములో నధికముగా బంధించు వారు మోహపాశమును బంధించు వేటకాండ్రు. విదురుఁడు ధృతరాష్ట్రునికి నిజమగు హితైషి.

విదురుఁడు తన సోదరునికి అనేకవిధముల నచ్చచెప్పఁగా నతఁడంత్యకాలమున నచ్చట నుండుట యేవిధముగఁ జూచినను మేలు కాదని తెలిసికొనెను. అతఁడు తనసోదరుని మాటలను విని గృహత్యాగము కావించుట కుద్యుక్తుఁడయ్యెను.

ఒక దినమున రాత్రియందు అందఱు నిద్రపోఁగా ధృతరాష్ట్రుడు మెల్లగా లేచి, విదురుని భుజమును బట్టుకొని "వెళ్ళుదము పద" మనెను.

గాంధారి సదా భర్తదగ్గఱనే యుండుటచేతను, దన పాతివ్రత్య ప్రభావముచేతను సమస్త విషయములను దన దివ్యదృష్టిచేఁ దెలిసికొని, తానుకూడ దండమును గైకొని భర్త చెఱఁగును బట్టుకొని బయలు దేరెను.

నడి పట్టి ధృతరాష్ట్రమహారాజిట్లనెను:- "ఎవరు? రాణీ! నీ వెక్కడికి బయలు దేరినావు?"

గాంధారి కొంచెము వ్యంగ్యస్వరముతో నిట్లనెను:- "రాజు వెళ్ళు చోటుకు రాణికూడ వెళ్ళును. రాజులేకున్న రాణికేమి శోభ కలదు?"

ధృతరాష్ట్రు డత్యంత స్నేహ స్వరముతో నిట్లనెను.- "దేవీ! మేమిప్పుడు మహాప్రస్థానమునకుఁ బోవుచున్నాము. అక్కడ భోజనపు టేర్పాటు లేదు. వాహనములులేవు. దాసదాసీజనములు లేరు కాలినడ కను అరణ్యములందును బర్వతములందును దిరుగవలసి యుండును. అరణ్యములలో వగరు, చేదుఫలములను దినవలసి యుండును. అవి యైనను స్వయముగ వెదకి తెచ్చుకొనవలయును దేవీ! నీ శరీరము సదా సుఖ భోగములతోఁ బెంపఁబడినది. నీవు దీనికి పనికిరావు. ఇచ్చటనే యుండి కుంతీ సహితముగఁ గృష్ణకథాకీర్తనములోఁగాల యాపనము గావించుము."

గాంధారి యిట్లనెను:- "దేవా! నేఁడు మీరిట్టి విచిత్రములగు పలుకులు పలుకుచున్నారేల? శరీరమును వదలి ఛాయ యుండఁగలదా? చంద్రుని విడిచి వెన్నెలుండఁగలదా? కాంతి ప్రభాకరుని వదలి యుండఁ గలదా? జలము శాశ్వతముగ శీతలత్వమును వీడఁగలదా? చేఁప జల మును వీడియుండగలదా? అట్లే పతివ్రత యెన్నఁడైనఁ బతిని వీడి యుండగలదా? నాకు భోగ, వాహన, దాసదాసీ, ఐశ్వర్యధనాదు లక్కఱలేదు. నాకు మీరే కావలయును. నాకు మీరే ధనము. మీరే నా సర్వస్వము. మీరున్నచోట సర్వమును గలదు. మీరు లేనిచోట యెన్ని యున్నను నేమియు లేనట్లే."

మధ్యలో నందుకొని విదురుఁ డిట్లనెను:- "అన్నా! ఇది వాద వివాదమునకు సమయము కాదు. పతివ్రతయగు మా వదినెగారు అట్లంగీకరింపరు. మిమ్ములను వీడి యామె యుండఁజాలదు. మీరామెను ఆపవలదు. రానిండు" ఇది విని యిఁకఁ ధృతరాష్ట్రుఁడడ్డగింప లేదు. ముగ్గురును లేచి బయలుదేరిరి. కావలివారి కెవరికిని దెలియకుండునట్లు బుద్ధిమంతుఁడగు విదురుఁ డిదివరకే యేర్పాటు చేసియుండెను. కావుననే వారు రాత్రివేళ యెవరికిని దెలియకుండగనే నగరము వెలుపలికి వెళ్ళి పోయిరి విదురుఁడు చాల బుద్ధిమంతుఁడు. కావుననే యాతఁడాదినమున నింక ముందుకు సాగిపోలేదు; పెందలఁగ ముందు ధర్మరాజు తన భటులచే నలుగడల వెదకింపగలఁడు. అందువలన గంగాతీరమున నొక నిర్జన స్థానమున సూర్యోదయము కాకపూర్వమే వెళ్ళి దాగుఁకొనిరి.

ఇచ్చట ప్రాతఃకాలమయ్యెను. ధర్మరాజు నియమానుసారముగ నరుణోదయమునకుఁ బూర్వమే లేచెను. స్నాన సంధ్యాగ్నిహోత్రాదులను బూర్తిచేసికొని యాతఁడు మంగళ ద్రవ్యముల దర్శించెను. అంతఁదనకాశ్రితులగు నసంఖ్యాకములగు బ్రాహ్మణులకు గో, భూ, హిరణ్య, తిలాది దానములను, అన్నవస్త్రములను దానము చేసెను. ప్రతిరోజు వెళ్ళునట్లాతఁడు ధృతరాష్ట్రునకు చరణాభివందనము చేయ వెడలెను. అక్కడికివెళ్ళి చూచునప్పటికి అచ్చటివస్తువులన్నియుఁజెల్లా చెదురుగఁ బడవేయబడియుండెను. ఆతనికి సందేహము కలిగెను బహుశః కాలకృత్యములకు వెళ్ళియుండవచ్చుననుకొని, తర్వాత గాంధారి పరుండు శయ్యను గాంచెను. అదికూడా శూన్యముగ నుండెను. ఆతని గుండె దడదడ కొట్టుకొనఁ జొచ్చెను. విదురుని శయ్య దగ్గఱకుఁ బోయి చూడ నదియు శూన్యముగ నుండెను. తన పెదతండ్రియుఁ, దల్లియుఁ, బినతండ్రియు వారిని వదలి యెచ్చటికో వెళ్ళిపోయిరని నిందించుకొనెను. అతఁ డాతురతతో నుచ్చైః స్వరముతో నిట్లు కేక

వేసెను:- "సంజయా! సంజయా! శీఘ్రముగా రమ్ము!" సంజయుఁ డెచ్చటికి పోలేదు. ఆ సమీపమునఁ గూర్చుండి యేడ్చుచుండెను. ధర్మరాజు వచ్చిన సంగతియే ఆతనికి తెలియదు. ధర్మరాజు బిగ్గఱగాఁ బిలుచు నప్పటికి అతని ధ్యానమునకు భంగము కలిగెను. శీఘ్రముగా లేచి చేతులు జోడించి, కన్నుల నీరు గార్చుచు సంజయుఁడు మెదలకుండ వచ్చి ధర్మరాజు దగ్గఱ నిలుచుండెను. ఆతఁడు నేఁడు మామూలు ప్రకారము ధర్మరాజును స్తుతింప లేదు. సూతుఁడిట్లుండుటను గాంచి దయాళుఁడగు ధర్మరాజేక్చచు నిట్లడిగెను:- "సంజయా! నాతల్లిదండ్రు లెచ్చటికిపోయిరి? అయ్యో! నేను నేఁడు వారి శయ్యలు శూన్యముగ నుండుటను గాంచుచున్నాను. నేనాతని పాదాభివందనము కావింపవచ్చి యున్నాను. కాని నేఁడు నాకాయన దర్శనము కాలేదు. పాపినైన నేనేపాపమును జేసితినో కానీ ఆతఁడసంతుష్టుఁడై మమ్ము వదలివెళ్ళిపోయినాడు. అయ్యయ్యో! ఈ ప్రపంచములో మమ్ముఁబోలిన భాగ్యహీను లింకెవ రుందురు? మా తండ్రి మమ్ములను బాల్య కాలములోనే విడిచి కాలకబళితుఁడయ్యెను. మాపితామహుని నేను నాదుర్బుద్ధిచే స్వయముగఁ జంపించితిని. నా కులవినాశనమంతయు నా కారణమున జరిగినది. ఇఁక మిగిలినది నా పెద్ద తండ్రి. ఆతఁడు మాతండ్రి చనిపోఁగానే మమ్ములను బెంచి పెద్దవారినిఁ జేసెను. వీరి సేవచేసి నా పూర్వకృతపాపములకుఁ బ్రాయశ్చిత్తము చేసికొనవచ్చు ననుకొంటిని. కాని నాకుటిలతా కారణమున నాతఁడుకూడ యెక్కడికో తెలియకుండ వెళ్ళిపోయినాఁడు. ఆతఁ డిప్పు డెంతోకాలము జీవింపఁడు. ఆతని పుత్రులందఱు మరణించిరి. ఆతఁడు గ్రుడ్డివాఁడగుటచే నేమియుఁ జూడజాలఁడు.

నిశ్చయముగా నాతఁడు గంగలో దుమికి ప్రాణపరిత్యాగము కావించుకొని యుండవచ్చును. విదురుఁడు మాకు ప్రాణదాతయే. తండ్రి

తర్వాత నాతఁడే మమ్ములను రక్షించుచుండెను. అతఁడే మమ్ముల ననేక విపత్తులనుండి భయంకర సుడిగుండములనుండి రక్షించెను. సంజయా! నీవు మా పెద తండ్రి, పినతండ్రుల వద్ద నెప్పుడు విడవక నుండెడు వాఁడవు. అట్టి నీ సమ్మతిలేక వారెట్లు పోఁగలుగుదురు? నీవే వారికి సరియగు సలహా నీయఁగల విశ్వసనీయ మంత్రివి. వారు తప్పక నీకు చెప్పియే వెళ్ళియుందురు. నీవు నాకు వారి జాడను జెప్పుము. లేగ దూడ తన తల్లివెంట నెట్లు పరుగిడునో అట్లే వారి జాడ తెలిసిన నచ్చోటుకు నేను బరువిడెదను. వారి శుశ్రూష చేయు చుందును."

సూతుఁడసలే దుఃఖితుఁడై యుండెను. శోకకారణమున నాతని యింద్రియములన్నియు వ్యాకులము చెందియుండెను. నేత్రములనుండి యెడతెగక నశ్రుప్రవాహము ప్రవహించుచుండెను. కంఠము గద్గదమగు టచే నాతఁడేమి పలుకుటకును నసమర్థుడై యుండెను. ధర్మరాజు వానిని మాటిమాటికి ప్రశ్నించుచుండెను. చివరకు ధైర్యము తెచ్చుకొని యాతఁడు తన నయనాశ్రువులను దుడిచికొనెను. విచారము ద్వారా స్వస్థచిత్తుఁడై యాతఁడు ప్రకృతిస్థుఁడై, తన స్వామియగు ధృతరాష్ట్రుని చరణములను జింతించుచుఁ జేతులు జోడించి యిట్లనెను:— "ప్రభూ! మీరు నా మాటలను నమ్ముఁడు నేను మీతో యదార్థమును జెప్పు చున్నాను. ఈ విషయమున నాతఁడు నా యభిప్రాయమును దీసి కొననే లేదు. ఆతని మనస్సులో నేమున్నదో, నేనాతని దగ్గఱ నున్నప్పటికి ఆపోకడయేమియు నాకు తెలియలేదు. కురుకుల తిలకా! ధృతరాష్ట్ర మహారాజు నాకు చెప్పక యేకార్యమును జేయఁడని నాకు పరమ విశ్వాసము. ఇంతవరకు నట్లే జరుగుచు వచ్చినది. ఎంత చిన్న విషయము కానిండు, పెద్ద విషయము కానిండు ఆఁతడు నన్నడుగక యేమియుఁ జేయఁడు. ఇదియే నాగర్వము కాని నేఁడు నాగర్వము ఖర్వమై పోయి నది. నన్నా మహారాజు మోసగించినాఁడు. ఇంతగా స్నేహ విశ్వాసము

లను బెంచి చివరకు నన్ను వంచించినాఁడు. పాపినగు నన్ను వారిసేవ చేయ నెడఁబాపినాఁడు. నన్ను వారివెంటఁ గొనిపోవలేదు. ఇప్పుడు నేనీ వృద్ధావస్థలో నా ప్రభువులేక యెట్లు జీవింపఁగలుగుదును?" ఇట్లు పలికి సంజయుఁడు వెక్కి వెక్కి పసిపిల్లలవలె నేడ్వఁ బ్రారంభించెను. తనకుఁ జెప్పకుండగనే పోయినట్లు సంజయునకుఁగూడ చెప్పకుండ పోయినాఁడని ధర్మరాజు నిశ్చయించుకొనెను. అతఁడిట్లు తలంచెను:— "సాయంకాలమున నందఱును సుఖపూర్వకముగ నాముందఱనే నిద్రించిరి. వారర్ధరాత్రియైన తర్వాతనేపోయి యుండవలయును. అతఁడు వృద్ధుండు నంధుఁడు కూడాను. అతడెంతో దూరముపోయి యుండఁడు. కావున నేను శీఘ్రముగఁ జారులను, సైనికులను బంపి వారిని వెదకించెదను."

ధర్మరా జిట్లనుకొనుచుండఁగా నాతని యేడ్పు పెడబొబ్బలు విని యాతని తమ్ములుకూడ వచ్చిరి. కుంతీదేవికూడ రోదనముచేయుచు వచ్చి తన బావను, తోడికోడలను, మఱఁది విదురుని గానక వెక్కి వెక్కి యేడ్వఁ బ్రారంభించెను.

శౌనకుఁడిట్లడిగెను :- "సూతా! కుంతీదేవికూడ గాంధారీ ధృతరాష్ట్రులతోఁ దపోవనమునకుఁ బోయినదని వినియుంటిమి. మీరు గాంధారీ ధృతరాష్ట్రులు విదురునితోఁ బోయిరని చెప్పుచున్నారిది యేమి?"

సూతుఁ డిట్లనియె:- "ఋషులారా! ఇట్టిది వేఱొక కల్పములో జరిగియుండవచ్చును కల్పభేదములను బట్టి కథలలోఁ జాల భేద ముండును. లోకములోఁ గ్రొత్త విషయ మేమియును లేదు పురాతన సంఘటనములు పునరావృత్తి యగుటకే ఇతిహాసమని పేరు. ప్రతి కల్పములోను ద్వాపరాంతమున మహాభారతము జరుగుచుండును.

ఒక్కొక్క కల్పములోఁ గొంచెము మార్చుండును. ఈ భాగవత కథాప్రసంగములోఁ బాండవుల జననియగుఁ గుంతీదేవి తపోవనమునకుఁ బోలేదు. ఆమెమనస్సు శ్రీకృష్ణచరణారవిందములందే లగ్నమై యుండెను. అర్జునుఁడు ద్వారకకు వెళ్ళినాడు. అతఁడు తిరిగివచ్చిన తర్వాతఁ దనకు రక్షకుఁడగు శ్రీకృష్ణ సమాచారమును విని కర్తవ్యమును నిర్ణయించుకొనవలెనని యామె నిశ్చయించుకొనెను. ఇట్లు చింతించి కుంతీదేవి యచ్చటనేయుండి విచార మనస్కయై కింకర్తవ్యవిమూఢయై హస్తినాపురములోనే యుండెను."

ధర్మరాజు నలువైపులను జారులను బంపి వెదకించెను, గాని వారు దొరకలేదు. ధర్మరాజు చింతించెను. ఒకదినము రామకృష్ణ గుణ గానము చేయుచు వీణాగాన మొనర్చుచు దేవర్షి యగు నారదుఁ డచ్చటకు వచ్చెను. నారదునిఁగాంచి నీటమునిఁగినవాఁడు తనవైపునకు నావ వచ్చుటను గాంచి సంతసించినట్లు పాండవులందఱును సంతసించిరి. చనిపోయిన వానికి సంజీవని లభించినట్లును, పుట్టుగ్రుడ్డికి కనుచూపు లభించినట్లును నారదుఁడు రాఁగావే అందఱకును సర్వజ్ఞుఁడగు ఋషి వచ్చినాఁడను సంతోషమయ్యెను. బ్రహ్మాండ మంతటను నీతనికిఁ దెలియని విషయమే లేదు. ఇప్పుడిఁకఁ దప్పక అందఱిజాడ తెలియఁగల దనుకొనిరి. ఇట్లనుకొను చుండఁగనే నారదుఁడు సమీపమునకు వచ్చెను. అందఱును లేచి ఆతనికి పాదాభివందనము కావించిరి. అర్ఘ్యపాద్యాదులొసంగి విద్యుక్తముగఁ బూజించిరి. ఋషి స్వస్థచిత్తుఁడై సుఖపూర్వకముగ గూర్చుండునప్పటికి ధర్మరాజు చేతులు జోడించి యిట్లనెను:- ప్రభూ ! నేఁడు నేను గొప్పచింతలోఁ బడియున్నాను, దానినుండి నన్నుద్ధరింపుడు."

నారదుఁ డిట్లనెను :— "రాజా ? నీ ముఖమండలమును జూచియే

నీవేదో చింతలోఁ బడియున్నట్లు తెలిసికొన్నాను. నీ దుఃఖకారణమును నాకుఁ జెప్పుము."

ధర్మరాజు చేతులు జోడించి యిట్లనెను:— "స్వామీ! మీరు సర్వజ్ఞులు. మీ సమ్ముఖమున మాటలాడుటకూడ ధృష్టతయే కాఁగలదు. మీరు సమస్తప్రాణులయొక్క విషయము లెఱుఁగుదురు. మీరడుగుచున్నారు. కాఁబట్టి నేనుడుపుచున్నాను. నాకు పితృసమానులగు ధృతరాష్ట్ర విదురులును తల్లియగు గాంధారియు స్వస్థచిత్తులరై నిద్రించిరి. కాని నేను ప్రాతఃకాలమునలేచి చరణాభివందనము చేయఁబోవఁగా వారచ్చట లేరు. ఈ దుఃఖసాగరములో నాహృదయము మునిఁగిపోయినది. దానినుండి బయటకు నాకు దారి దొరకలేదు. ఈ శోకసాగరమునుండి బయట వేయఁగల కర్ణధారుఁడవు నీవే ప్రభూ! నా పితృవ్యులు, తపస్వినియగు మాతల్లి గాంధారీదేవియు నన్నువీడి నాకు చెప్పకయే యేల వెళ్ళిపోయిరో చెప్పుఁడు. ఎచ్చటకు వెళ్ళిపోయినారు? మమ్ముల నేయపరాధముచే వదలివేసినారు?"

ధర్మరాజు పలుకు స్నేహయుక్తములగు సుందరశోకయుక్త వచనములను విని వక్తలలో శ్రేష్ఠుఁడగు నారదమహాముని యిట్లనెను:- "రాజా! ఇంతటి జ్ఞానివి, ధ్యానివి, తేజస్వివి, తపస్వివి యైయుండి నీవిట్లజ్ఞానపు వాక్యములను బలుకుచుంటివేల? ఎవరు ఎవరికి సుఖదుఃఖము లొనఁగూర్పఁగలరు? ఈ ప్రపంచమంతయు నా సర్వేశ్వరుని యాజ్ఞచే వర్తించుచున్నది. జీవులందఱును దైవాధీనులై కార్యములొనర్చుచున్నారు. భూమిమీఁద ప్రతి అన్నపు గింజలో నందఱి నామము అంకితములై యున్నవి. ప్రతి జలకణములో నర్వుల నామములు లిఖింపఁబడి యున్నవి. ఎవరెవ రెన్నిదినములవఱ కెంతెంత అన్నజలకణముల ననుభవింపవలెనని వ్రాయఁబడి యున్నదో అంత

వఱకు భోగముల ననుభవింపవలయును. ఆ అవధి తీరిపోగానే లక్ష ప్రయత్నములు చేసినప్పటికిని ఒక్క నిమిషమైన నుండఁజాలఁడు. ఈ చరాచర విశ్వమంతయు నా ప్రభు ప్రేరణచేఁ బ్రేరితమై సమస్త క్రియలందుఁ బ్రవృత్త మగుచుఁడును. మానవులు, దేవతలు, పశు పక్ష్యాదులు, సరీసృపములు, వృక్షాదులు సంగతి యేల, ఇంద్ర, వరుణ, కుబేరాది లోకపాలురనఁబడు వారుకూడ అతని ప్రేరణలేక యేమియుఁ జేయఁజాలరు."

ధర్మరా జిట్లనెను:- "స్వామీ ! ఇది నిజమే కాని ప్రియజన సంయోగముచే సుఖమును, వియోగముచే దుఃఖమును గలుగుచునే యుండును."

నారదుఁ డిట్లనెను:- "కలిగినఁ గలుగ నిమ్ము. నీవు సుఖ దుఃఖము లున్నవని సంయోగవియోగములు కలుగకుండఁ జేయఁగల వేమి ? ఎవరితో సంయోగము కలుగవలసియుండునో కలుగనే కలుగును. నీవు ప్రయత్నించి దానిని కాదనఁజాలవు. కాల పక్వమై వచ్చిన వియోగము అవశ్యం భావియగును. ఏనుఁగు మావటివానికిని, గుఱ్ఱము రౌతుకును, ఎద్దు రైతుకును వశమైనట్లు జీవులందఱును ప్రారబ్ధమునకు వశులై యున్నారు. ఒకవేళ నున్మత్తము చెందిన యేనుఁగు, గుఱ్ఱము, ఎద్దు, గేదె త్రాడు తెంచుకొని స్వేచ్ఛాచరణము చేసినఁ జేయునేమో కాని మానవుఁడు ప్రారబ్ధ బంధనమును దెంచుకొని స్వేచ్ఛాచరణము కావింపలేఁడు. అతఁడు ప్రారబ్ధ పరిధిలోనే పడియుండవలసియుండును."

ధర్మరాజిట్లనెను :- "అయితే యీ సన్న్యాసులు, బ్రహ్మచారులు, వానప్రస్థులు మొదలగు వారు స్వేచ్ఛాచరణము కావించుచు సాధన చేయుచున్నారే వారెట్లు చేయుచున్నారు?"

నారదుఁ డిట్లనెను :- "స్వేచ్ఛగా నెక్కడ చేయుచున్నారు? వీరందఱును వేదశాస్త్రరూపమగు ఆజ్ఞాబంధమునఁ గట్టఁబడి వివశులై ప్రారబ్ధకర్మానుసారముగఁ గార్యము లొనర్చుచున్నారు. ఈ విషయమున నీవొక దృష్టాంతమును వినుము. చిన్నపిల్లవానిని జూడుఁడు ఆతఁ డాడుకొనుచు నిసుకతో నిండ్లు కట్టును. నదిలోని మెత్తని మట్టిని దీసికొని వచ్చి దానితో నాతఁడు గుఱ్ఱములను, ఏనుఁగులను, ఒంటెలను, దూడలను మొదలగు ఆటవస్తువులను జేయును. ఇంటిలో నొక గుఱ్ఱపు కొట్టమును నిర్మించి గుఱ్ఱము నక్కడ కట్టివేయును. గోశాలను నిర్మించి దానిలో నావులను, ఆవు దూడలను గట్టివేయును. ఆ మెత్తని మట్టితో ననేక స్త్రీ పురుష విగ్రహములను జేసి కూర్చుండఁ బెట్టును. పిలుచుటకు మాత్రము చాలమంది కలరు. స్త్రీలు, పురుషులు, నౌకరులు, యజమాని, సంబంధులు, ఏనుఁగులు, గుఱ్ఱములు, ఒంటెలు, గోవులు, ఎద్దులు, గేదెలు, వేయేల అన్నియుఁ గలవు. కాని యవి యన్నియు మట్టితోఁ జేయఁబడినవియే. అన్నిటిలో నున్న పదార్థమొక్కటే. కేవలము ఆకృతిభేదమే. ఆ యాకృతియైనను పిల్లవాఁడు తన బుద్ధి చాతుర్యముచేఁ జేయఁబడినవే. ఇప్పుడాతఁడే యాటవస్తువునైనను దన యిష్టమువచ్చిన చోట నుంచఁగలఁడు. ఆవులలోకి గుఱ్ఱములను దీసికొనిపోయి కట్టివేసిన నా మృద్వస్తువులు కాదనవు. వాటిని దీసికొనిపోయి మనుష్యుల నెత్తినఁ బెట్టినవారు తీసి పారవేయ లేరు. ఇవన్నియు బాలకునకు వినోదమాత్రములు. వానికి బుద్ధిపుట్టిన మరల వీటినన్నిటిని విఱిచి తుక్కుతుక్కు చేసి పారవేయును. ఆట అయిపోయినది. అన్నియు నేకమైనవి. అట్లే యీ జగత్తంతయు జగత్పతియొక్క క్రీడాస్థలము. ఆతఁడు తన యిచ్ఛననుసరించి కొందఱకుఁ గొందఱితో సంయోగము కలిగించుచు, కొందఱకుఁ గొందఱితో వియోగము కలిగించును."

ధర్మరా జిట్లనెను :- "స్వామీ! ప్రారబ్ధమను విషయము

నిజమేకాని, మా పెదతండ్రి, పెత్తల్లి యున్నాళ్ళు మా వద్దనుండి మమ్ములను బోషించినారు. వారి కొఱకై దుఃఖము కలిగితీరును."

నారదుఁ డిట్లనెను :— వారి విషయమున దేనినిఁగూర్చి నీవు శోకమును జెందుచున్నావు? ఆతనిలో మూఁడుభావములు కలవు. ఒకటి దేహము, రెండవది జీవుఁడు, మూఁడవది బ్రహ్మ. దేహమనిత్యమైనది అది యెప్పటికైన నాశనమై తీరును. ఇవ్వేళ కాకున్న, రేపైనను, రేపు కాకున్న నెల్లుండియైనను దాని నాశనము తప్పదు. అనిశ్చిత నాశముగల దానినిఁ గూర్చి చింతించుట చతురపురుషులకు శోభనీయదు. జీవుఁడవినాశి.. వానికి నాశనమేలేదు. వానికి నాశనమేలేనప్పుడు దానినిఁగూర్చి చింతింపనేల? చింత పోయినవస్తువునకై యుండవలయును. బ్రాహ్మ యీ రెండు భావములు లేనివాఁడు. ఇప్పుఁడు నీవు దుఃఖించునది దేనినిగూర్చి? ఇది కేవలము నీకుఁగలగిన మోహజన్యస్నేహమే. ఆ కారణముననే ఇంతగా దుఃఖము కలుగుచున్నది."

ధర్మరా జిట్లనెను :—"మంచిది. శోకింపకూడ దంటిరి. మా పెద తల్లియుఁ బెదతండ్రియు గ్రుడ్డివారు. వారికేమియుఁ గనపడదు కదా! వారిని రక్షించుభారము నాపైఁ గలదు గదా!"

నారదుఁడు నవ్వి యిట్లనెను :- "రాజా! వారిక్కడ నున్నంత వఱకు వారిని సేవించుట నీకు ధర్మమే. వారు బుద్ధి పూర్వకముగ నిల్లు వదలి వెళ్ళిపోయిన నీవు ఎక్కడికని వెళ్ళి రక్షించుచుఁ దిరుగు చుందువు? గర్భములోని బాలకుని రక్షింపఁగలవా యేమి? నీటిలోఁగల అసంఖ్యాకములగు జల జంతువులకు నీవు నీ మహలులోనుండి ఆహార మును బంపెదవా యేమి? ఆకాశములోఁగల అనేక జంతువుల కాహార మెవరు పెట్టగలరు? కురుకులతిలకా! నేను లేకున్న వారిని

రక్షించున దెవరను భ్రమను నీ హృదయమునుండి తీసిపార వేయుము. నీ తలిదండ్రులెట్లు నీవు లేకున్న జీవింతురని తలపోయకుము. భగవంతుఁడు ప్రతివానికిఁ బుట్టుకతోడనే ఆహారమును గల్పించి యున్నాఁడు. అందఱియొక్క యీ పాంచ భౌతిక శరీరములు కాల, కర్మ, గుణత్రయముల కధీనములైనవి. భేద మేమనఁ గొందఱకు పుణ్య మధికము. కొందఱకు పాపమధికము కొందఱు సత్త్వగుణ ప్రధానులు, అందఱును కాల, కర్మ, గుణములకు వివశులై కర్మ లొనర్చుచుండగాఁ దాము స్వతంత్రులై యితరుల నేమి రక్షింపఁ గలుగుదురు? చచ్చినవాఁ డెవరినైనఁ జంపఁ గలుగునా? నీట మునిఁగినవాఁడు నీట మునుఁగఁ బోవువానిని రక్షింపఁ గలడా? విష మును దిని చావఁబోవువాఁడు విషపీడితుఁ డగువాని నెట్లు రక్షింపఁ గలుగును? సర్పదష్టుఁడగు వాఁ డితరుల నెట్లు రక్షింపఁ గలుగును?"

ధర్మరాజిట్లనెను :- "స్వామీ! మీరు చాల విచిత్రములగు పలుకులు పలుకుచున్నారు. అట్టియెడ దయా, ధర్మ, పరోపకార, పురుషార్థము లేమియు నుండవు కదా! మీఁదఁగల అశచేఁ జేతులతోఁ జేతులు పెట్టుకొని యూర్చుండిన నే కార్యము నెఱవేరగు నరిగదా, అందఱు జచ్చిపోవుదురు."

నారదుఁడిట్లనెను :- "రాజా! పురుషార్థమైనను అందఱుఁ జేయఁజాలరు. పురుషార్థముగాని, దాని ఫలముగాని ప్రారబ్ధకర్మాధీన ములే. భగవంతుఁ డందఱకు అన్ని వృత్తుల నిశ్చయించినాఁడు. జీవులందఱు జీవములవలననే జీవించుచుందురు. గడ్డి, చెట్టు, ఆకు మొదలగు వాటిలోఁగూడ జీవము కలదు. వాటినిఁ దిని పశుపక్ష్యాదులు జీవించును పశువులను బెంచి వాటితో వ్యవసాయముచేసి పంటలను బండించి మానవులు బ్రదుకుదురు చాలనుండి నిర్దయులు గొఱ్ఱెలను,

మేకలను, జింకలను మొదలగు వాటిని జంపికూడ తినుచుందురు. జలములోనుండు తిమి, తిమింగలాదులు చిన్న చిన్న చేపలను దిని జీవించును. ఈ విధముగా నన్నియు జీవులమీఁదనే ఆధారపడి యుండును. మీ పెదతల్లి, పెదతండ్రి, పినతండ్రి, వన్యఫలములతో జీవింపఁగలుగుదురు. వారిని గూర్చి చింతించుట వ్యర్థము."

ధర్మరా జాశ్చర్యముతో నిట్లనెను:- "ప్రభూ! అద్భుత జ్ఞానమును మీరు చెప్పుచున్నారు. భోజ్యము, భోక్త ఒక్కఁడే. జీవులద్వారా జీవనధారణ చేయుచున్నాఁడు"

నారదుఁడిట్లనెను:— "అయితే! నీవేమనుకొనుచున్నావు? స్వయం ప్రకాశుఁడగు నాభగవానుఁడు సమస్త రూపములలో నుండి నవ్వుచున్నాఁడు. అతడే నానారూపములు ధరించి క్రీడించుచున్నాఁడు ఆయన తప్పితే యింకెవరున్నారు? ఫల పుష్పములలో నాతఁడే కలఁడు. వాటినిఁ దిను ఋషి మునులలోను నాతఁడే కలఁడు. మహాభారత యుద్ధంలోఁ జచ్చినవారందఱిలోను ఆత్మస్వరూపుఁడుగ నున్నాఁడు. మఱియుఁ గాలరూపుఁడై యందఱను సంహారము కూడ అతఁడే చేసినాఁడు. నీవు శ్రీకృష్ణునిఁగూర్చి ఏమనుకొన్నావు? ఆ కాలుఁడు భగవంతుఁడు. నీవు నీసఖునిఁగాను, సంబంధిగాను, మిత్రునిగాను సారథిగాను దలఁచుచున్నావే ఆ కృష్ణుఁడు కాలునకుఁ గూడ కాలుఁడు. భూమికి భారభూతులగు వారినందఱను సంహరించి యిప్పుడు యదు వంశ సంహార విషయమునుగూర్చి యోచించుచున్నాఁడు. ఇదియంతయుఁ జేసిన తర్వాత నాతఁడీధరాధామమును వదలి తన నిత్య శుద్ధ సనాతన లోకమునకు వెళ్ళిపోవును. భగవంతుడీ భూమిని వదలి వెళ్ళిపోఁగానే కలి ప్రవేశించును. అప్పుడు భూమిమీద నుండుటకు యోగ్యముగ నుండదు. మీరందఱును దీనిని వదలి మహాపథము ననుసరింతురు."

ధర్మరాజున కంతయుఁ దెలిసెను. "మా కందఱకు కాలమొక్క- సారియే ఆసన్నమైనది. నేనుగూడ ఇఁక గృహత్యాగము చేయవల యును." అనుకొనుచు నాతఁడు కాల స్వరూపుఁడగు భగవానునిఁ బ్రత్యక్షముగఁ జూచుచుండెను. ఆతడిట్లడిగెను:- "ఓ సర్వజ్ఞా! మీకన్నియుఁ దెలియును నా పెదతండ్రియొక్కయు పెదతల్లి యొక్కయు, పినతండ్రి యొక్కయు జాడ చెప్పవలయును. వారెక్క- డికి వెళ్ళిరి?"

నారదుఁడిట్లనెను:- "ధర్మరాజా! నీవు చింతింపవలదు. వారం దఱు ధర్మాత్ములు. వారికి దుర్గతి కలుగఁ జాలదు. హిమాలయమునకు దక్షిణ భాగమున భాగీరథీగంగ హిమాలయమునకు దిగి నేలమీఁదకు పారునటువంటి గంగాద్వారము (హరిద్వారము) దగ్గఱ సప్తర్షుల యొక్క సుందరమగు నాశ్రమము కలదు సప్తమహర్షుల తపస్సు నకు మెచ్చి సురాపగ యగు గంగ యేడు ధారలుగఁ బ్రవహించెను. అందువలన దానికి సప్తస్రోతయను ప్రసిద్ధి కలిగినది. అచ్చటికే మీ పెదతల్లి, పెదతండ్రి, పినతండ్రి వెళ్ళి సుఖముగ నున్నారు."

ధర్మరాజిట్లనెను:- "ప్రభూ! అక్కడ వారు చేయునదేమి? వారి కాహారమెట్లు దొరకుచున్నది?"

నారదుఁ డిట్లనెను:- "ధర్మరాజా! నీవుకూడ యిట్టి తికమక మాటలు పలుకుచున్నావేమి? పిచ్చివాఁడా! శ్రీకృష్ణ స్మరణ చింతన ములు, గుణలీలాశ్రవణమే నిజమగు నాహారము నీ తలిదండ్రులు, పినతండ్రి ఆ యాహారముతోడనే సంతుష్టిని బొందుచున్నారు. వారు పుణ్యసలిల యగు గంగాపులినమందు త్రికాల స్నానము చేయు చున్నారు. ఇంతవఱకు వా రగ్నిహోత్రపరిత్యాగము కావింపలేదు.

కాని ఆహారమును వదలి పెట్టినారు. వారు నిత్యనియమముతో నమ్రతో పమానమగుఁ బునీత గంగాజలమును ప్రతిదిన మాహారముగఁ బానము చేయుచున్నారు వారింకేమియుఁ దినుట లేదు. వారు సంయమముతో ఆసనము వేసికొని ప్రాణాయామాభ్యాసముచేయుచు మనస్సును, సమస్తేంద్రియములను వశపఱుచుకొనినారు. కురుకుల మకుటమణి యగునో ధర్మరాజా! ఈ సత్త్వరజస్తమో గుణములు బంధన హేతువులు. ఇవే ప్రాణులు ఈ గుణములే జీవులను బంధించుచున్నవి. నిరంతరము శ్రీహరిస్మరణ చేయుటచే నీ గుణముల మలము నశించిపోవును. అహంకారమును బుద్ధితోఁగలిపి సాక్షిచైతన్యమందు దానిని లీనము కావించిన వాఁడే త్రిగుణాతీతుఁడగును. ఆ స్థితిలో నీ సాక్షిచైతన్యమును శుద్ధ సచ్చిదానందఘనముతో నైక్యము కావించిన నిఁక మిగులున దేమున్నది? బిందువు సింధులోఁ గలిసినది. విస్ఫులింగములు నిత్యాగ్నిలోఁ గలిసి ఏకత్వమును జెందినవి. ఘటాకాశము మహాకాశములోఁ గలిసినది. అప్పుడు జీవుఁడు కృత కృత్యుఁడైనట్లే. వారట్లేచేసిరి. వారు మాయిక గుణవాసనా రహితులైరి. మనస్సు, యింద్రియములు వశమగు నెడల, నింత వఱకు విషయాసక్తిచే విషయములఁ దిరిగిన మనస్సిప్పుడు విషయవిరతిని జెందును. ఈ సమయమున జీవికి ప్రాణమున్నను స్థాణువై పోవును. వాని చంచలతపోయి నిశ్చల వృత్తిగలవాఁడగును. వృత్తిగలవాఁడగును. వారు ముగ్గురు ఇట్టి స్థితిని బొందిరి.

ధర్మరాజిట్లనెను:- "అట్లయిన స్వామీ! నేనచ్చటకు వెళ్ళెదను. ఎట్లైనను వారిని తీసికొనివచ్చెదను. పోనిండు వారు నాయంతఃపురములో నుండకున్న మాననిండు. గంగాతీరమున వారికి సమస్త సౌకర్యములు కావించి, నేనక్కడనేయుండి సర్వదా స్వయముగా వారిసేవ చేయుచుందును."

నారదుఁ డిట్లనెను:— "రాజా! నీకీ ప్రయానము వ్యర్థము. వారి చ్చటినుండి మోహమును వీడి వెళ్ళిపోయినారు. నీవు వారికేవిధమగు కష్టమును గలిగింపలేవు. నీయెడల నసంతుష్టులయ్యి వారు వెళ్ళి పోలేదు. వారి మరణసమయమున మీవంటి బంధువులు వారినిఁ జూడ వలెనని వారికిలేదు. వారి భయము, అంత్యకాలమున వారి వృత్తి కుటుంబ పరివారము మీఁదనుండిన మరల జన్మింపవలసి వచ్చుననియే. కావున నీవు వారి కార్యముల కంతరాయము కలిగింపకుము. సర్వసంగ పరిత్యాగులగు నా మహానుభావుల మార్గమున కంతరాయము కలిగింప కుము. వారి పనిని వారినిఁ జూచుకొననిమ్ము. నీపనిని నీవు చూచు కొనుము అదియునుగాక నీవు ఒకవేళ వెళ్ళినను వారినింటికి దీసికొని రాలేవు. నేఁటి కైదు దినములకు వారీ శరీరమును వదిలివేయుదురు."

ధర్మరా జిట్లనెను:— "స్వామీ! వారు శరీరమునెట్లు వదలెదరు? అచ్చట వారికి దహనాదిక్రియ లెట్లు జరుగును?"

నారదుఁడిట్లు సమాధాన మొసంగెను:— "నీకింకను దహనచింత కలదా? ఈ నశ్వర శరీరమును దహనము చేసిన నేమి? జలజంతువులు, కాకులు, గ్రద్దలు, డేఁగలు పీకుకొని తినిననేమి? లేక క్రుళ్ళి, పురుగులు పడి మట్టిలో గలిసిన నేమి? జ్ఞానికా చింతలేదు. మీ పెత్తండ్రిశరీరమును వనములోని దావాగ్ని దానికదియే బయలుదేరివచ్చి భస్మము చేయును. నీపెత్తల్లి కుటీరద్వారమున నిలుచుండి యీ సంగతినిఁ దెలిసికొని తాను గూడ కుటీరమునఁ బ్రవేశించి పతితోఁబాటు నిజశరీరమును భస్మము కావించును."

ధర్మరాజిట్లనెను:— "స్వామీ! పినతండ్రి యగు విదురుఁడు కూడ మండిపోవునా?"

నారదుఁడిట్లనెను:— "కాదు. అతనికి ప్రభాసక్షేత్రమున దేహత్యాగము చేయవలెనని కోరిక కలదు. కావున నాతఁడు తన యన్న వదినెగార్ల సద్గతికి సంతోషించి వారి వియోగ దుఃఖముచే దుఃఖితుఁడై మరల తీర్థయాత్రకు పోఁగలఁడు. అతఁడు మరల పుణ్యక్షేత్రములను దర్శించుచుఁ చివరకు ప్రభాసక్షేత్రమునకు వెళ్ళి, అచ్చట తన నశ్వరమగు భౌతిక దేహమును వదలి, మరల తన ధర్మరాజు పదవియందుండి జీవుల పాపపుణ్యముల నిర్ణయించుచుండును. నీవారి సమాచారమిది, ధర్మరాజా! ఇఁక నీవు వారిని గూర్చి శోకింపక నీవిషయమాలోచించుకొనుము."

ఈవిధముగా ధర్మరాజునకు వివిధములగు నుపదేశములనొసంగి ధృతరాష్ట్రాది సర్వుల యంతిమగతినిఁ జెప్పి దేవర్షులలో శ్రేష్ఠుఁడగు నారదుఁడు తనప్రియసఖుఁడగు తుంబురునితో హరిగుణ గానము చేయుచు, వీణమీటుచు, దుఃఖిత ప్రాణులకు ప్రేమ పీయూషము నొసంగుచు, సుమధుర త్రైలోక్యపావనమగు భగవన్నామములను బాడుచు సమస్త వృత్తాంతమును విని, నారదోపదేశమును స్మరించుచుఁదన పెత్తల్లి, పెత్తండ్రి, పినతండ్రులను గూర్చి చింతను వీడి నిశ్చింతగ నుండెను.

## విపరీత ధర్మములఁగని ధర్మజుఁడు చింతించుట

౪౭

శ్లో॥ పశ్యోత్పాతా౯ నరవ్యాఘ్ర-దివ్యా౯ భౌమా౯ సదైహికా౯।
దారుణా౯ శంసతోఽదూరా ద్భయం న్నో బుద్ధి మోహనమ్॥

—శ్రీ భాగ ౧ స్కం. ౧౪ అ. ౧౦ శ్లో॥

"ధర్మజుండు భీమునిం జూచి యిట్లనియె:—

(సీ॥ ఒకకాలమునఁ బండు నోషధిచయము వే
  రొకకాలమునఁ బండకుండు నంద్రు
క్రోధంబు లోభంబు క్రూరత బొంకును
  దీపింప నరులు వర్తింతు రంద్రు
వ్యవహారములు మహావ్యాజ యుక్తము లంద్రు
  సఖ్యంబు వంచనా సహిత మంద్రు
మగలతో నిల్లాండ్రు మచ్చరించెద రంద్రు
  సుతులఁ దండ్రులఁ దెగఁజూతు రంద్రు

గీ॥ గురులు శిష్యులు దూషించి కూడ రంద్రు
శాస్త్రమార్గము లెవ్వియు సాగవంద్రు
న్యాయపద్ధతి బుధులైన నడవ రంద్రు
కాలగతి వింతయై వచ్చెఁ గంటె నేఁడు)

క॥ మానసము గలఁగు చున్నది
మానవు బహుదుర్నిమిత్త మర్యాదలు స
న్మానవ దేహక్రీడలు
మాన విచారింప నోపు మాధవుఁ డకమీ॥"

—శ్రీమదాంధ్ర భాగవతము.

ఈ ప్రపంచమంతయు పరివర్తన శీలము కలది. దీనిలోఁ గనఁ బడు వస్తువులన్నియు నా రూపమున సత్యములు కావు. అన్నియు నసారములు, నాశవంతములు, క్షణభంగురములు. వీటి అన్నిటిలో సమాన రూపమున వ్యాప్తమగు భగవత్ సత్తా సత్యమైనది. రోగ, శోక, చింతా వ్యాకులతకు నిలయమగు నీ సంసార రచనము ప్రభు వేల చేసి నాఁడు? అందరు దీనికొక్కటే జవాబిచ్చినారు క్రీడకొఱకు, వినో

దార్థము, చిత్త సంతోషము కొఱకు ఇది మనో రంజనము కొఱకే యగునెడల నీదైత్య, దానవ అధర్మ, పాపాదుల భీభత్స దృశ్యమెందు లకు? ఇదికూడ మనోరంజనమేనా? బాగుగా లడ్డు, జిలేబి మొదలగు వస్తువులుతిని ముఖము మొత్తినప్పుడు పచ్చడి, ఆవకాయ నంజుకొనిన రుచిమాటి నోటి కనుకూలముగ నుండును ప్రభువునకుఁ బ్రస్తుతము కాక ధర్మము యిష్టములేదు. ఈ రెండును ప్రభువున కంగములు. ధర్మము ఉత్తమాంగమగు హృదయము. అధర్మము పృష్ఠాంగము; కాని శరీర రక్షణకు ఉత్తమాంగము లన్నియు నావశ్యకములే. సర్వదా అసహ్యమగు దుర్గంధము వెడలు పృష్ఠద్వారము ఉత్తమమైనది కాదను కొని దీనిని శరీరమునుండి వేఱుచేయుట దుర్లభము అవి లేకుండిన శరీరమే నిలువదు. మలాధారముననే యీ శరీరము నిలిచినది. అట్లే యీ ప్రపంచములో ధర్మాధర్మములు రెండు నెల్లప్పుడుండనే యుండును. వుండగలవు. కాని ధర్మము గ్రాహ్యమైనది. అధర్మము త్యాజ్యము.

కాలరూపుడగు ప్రభువు సదా క్షణక్షణము తన నిత్యనూతన రూపమును ధరించుచుండును. అతఁ డెన్నఁడు నొక స్థితిలో నుండఁడు. అతని గతి దుర్నివార్యము. దాని నెవరును దాఁటజాలరు. ఇవ్వేళ ఆదివారముకాక శనివారము కావలెననిన నది యసంభవము. నీ వెంత ప్రయత్నించినను అమావాస్యనాఁడు పూర్ణిమ కాఁజాలదు. ఆ దినమున నీవు లక్ష ప్రయత్నములు చేసినను పూర్ణచంద్రునిఁ జూపింపలేవు. జ్యేష్ఠమాసములో మాఘమాసములోని చలిని సర్వత్ర నీవు చూపింపఁ జాలవు. వ్యక్తిగతముగ నీవు నీ యింటిలో శీతలములగు హిమఖండ ముల నుంచుకొని నీ ఒక్క గృహమును జల్లగఁ జేసికొనినఁ గలుగు దువు. అన్నిటికని కాలమనునది కలదు. కృతయుగము తర్వాతఁ త్రేతాయుగము, త్రేతాయుగము తర్వాత ద్వాపరము తర్వాత కలి యుగము వచ్చుచునే యుండును. దాని నెవరును గాదనఁజాలరు. ఇది

శ్రీహరి విధానము. దానిని నివారించుట మానవీయ శక్తి కతీతము. తమ యహంకార వశమునఁ గటువాక్యములు పలుకు బంధువులు జాలి పడఁ దగినవారు నేనా కార్యము చేయుదును. ఈ కార్యము చేయు దును. ఈ నియమము లేర్పఱతును, అని అనుచుందురు. నిజముగఁ జూచిన నియమముల నేర్పఱచుటకు మనకేమి యధికార మున్నది ? రామకృష్ణాద్యవతారములే లోక మర్యాదను నిలుపుటకై కాలపక్వము కాఁగానే శిథిలమై పోఁగా, నీ వంటి యల్పుల కేమిలెక్క ? కానివారికి కూడ తప్పలేదు.

పాండవులు సుఖముగ రాజ్యము చేయుచుండిరి. వారు రాజ్యము చేయుచుండఁగా ముప్పదియాఱు వత్సరములు గడచినవి. వారు చాల వ్యవహారిక వ్యాపారములలో మునిఁగి యుండుటచేఁ గాలమును మఱ చిరి. కాని అప్రమత్తమగు కాలము సదా వ్రేళ్ళమీఁద లెక్కపెట్టు కొనుచు శీఘ్రముగఁ బోవుచుండుటచే దినములు చాల జరిగిపోవు చుండెను. అర్జునుఁడు భగవంతున కభిన్నహృదయుఁడు. జపము చేయు చుండిన మేరుపూస చేతికి తగులఁగా నర్జునుఁడు రోజులిట్లే గడచుచున్న వని గ్రహించి ధర్మరాజుతో నిట్లు ప్రార్థించెను. మహారాజా ! చిర కాలమునుండి శ్యామసుందరుని క్షేమసమాచారములు తెలియుటలేదు. నామనస్సు నేవియో వివిధ సందేహములు కలుగుచున్నవి. చిత్తములో నేదో యనిష్ట స్పృహ కలుగుచున్నది. మీ యాజ్ఞ యగునెడల శ్యామ సుందరుని సమాచారము దెలిసికొని వచ్చెదను. నా మనస్సు శ్రీకృష్ణ చరణసరోజ దర్శనము కొఱకు తహతహ లాడుచున్నది.

ధర్మరాజు కోరికయు నిదియే. అతఁడుగూడ వాసుదేవుని విచిత్ర లీలలను తెలిసికొనఁగోరు చుండెను. ఈసారి యెట్టిలీలఁ జూపఁ దలఁచినాఁడో దెలిసికొనవలసి యుండెను.

అర్జును వాక్యములను విని ధర్మరాజు ఆజ్ఞనొసంగుచు నిట్లనెను:- "అర్జునా! నీవు నా మనస్సులోని విషయములనే పలికినావు. నేను గూడ దేవకీనందనుని సమాచారమును వినుట కుత్సహించుచున్నాను. నిన్నుఁ బంపవలయుననియే యున్నది. కాని భ్రాతృస్నేహవశమున నిన్ను నా కండ్ల కెదుట లేకుండఁ జేయుటకు నా మనస్సొప్పుట లేదు. ఇప్పుడు నీవే అట్టి ప్రస్తావమును గావించితివి కావున నీవు తప్పక వెళ్ళి అచ్చటి సమాచారమును దీసికొని త్వరగాఁ దిరిగి రమ్ము. తమ్ముఁడా! అచ్చట ఆలస్యము చేయవలదు. నీవు భగవంతుని దగ్గఱకుఁ బోఁగానే మమ్ములను మఱచియే పోవుదువు అట్లు మఱచి పోరాదు. వెళ్ళిరమ్ము." ఈ విధముగా ధర్మరాజు ఆజ్ఞను బొంది తనవారందఱకడ ననుమతిఁ గొని, అందఱను ప్రేమతో గలిసికొని, కొద్దిగా సేననుగొని కుంతీ నందనుఁడగు అర్జునుఁడు ద్వారకకు వెడలెను. అతని కొఱకు హస్తినా పురములోఁ బ్రతిదినమును ప్రతీక్షించుటయే కాని యేడుమాసము లైనప్పటికిని అర్జునుఁడు రానేలేదు. ఇంతలోనే విదురుఁడు వచ్చి గాంధారీ ధృతరాష్ట్రులను కొనిపోయెను. నారదుఁడు వచ్చి జ్ఞానోపదేశ మును జేసి వెడలిపోయెను.

ధర్మజుని చిత్తమిప్పుడు కొంచెము చంచలమై పోయెను. అతఁ డిదివఱ కెన్నఁడును జూడనట్టి ధర్మ విపరీతములను గాంచెను. ఇది వఱకెన్నఁడును గలుగని యుత్పాతములు కలిగినవి. రాఁగూడని యీ సంఘటనములనుగాంచి యాతఁడు మిక్కిలి చింతించెను. ఒకానొక దినమున నాతఁడు తన ముగ్గురు తమ్ములను, ఋషులను, మునులను గాంచి తన చింతా కారణమును దెలిపెను.

తమ అన్న యిట్లు చింతామనస్కుఁడై యుండుటను గాంచి తమ్ములందఱిట్లనిరి :- "ప్రభూ! మీరింతగాఁ జింతించు చుంటిరేల?

సంసారములో సుఖ దుఃఖములు, శుభాశుభములు, కలుగుచునే యుండును."

ధర్మరాజత్యంత గంభీరుఁడై యిట్లు చెప్పఁదొడఁగెను :— "సోదరులారా! మీ కింకను దెలియదాయేమి? ఇప్పుడు ఘోరమగు కాలము రానున్నది. ఇట్టి లక్షణములు నాకు ప్రత్యక్షముగ గోచరించు చున్నవి. ఇప్పుడు కలియుగము వచ్చినదో లేక కొద్దికాలములో రానున్నదో యని తోఁచుచున్నది. స్వప్నములో నైనను రాఁగూడనట్టి విషయములు జరుగుచున్నవి. పితా పుత్రులకును, అన్నదమ్ములకును, బంధువులకును, భార్యాభర్తలకును ఎక్కడచూచినను మనో మాలిన్య లక్షణములు కనఁబడుచున్నవి. ప్రజలలో లోభ ప్రవృత్తి అతిశయించినది. అధర్మ బంధువగు దుష్ట కలికాలము నా రాజ్యములోఁ బ్రవేశించినదని తోఁచుచున్నది."

తమ్ము లిట్లనిరి —"ప్రభూ! మీకెట్లు తెలిసినది? మీరు మూర్తిమంతమగు ధర్మస్వరూపులు మీ యాజ్ఞలేనిది మీ రాజ్యములోఁ బ్రవేశించుట కీ కలికి సాహసమెక్కడిది?"

ధర్మరాజు దీనతతో నిట్లనెను :—"సోదరులారా! దుర్నివారమగు గాలమునుదాఁట శ్రీకృష్ణునకు తప్ప యింకెవరికిని సామర్థ్యము లేదు. లెక్కప్రకారము కలియుగ మిదివఱకే వచ్చియున్నప్పటికి శ్రీకృష్ణపదాంకిత మగు నీ భూమిమీదకుఁ గలి యెట్లు పాదప్రక్షేపము కావింపఁగలఁడు? కావునఁ గలి తన ప్రభావమును జూపఁజాలదు. ప్రజలలో స్వాభావికముగ నున్న ధర్మ ప్రవృత్తి మారిపోవుచుండుటను గాంచుచున్నాను. కాలగతి వికరాళముగ నున్నది. ఋతుధర్మములు విపరీతములైనవి వర్షాకాలములో వర్షము లేదు. వర్షమవసరము లేనప్పుడు పంట నాశనము చేయుటకు విపరీత వర్షములు కురియుచున్నవి.

ప్రజలు క్రోధము కలవారుగను, లోభులుగను, వాగాడంబరము కల వారైరి. ఏదియో నందుచూచుకొని కలియుగము భూమిమీఁదకు ప్రవేశించినట్లున్నది."

శ్రీకృష్ణుఁ డిచ్చటనుండఁగా నాదగ్గఱనొక యభియోగము వచ్చి యుండెను. ఒక వ్యక్తి తన పూర్వుల యింటి నింకొక వ్యక్తికి తన చేతులార అమ్ముకొనెను. కొన్నవాఁడు క్రొత్త యిల్లు కట్టుకొనుటకు దానికిఁ బునాదులు త్రవ్వుచుండెను, పునాదులలో స్వర్ణ వరహాలతో లంకెబిందెలు దొఱకెను. ఆ యిఁటిని గొనినవాఁడా వరహాలనుగొని యింటిని అమ్మినవాని వద్దకుఁబోయి యిట్లనెను:-"సోదరా! నీవమ్మిన భవనములో వరహాలబిందె దొఱికినది. దీనినిఁ దీసికొనుము."

ఆ వరహాల బిందెను గాంచి పామునుజూచిన భయపడినట్లు భయపడి, దానిని తాకఁకయే అమ్మిన వాడిట్లనెను :— "మహానుభావా! ఏమిది? ఇట్లపర్మముగ మాటలాడుచున్నావు. నేను నీకు గృహమును విక్రయించినప్పుడు ఆ యావరణములో వరహాలు దొఱకనిండు. వట్టి గుల్ల పెంకులు దొఱకనిండు అన్నియు నీవే. నేనీ వరహాలను దీసికొనఁజాలను నీవే వాటి ననుభవింపుము"

ఇది విని యా కొనినవ్యక్తి యిట్లనెను :- "సోదరా! నీవు నన్ను లోభపెట్టి నా పరలోకమును బాడుచేయకుము నాకు నీవు గృహము నమ్మితివా యీ వరహాలనా? వరహాలను మీ పూర్వులు పాతిపెట్టినారు. ఆ సంగతి నీకు తెలియలేదు. నీకు తెలిసియేయుండిన నీవీ స్వల్పవెలకు దీనిని నా కమ్ముదువా, నేనిచ్చిన ద్రవ్యము భూమికి, యింటికిగాని వరహాలకు కాదుకదా! కావున నీ స్వర్ణముద్రలపై నా కేయధికారమును లేదు. నేను వీటిని గైకొని పాపిని గాఁదలపు లేదు."

అంత విక్రయించినవా డిట్లనెను :- "నేను భూమినమ్మితిని. దానిఁమీద నాకుఁగాని నా పూర్వులఁకు గాని అధికారము లేదు. ఒక వేళ నా భూమిలోనుండి తేళ్ళు బయలుదేఱి వచ్చిన వాటిని నా యింట వదిలిపెట్టెదవా యేమి? మా పూర్వులు దయ్యాలై అక్కడుండిన నా దయ్యముల నా యింటికి పంపెదవా యేమి? ఇంటిలోని వస్తువుల నిర్దేశించి నేను నీకు అమ్మలేదు. ఇంటిని మొత్తము నమ్మితిని. దానిలోనేమి దొరికినను నీవియే-"

ఈ విధముగ వారిద్దరికి వాదవివాదము జరిగినది. ఆ వరహాల బిందె నెవరును తీసికొని పోలేదు. వివాదము పెరిగి పెరిగి నా దగ్గఱకు వచ్చిరి. ఇద్దరును వారివారి వాదముల పుష్టికై ప్రమాణముల నొసంగిరి. అట్టియెడ నేమి నిర్ణయము చేయవలయునో తెలియక కింకర్తవ్యతా విమూఢుఁడనై యుంటిని నే నేమియు నిశ్చయము చేయలేని స్థితిలో నుండి శ్రీకృష్ణ భగవాను నిట్లడిగితిని :- "ప్రభూ ! దీని కేమి తీర్పు చెప్పుదును? ఈ వరహా బిందె నెవరికీయ వలెను?"

నా మాటలను విని వాసుదేవుఁడు నవ్వి యిట్లనెను :- "ధర్మ రాజా! నీవు దీని నెవరికి నీయవలదు. దీనిని నీ దగ్గఱనే అనామతుగా నుంచుము. కొంతకాలమైన తర్వాతఁ గలియుగము రాఁగలదు. అప్పుడు వీరి మనస్సులలో లోభము పుట్టఁగలదు. అప్పు డెవరువచ్చి యడిగిన వారికిమ్ము."

శ్రీకృష్ణుని సలహాప్రకారము వారిద్దరితో నేనిట్లంటిని:-"మంచిది. మీరిద్దరు వెళ్ళిపొండు. ఇది అనామతుగా నా దగ్గఱ నుండఁగలదు. మీ రాలోచించుకొని మరల నా వద్దకు రండు. ఇది ఎవరిదిగా నిర్ణయించు కొందురో వారికిచ్చెదను." ఇదివిని వారిద్దరు చాల సంతోషమున వారి నెత్తిమీఁది బరువుదించినట్లుండి వెళ్ళిపోయిరి.

నిన్నటి దినమున వారిద్దరు నా దగ్గఱకు కలహించుచు వచ్చి యిద్దరిట్లనిరి :- 'వరహాల బిందె నాదనిన నాదని మొదలిడిరి. ఇంతే కాదు వారిద్దరును విధాన విశారదులను (న్యాయవాదులను) తమతమ పక్షమునఁ బ్రమాణములను జూపివాదించుటకు తమవెంటఁ గొనివచ్చిరి. ఈ మూలమున నేను కలియుగము వచ్చినదని తెలిసికొంటిని."

నా సేవకులు సేవించుటలోఁ బ్రమాదపడుచుండిరి. ఒక దినమున నేను ప్రధాన న్యాయాధీశుని బిలిచి యిట్లంటిని:- "ఇప్పుడు నీదగ్గఱ కెట్టి యభియోగములు వచ్చుచున్నవి ?"

అతఁ డిట్లనెను :- "ప్రభూ ! అభియోగములు చాల వచ్చు చున్నవి. దానిలోఁ గొందఱు అబద్ధములుకూడా మాట్లాడుచున్నారు."

నేను వ్యగ్రతతో నిట్లంటిని :- "అబద్ధ మనిన నాకు తలనొప్పి శ్రీకృష్ణుని యాజ్ఞచే నొకసారి అర్ధసత్యమును బలికితిని. దానిమూలమున నాకిప్పటివఱకు మనస్సులో బాధ కలుగుచునే యున్నది. నీ వభియోగము లన్నిఁటిని వ్రాయుచుండుము."

న్యాయాధీశు డిట్లనెను :- "ప్రభూ! పాపముల లెక్కవ్రాయుట కలియుగ చిహ్నము. మీరిట్టి యాజ్ఞ యెందుల కొసంగుచున్నారు?"

నే నిట్లంటిని :- "ఏమైనఁ గానిమ్ము. ఆ లెక్కలను నేను జూడవలసి యున్నది."

అతఁడు నా యాజ్ఞచే లెక్కలు వ్రాయుట నారంభించెను. ఒక్కరో యిద్దరో న్యాయాధీశులుండిరి ఇప్పుడు వందలకొలఁది యున్నప్పటికి వ్యాజ్యములు తీర్పగుట లేదు. ఒకదినమున నేనా లెక్కను జూచితిని. కొన్ని వ్యాజ్యములు నాకు నమ్మకమే చేనట్టివి కలవు. నేను వాది ప్రతివాదులను బిలిచి యిట్లంటిని :- "ఏమయ్యా !

మీరిట్టి పాపములు చేయుచుంటిరా!" వారు స్పష్టముగ నిట్లనిరి :—"లేదు మహారాజా! మే మవి చేయనే లేదు." నేను న్యాయాధీశునితో నిట్లంటిని : "వీరట్లు చేయలేదనుచున్నారు. యభియోగము నెట్లు వ్రాసితివి?" అతఁ డిట్లనెను :- "ప్రభూ! వీరిని నేనడిగియే వ్రాసితిని. ఇప్పుడు వీరు మీ సమక్షమున నసత్యము పలుకుచున్నారు" అప్పుడు నే నిట్లంటిని :— "మంచిది అందఱిచేత సంతకములను గూడ తీసికొనుము."

నా మాటలను విని న్యాయాధీశుఁ డిట్లనెను :- "ప్రభూ! మీరిటి యాజ్ఞ నీయకుఁడు ప్రతి విషయమునకు సంతకము తీసికొనుట ప్రత్యక్షముగ నవిశ్వాసమును బ్రకటించుట యన్నమాట. అవిశ్వాసము కలహములకుమూలము." నేనిట్లంటిని :- "వీఁడిట్లు చెప్పినాఁడని మన కెట్లు గుర్తు? నీ వందఱిచేత సంతకములు చేయించుకొనవలయును." అప్పటినుండి వ్యాజ్యములను సంతకముతో లెక్క వ్రాయఁబడు చుండెను. వీనిలోఁ నేఁ డెచ్చట చూచినను కలియుగము లక్షణములు కనఁబడుచున్నవి.

నా కర్మచారులు, అధికారులు ఇదివఱకు వారి కర్తవ్యమును దెలిసికొని ధర్మముగ వారివారి కార్యము లొనర్చు చుండిరి. అట్టివా రిప్పుడు ప్రమాదపడుచున్నారు. అప్పుడు నేను మంత్రితో నిట్లంటిని :— "ఈ కర్మచారులను, అధికారులను గనిపెట్టి యుండుటకు వేతనమిచ్చి కొందఱ నిరీక్షకుల నియమింప వలయును."

మంత్రి యిట్లనెను :— "ప్రభూ! ఇది ధర్మ విరుద్ధము. ఒకసారి విశ్వాసముంచి ఒకకార్యమును వారికి ఒప్పఁజెప్పినప్పుడు వాని ననుమానించి విశ్వసింపకుండుటయు, వారిపై నొక యధికారిని నిరీక్షకునిగా నియోగించుటయు బలవంతముగఁ బ్రమాద ప్రవృత్తులఁ గావించుటయే

కాఁగలదు. నిరీక్షకుఁడు ప్రతిమాఱును వారి కార్యములను బరీక్షించు చుండిన నిరీక్షకునినుండి తప్పించు కొనుటకు వారసత్యములు పలుకు చుందురు. ఒక పాపమును దాఁచుట కనేక పాపములను జేయు చుండెదరు."

నే నిట్లంటిని :— "ఏమైనఁ గానిండు. ఇవ్వేళ నొక ప్రమాదము కావించినవాఁడు రేపు మఱియొక ప్రమాదము చేయఁగలడు. కావున నిరీక్షకులను దప్పక నియమింప వలసినదే." నా మాటప్రకారము మంత్రి వైతనిక నిరీక్షకులను సమీక్ష కొఱకు నియోగించెను. వారు కొన్ని దినములు బాగుగానే పనిచేసిరి. కాని కొన్నాళ్లైన తర్వాత నా నిరీక్షకులుగూడా ప్రమాదపడ మొదలిడిరి. ఆ కారణమున నిరీక్షకుల నిరీక్షించుటకై కొందఱను నియోగింప వలసి వచ్చెను. ఇట్లు జరుగు చున్నను ప్రజలు ధర్మముగ నడచుటలేదు.

ఒకదినమున నొక బ్రాహ్మణుఁడు పాలు, నేయి నమ్ముటను గాంచి వానిని బిలిచి నే నిట్లంటిని :— "బ్రాహ్మణోత్తమా! మీరు పాపము చేయుచున్నా రేల? పాలు, నేయి, చక్కెర, నూనె మొదలగు రసవస్తువుల నమ్ముట బ్రాహ్మణులకు నిషిద్ధము. మీరీ నీచవృత్తి నేల యవలంబించితిరి."

అతఁడు దీనతతో నిట్లనెను :— "ఏమి చేయుదును ధర్మావతారా! పొట్టనిండుటలేదు. ఈ పాపపు పొట్టకొఱ కేమైనఁ జేయవలసి యుండును."

నేను ధర్మాధ్యక్షునితోఁ జెప్పి వానికిఁ గావలసిన ద్రవ్యము నిప్పించి యిట్టి పనులు చేయవలదని నిషేధించితిని. అతఁడట్లే చేసి నాఁడు గాని యితర వర్ణములవారిలోఁ గూడ వృత్తిసాంకర్య మేర్పడి నట్లు తెలియవచ్చుచున్నది.

ప్రజలలోఁ బరస్పర వ్యవహారము కుటిలతా పూర్ణముగనున్నది ఒకరియెడల నింకొకరికి అవిశ్వాసము. ఒకదినమున నొక కమ్మరివాని యొద్ద నే నొక యంత్రమును జూచితిని. అట్టి దానిని నే నెన్నడును జూడకపోవుటచే వానిని బిలిచి యిట్లు ప్రశ్నించితిని :- "ఈ వస్తువే మిటి ? ఇది యేవిధముగ నుపయోగపడును ?"

అతఁ డిట్లనెను :- "ప్రభూ! ఒకదినమున నేను స్నానమునకు వెళ్ళితిని. అప్పుడు నా పాత్ర నెవరో తీసికొనిపోయిరి. ఆ కారణమున నా బుద్ధిచే నీ యంత్రమును గని పెట్టితిని. దీనిపేరు తాళపుబుఱ్ఱ. తలుపులకు గొళ్ళెమునుబెట్టి నాగవాసమునకు దానిని తగిలించి దీనిని వేసిన లంకెవరును తలుపును దెఱువలేరు. దీని తాళపుచెవి నాదగ్గఱ నుండును." ఇది వినఁగానే నాకు చాలయాశ్చర్యమొదవి వానితో నిట్లంటిని : "ఇంటికి తాళమువేయుట అందఱ యెడల నవిశ్వాసము కలిగియుండుటయే. నీ వస్తువులను మేము రక్షింతుము. దానిని పగులఁగొట్టి పాఱవేయుము. ఇఁక నిట్టివి చేయకుము." అతఁడప్పుడే దానిని పగులఁగొట్టి పాఱవేసినాడు, గాని యాతని మనస్సులో దీని సంస్కారములట్లే నిలచిపోయినవి ఇవ్వేళ కాకపోయిన రేపైనను మరల తయారుచేయగలఁడు.

ఒకదినమున నేను గంగకు వెళ్ళి వచ్చుచుంటిని. ఒక రైతు తన భుజముమీఁద నాఁగేటిని బెట్టుకొని యింటికి వెళ్ళుచుండెను. నేను రథమునాపి వానిని బిలిచి యిట్లడిగితిని:- "ఏమినాయనా! నీవింతగా శ్రమపడుచున్నావేల? నాఁగలిని ఇంటికేల గొనిపోవుచున్నావు? పొలములో నుంచిరారాదా?"

అతఁడు చేతులుజోడించి యిట్లనెను:- "ధర్మావతారా! ఎప్పుడును నాఁగలి పొలములోనే యుండెడిది. రైతు యెన్నడును నాఁగలి

నింటికి తెచ్చుకొనెడువాఁడు కాఁడు. కాని ఒక దినమున నానాగఁలి కన బడలేదు. ఎవఁడోయెత్తుకొని పోయినాఁడు. నేను బీదరైతును. ఆ కారణ ముచే నేను ప్రతిదినము నింటికి గొనిపోవుచున్నాను. మరల పొలము నకుఁ దీసికొని వచ్చుచున్నాను."

అంత నాకు నా రాజ్యములోని నా రైతు లిట్లవిశ్వాసము, చోర భయముచే నిత్యము నాఁగలి నింటికిఁ దెచ్చుకొనుచున్నారను దుఃఖము కలిగినది. నేనిట్లాజ్ఞాపించితిని:— "నీ నాగలిని రక్షించు భారము ప్రభు త్వముమీదఁ గలదు. మీరు నాఁగలిని నింటికి గొనిపోవలసిన పనిలేదు." అంత నేను ప్రతిగ్రామ పంచాయతికిని ఎవరైన నితరుల నాఁగలిని బట్టుకొని పోయిన ప్రాణదండన మిప్పింపవలయునని తాఖీదును బంపి తిని. సరళముగ, బుద్ధిమంతుఁడుగ నున్న రైతునకును నిట్టి వ్యవహార మారంభ మయ్యెను.

ఒక దినమున నేనొక యాశ్చర్యమును గాంచితిని. ఒక మండ లాధిపతియగు రాజు ఒక లోహయంత్రమున నాకాశమున కెగురుటను గాంచితిని. నేను వానినిఁబిలిచి యిట్లంటిని:— "నీవే దేవత నారాధించి యీ కామగ విమానమును సంపాదించితివి?"

అతఁడు కొంచెము భయపడుచు లజ్జాభావముతో నిట్లనెను. "ప్రభూ! ఇది కామగ విమానము కాదు. దీనిని నా రాజ్యంలో నొకశిల్పి తయారుచేసినాఁడు ఇది నీరు, నిప్పుసహాయమున నావిరితో వెళ్లును. ఏదైన స్నిగ్ధపదార్థమును వేసిన దాని సహాయమున దీనిని నడిపిన నిది నడచును. సంకల్పముచే దేవతా విమానమువలె నిదిపోదు."

నే నిట్లంటిని:— "అట్లైన నిందు నందఱును అధికారులు, ననధి కారులు. ఎక్కి పాపప్రచారము చేసెదరు."

అతడు భయభీతుఁడై యిట్లనెను "ధర్మావతారా! దీనిద్వారా ధర్మప్రచారము కూడా కాఁగలదు."

నే నిట్లంటిని:— "ధార్మికులలో నిట్టిసామర్థ్యము వారి తేజము వలన నుండును. వారు తమ యిష్టమువచ్చినచోటకు తమ భావములను బంపఁగలుగుదురు. ఇట్టి యంత్రములను అల్పశక్తిగల అసమర్థులు, పాపపరాయణులు, దైవీసంపత్తి లేనివారు, ప్రతికార్యమును శీఘ్రముగఁ జేయఁదలఁచినవారు సిర్మించుకొనుచుందురు వానికి ప్రతికార్యము శీఘ్రముగఁ బూర్తి కావలెనను దృష్టియే" నేనిట్లు చెప్పుచుండఁగనే వ్యాసభగవానుఁడప్పటికి వచ్చెను నేను లేచి పద్యుక్తముగఁ బూజించి యీ సమస్త వృత్తాంతమును నివేదించి యిట్లడిగితిని :- "ప్రభూ యీ మండలాధిపతి కలియుగ భావములు శీఘ్రముగాఁ బ్రచారము చేయుటకు వీలగు నీయంత్రమును నొక శిల్పి సహాయమున నిర్మించి యున్నాఁడు. వీనికేమి శిక్షవేయవలయునో తమరు సెలవీయుఁడు."వ్యాసభగవానుఁడు నవ్వుచు నిట్లనెను:— "రాజా! వీని నేమియు శిక్షింప వలదు. నేను వీనికిఁ దెలియ జెప్పెదను. నీవు దీనిని నాశనము చేయుము. ఈ శిక్షచాలును." నాతో నిట్లుచెప్పి వ్యాసభగవానుఁడు ఆ రాజున కిట్లనియె:- "నాయనా! ధర్మరాజు రాజ్యమున నిట్లుచేయుట ఉచితముకాదు. నేఁటికి రెండువేల అయిదువందల సంవత్సరములైన తర్వాత బౌద్ధులనఁబడు వారు గొందఱు నాస్తికులు పాలించినప్పుడిట్టియంత్రములను నిర్మించెదరు. వారు పాదరసము ద్వారా వాటిని నడిపెదరు. అయిదువేల సంవత్సరములైన తర్వాత నివి యింటింటఁ బ్రచార మగును. ఆ సమయమున తెలుపు నలుపు వర్ణముగల దస్యులేలెదరు. అప్పుడీ యంత్రములద్వారా అసత్యము, అధర్మము, కలహము, ప్రచారము చేయఁబడుచుండును. వాటికిది సమయము కాదు." ఇట్లు చెప్పి వ్యాస భగవానుఁడా యంత్రమును తన ముందఱనే నాశనము చేయించెను.

ఆ తరువాత వ్యాసభగవానుఁడు నాతో నిట్లనెను:— "రాజా! నీవిఁక నిప్పుడేమి చూచినావు నేఁటికి అయిదు వేల సంవత్సరములైన తర్వాతఁ బ్రజలకు వర్ణాశ్రమ ధర్మములందు ప్రీతి యుండదు. అధ్యయనమందు గురువని శిష్యుడని యుండఁబోదు శూద్రులు, అంత్యవర్ణస్థులు ఉచ్చవర్ణసులకార్యములఁ జేయఁదొడగెదరు ఉచ్చవర్ణస్థులు అంత్యజులతో సహ భోజనాసనవివాహాదుల నొనర్చి అదియే గొప్ప ఘనత యనుకొనెదరు. సంస్కృతి సదాచారములు క్షీణించిపోవును. సంధ్యావందనము, దేవర్షి పితృ శ్రాద్ధములు, తర్పణములు, పూజా పారాయణలు మొదలగువాటినన్నిటిని జూచి ఎగతాళి చేయుదురు. స్వేచ్ఛాచారమే సద్ధర్మముగ నెన్నఁబడును. అందఱు సన్నివృత్తుల నవలంబించి ద్రవ్యోపార్జన చేయ మొదలిడెదరు. దస్యుధర్మముగల విధర్మీయులు రాజులగుదురు. రాజులు వ్యాపారమును సాగింతురు స్త్రీలు లజ్జా విహీనులగుదురు. కులీన స్త్రీలు ఏకవస్త్రలై సగము శరీరమును గనపఱచుచు నిర్లజ్జలై పురుషులతో బజారులలోను ఉద్యానవనములందును దిరుగుచుందురు. కన్యలుండనే యుండరు. అవివాహితులు, వివాహితులు, విధవలు ఒక్కరీతిగానే యుందురు. సౌభాగ్య చిహ్నములగు నాభూషణములు నెవరును ధరింపరు. శ్రీ, కాంతి విహీనలై వస్త్రాభూషణ రహితలై చేతులకుఁ గాళ్ళకు నేమియు లేక విధవలవలెఁ గనఁబడుదురు. ఒకరు ఇద్దరుకారు, ఇంటింట భ్రూణహత్యలు జరుగుచుండును. కన్యలు, విధవలు, కన్న సంతాన మధికము కాఁగలదు. వారు పాపాచరణమునఁ బ్రవృత్తులగుచుందురు. కులకాంతలకును, వారకాంతలకును, వేషభాషాచరణ వ్యవహారములలో భేదముండదు. దాంపత్య భావము నశించిపోవును స్త్రీలు పురుషులవలె స్వతంత్రులై స్వేచ్ఛగ నుండవలయునని పురుషులతోఁ బ్రతిదినమును గలహించుచుండెదరు. చాలా మంది స్త్రీలు యథేష్టముగాఁ

దిరుగుటకును, ప్రసవనపీడనుండి తప్పించుకొనవలయుననియు గర్భకోశమును శస్త్ర చికిత్సద్వారా తీసివేయించుకొని ఘోరమగు పాపములను జేయుచుండెదరు."

ఇదివిని నేను చేతులతోఁ జెవులు మూసికొని యిట్లంటిని:- "దేవా! ఇట్లు చేయువారు మానవస్త్రీలా, రాక్షసస్త్రీలా?"

వ్యాసభగవానుఁ డిట్లనెను:- "వారు చూచుటకు మానవమానినులవలెనే యుందురు. వారి యాకృతి మానవాకృతియే. చూచుటకుఁగూడ బాగుగానే యుందురు; కాని వాస్తవముగ వారు రాక్షసస్త్రీలై పుట్టెదరు."

నేను శ్రీకృష్ణ ద్వైపాయనుని పాదములంటి యిట్లంటిని :- "ప్రభూ! ఇట్టి కాలమును నేనుఁజూడరాదు. ఈ పాపములు నా ముందుండరాదు. నాకొక వరమీయవలెను. నేనది భగవానునిగూడ యాచించితిని. అయిదు వేల సంవత్సరముల వఱకు కలియుగ మీ భూమిపై నడుగిడనీయ కూడదు"

వ్యాసుఁడు ప్రసన్నుఁడై యిట్లనెను:- "ధర్మరాజా! నీవీ ఘృణితపాపాచరణ పూర్ణమగు కార్యములను జూడవు. నా యాశీర్వచనమున నైదు వేల సంవత్సరముల వఱకు కలియంతగా నుండదు. అయిదు వేల సంవత్సరములైన తర్వాత కలి దాని ప్రభావమది చూపింపఁ గలదు." ఇట్లు చెప్పి వ్యాసభగవానుఁడు వెళ్ళిపోయెను.

నిన్న నే నొక యాశ్చర్యము గాంచితిని. ఒక కులీన స్త్రీ ఏక వస్త్రముతో నర్ధనగ్నయై, నిర్లజ్జయై అందఱ యెదుట నవ్వుచు బజారునఁ బోవుచుండెను నన్ను జూచియు సిగ్గుపడలేదు. నేను రాజభవనమునకు వచ్చునప్పటికి - ఒకస్త్రీ' మంచి చక్కని వస్త్రాభూషణములను ధరించి యనేక సుగంధద్రవ్యములను రాచుకొని నిలుచుండెను. నన్నుఁజూచి

ఆమె కొంచెము లజ్జితయై తొలగెను. ఆమె యెవరని నేను మా వృద్ధ దాసి నడిగితిని. 'ఈమె దుర్యోధనుని ఆఖరు తమ్ముని భార్య' యని యామె చెప్పెను. ఇది వినఁగానే నాపై నేదో పిడుగు పడినట్లుండెను. కలియుగము నా రాజ్యములోనే కాదు ప్రవేశించినది, నా యింటిలోఁ గూడ ప్రవేశించినదని గ్రహించితిని. ఇఁక నీ లోకములో నుండ వీలులేదు. మాకేదియో యనిష్టము సంభవింపనున్నది. నిన్న నేడుఁ నే ననేకములగు అపశకునములను గాంచుచున్నాను. వాటి నన్నిటిని ముందు మీ కందఱకు చెప్పెదను"

ఇంకొక విషయము కూడ జరిగినట్లు నాకు తోచుచున్నది. శ్రీకృష్ణభగవానుఁడు ఈ భూమిని వదలి పోయినాఁడో, పోనున్నాడో, అందుకనియే కలికాల మింతగా భూమిమీఁద వ్యాపించినది.

౨

సూతుఁ డిట్లనెను:—మునులారా! అర్జునుఁడు రాకపోవునప్పటికి ధర్మరాజు భీమసేనునితోను, ఇతర తమ్ములలోను ఇట్లనెను:-అర్జునుఁడు రాని కారణము నాకు తోఁచుటలేదు ఇఁక నిచ్చట కలికాలము తన యధికారమును సర్వత్రవ్యాపింపఁ జేసికొనినట్లు తోచుచున్నది. ఇది కలిశాసన కాలము కావున మన మిక నిచ్చట నుండరాదు. కలియుగ చిహ్నములన్నియుఁ బ్రత్యక్షముగఁ గనఁబడుచున్నవి. ఒక దినమున కలి నా దగ్గఱకు వచ్చి 'ఇది నా రాజ్య కాలము, మీరిఁక సింహాసనమును వీడవలయు'నని చెప్పకొనెను

అంతఁగుతూహల వశమున నొక యాత్మీయుఁడిట్లనెను:-"దేవా! మీరు ధర్మావతారులు. కలికిని మీకును సమావేశ మెక్కడ? మీయెదుటకు వచ్చునంతటి సాహసము కలికెట్లు కలిగినది?"

ఈ ప్రశ్నను విని అందఱు వినునట్లు ధర్మరాజిట్లనెను:- "సోదరులారా! ఒక దినమున నా తమ్ములగు భీమార్జున నకుల సహదేవులు నలుగు రొక్కసారిగ సభలోనికి వచ్చుచుండిరి. అప్పుడు వీరు సభా ద్వారమున నొక్కని గాంచిరి. అతని వద్ద సర్వలక్షణ సంపన్నమును, మిక్కిలి వేగముగఁ బరువిడఁగల నొక సుందరాశ్వము కలదు. ఆ దివ్యాశ్వమును గాంచి నా సోదరులచ్చటకు వెళ్ళి 'గుఱ్ఱము నమ్మెదవా?' యనిరి.

అతఁడు వినయముతో నిట్లనెను :- మహారాజా! నేను దీని నమ్ముటకే తెచ్చితిని."

అప్పుడు నా తమ్ములు సంతోషముతో నిట్లనిరి :- "మంచిది. అయితే నీవు దీనిని మా యశ్వశాలలోఁ గట్టివేసి వచ్చి నీ కెన్ని రూపాయలు కావలయునో అన్నిటిని గొనిపొమ్ము."

ఆ వ్యక్తి యిట్లనెను : "మహారాజకుమారులారా! మీ వద్ద ధనమునకు కొదువలేదు. నాకును ధనేచ్ఛలేదు. మీకు నేను నాలుగు ప్రశ్నలిచ్చెదను. వాటికి మీరు సదుత్తరము లిచ్చిన గుఱ్ఱము మీది. నేను దాని నశ్వశాలలోఁ గట్టివేసెదను. మీరు సరియైన జవాబులు చెప్పలేకపోయితిరా, నేనొక గీటు గీసెదను. నా ప్రశ్నలకు సరియగు జవాబు లభించువఱకు మీరు ధర్మము ననుసరించి ఆ గీటు దాటఁ గూడదు." సాధారణముగ గుఱ్ఱముల నమ్ముకొనువాని యిట్టి మాటలను విని నాసోదరులకు కుతూహలము కలిగి వారు నవ్వుచు నిట్లనిరి :- "సరే! నీ నియమము మా కంగీకారమే."

ఇదివిని యాతఁ డానందముతో నిట్లనెను :- "నేను నా యశ్వమును దీసికొనివచ్చునప్పుడు దారిలో నొక భయంకరమగు బావిని జూచితిని అచ్చట నొక విచిత్రవిషయమొకటి కనఁబడినది. ఆ కూప

ముఖమున ఒక కానీ వేలాడఁగట్టఁబడి యుండెను. ఆ కానీకి లక్ష మణుగుల బరువుగల యినుపగుంతు వ్రేలాడఁగట్టబడెను. అయినను అది బావిలోఁబడలేదు. దాని కారణమేమి?"

నాతమ్ములు నలుగురు ఒకరి ముఖము లొకరు చూచుకొనిరి. ఎవరికిని దీనికి ప్రత్యుత్తరము తోఁచలేదు. అప్పుడాతఁడు వినయముతో నిట్లనెను :- "మీనల్గురన్నదమ్ములలో ఒకరు మన వంటెనకు కొఱకు ఈ గీతలో నిలుచుండవలెను." అని విని భీముఁడు ఆ ధర్మరేఖ లోపల నిలుచుండెను. అంత నాతఁడు రెండవ ప్రశ్నను వేసెను :— "ఒకదినమున నేను మార్గమున వచ్చుచుంటిని. దారిలో నేనైదు బావులను జూచితిని. నాలుగు బావు లచ్చటచ్చట నున్నవి. ఒక బావి మాత్రము మధ్యలోఁ గలదు. ఆయైదు బావులలోని నీరు ఉడుకుచుండును దగ్గఱలో నున్న బావి వట్టుపడినపుడు మధ్యబావిలోని నీరుడికి దానిని నింపును. కాని మధ్యబావి వట్టుపడినపుడు దానిని మిగిలిన నాలుగు బావులు నింపలేవు. కారణమేమి?"

నాతమ్ములు ముగ్గురిలో నెవరికిని దీనికి సమాధానము కుదురలేదు. అంత నర్జునుఁ డాధర్మరేఖలోఁ బోయినిలుచుండెను అంత నాతఁడు మూఁడవ ప్రశ్న వేసెను. అతఁడిట్లనెను:- "ఒకదినమున నేను దారిలో నొకవింతను గాంచితిని. ఒక ఆవు దూడ నీనినది. పుట్టఁగానే దూడ ఆవు పాలు త్రాగవలసినది పోయి ఆవు దూడ పాలు త్రాగుచుండెను."

ఇది విని నకులసహదేవులు ఒకరిముఖము నొకరుచూచుకొని యాతఁ డద్భుతములో నద్భుతప్రశ్న లడుగుచున్నాఁడే యనుకొనిరి. వారికి సమాధానము దొరకకపోవుటచే నకులుఁడా ధర్మరేఖలోనికిఁ బోయెను. అంత నాతఁడు నాల్గవప్రశ్న నడిగెను.

ఆతఁ డిట్లనెను:- "ఒకదినమున నేను దారిని వచ్చుచుండఁగా నొక జంతువు నా యెట్టయెదుట కనఁబడెను. అది చాలసారులు నోటితోఁ జెడ్డశబ్దములు వలుకుచు, ముడ్డితో గడ్డి తినుచున్నది. ఇది యేమి?"

సహదేవునకు దీనికి జవాబు దొరకలేదు. అందువలన నాతఁడు కూడ ధర్మపరిధి లోనికిఁ బోయి నిలుచుండెను.

నేను చాలసేపు నిరీక్షించితిని. నలుగురిలో నొక్కరును ఇంత వఱకు రాలేదేలనని నేను సేవకునిఁ బంపఁగా సేవకుఁడు వచ్చి యిట్లనెను:- "మహారాజా ! ఒక గుఱ్ఱపువాఁడు ద్వారమున నిలుచున్నాఁడు వాని దగ్గర నలుగురును నిలుచుండిరి. లోపలకు రానేరారు"

నాకును గుతూహలము కలిగి బయటకు వచ్చితిని. నే నిట్లను కొంటిని:- 'వీరికి గుఱ్ఱము నచ్చి కావలెననుకొనుచున్నారు ఈతఁ డీయఁడు, బేరము చెప్పఁడేల?' అనుకొని నే నిట్లంటిని:- "అబ్బాయీ ! నీవు గుఱ్ఱమును అమ్మవాయేమి?

ఆతఁడిట్లనెను:- 'అన్నదాతా ! నేనమ్ముటకే వచ్చితిని.' నే నిట్లంటిని :- "అయితే, నా సోదరులిట్లెందులకు నిలుచుండిరి ? దీనిని అశ్వశాలలోఁ గట్టివేయుము. నీకు కావలసిన రూప్యములు గొనిపొమ్ము."

ఆతఁడిట్లనెను:- "అన్నదాతా ! మీవద్ద ధనమునకుఁ గొదువేమి? ఈమాటను మీతమ్ములు కూడ చెప్పిరి. కాని ధనావశ్యకత నాకుగూడ లేదు. మీరు నాకు నాల్గుప్రశ్నలకు జవాబీయుఁడు. ఈ గుఱ్ఱమును దీనికొనిపోయి అశ్వశాలలో బంధించెదను."

ధర్మరా జిట్లనెను:- అడగు నాయనా ! నీ ప్రశ్న లేమిటో ? అతఁడా మొదటి ప్రశ్న నడిగెను. అగాధ కూపమందు కానీ యాధార

మున లక్షమణుఁగుల బరువుగల లోహము వ్రేలాడుచున్నది. ఇది యేమిటి?"

నేను వానిని గద్దించుచు నిట్లంటిని:- "నీవు పట్టి ధూర్తునివలెఁ గనఁబడుచున్నావే. మారాజ్యములో నీవు కలియుగ విషయములు పలుకుచున్నావు. ఇట్టివి కలియుగములో జరుగఁగలవు కలియుగములో ధర్మకర్మము లుండవు. ఎవడైన దయావశమున నొక్క పిడికెడన్న మెవరికైన దానము చేసెనా ఆకానీ దానము మూలకముగా లక్షమణుఁగుల ఇనుమునుబోలు అధర్మమును వ్రేలాడఁగట్టుకొనును. దయాదానములను రెంటిని వదలి పెట్టినవారు ఆ లోహముతో సంసార రూపమగు మోహకూపములోఁ బడిపోవుదురు."

ఇది విని యావ్యక్తి యిట్లనిగెను:- "మహారాజా! మధ్యలో నున్న నొక కూపము చుట్టునున్న నాలుగు ఖాళీకూపములను నింపును, గాని మధ్యకూపము ఖాళీయైన నా ఒక్కకూపమును నీనాల్గుకూపములు కలిసియు నింపలేవు. ఇవి యేమిటి?"

నేను తేజితుఁడనై యిట్లంటిని :- "నీవు గొప్ప అధర్మబంధుఁడవు, ధూర్తుఁడవును! ఇంకను గలియుగమునకు సంబంధించిన వాక్కులే నోట వెలువడుచున్నవి. ఇట్టివి కలియుగములో జరుగును. తండ్రికి నలుగురు కొడుకులుండిన వారిని నలుగురిని పెంచి పెద్దవారిని గావించును. విద్యాబుద్ధులు చెప్పించును. యోగ్యుల నొనర్చును. కాని తండ్రికి వృద్ధాప్యము రాఁగానే కలియుగములో నీ నలుగురును వారిని పోషింపరు. తల్లిదండ్రులు కడుపుమాడి చావవలసినదే, లేదా అనాథాలయము నాశ్రయించవలెను. లేక అఁకటఁ జావనైనఁ జావవలయును".

ఇది విని అవ్యక్తి యిట్లనెను :- "మహారాజా! గోక్షీరమును వత్సము త్రాగవలయును. గోవు దూడపాల నేల త్రాగుచున్నది?"

నేను వానిని గద్దించుచు నిట్లంటిని:-"జాగ్రత్త! చాల ముదిరినది. నీవు సాక్షాత్తు కలియుగమువలె నున్నావు. ఓరీ! ధూర్తుఁడా! ఇట్టి పనిని కలియుగములోని తండ్రి చేయవలయునురా! ఆఁడుపిల్ల పుట్టెనా, దాని సహాయమున నప్పుచేయును. బాగుగా తినుచుండును. అది కొంచెము పెద్దది కాఁగానే దాని నమ్మివేయును. అంత మఱియొక పిల్లపేరట నప్పుచేయును. ఇట్టి కన్యావిక్రయము చేయు నీచులు, అధములు, పాపులు, రాక్షసులు అగు తండ్రులు కలికాలమునఁ జాలమంది పుట్టఁగలరు. ఇట్లమ్మఁబడిన దానికి పుట్టిన బిడ్డలు జరిపిన పిండదానాదులు వారి పితరులకుఁ జెందవు కన్యక నమ్మువాఁడును కన్యాద్రవ్యముచే జీవించువాఁడును ఘోరపాపులు. ఇట్టిపాపుల ముఖము జూచినను పాపమే కలియుగములో నిట్టి పాపులనేకు లుండఁగలరు."

ఇది విని యాతఁడిట్లడిగెను :-"మహారాజా! భయంకరమగు చెడ్డశబ్దములు చేయుచు, ముడ్డితో గడ్డితిను జంతు వేది?"

ఇదివినఁగానే నాకుమిక్కిలి కోపమువచ్చి ఖడ్గమును దూసి యిట్లంటిని:-"నీవు కపటవేషముతో వచ్చిన కలియుగమని నే నిప్పుడు నిశ్చయముగ గ్రహించితిని. అరే నీచా! వేదశాస్త్రములను వదలి, ఇతిహాస పురాణాశ్రయమును వీడి, నతనికిష్టమువచ్చిన కపటకల్పితములై తలతోక లేని రచనలు చేయుచు డబ్బుకై గడ్డితిను కవులు కలియుగములో నుండఁగలరు. వారనుకూలమార్గములను వదిలి ప్రతికూల మార్గముల నాశ్రయించెదరు. నోటఁదినక ముడ్డినిదిందురు. నేను నీ ప్రశ్నల నాల్గింటికి జవాబిచ్చితిని. నీ వెవఁడవో యిప్పుడు నాకు నిజముగఁ జెప్పుము. లేకున్న నీతల తీసివేసెదను."

ఇది విని నాతఁడిట్లనెను :—"ప్రభూ! వాస్తవముగ నేను గలియుగమునే. ఇప్పుడు నాకు రాజ్య సమయ మాసన్నమైనది. కాని

సాక్షాత్తుగ ధర్మావతారులగు మీరు చక్రవర్తులగునంతవఱకు నాకు గతి లేదు, నా కధికారము లేదు. నే నడుగిడునది లేదు. మీరు ధర్మాత్ములరు. ఇతరుల భాగమును హరింపగోరరు కావున నిప్పుడు సింహాసనము నాకు లభింపవలెను ఇఁక నా సామ్రాజ్యము సాగవలయును"

ఇది విని నేను నవ్వుచు నిట్లంటిని:-"అరే! ధూర్తా! నీవధర్మ మిత్రుడవని నే నిదివఱకే తెలిసికొంటిని. ఇది నీ రాజ్యకాలమని నాకు తెలియును. కాని ఆనందకందుఁడగు దేవకీనందన శ్రీకృష్ణచంద్రుఁ డీ యవనీమండలమున నుండువఱకు నేనుసింహాసనమును వదలను. ఆతఁడు స్వధామమునకుఁ జేరినప్పుడు నేనుగూడ హిమాలయమునకుఁబోయెదను. అప్పుడు నీ యిష్టము వచ్చినట్లు చేసికొనవచ్చును. శ్రీకృష్ణుఁడుండఁగా నీవు నారాజ్యములో నుండవలెననియు ననుకొనఁగూడదు." నాయీ మాటనువిని కలియుగము ప్రసన్నుఁడై వెళ్ళిపోయెను.

కావున సోదరులారా! నేడాఁవిషయములన్నియుఁ బ్రత్యక్షముగఁ గనఁబడుచున్నవి. దీనినిబట్టి విశ్వనాథుఁ డీ విశ్వమును విధవనుజేసి స్వధామమునకుఁ జేరెనని తోఁచు చున్నది. శ్రీకృష్ణరహితమై, కలి యుగాక్రాంతమైన నీ యవనియ ందిఁక మనముండఁ జనదు. ఇఁక మనము హిమాలయమునకు వెళ్ళుదము.

ఇట్లు చెప్పుచు ధర్మరా జత్యంత చింతాకులుఁడై అశ్రువుల రాల్చెను. అతని ముఖమండలము వాడిపోయెను. అతఁ డత్యంత విషాద యుక్తుఁడై దీర్ఘ నిశ్వాసములు విడుచుచుండెను.

## ధర్మరాజునకు కనఁబడిన అపశకునములు

౪౮

శ్లో॥ ఇమే జనపదా గ్రామాః పురోద్యానా కరాశ్రమాః।
భ్రష్టశ్రియో నిరానందాః కిమఘం దర్శయంతి నః॥

—భాగ. ౧ స్కం. ౧౪ అ ౨౦ శ్లో.

"భీమసేనా! యీసమస్త దేశము, గ్రామ, పురోద్యానములు, ధాతునిలయములు, ఋష్యాశ్రమములు శ్రీహీనములై ఆనందరహితములై యున్నవి. ఇట్టియపశకునములు కనఁబడుచున్నవి. ఇవి దారుణ దుఃఖ వార్తను వినవలసి యున్నదని సూచించునట్లున్నది."

రాబోవు సమయ సూచన ముందుగానే తెలియుచుండును. చలి కాలము తర్వాత ఎండకాలము వెంటనేరాదు. మొట్టమొదట వణఁకు పుట్టునంత చలిగానుండును. క్రమక్రమముగాఁ బన్నీరు జల్లువలె మంచు బడుచు పగట కొంచెము ఉష్ణముగ నుండును. దీనిని బట్టి ప్రజలు చలి కాలము పోయి యెండకాలము వచ్చుచున్నదని గ్రహించెదరు. ఇదేవిధ ముగా వర్షాకాలము తర్వాత మొదట కొంచెము చలిచలిగఁ దోఁచు చుండును. ఇదివఱకు సహింపరాని తీక్షపుటెండ యిప్పుడు కొంచెము హాయిగనుండును. దీనినిబట్టి చలికాలము రానున్నదని ప్రజలు గ్రహింప గలరు. ఈ విధముగనే శుభాశుభ శకునములవలన జరుగఁబోవు శుభా శుభములను గనుఁగొనవచ్చును. శుభములు జరుగవలసి యుండిన శుభశకునములు కలుగును. అశుభములు జరుగవలసియుండిన అశుభ శకునములు కలుగును. అవిశ్వాసమువలన నేఁటివారీ శకునములమీఁద లక్ష్యముంచరు. పూర్వము శకునములను గాంచియే సర్వకార్యములు

జరుగుచుండెడివి. లక్ష్యపెట్టకున్నను అశుభశకునములు అశుభఫలముల నిచ్చితీరును.

ధర్మరాజు యీవిధముగా దుఃఖితుఁడై, చింతించుచు, విలపించు చుండుటను గాంచి భీమసేనుఁ డిట్లడిగెను :- "రాజా! మీరేయే యప శకునములను గాంచి యిట్లు చింతించు చున్నారు? మనమీఁద దండెత్తుటకు మనకు శత్రువులెవరును లేరే. చుట్టాలు పక్కాలంద ఱిదివఱకే నశించిరి. ఇఁక నున్నది మనమన్నదమ్ములమే. మనకైనను ఇంకె న్నాళ్ళో బ్రతుకవలెనని లేదు. అట్టియెడ మీరింతగాఁ జింతింపనేల?"

ధర్మరాజిట్లనెను :- "భీమసేనా! నాకు శత్రుచింత అణు మాత్ర మైన లేదు ఒక్కబాణముచేఁ ద్రిలోకములను భస్మము చేయఁగలిగిన భీష్మ, ద్రోణ, కర్ణాదులను మహాయోధులను జయింపగా నింకే శత్రువు మన కనిష్టము చేయఁగలుగును? నాకు మీ నల్గురు తమ్ముల అండ కలదు నాకు నా శరీర చింతయు లేదు. అది యేదియో యొక దినమునఁ జావనే చచ్చును. కాని నా చింత వేఱు. అది ఒక్క విషయమునఁ గలదు. తమ్ముఁడగు నర్జునుని నేను ద్వారకకుఁ బంపితిని. పంపిన కారణముకూడా పుణ్యశ్లోకుఁడగు వాసుదేవుఁడు ముందేమి చేయ నున్నాఁడో కనుఁగొని రమ్మనియే. అతఁడు వెళ్ళి ఏడవమాసము దాఁటి పోయినది అతఁడింకను రాలేదు. తనసంగతి దూతద్వారానైన కబురు చేయలేదు. ఈ విషయముననే నాకు మాటిమాటికి సందేహము కలుగుచున్నది. దేవర్షియగు నారదుఁడు భగవంతుఁడు తన నరలీలను ఉపసంహరింపఁ బోవుచున్నాఁడని నాతో నిప్పుడే చెప్పిపోయినాఁడు. అట్టిస్థితిని మనము కన్నులారఁ జూడరాదు. మన మీ భూమిపై నుండఁ గనే యాత్రైలోక్య సుందరవిగ్రహుఁడగు దేవకీనందనుఁడు తన యను పమ లీలావిగ్రహమును వదలి స్వధామమునకు వెడలిన నా దుఃఖ

వార్తను విన నేను సిద్ధముగలేను. ఇది మనము సహింపరాని దుఃఖము మన యీ శరీరములనుండి ఉచ్ఛ్వాస నిశ్శ్వాస రూపమున వెడలుచుండు నీ ప్రాణము నిజమగు ప్రాణముకాదు. మనకా వాసుదేవుఁడే ప్రాణము. మనకు లభించిన ధనము, రాజ్యము, ఐశ్వర్యవృద్ధి, కులప్రేమ, ప్రజాప్రేమ, శత్రువిజయము, యజ్ఞయాగాది క్రతునిర్వహణమువలన ఇహపరలోకప్రాప్తి ఇవన్నియు నాతని కృపవలననే లభించినవి. అతఁడు లేకపోయిన మనమేమి చేయగలిగెడి వారము? అతని సహాయము, సమ్మతి, కృపానుగ్రహాదులు లేకున్న మనమీదశలో నుండగలిగెడివారమేనా? అతఁడు మనలను వదలి వెళ్ళిపోవునేమోయని నాకు రోజుకు నాలుగు సారులు మనస్సుకు వచ్చుచుండును. అట్లు వచ్చినప్పుడు నా హృదయము చాల వ్యథచెందుచుండును. ఒకటి కాదు, రెండుకాదు అనేకములగు నాధ్యాత్మిక, అధిదైవిక, అధిభౌతిక అపశకునములు నాకుఁ దోఁచుచున్నవి."

భీమసేనుఁ డిట్లనెను:- "దేవా! మీ కే యపశకునములు గోచరించుచున్నవో తెలుపుఁడు. వినఁగోరుచున్నాఁడను."

ధర్మరా జిట్లనెను:- "పురుషులకు వామాంగములు అనఁగా కన్ను, భుజము, జంఘ మొదలగునవి అదరుట అశుభము. స్త్రీలకు కుడి యవయవయము లదరుట అశుభము. పురుషునకు ఎడమ కన్నుపై ఱెప్ప, కనుబొమ్మ అదరుట అశుభమే కాని క్రింది ఱెప్ప, బుగ్గకు పై భాగము అదరిన మిక్కిలి అశుభము. నాకిక్కడే మాటిమాటికి అదరుచున్నది."

భీమసేనుఁ డిట్లనెను:- "రాజా! కన్నదరిన ప్రజలు సాధారణముగ దానిఁమీద కొంచెముగ నుమ్మివైచి రాఁచెదరు. అప్పుడది అదరదు దానివలన ననిష్టము శాంతించునందురు."

ధర్మరాజిట్లనెను:— "నేనన్నియుఁ జేసిచూచితిని. కన్నదరుట ఆఁగలేదు. ఇంతేకాదు. హృదయముకూడ అకారణముగ నదురుచున్నది. మనస్సేలకో తికమకచెందుచున్నది?"

భీమసేనుఁ డిట్లనెను:— "ప్రభూ! ఒక్కొక్కప్పుడు మనోవిభ్రమము కలిగిన ఇట్లే యుండును. అర్జునుండు రాకపోవుటచే మీకిట్టి యనుమానము కలుగుచున్నది. ఆ కారణముననే మీ చిత్తము చంచలమైనది, మీ రా ఆనుమానిక శంకనువీడుఁడు. మంగళమయుఁడగు మాధవుఁడు మీకు సర్వ శుభములు చేకూర్పఁగలఁడు."

ధర్మరా జిట్లనెను:— "భీమా! సరియే నీవు చెప్పినట్లే అగునెడల నేనొప్పుకొనుటకు సిద్ధముగ నున్నాను; కాని నా శరీరములోనే కాదు బాహ్యమందును నిట్టి యపశకునములు కనఁబడుచున్నవేమి! నక్కలు రాత్రులందే సాధారణముగ నఱచుచుండును. కాని ఆఁడు నక్కలు తెల్లవారిన తర్వాత సూర్యునిజూచి అఱచుచున్నవి. కుక్కలు నావైపు మోరలెత్తుకొని నిర్భయముగ మొఱగుచున్నవి. ఎవరి ముఖము చూచి కుక్క ఏడ్చుచు అఱచునో వాని కేదియో గొప్ప యనిష్టము కలుగునని గ్రహింపవలెను."

శాస్త్ర మేమనఁగా—గోవు కుడిప్రక్కగాఁ బోవలయును కుక్క, నక్క, గాడిద, పంది మొదలగునవి ఎడమవైపుగాఁ బోవలయును. కాని ఎంతప్రయత్నము చేసినప్పటికిని గోవు కుడిప్రక్కగాఁ బోవుటలేదు. ఎడమవైపుగానే పోవుచున్నది. ఇదిగాక విపరీతముగ నింద్యపశువులు కుడిప్రక్కగా నిర్భయముగఁ బోవుచున్నవి."

భీమసేనుఁ డిట్లనెను:— "రాజా! దైవవశమున నిట్టియుండ వచ్చును. ఆటవిక జంతువుల కింతటి జ్ఞానమెచ్చటిది?"

ధర్మరా జిట్లనెను:— "అట్లు కాదు. మన అశ్వశాలలోని అశ్వ ములకెవరు నేర్పిరి? నేను మన సహదేవుని ద్వారా వాటినిగూర్చి చాల పరామరిక చేయించుచున్నాను. కాని అవి కన్నులనుండి నీరు గార్చుచు నేడ్చుచున్నవి. మృత్యుదూతలగు కపోతములు, గుడ్లగూబలు రాత్రియంతయు నా భవనముపైఁ గూర్చుండి కఠోరశబ్దములు చేయు చుండును. దీనినిఁబట్టి విశ్వప్రళయము కలుగునేమోయని తోఁచు చున్నది. దిక్కులంధకారమయములై యున్నవి. అవియన్ని యుధూమ్రమ మయములుగ నున్నవి. చుక్కలు రాలుచున్నవి. సూర్య చంద్రమండల ముల చుట్టును మండలములు కనఁబడుచున్నవి. భూమి మాటిమాటికి కంపించుచున్నది. పర్వతములు భూమిలో దిగబడి పోవుచున్నవి. అప్పుడప్పుడు అక్కడక్కడ భూమిలోనుండి అగ్ని యుప్పతిల్లుచున్నది. ఆ సమయములో నురుములు ఉరుముచున్నవి. మేఘములు బీభత్స దృశ్యములోఁ గనఁబడుచున్నవి. రాజ్యములో నచ్చటచ్చట రక్తవర్షము కురియుచున్నదని ప్రజలు చెప్పుచున్నారు."

భీమసేనుఁ డిట్లనెను:— "రక్తవర్ష మెట్లు కురియును?"

ధర్మరాజిట్లెను :— "నీటివర్షము కురిసినట్లే రక్తవర్షము కూడ ఆకాశమునుండి కురియును. ఇంటికప్పులపై రక్తము పేరుకొనును. పృథ్వి రక్తరంజితమగును ఇట్టి వర్షమును నేను స్వయముగఁ బోయి చూచితిని."

ఇంతేకాదు. ఆకాశమున నింక ననేకోత్పాతములు కలుగు చున్నవి. గృహములు కదలుచు నొకటొకటి ఢీకొనుచున్నవి. పగటనే భూత ప్రేతాదులు నృత్యము చేయుచుఁ గనఁబడు చున్నవి. భూమిలోపల నుండి మంటలు రేగుచున్నవి నద, నదీ, సరోవర, తటాకాది జలా శయములలోని నీరు కలతచెందుచున్నది. జనులందఱ మనస్సులలో నేదియో క్షయము కలుగుచున్నది."

భీమసేనుఁ డిట్లనెను :— "ఇట్టివి జరుగుచున్నవని మీ కెవరైనఁ జెప్పినారా? లేక మీరు స్వయముగ నీలక్షణములను గాంచినారా?"

ధర్మరా జిట్లనెను :— "కొన్ని విషయములు విశ్వసింపఁ దగినవారు చెప్పిరి. కొన్నిటిని నేను స్వయముగ గాంచితిని."

నేను సాయంకాలము, ప్రాతఃకాలము నిత్యము అగ్నిహోత్రము చేయఁబోవుదును. హోమాగ్ని ఎంత ప్రయత్నించినను ప్రజ్వరిల్లదు. మాటిమాటికి వినరి ఘృతాహుతులను వెయుచునే యుందును, దాని నుండి పొగ వచ్చును గాని మంటరాదు. ఒక దినముసఁగాదు. చాల దినములనుండి యిట్లు జరుగుచునే యున్నది. దీనినిఁబట్టి యీ కుటిల కరాళ కాలమేమి చేయనున్నదో యని నాకు సందేహము కలుగుచున్నది.

అశ్వశాలలలోని యశ్వము లేడ్చుటయే కాదు, గోశాలలోని గోవులుకూడ అట్లే యేడ్చుచున్నవి, దూడలను పాలకు వదలిన నవి పాలను ద్రాఁగవు. గోవులు పాలీయవు. ఎద్దులుకూడ మొద్దులవలె మందమతిగా నున్నవి. వాటికి గడ్డి, గాదము వేసిన ముట్టవు, కారణ మేమియో తెలియదు. వాటికేమి రోగ శోకములు కలిగినవో? ఒక్కసారిగా నిట్టి స్థితి యేలకలిగినది?

ఇదంతయు మానవ, పశుపక్ష్యాదులవిషయము. ఇంక నాశ్చర్యకర విషయములు కలవు. దేవతామూర్తులు కన్నులనుండి నీరు కార్చుచున్నవి. వాటి శరీరమునుండి చెమట వచ్చుచున్నది. అవి యేడ్చుచున్నట్లు కనఁబడుచున్నవి అవి బ్రదికియున్న ప్రాణులవలెఁ జైతన్యముగ నున్నవి. ఇవికాక ఇంక ననేకోత్పాతములు కనఁబడుచున్నవి. ధన ధాన్యాదులన్నియుఁ బూర్వరీతినే యున్నప్పటికి దేశ, గ్రామ,

పుర, పుష్పోద్యానాదులు, ఋష్యాశ్రమములు శూన్యములై శ్రీహీనములై కనఁబడుచున్నవి ఈ యుత్పాతములవలనను, అర్జునుఁడింకను రాక పోవుట చేతను భగవంతుని వజ్రాంకుశ ధ్వజారవింద చిహ్న చిహ్నిత శ్రీపాదస్పర్శచే సౌభాగ్య శాలియైన నీ పృథ్వి అభాగిని కాలేదు కదా యని మాటిమాటికి చింతించుచుందును. వాసుదేవ భగవానుఁడీ ధరా ధామమును వదలి పోలేదు గదా ?"

ధర్మరాజు మాటలను విని భీమసేనుఁడిట్లనియె :- "దేవా, ఇవి వాస్తవముగ ననిష్ట కరములగు అపశకునములే. ఇప్పుడు మన మేమి చేయవలయునో యేమియుఁ దోఁచుటలేదు మీరాజ్ఞ యొసంగిన నేను ద్వారకాపురికి పోయి సమస్త సమాచారమును గొనివచ్చెదను." ఇదివిని ధర్మరాజు చింతాకుల మనస్కుఁడై, తర్వాత నేమి చేయవల యునో తెలియక కూర్చుండి చింతించుచుండెను.

## ద్వారాపతినుండి అర్జునాగమనము

౪౯

శ్లో॥ ఇతి చింతయత స్తస్య దృష్టారిష్టేన చేతసా,
రాజ్ఞః ప్రత్యాగమ ద్బ్రహ్మన్ యదుపుర్యాః కపిధ్వజః ॥

—భాగ. ౧ స్కం. ౧౪ అ. ౨౧ శ్లో.

"మఱియు మహోత్పాతంబులు పెక్కులు పుట్టుచున్న యవి. మురాంతకుని వృత్తాంతంబు వినరాదని కుంతీసుతాగజుండు భీమునితో విచారించు సమయంబున"

క॥ ఖేదమున నింద్రసూనుఁడు
యాదవ పురినుండి వచ్చి యగ్రజుఁ గని త
త్పాదముల నయన నలిలో
త్పాదకుఁడై పడియె దీను భంగి నరేంద్రా ।

—శ్రీమదాంధ్ర భాగవతము.

మన మెవరినిగూర్చి చింతించుచుంటిమో అతఁడప్పుడే వచ్చి నెడల మన సంతోషమునకు అప్పుడంత ముండదు; కాని మన యను మానమునకుఁ దగినట్లే యాతఁడు దుఃఖితుఁడగుటను గాంచిన నిఁక మనకప్పుడు హర్షమునకు బదులు దుఃఖము కలుగును. ఈ భావము నకే హర్షవిషాద సాంకర్య భావమని పేరు. దీనిలో హర్షవిషాదములు రెండు నుండును చూచుటకు హర్షము నిశ్చితముగానే యుండును. కాని విషాద విషయమున శంక నిలిచియే యుండును. ఆ శంకా సమాధాన మునకే మనము ప్రత్యుత్తరమును ప్రతీక్షింపకమే తొందరచే చాల ప్రశ్నలు వేయుచుందుము అప్పుడు మన శంకల నన్నిఁటిని వెదలఁ గ్రక్కి ఆ శంకలలో నేదో ఒకదానికి అవుననియో కాదనియో జవాబు కావలెనని కోరుచుందుము.

ధర్మరాజు చింతితుఁడయ్యెను, దుఃఖించుచుండెను. అపశకునము లచే నాతని వ్యాకులత యెక్కుడయ్యెను. ఆ సమయముననే అర్జు నుఁడు వచ్చి యెదుట కనఁబడెను. అతఁడు వెళ్ళి యేడెనిమిది మాసము లైనది. ఆతని సుహృత్సంబంధులఁ జూచి వచ్చుచున్నాఁడు. ప్రాణాధికు లగు ప్రియబంధువులను చిరకాలము దర్శించి అచ్చటనే చాలకాలముండి వచ్చినాఁడు. ఈ కారణము లన్నిటిచే నర్జునుఁడు సంతోషముగ నుండి యుండవలయును. ఆతని ముఖమండలము ప్రేమప్రముదితమై యుండ

పలెను. అతఁడట్లు లేక దుఃఖితుఁడైనట్లు కనఁబడుచుండెను. ముఖము వాడి తేజో విహీనమై యుండెను. ముఖకాంతి మాసెను. అతఁడేదో గాఢచింతలో బడినట్లును, సంతాపముచే సంతప్తుఁడైనట్లుండెను. తన కమలనేత్రముల నుండి శోకముచే నుష్ణ నేత్రబిందువులను రాల్చుచు దీనవదనుఁడై తలవంచుకొని అర్జునుఁడు ధర్మరాజు చరణములం దువ్యాకులతతో బడెను. తనకు దుఃఖము కలిగినట్లే తనతమ్ముడుకూడ దుఃఖితుఁడగుటను గాంచఁగనే ధర్మరాజునకు నారద వాక్యములు స్మరణకు వచ్చెను. అతని హృదయము కొట్టుకొనుచుండెను. ద్వారకాపురిలో తన వారి క్షేమమును బేరు పేరు వరుసల నడిగెను.

ధర్మరాజు అర్జునుని శిరస్సునఁ జేయియుంచి యిట్లడిగెను:— "సోదరా! నీవిట్లు దుఃఖముతో నుంటివేల? దారిలో నేదైన దుర్ఘటన సంభవించినదా? అధిక వేగముగల రథముపై నీవు వచ్చుటచే అలసి పోతివా? ద్వారకలో మన బంధువులగు మధు, భోజ, దశార్హ, సాత్వతాంధక, వృష్ణి వంశ వీరులందఱును పరివార సహితముగాఁ గుశలముగ నున్నారా? యాదవు లందఱిలో శ్రేష్ఠుఁడును, జ్యేష్ఠుఁడునగు శూరుఁడు మంత్రి పురోహితాదులతోఁ గుశలముగ నున్నాఁడా? అతని రాజ్యములో దుర్ఘటన మేమియు జరుగలేదు కదా? మాననీయుఁడగు మన మామ వసుదేవుఁడు క్షేమమే కదా? అతని తమ్ముఁడును మనకు చిన్నమామయునగు దేవభాగుఁడు కుశలమే కదా! మన ధృతదేవుఁడు, శ్రీదేవుఁడు, దేవరక్షితుఁడు, సహదేవుఁడు, దేవకుఁడు, ఈ యేడుగురు పెద్దమామలును. కంసా, కంసవతి, కంకా, శూరభూ, రాష్ట్రపాలికా మొదలగు చిన్నత్తలు, వారి పుత్రులు, పుత్రబంధు సమేతముగ సుఖముగ నున్నారా?

ఎవని మాటమీఁద కోట్లకొలది యాదవులుందురో, ఎవని కుమా

రుఁడగు దుష్టకంసుని శ్రీకృష్ణుఁడు సంహరించి అతనిని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టెనో, అట్టి వృద్ధ పితామహుఁడును యాదవ మహారాజు నగు ఉగ్రసేన మహారాజు బాగున్నాఁడు కదా? దేవకీదేవి తండ్రియు, ఉగ్రసేనుని తమ్ముఁడును అగు దేవక మహారాజు నిరోగియై క్షేమముగ నున్నాఁడా? వీరందఱు చాల వృద్ధులై యుండవచ్చును. వీరి దర్శనము చేసియు చాల దినములైనది.

తమ్ముఁడా! నీవు మాటలాడవేమి? హృదీకుఁడున్నాఁడా? కృతవర్మ, అక్రూరుఁడు, జయంతుఁడు, గదుఁడు, సారణుఁడు, శత్రుజిత్తు వీరందఱు కుశలమేనా? మాననీయుఁడగు ముసలధారియగు బలరాముఁడు సుఖమేనా? ప్రద్యుమ్నుఁడు, అతని పుత్రుఁడగు ననిరుద్ధుఁడు వీరందఱ సమాచారమేమి? నాకు శ్రీకృష్ణ పుత్రుల పేరులే తెలియవు. ఒకరు ఇద్దరు అయినచో జ్ఞాపకము పెట్టుకొనవచ్చును. ౧౮౦౦౦ కేవలము శ్రీకృష్ణుని పుత్రులు. ఇఁక వారికిగూడ పుత్రపౌత్రులు కలిగి యుండవచ్చును. వీరందఱ పేరులెట్లు జ్ఞాపక ముంచుకొనఁ గలుగుదును? అయితే సుషేణ, చారుదేష్ణ, సాంబ ఋషభాదుల పేర్లు పది పదినైదు పేర్లు తెలియును. వీరందఱు వారి బంధువులతోఁ గుశలమేనా ?

నీవు వెళ్ళితివే. వారందఱు నిన్నెట్లు సన్మానించిరి? మమ్ములను గూర్చి వారేమడిగెడువారు? శ్రీకృష్ణుఁడు ఏదైన ప్రసంగము వచ్చినప్పుడు మమ్ములను నెన్నడైన స్మరించునా? లేదా? నీమనస్సక్కడ నుండగాఁ నానందముగ నున్నదా? శ్రీకృష్ణుఁడు మాకేమి సందేశము పంపినాడు? మన అవ్వలు, తాతలు, అత్త మామలు మాకేమియు యుపహారములను బంపిరి. ఈ విషయములన్నియుఁ జెప్పుము.

శ్రీకృష్ణుని కుశలమును నేనేమని యడుగుదును? అతఁడు కుశల స్వరూపుఁడే యయ్యెను. సమస్తానందములకును మంగళములకును అతఁ

డొక్కడే కదా నిధి. స్వర్గమునుండి పారిజాత వృక్షమును బెల్లగించుకొని వచ్చినవాని కుశలమును గూర్చి యడుగుట కుశలమును గళంకిత పరచుటయే కాఁగలదు.

ఎవ్వఁడు పరిపూర్ణమగు బ్రహ్మమయ్యు బ్రాహ్మణ భక్తుఁడయ్యెనో, ఎవ్వఁడు మానవ వేషమును ధరించియు మాయాతీత మహేశుఁడయ్యెనో, ఎవఁడు యదుకుల క్షీరసాగరమున ననంతావతారుఁడగు శేషుని సహాయమును గొనుచు సుఖముగాఁ ననునీయ క్రీడలొనర్చుచున్నాడో, ఆద్యంతములు లేని వాఁడును, తన్నాశ్రయించిన భక్తుల రక్షించుటయందు తత్పరుఁడగు వాఁడును, ఎవని కృపచే భూమిమీఁద నుండియు యాదవు లందఱు విష్ణుపార్షదులవలె వైకుంఠ సుఖముల ననుభవించుచున్నారో అట్టి శ్రీకృష్ణుని కుశలమును మర్త్యలోకములో మాయా మోహవ్యాప్తి చెందిన నేనేమని యడుగుదును?

అర్జునా! ఎంతటి యాశ్చర్యము! రాజులకు పది యిరువది మంది రాణులుండిన వారి నందఱను సమానముగ సంతుష్టులఁ గావించుట దుర్లభమగును. ప్రతిరోజును సవతులలో నేదియో కలహము పుట్టుచునే యుండును. ఒక్కొక్కచోట లాగి పీఁకు కొనుటయు జరుగుచుండును. కాని శ్రీకృష్ణునకు రుక్మిణి మొదలుకొని ౧౬౧౦౮ మంది రాణులు. అందఱు సంతుష్టులే. అందఱును శ్రీకృష్ణ చరణారవిందములందు ఒకరికి మించి ఒకరికి అనురాగ మధికము. స్వర్గాధిపతియగు దేవేంద్రుని రాణి శచీదేవికూడ అనుభవింపని దివ్యభోగములను వారనుభవించుచుండిరి.

శ్రీకృష్ణుని బలిగా గ్రహించి యారాణులందఱు నుప్పొంగి పోవుచుండురు. ఆ రాణులు నీతో మాటలాడు చుండుదురా? వినోదములలో వారు నిన్నుపహాసము చేయుచుందురా? నీవుండు చోటుకు శ్రీకృష్ణునితోఁ

జాలసారులు వచ్చుచుండురా? నేను బోయిన వారందఱు సిగ్గుపడెదరు. ముసుఁగులు వేసికొందురు. కాని వారంద ఱొక్కసారిగా నాభూషణములను ధరించి కదలి పోవుచుండిన మన్మథసేన తరలిపోవుచున్నదా యనునట్లుండును."

ఇంతగా అడిగినను అర్జునుఁడు పలుకక పోవునప్పటికి ధర్మరాజునకు సందేహమింకను అధికమయ్యెను. యాదవుల కుశలమడిగిన కొలఁది అతని ముఖమింకను వాడిపోవుచుండెను అందువలన నాతఁడు మరల నిట్లనెను:-"అర్జునా! నీవు పలుకుటలేదు నీవేల యిట్లేడ్చుచున్నావు? నేనెంతగాఁ అడిగినను నీవు యాదవుల కుశలము చెప్పవు. కారణమేమి? ఏ కారణము వలనైనను నీకును యాదవులకును జెడలేదు కదా? నీవు బొత్తిగాఁ దేజోవిహీనుఁడ వైనావేల? తనవారందఱిక్కడనుండి అచ్చటి వారుపేక్షించిన సాధారణముగ నట్లే యుండును. ద్వారకలో యాదవులు నిన్నుపేక్ష చేయకుండిన నీకెవరైన నవమానము కలిగించినారా? ఎవరో బయటవారవమానించిన నంతగా బాధయుండదు. బంధువు లయినవా రవమానించిన నా గాయము శస్త్రముచేనైన గాయముకంటె నెక్కుడుగ నుండును ఈ యవమానము చచ్చువఱకు మఱపునకు రాదు. దుర్భావయుక్తమగు నమంగళ వచనము హృదయమును ఛేదించుకొనిపోవును. ఆ చింతచే ముఖము సదా మ్లానముగ నుండును. ఆంతరిక పీడ శరీరమును వికృతము కావించును.

తేజోవిహీనమగుట కింకొక కారణము కూడ కలదు. ఒకానొకఁడు గంపెడంత యాశతో నొకకార్యము కొఱకు మనదగ్గఱకు వచ్చెననుకొనుఁడు, ఆ కార్యము నెఱవేర్చిపెట్టుటలో మన మన్ని విధముల సమర్థుల మనుకొనుఁడు. అట్టియెడ అతఁడు మనదగ్గఱకు వచ్చి సహాయము కొఱకై ప్రార్థించినాఁడనుకొనుఁడు, ప్రార్థనను విని

మనస్సు కరిగి సహాయము చేతుమని నమ్మించి నిశ్చింతగా నుండుమంటి మనుకొనుఁడు మనమాట మీఁద మనలను నమ్మి వారు నిశ్చింతగా నుఁడి కార్యము జరుగుననుకొన్నా రనుకొనుఁడు. కొంతకాల మైన తర్వాత లోభ వశముననో, ప్రమాద వశముననో వానికిల్లు చెప్పితిమనుకొనుడు. "అబ్బాయీ! మా వలన నీపని నెఱవేఱదు, నీ యిష్టమువచ్చిన వారి దగ్గఱకుఁబోయి నీవు చేయించుకొనవచ్చును. నా మీఁద మాత్రము ఆశ పెట్టుకొనకుము" అనిన నీ మాటకా యాశ పెట్టుకొన్నవాఁడు నిరుత్సాహము చెంది శాపము పెట్టిన, విశ్వాసఘాతమగుటచేఁ దన హృదయములో మాటిమాటికది పొడుచు చుండిన, నీకారణమున మానవుఁడు శ్రీహీనుఁడు కాంతిరహితుఁడు కాఁగలఁడు. నీ విట్టి పని చేయలేదుకదా?

ఇదేవిధముగా దుఃఖితులై బ్రాహ్మణుఁడు, బాలకుఁడు, గోవు, వృద్ధుఁడు, రోగి, స్త్రీ వీరిలో నెవరైన నిన్ను శరణువేఁడిన, వారిని రక్షింప సమర్థులమయ్యు, రక్షింపక తిరస్కారముగ విడిచి పుచ్చుచో వాఁడు కూడ తేజోవిహీనుఁడు భీభత్సుఁడు, కాఁగలఁడు.

నీ ముఖము వాడిపోయినది. ఎంత యడిగినను జవాబీయవు. ఇట్టిస్థితి యవమానమునఁ గూడ కలుగును. ఆంతరంగిక గ్లానిచేఁగూడా నిట్లుండును పాపకర్మచేఁగూడ నీస్థితి కలుగును. పొరపాటునైన నీవు అగమ్యాగమనము చేసి సంతానార్థమై వచ్చిన స్వభార్యను దిరస్కరించితివని నేను స్వప్నమునైన విశ్వసింపను. ఇట్టి కార్యము ఇదివఱ కెన్నడును జేయలేదు. నీవు ఇదివఱకు ధర్మము నెన్నడును వీడలేదు. స్వర్గములో ప్రేమరాశిఁగు ఊర్వశి స్వయముగ నిన్నుఁగోరఁగా నామెను 'తల్లీ' యని సంబోధించి సత్కరించితివి. అట్టివాఁడవు నీవు పరాయి స్త్రీని కన్నెత్తియైనఁ జూతువా? ఒకవేళ యిట్టిపాపము నీ వలన జరుగ లేదుకదా!

సోదరా! బలవంతుఁడగువాఁడు బలహీనునితోఁ బోరి యోడినను కాంతిహీనము కాఁగలఁడు. నీవు మహాభారత యుద్ధములో భీష్మ ద్రోణ కర్ణాదులవంటి మహారథులను గూడ పరాజితులఁ గావించితివి. నీ వెవరి చేతనో ఓడిపోవుట సంభవింపని పని.

మానవుఁ డింద్రియ వశీభూతుఁడై జిహ్వాచాపల్యవశమునఁ స్వాదిష్ట పదార్థములను దన యాశ్రమములో నున్న వృద్ధ, బాలకులకు మును ముందుగాఁ బెట్టక తాను దినుచుండినను మానవుని సద్గుణములన్నియు హీనములై పోవును. అట్టివాఁడు ప్రేతమువలె గనఁబడును. శాస్త్రములో జెప్పఁబడిన నింద్యకర్మలొనర్చినను మానవుని ముఖములో మలిన మేర్పడును. ఇట్టి కార్యమేదియు నీవు చేయలేదుకదా? నిశ్శంకుడవై నాతో నున్నదున్నట్లు చెప్పుము. నేను గొప్ప విద్వాంసులను శాస్త్ర వేత్తలను కర్మిష్ఠులను బిలిపించి దానికి ప్రాయశ్చిత్తము చేయించెదను.

ఇదిగాక నాకు చివర సందేహ మొకటికలదు. దానిని నేను జెప్పఁదలఁచుటలేదు. ఆశంక నిర్మూలమైవచ్చునట్లు భగవంతుఁడు చేయ వలయును. కాని అది నిర్మూలమైవచ్చునట్లు నాకు తోఁచుట లేదు. భయంకరోత్పాతములచేతను, గాలవైపరీత్యము చేతను, పృథ్వ్యంత రిక్షములందును ఆకాశమునను అపశకునములు గోచరించుటచేతను, ఉండి ఉండి ఆసందేహమే నాకు కలుగుచున్నది. నీకు పరమప్రేమా స్పదుఁడును, అభిన్నహృదయుఁడును, సుహృదుఁడును, సఖుఁడును, సారథియు, సంబంధియు, స్నేహితుఁడు నగు శ్యామసుందరుఁడు ఏడ్పు చున్న నిన్ను వదలి యీ ధరాధామమును వదలి స్వధామమునకు వెళ్ళి పోలేదు కదా? సోదరా! ఇదివఱకు నేను చెప్పిన కారణము లన్నియుఁ బ్రసంగవశమునఁ జెప్పినవి. ఇది తప్ప నీ హృదయమునకు వేఱు దుఃఖకారణము లేదని నా యంతఃకరణము నొక్కి చెప్పుచున్నది. ఇంతకు తప్ప వేఱుకారణము నాకు గోచరించుట లేదు. సోదరా!

ఇంకెంతవఱకు దాచెదవు? మర్మము విడిచి నిజము చెప్పుము. శ్యామసుందరుఁడు మనమేమి యపరాధము చేసినామని మనల నొంటరిగా నీ భూమిపై వదలి వెళ్ళిపోయినాఁడు? శ్యామసుందరుఁ డొక్కఁడే వెళ్ళినాఁడా? లేక ఇంకెవరైన వెళ్ళినారా? అతఁడు లేక యాదవు లెట్లుండఁగలరు? సోదరా! ఉన్నదున్నట్లుగాఁ జెప్పుమిప్పుడు."

ఇట్లు పలుకుచు ధర్మరాజు వెక్కి వెక్కి యేడ్వం బ్రారంభించెను. అర్జునుఁడు కూడా కేక వేసి బిగ్గఱగ నేడ్చెను. ఇదియే కారణమని అందఱును గ్రహించిరి. కావున పాండవులును, సభాసదులును శోక సంతప్తులై దీర్ఘ నిశ్శ్వాసములు విడుచుచు నుచ్చైస్స్వరమున విలపింప మొదలిడిరి.

## ప్రభు కృపను అర్జునుఁడు వర్ణించుట

### ౩౦

శ్లో॥ యత్ సంశ్రయాత్ ద్రుపదగేహ ముపాగతానామ్
రాజ్ఞాం స్వయంవరముఖే స్మరదుర్మదానామ్ ।
తేజో హృతం ఖలు మయాభిహతశ్చ మత్స్యః
సజ్జీకృతేన ధనుషాధిగతాచ కృష్ణా ।

—భాగ. ౧ స్కం. ౧౫ అ. ౭ శ్లో.

అర్జునుఁడు జ్యేష్ఠ భ్రాతయగు ధర్మజునితో శ్రీకృష్ణవియోగ వర్ణనము చేయుచు నిట్లనెను :— "రాజా? ఎవనికృపచే ద్రౌపదీ స్వయంవర సమయమున ద్రుపద సభాసమ్ముఖమున సమావేశమైన కామోన్మత్తులగు రాజుల తేజః ప్రభావమిలను నేను హరించితిని? ధనస్సునెక్కిడి

మత్స్యయంత్రమును భేదించి త్రైలోక్య సుందరి యగు ద్రౌపదిని మన మందఱము బడసితిమి! ఇంత చేయఁగలుగుట ఆయన నాశ్రయించుట చేతనే సుమా! ఆ శ్యామసుందరుఁడు మనల నందఱను వీడి స్వధామము చేరెను.

294.592 VEN

శ్రీ ఆంధ్రభాగవతము

హృదయము దుఃఖముచే నిండిపోఁగానే నోటమాటరాదు. వాక్ని రోధము కలుగును. హృదయము బద్దలగును. యథేష్టముగఁ గంట నీరు కార్చినను, తత్సంబంధమగు చర్చ జరిగినను, తద్యశోగానము చేసినను శోకము తగ్గి మనస్సు కొంతవఱకు కుదటబడును. అట్లే దుఃఖ సమయమున బంధువులువచ్చి యోదార్చిన నాసమయమున మృతి చెందినవాని గుణగానముచేయ మొదలిడుదురు:— "అతని విషయమున నేమిచెప్పుదును. అతఁడు మానవుడు కాడమ్మా. సాక్షాత్తుగ దేవత. మాకతఁడిది చేసెను. అది చేసె"నని చెప్పుకొనుచు శోకిత పురుషునకు అతని పరివారమునకు ధైర్యము చెప్పుదురు పరోక్షపురుషుని చర్చ జరిగిన చిత్తము తదాకారమగును. అక్షణమున వియోగానుభవము కలగదు. మనమాతని యెదుటఁ గూర్చుండి ప్రత్యక్షముగ మాట్లాడి నట్లుండును, అందుకనియే శాస్త్రకారులు మాటిమాటికి భగవద్యశోగుణ గానము, నామ గుణ కీర్తనములకు మిక్కిలి బలమిచ్చినారు. లీలా కథారస నిషేవణమునఁ దప్ప భగవచ్చరణారవిందములందు ప్రీతి కలుగుటకు ఇంకొక సరళ, సుగమ, సర్వసమ్మతమగు నుపాయము లేదనిరి. పరస్పరము అతని చర్చయే చేసికొనవలయును, అతని గుణ ములనే గానము చేయవల్లయ్యును. అతనిలోనే రమింపవలయును.

Acc No 5218

ధర్మరాజు మాటిమాటికి ప్రశ్నించుచు, అనేకములగు ననుమాన ములను వ్యక్తపఱచు చుండునప్పటికి అర్జునుని దుఃఖమింకను నధిక మయ్యెను. అతఁడు దీర్ఘనిశ్వాసములు విడుచుచు దుఃఖవ్యాకులుఁడై, ముఖము బదలిక చెంది, హృదయ కమలము ముకుళితమై వాడిపోయి.

నట్లుండెను. శరీరకాంతి మాసెను. ఆతఁడు సర్వాంతర్యామి. ప్రభు ధ్యానమును జేయుచుఁ బ్రేమసాగరములో మునిఁగిపోయెను. ఆతనికి బాహ్య జగత్తేమియుఁ దెలియుటలేదు. అతఁడు ధర్మరాజు ప్రశ్నలకేమి జవాబీయఁ గలఁడు ?

శోకవేగము కొంచెము తగ్గగానే చిత్తవృత్తి భగవద్ధ్యానము నుండి కొంచెం తొలఁగి యీలోకములోనికి వచ్చెను. అంత నాతఁడు అశ్రువులను జేతులతోఁ దుడుచుకొనెను. ఆసమయమున నాతని కను రెప్పల క్రింద ఎఱుపెక్కెను శ్రీకృష్ణు డంతర్హితుఁడగుటచేఁ బ్రేమో త్కంఠతచేఁ గాతరుడగుటవలన నాతఁడు మాటాడఁ దలచినను మాటాడ లేకపోయెను. అతఁడు శ్యామసుందరుని త్రైలోక్య పావనమును ముని మనోహారిణియగు మనోహరమూర్తిని స్మరింపగానే యాతని హృద యము దుఃఖముతో నిండిపోయి కంఠము గద్గదమగుచుండెను. ఆతనికి శ్రీకృష్ణసాహచర్యము, స్నేహకార్యములు జ్ఞాపకమునకు రాఁగానే వికలుఁడగు చుండెను. ఈవిధముగ నాతఁడు చాలసేపున్న తర్వాతఁ జాల కష్టముమీద ధైర్యము వహించి గద్గద కంఠముతో ధర్మరాజుతో నిట్లనెను :- "రాజా! శ్రీకృష్ణుఁడు విశ్వాసఘాతము కావించినాడు"

ధర్మరాజు చకితుఁడై సంభ్రమముతో నిట్లనెను:— "అన్నివిష యములను జెప్పుము, ఏమైనది? భగవంతుడు గొప్ప భక్తవత్సలుఁడు."

రోదనము చేయుచు నర్జునుఁడిట్లనెను:— "భక్తవత్సలుఁ డెచ్చట నున్నాడు? భక్తవత్సలుఁడే యగునెడల పాపినగు నన్ని ధరాతలమున నిట్టొంటిగా వదలి తానొక్కఁడు స్వధామము నకుఁ బోవునా?"

ధర్మరాజు సింహాసనమునుండి క్రిందకుపడి యిట్లనెను:- "హా! శ్యామసుందరా! నిజముగ నీవీ ధరాధామమును వదలి వెళ్ళిపోయితివా!"

ధర్మరాజు క్రిందకు పడిపోవుటను గాంచి మంత్రి సచివాదులు

జాగ్రత్తగఁ బట్టుకొని లేవనెత్తి మరల సింహాసనమునఁ గూర్చుండ బెట్టిరి. యుధిష్ఠిర మహారాజు బాలకునివలె విలపించుచు నిట్లనెను:- "అర్జునా! అర్జునా! నీవు శ్యామసుందరుని వృత్తాంత మంతయుఁ జెప్పుము. అతని పావన కథలను జెప్పి నా సంతప్తహృదయమును కొంచెము సేపు శీతలము కావింపుము నా హృదయము వజ్రముతోఁ జేయఁబడినది. శ్రీకృష్ణుని వియోగవార్తను వినియు బ్రద్దలు కాలేదు. ఇది ముక్కలు ముక్కలేల కాదు? ఓరీ! తమ్ముఁడా! నీవు మహాభారత యుద్ధములోఁ జూపిన బలమేమై పోయినది? అక్కడ ఉండియు నీవేమియుఁ జేయలేక బోయితివా?"

కన్నుల నీరు గార్చుచు గద్గద కంఠముతో నర్జునుఁ డిట్లనెను :- "నా తేజమెచ్చట నున్నది? అదంతయు నాతని విభూతి అతఁడే నా శరీరములోఁ బ్రవేశించి సమస్త కార్యములు చేయించినాఁడు. అతని తోడనే నా తేజముకూడా పోయినది. నేనిప్పుడు నిస్తేజుఁడను. నాలో నిప్పుడు బలపరాక్రమము లేవియును లేవు. నేను శవసమానుఁడ నైతిని. నేనే యననేల? సమస్తలోకమును శ్రీకృష్ణుఁడు లేక శవము వలె నున్నది. నిర్జీవప్రాణివలె నైనది. నామీఁద నాతని కెంతటి కృప యుండెడిది! నన్నెంతగాఁ బ్రేమించెడువాఁడు! మొట్టమొదటగా ద్రౌపదీ స్వయంవరమున వాసుదేవుని దర్శనము నాకైనది జలములచే నిండిన కారుమేఘము విద్యుత్పుంజముచే శోభించినట్లు, అతఁడా స్వయంవర భవనమున బలరామునితో గూడి శోభించెను. అసంఖ్యాకములగు తారలలోఁ చంద్రుఁడు శోభించినట్లు, ఆ రాజమండలిలో నాతఁడు వెలిఁగెను. అత్యంత ప్రేమమయ దృష్టులతో నాతఁడు బ్రాహ్మణ వేషములతోనున్న మనలను జూచుచుండెను. అతని దృష్టులలో నింద్రజాలము కలదు. నేనాతనివైపు ఆకర్షింపఁ బడితిని అతఁడుకూడ తన ప్రేమ నంతను బుంజీభవింపఁజేసి యా నిండుసభలో నాపైఁ బఱపెను.

ద్రౌపది త్రైలోక్యసుందరి. గొప్ప బలవంతులగు రాజులందఱు నామెను బొందవలెనని గట్టిగాఁ బ్రయత్నించుచుండిరి. యంత్రమునఁ గట్టఁబడిన చేఁపను గొట్టుటకు అందఱు నొకరినిమించి మఱియొకరు వ్యగ్రులై యుండిరి. అయోనిజయగు ద్రౌపది తమకే లభింపవలెనని ప్రతివానికి ఆశ. త్రిభువన సౌందర్యవతియగు ద్రౌపదిని జూడఁగానే అందఱ చిత్తములు చంచలములయ్యెను. పంచశరుఁడు తన పుష్పాయుధములచే నందఱను గొట్టుచుండెను. మత్స్యయంత్రమును గొట్టుట కృష్ణునకేపాటి కార్యము? బృహత్సేనుని పుత్రియగు లక్షణను వివాహము చేసికొనుట కిట్టియంత్రమునే యాతఁడు భేదించియుండెను ద్రుపద సభాభవనమునఁగల యంత్రమట్లే బయటకుఁ గనబడుచుండును కాని బృహత్సేనుని సభాభవనమునఁగట్టఁబడిన యంత్రము గిఱ్ఱునఁ దిరుగుచుండును. దాని ఛాయ మాత్రము జలములలోఁ బడును. ఛాయను జూచి లక్ష్యమును భేదింపవలయును. ఆ స్వయంవరమునకుఁ గూడ రాజులందఱు వచ్చిరి. నేను నచ్చట నుంటిని. ఎవ్వరు నా లక్ష్యమును గొట్టఁజాలకపోయిరి. నేను లేచితిని కాని నా బాణముకూడ లక్ష్యమును దాఁకుచుఁ బోయినది. అంత శ్రీకృష్ణుఁడు లేచి నిమిషములో ఛాయనుజూచి బాణముతో దానినిఁగొట్టెను. అతనికా కార్యములోఁ బ్రయాస మేమియుఁ దోచలేదు. అట్టివానికి ద్రుపద సభాభవనమున లక్ష్యమును భేదించుట ఏపాటి పని; కాని యాతఁడు దానిని గొట్టవలెనని మనస్సునసైనను జింతింప లేదు, త్రైలోక్య సుందరియగు ద్రౌపది మనకు భార్యకావలెనని యాతని కోరిక. అందఱ సమ్ముఖమున మనలను విజయులఁ జేయుట కాతఁడు నడుము కట్టుకొనెను. అతఁడు మాటిమాటికి మనవైపు చూచుచు, దగ్గఱ కూర్చుండిన బలరాముని చెవిలో నేదియో చెప్పుచు, సైగలద్వారా మనవైపు చూచుచుఁ జెప్పుచుండెడువాఁడు. మనమామ వసుదేవుని కుమారుఁ డాతడేనని

అప్పుడు గ్రహించితిని. ఆ నిండుసభలో నేను నా సర్వస్వము నాతని శ్రీచరణములకు సమర్పించితిని.

రాజులందఱు లక్ష్యభేదము చేయలేకపోవుటను గ్రహించి బ్రాహ్మణు లందఱు ప్రోత్సాహముచే బ్రాహ్మణులలో గూర్చుండిన బ్రాహ్మణ రూపధారినైన నేను లేచితిని. నేను లోలోన నాప్రాణధనము లన్నిటిని శ్యామసుందర చరణారవిందముల సమర్పించితిని. అతఁడు ప్రేమతో నన్నుఁగాంచి హృదయపూర్వకముగ నా మేలును గోరెను. ఈ భిక్షుక బ్రాహ్మణుఁ డింతటి దుస్సాహసము చేయుచున్నాఁడేమియని రాజులు భేదింపలేని లక్ష్యమును నిరంతరము వేదాధ్యయనము చేయుచు దిరుగు అనాధ భిక్షుక బ్రాహ్మణుఁ డెట్లు భేదింపఁగలుగునని వారి యాశ్చర్యము. నేను శ్రీకృష్ణ కృపాబలమున నెవరిమాటలను లక్ష్య పెట్టక, అందఱుఁ జూచుచుండఁగనే లక్ష్యమును భేదించి రాజులందఱ శిరములఁ దాలఁదన్ని నేను ద్రౌపదినిగొని సభామండపము బయటకు వచ్చితిని.

అప్పటికి మీరు వచ్చివేసితిరి. నేను విజయుఁడ నగుటను గాంచి రాజులందఱు నా మీఁద విరుచుకొని పడిరి. భీమసేనుఁడు వెంటనే అక్కడనుండి ఒక గొప్పవృక్షమును బెల్లగించి దానితో రాజులను బాదఁ బ్రారంభించెను. ఆ కార్యమును జూచి శ్రీకృష్ణుఁ డెంత సంతో షములో నిండిపోవుచుండునో నేనావైపున జూచుచునే యుంటిని. అతఁడు మాటిమాటికి మమ్ములను బరిచయము కావించుచుండెను. శ్వేతవస్త్ర మును ధరించి నావెంట వచ్చుటను, ఆమె నామెడకు వేసిన మాలను గాంచి అతఁడు ఆనందమున నృత్యము చేయుచుండెను. అతఁడు కను ఱెప్ప వాల్చక మాయనుపమదాంపత్యమును గాంచి మురిసియు చుండెను.

రాజులనందఱ నోడించి మేము ద్రౌపదిని దీసికొని మా వాస స్థానమగు కుమ్మరివాని యింటికి వచ్చితిమి. అది రాత్రివేళ. నేను

శ్యామసుందర మధురమూర్తినే చింతించుచుంటిని, ఇంతలోనే యాతఁడు బలరామునితోఁ గలసి పద్మమాలను, పీతాంబరమును ధరించి మన దగ్గఱకు వచ్చెను రాఁగానే యాతఁడు కుంతీదేవి పాదము లంటి, తర్వాత మీపాదములమీఁద బడి యెంతో మమకారముతో నిట్లనెను:- "రాజా? నీవు నన్నెఱుఁగవు ఇదివఱకు నన్నుఁజూడలేదు. నేను వసుదేవుని కుమారుఁడగు శ్రీకృష్ణుడను. మీకంటెఁజిన్నవాఁడను" అప్పుడు మీరు మిక్కిలి ప్రేమతో గౌఁగలించుకొంటిరి, అతఁడమాయకపు బాలునివలె బెరుకులేక తన యవయవములను ముడుచుకొని మీ కౌఁగిలిలో నిమిడెను. అంత నేను లేచి యాతనికిఁ బ్రణామము కావించితిని తన విశాల బాహువులతో నన్ను పట్టుచు, గట్టిగాఁ గౌఁగిలించుకొనుచు మందహాసము చేయుచు ద్రౌపదిని జూపించుచు వినోదముగ నిట్లనెను:- "అబ్బాయీ! పిల్లయా నల్లనిదే కాని చక్కనిది తెలివికలది. మీ దాంపత్యము వర్థిల్లి బాగుగా ఫలించుగాక!" ప్రథమ సమావేశముననే యింతటి మమత్వము యింతటి వాత్సల్యము నేనింతవఱకీ మానవలోకములోఁ జూడలేదు. ఆ సమయమున దొంగవలెనిట్లనెను: "ఇప్పుడిఁక మేము వెళ్ళెదము. మీ యందఱముం దిప్పుడే ప్రకట మగుట ఉచితముకాదు. ఇప్పుడే ప్రకట మగునెడల మన కందఱకు అపాయము కలుగవచ్చును."

"రాజా! ఆ చరాచరస్వామికి ఎవరివలన నేమిభయము? అతఁడు మనుష్యునివలె నటించెను. తన భక్తవత్సలతను జూపించెను. మనమీఁద సాంసారికముగ సంబంధమున్నట్లు గుర్తు చూపించెను. అతని కృపచే మనమందఱము ద్రౌపదిని బడసితిమి. ద్రుపద మహారాజు సంబంధముచే మనకు మనపైతృక రాజ్యముకూడ లభించెను. భగవత్కృప లేక యుండిన మనకు రాజ్యము నిచ్చునదెవరు? ఈ విధముగ భిక్షకుల వలె వన,పర్వత, దుర్గనగరాదులలోఁ దిరుగు మనకు ఆ సర్వేశ్వరుఁడు

రాజ్యమిప్పించి ఛత్రపతి సామ్రాట్టులను గావించెను. మన మందఱము దేవతలు స్వర్గములోవలె నింద్రప్రస్థములో నివసించుచున్నాము.

ద్రౌపదీదేవి, మీరు ఏకాంతమున నుండు భవనములోనికి గోబ్రాహ్మణ రక్షణ నిమిత్తమై అస్త్రములు కొనిరాఁగా, అది నియమ భంగమగుటచే నిశ్చయాను సారముగ ద్వాదశ వార్షికములు నేను వన వాసము చేయవలసి వచ్చినది. ఈ సందర్భమున నేను ద్వారకకుఁగూడ పోయితిని. అచ్చట శ్రీ కృష్ణుని చెల్లెలగు సుభద్రకు నాకు మనసుకుదిరినది. సర్వాంతర్యామికి తెలియని దేమున్నది? ఈ సంగతి కూడ అతనికి తెలిసి నది. అతని యన్న బలరాముఁడీ సంబంధమున కంగీకరింపఁడని యాత నికిఁ దెలియును. అతనికి దుర్యోధనుని కీయవలెనని యుండెను. కాని శరణాగత వత్సలుఁడును ఆశ్రితజనముల కోరికలఁ దీర్చువాఁడు నగు దేవకీనందనుడు నవ్వుచు నాచెవిలో నిట్లనెను:— "నీవు మెల్లగా నా చెల్లెలగు సుభద్రను హరించుకొని పొమ్ము. ఇంతేకాదు, అతఁడు తన రథమును గూడ నాకిచ్చెను. అహా! అతని కృపాళుతా వర్ణన మెంతని వర్ణింపఁగలను? అతనిదయ, అనుకంప, అనుగ్రహమును గూర్చిన కథ లెన్నని చెప్పుదును? నేను చెప్పిన నేమైనను సరేయని నవ్వుచు నంగీ కరించును. నేను చెప్పినదానికి కాదనుట అతనికి తెలియదు. చివరకు నన్నిట్లు మోసముచేసి పోవునని నాకేమి తెలియును? నేనిట్లేడ్చుచుండ నాతఁడు నన్నొంటిగా వదలి అతఁడొంటరిగా స్వధామమునకుఁ బోయి నాఁడు మొన్న మొన్న నేను వెళ్ళినప్పుడు కూడ అతఁడు నన్నెంత ప్రీతిఁగ జూచినాఁడు! అతని విషయములు నాకొక్కొక్కటి జ్ఞాపకము నకు వచ్చి నాహృదయము శూలమువలె గుచ్చినట్లే బాధపెట్టుచున్నది. రాజా! ఇఁక లోకములో నుండరాదు."

ఇట్లు పలుకుచు నర్జునుఁడు మరల భగవద్విషయములు లీలలు హృదయపటలమున నంకితమగుటచే వివిధవిధముల విలపింపఁ జొచ్చెను.

## ఖాండవ దహనమునఁ గృష్ణకృప

౨౧

శ్లో॥ యత్సన్నిధావహము ఖాండవ మగ్నయేఽదా
మింద్రం చ సామరగణం తరసా విజిత్య।
లబ్ధా సభా మయకృతాద్భుత శిల్పమాయా
దిగ్భ్యోఽహరన్ నృపతయో బలిమధ్వరేతే॥
—శ్రీభాగ. ౧ స్కం. ౧౫ అ. ౮ శ్లో

"కం॥ దండి ననేకులతో నా
ఖండలుఁ దెదురయిన గెలిచి ఖాండవ వనముం
జండార్చికి నర్పించిన
గాండీవము నిచ్చెఁ జక్రి గలుగుట నధిపా.

కం॥ దిక్కుల రాజుల నెల్లను
ద్రిక్కించి ధనంబుఁగొనుట మయకృత సభ ము
న్నెక్కుట జన్నము సేయుట
నిక్కము హరి మనకు దండ నిలుచుట గాదె

కం॥ మన సారథి మనసచివుఁడు
మన వియ్యము మనసఖుండు మనబాంధవుఁడున్
మన విభుఁడు గురుఁడు దేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా"
—శ్రీమదాంధ్ర భాగవతము.

ధర్మరాజు దుఃఖమున కంతు కనఁబడలేదు. నీరులేని బురద గుంటలోని చేఁపలెట్లు సూర్యకిరణములచే సంతాపమును జెంది తరపడ క్కొట్టుకొనునో అట్లే ధర్మరాజుకూడ కృష్ణవియోగముచేఁ గొట్టుకొను చుండెను. అర్జునుఁ డూరకున్న తర్వాత నాతఁ డిట్లనెను:- "సోదరా అర్జునా! నీవు దేవకీ నందనునకుఁ బ్రియ సఖుఁడవు. అభాగ్యుఁడనగు నన్నాతఁ డెక్కువగ గౌరవించెడువాఁడు; కాని నీవాతనికి అభిన్న హృదయుఁడవు. అతఁడు నీదగ్గఱ నేమాత్రము సంకోచములేక మెలఁ గెడువాఁడు. అతఁడు వెళ్ళినచోటకు నిన్నుఁ గొనిపోయెడివాఁడు నీవు లేక అతఁడొంటరిగాఁ దిననైనఁ దినెడువాఁడు కాఁడు నీవాతని చరి త్రను జెప్పి భావజగత్తులో నాతని సాక్షాత్కారము కావించు చున్నావు. కాఁబట్టియే మనమింతవఱకు బ్రదుకఁగలుగుచున్నాము. ఇప్పుడు మన కాతని స్మృతి మాత్రామే ఆధారముగ నీ లోకమున నిలిచినది. ఆతని లీలాస్మరణము వలననే మన మేదోవిధమునఁ బ్రాణములఁ నిలుపుకొనఁ గలము తమ్ముఁడా! నీ వూరకుండఁబోకుము. ఆతని స్మృతి కలుగఁ జేయుము. ఆతని గుణగానము చేయుము. ఆ మూలమున నా శోక సంతాపములు కొంచెముగ తగ్గుచున్నవి. ధ్యానములో నే నా నంద నందనుని దర్శనము చేయుచున్నాను ఆతని వియోగ దుఃఖము ఆతని లీలాశ్రవణముచే విస్మృతమగు చున్నది. కావున నాతని గూర్చి యింకొక విషయము చెప్పుము. అన్య విషయము లక్కఱలేదు. నిద్ర నేత్రములనుండి పోయి భగవంతుని వెదుక పోయినది. ఈ శోక పూర్ణ మగు రాత్రి నెట్లో జరుపవలయును. ఇంకేమైన పనులుండిన రేపు ప్రొద్దున చేసికొన వచ్చును. ఉదయాచలమునుండి భువన భాస్కరుఁ డుదయించఁగానే భవిషత్కార్యక్రమమాయెనే జెప్పఁగలఁడు. అంత వఱకు నీవు త్రైలోక్య పావనుఁ డగు ద్వారకానాథుని గూర్చిచెప్పు చుండుము."

ధర్మరాజిట్లని యూరకుండెను. ధర్మరాజుని తమ్ములు, మంత్రులు, ప్రధానులగు నధికారులు వేయేల సందఱును పాషాణ ప్రతిమలవలె శోక సంతప్తులై నిశ్చల భావముతోఁ గూర్చుండిరి. వారు కాలకృత్యములు, స్నానసంధ్యాదులు, ఆహార పానీయములను మఱచిరి. వారందఱు అశ్రువులను గార్చుచు నర్జునుఁడు చెప్పు శ్రీకృష్ణ కృపాకథను వినుచుండిరి. కన్నుల నీరు తుడుచుకొని, చీదుకొని గొంతు సవరించుకొని దుఃఖించుచు నర్జునుఁ డిట్లనెను:- "రాజా! ఒక్కటైనఁ జెప్పఁగలను. నా రోమరోమములందు ఆతని యనంతోప కారములు నిండియున్నవి. ఒక్కొక్క రోమమునకు కోటి జిహ్వలుండి కల్పాంతము వఱకు వర్ణించినను ఆతని యుపకారములు తరుగవు బ్రహ్మాది దేవతలకుఁగూడ దుర్లభములగు లీలలను, దృశ్యములను ఆతఁడు చూపించెను. ఇంద్రాగ్ని వాయువులు మొదలగు దేవతలు ఆతని సమ్ముఖమున చేతులు జోడించి నిలుచుండెదు వారు. బాలుఁడు కాగితపు బొమ్మలతో నాడుకొనినట్లు వారి నొక్కొక్కప్పుడు కాగితము నూదిపార వేసినట్లు ఊదిపార వేసెదువాడు ఒక్కొక్కప్పు డాకాశమున కెక్కించెదువాడు' బొమ్మలను జేయుట ఆతని కాట. వాటి నెగుర వేయుట. ఆడించుట ఉబ్బించుట, త్రిప్పుటగూడ ఆతని కాటయే. వాటిని పగులగొట్టినప్పుడు కూడ ఆతనికి మనో రంజనమే. శబ్దముచేసి పగిలిన పకపకనవ్వుచుఁ జూచుచుండును. అట్టి స్థితిలోఁగూడ నాతనికి శోక సంతాపములు లేవు ఒక విధమగు నానందమునే యనుభవించును. దేవతలాతని మానుష రూపమునుజూచి మోహములోఁబడి, అప్పుడప్పుడు సాధారణ మనుష్యుఁడుగ వ్యవహరించుచుందురు. ఆ సమయమున నాతఁడుకూడ సామాన్య మానవునివలె వ్యవహరించును. అట్టి చేష్టలనే చూపించును. దీనివలన నాతనికి మానవీయ లీలలు మిక్కిలి సుఖప్రదముగను, సరసముగను ఉండును. మానవీయ భావములతో దివ్యలీలలు ప్రకట మగుచుండును.

మీకు జ్ఞాపకముండవచ్చును. మీయాజ్ఞను గొని మే మొకసారి యమునా తటమునకు వినోదార్థము జల క్రీడలకై వెళ్ళియుంటిమి. ఏకాంతమున నన్ను నాతఁడెంతో ప్రేమించెను. తన అపార ప్రేమచే నన్నాచ్ఛాదించెడువాఁడు. నే నా ప్రేమ ప్రవాహములో నన్ను నేను మఱచునట్లు కొట్టుకొని పోయెడివాఁడను. అతఁడు స్నేహవశమున చాల మంది నట, నర్తక, గాయక, దాస, దాసీజనములను నా వెంటఁ బంపెడువాఁడు. కాని నా కివేమియు సంతోషముగ నుండెడివి కావు. నా సంతోషమునకాధార మా ప్రసన్నముఖుఁడగు మదన మోహనుఁడే. యమునా తీరమునకు వెళ్ళి మేసుందఱమును యథేష్టముగ వినోదములు కావించితిమి అతఁడు నన్ను యమునానదిలోనికిఁ గొనిపోయి చాలసేపటివఱకు జలక్రీడా వినోదములో మున్చెను. నాతో పందెము వేసి యీదును. నా మీఁద జలములఁ జిమ్ముచుండును. నీరుకొట్టి నన్నా కుల పఱచును. అప్పుడు నేనతనిఁ గట్టిగాఁ బట్టుకొనెడివాఁడను, ఆహా! ఆతని స్పర్శ యెంత సుఖకరముగ నుండెడిది! అతని శ్రీయంగముల కాంతి యెంత ఆనందకరమైనది! ఆ దినములిప్పుడు స్వప్న తుల్యము లయ్యెను. ఆ విషయములు పూర్వజన్మ విషయములవలె దోఁచు చుండెను.

జలక్రీడ చేయుచుఁ జేయుచు నలసిపోగా నాతఁడు స్నేహభరిత వాక్కులతో నిట్లనెను:— "అర్జునా! ఈ గుంపులో నా మనస్సానందము చెందుటలేదు. వెళ్ళుదము పద, ఏకాంతమునకు వెళ్ళి కూర్చుందము."

"గ్రుడ్డివాఁడా! గ్రుడ్డివాడా! నీకేమి కావలయునురా? యనినఁ జూచుటకు కన్నులు కావలయు" నన్నట్లు నేను నదే కోరుచుంటిని. నన్నుఁ దీసికొనిపోయి అతఁడొక నికుంజములోఁ గూర్చుండెను. నా

తొడమీఁద నాతని శిరముంచి పరుండెను. అమృతమయ దృష్టిని నా దృష్టియందు బఱపి, నా హృదయములో, ప్రేమరస సంచారము కావించుచు, ననేక రహస్యవిషయములను జెప్పుచు నాతఁడు నాకీ భూమి మీఁదనే వైకుంఠలోక సుఖముల నొసంగెను. మనసొక్కటైన మిత్రత లభించిన వాని అదృష్టమే అదృష్టము. ఒకఁడు తనమిత్రునకు అంతరంగిక రహస్యవిషయములు చెప్పుచుండిన నప్పుడు లోకమంతయు మఱపునకువచ్చును. ఈ లోకమున కావలనున్న సుఖమయమగు భావమయ జగత్తులో ఆ మిత్రులిద్దరు సంచారము చేయుదురు. నేనుగూడ అట్టి యనుపమప్రేమ రసాస్వాదనము చేయుచున్న సమయములో తాటి పొడవు కలిగి, పరమతేజస్వియై, యెఱ్ఱనిమీసములు, గడ్డములు కలిగిన బ్రాహ్మణుఁ డొకఁ డచ్చటికి వచ్చెను. ఆ సమయమున నా బ్రాహ్మణుఁడు వచ్చుటచే రసభంగమయ్యెను. రసభంగమువలన నేకత్వములో ద్వైతము ప్రవేశించెను. నిస్సంకోచములో సంకోచము ప్రవేశించుటచే నంతయు వికలమయ్యెను. మేమిద్దరమును బ్రాహ్మణుని సన్మానించుటకు లేచి నిలువఁబడితిమి. రాఁగానే యాతేజస్వియగు బ్రాహ్మణుఁ డిట్లనెను:— నేను చాల ఆఁకలి చెందియున్నాను. నాకేదైన దిన నాహార మీయవలయును."

నేనిట్లనఁబోవు చుంటిని:— ఓ భూసురోత్తమా! భోజనముకొఱకు మీరు మా ఐకాంతిక రసమునకు విఘ్నమేల కావించితిరి ? మా సేవకులవద్ద కావలసినంత భోజనమున్నది. వారినడుగ వచ్చునే!' ఇంతలో శ్రీకృష్ణుఁడు వారింపఁగా నేనేమియుననలేదు. అంత భవభయహారియు, మేఘశ్యాముఁడు నగు నా కృష్ణుఁడు మేఘగంభీరస్వరముతో నా బ్రాహ్మణునితో నిట్లనెను :— "విప్రోత్తమా ! నీవు సాధారణ బ్రాహ్మణుఁడవుగఁ గనఁబడుట లేదు, సాధారణమగు భోజనములో నీకు తృప్తియగునట్లు లేదు. కావున ముందు నీకెట్టిభోజనము కావలయునో

నిర్దేశించుము. మీ భోజనవిషయమును విని మేము నిన్ను దృప్తిపెట్టఁ గలమో లేమో తర్వాత నిర్ణయించెదము"

శ్రీకృష్ణుని వాక్యములు వినఁగానే నేను తికమక పడిపోయితిని. తర్వాత కొంత కుదుట పడితిని. ఇంతవఱకు నేనెవరిని సామాన్య బ్రాహ్మణ దనుకొనుచుంటినో అట్టివానికి భోజనము పెట్టి తృప్తిపెట్టుటకు అఖిల బ్రహ్మాండములను దృప్తిపెట్టు శ్యామసుందరుఁడు కూడ శంకించుచుండెను. ఆ బ్రాహ్మణుఁడు సూర్యకిరణములతో సహాసముగ నున్న తన యెఱ్ఱని గడ్డము నాడించుచు నవ్వి యిట్లనెను:— "దేవా! నేను సాధారణ బ్రాహ్మణుఁడను గాను, నేనగ్నిహోత్రుఁడను. నాకజీర్ణ రోగము పుట్టుటచే నీ సమీపమున నున్న ఖాండవవనమును దగులఁ బెట్టవలె ననుకొనుచున్నాను. దీనిలోఁగల యక్ష, రాక్షస, అసుర, నాగ, సర్పాదుల మాంస మేధస్సులఁదగులఁ బెట్టుటచే నాకు తృప్తి కలుగును. ఈ వనమును భస్మము చేయుటచేతనే నాకీ యజీర్ణము పోవును."

భగవానుఁ డిట్లనెను:— "అయితే తగుల బెట్టుము. మమ్ముల నడుగుట ఎందులకు? నీవు హుతాశనుఁడవు. సమస్త బ్రహ్మాండమును భస్మముచేయు సమర్థుఁడవు."

అగ్ని ఖేదస్వరమున నిట్లనెను:- "ఎట్లు తగులఁబెట్టుదును? దీనిలో తక్షకుఁడు సపరివారముగ నివసించుచున్నాడు. అతని కింద్రునితో స్నేహము. ఆ కారణమున నింద్రుఁడీ వనమును రక్షించుభారము తనపైఁ బెట్టుకొనెను. నేను తగులఁ బెట్టుటకుఁ బ్రారంభించితినా వెంటనే యింద్రుఁడు వర్షము కురిపించి దాని నార్పివేయుచుండెను. అందువలన నది నావశమగుటలేదు. అనేకమార్లు ప్రయత్నించితిని. కాని అది వ్యర్థమైపోయినది. నీ వస్త్ర శస్త్ర విశారదుఁడవు. మీరు

తలఁచుకొనిన నింద్రుని వర్షమును మీ అస్త్రములచే నాపి నా మనోరథ మును బూర్తి కావింపఁ గలరు."

రాజా! ఆతనికి అస్త్రశస్త్రజ్ఞానము బొత్తిగా లేనట్లు ఏదైన అస్త్రశస్త్రములలోఁ బనిపడిన నావైపు చూచును. దేవతలందఱొక్కటై కూడ చేయలేని కార్యములను నేనాతని అండచూచుకొని చేసెడు వాఁడను. మర్త్యలోకములో నెవరును జేయఁజాలనట్టి ఘోర ప్రతిజ్ఞలను జేయుచుందును. శ్రీకృష్ణుని ప్రవృత్తినిగాంచి నేనిట్లంటిని :- "అగ్ని దేవా! నీవు నిశ్శంకుఁడవై ఖాండవవనమును దహింపుము. నిన్ను నేను రక్షించెదను. ఒక యింద్రుఁడు కాఁడు, నూర్గురింద్రులు వచ్చినప్పటికిని జయింపఁజాలనట్టి బలసాహసములు నా బాహువులలోఁ గలవు. అయితే నా బలమునకుఁ దగినట్లు నావద్ద రథము అస్త్ర శస్త్రములు లేవు. అది యెంతటి గట్టి ధనువైనఁ గానిఁడు, నేను బలాత్కారముగ లాగితినా అది నా బలాధిక్యతచే పిటిగిబోవు చుండును. నేనత్యంత లాఘవమున రెండు చేతులతో నొక్కసారిగా నత్యంత శీఘ్రముగ బాణములను వదల గలను. ఎన్ని బాణము లున్నను నిమిషములో వట్టువడి పోవు చున్నవి. కాఁబట్టి నీవు నాబలమున కనురూపముగ నుండు దివ్యధను స్సును, అక్షయతూణీరమును నా వేగమును సహించు దివ్యరథము నొసంగు నెడల నేను శ్రీకృష్ణుని సహాయముచే నీకోరికను నెఱవేర్పఁ గలుగుదును."

నా మాటలను విని నందనందనుఁడు నవ్వెను. అంత నగ్ని దేవుఁడు ప్రసన్నుఁడై నాకు జగత్ప్రసిద్ధమగు గాండీవమును, అక్షయ తూణీరమును, ఏ రథధ్వజముపై మారుతి యుండునో అట్టి దివ్యరథ మును ఇచ్చెను. అగ్నిహోత్రుఁడు శ్రీకృష్ణునకుఁ గూడ సత్కారార్థము చక్రమును ఆగ్నేయాస్త్రము నొసంగెను. నిజమున కాతనికి అస్త్రముల కవసర మేమి కలదు? ఆతఁడు సంకల్పముచేతనే సమస్తసృష్టిని విలీ

నము చేసికొనఁగలఁడు; కాని యాతఁడగ్ని నవమానింపలేదు. ఆతఁ డస్త్రమును భక్తితో గ్రహించెను.

రాజా ! అగ్నిహోత్రుఁడు ఖాండవవనమును దహించుటకుఁ బ్రారంభింపఁగనే దేవతాప్రేరణచేఁ దనబలములతో దానిని రక్షించుట కింద్రుఁడు వచ్చెను. ఆతఁడు రాగానే మమ్ముల నెదుర్కొనెను. అంత నేను నాగాండీవ ధనుస్సును నారిమోగించి శ్రీకృష్ణుని అండను నిలువఁబడి దేవతల మీఁదను, దేవేంద్రుని పైనను బాణవర్షము గురి పించితిని. నాబాణవర్షమున కాగలేక దేవతలందఱు తమ తమ ప్రాణములను గుప్పిటను బెట్టుకొని యుద్ధమునుండి పారిపోయిరి. మా యిద్దరి బలపరాక్రమములను జూచి యింద్రుఁడుకూడ పారిపోయెను. నా తండ్రి యగు నింద్రుఁడు ఆసమయమున లజ్జించెను, హర్షించెనుగూడ. ఆతఁ డోడిపోవుటచే లజ్జించెను. ఆతని కొడుకునగు నా పరాక్రమమునుగాంచి హర్షించెను. రాజా ! అది నా పరాక్రమముకాదు. ఆ పురాణ పురుషుఁ డిచ్చిన బలవీర్యములు. ఆతఁడిచ్చిన పరాక్రమ మాతనితోడనే పోయి నది. నేనిప్పుడు సాధారణులవలె నిర్వీర్యుఁడనే అయితిని.

ఆహా! ఆ సమయమున భగవంతుని శోభ యేమని పొగడుదును? అగ్నిదేవుఁడు ఖాండవ వనమును దగులబెట్టుచుండెను. నలువైపుల చటచటా శబ్దము లుత్పత్తిల్లెను. సింహ, వ్యాఘ్ర, భల్లూక, పశు, పక్షి, నాగ, సర్పాది సమస్తజీవులు దహనమై పోవుచున్నవి. శ్రీకృష్ణుఁడు నా రథముతోఁబాటుగా నలాతచక్రమువలె నరణ్యమునకు నలువైపుల పరిభ్రమించుచుండెను. ఏజీవియైనను అగ్నిజ్వాలనుండి తప్పించుకొనెనా మేము మాయస్త్రములచే దానిని గొట్టెడివారము. దైవయోగముచే నింద్రునిమిత్రుఁడగు తక్షకుండా సమయమునఁ గురుక్షేత్రమునకుఁ బారి పోయెను. ఆతఁడగ్నినుండి తప్పించుకొని, దైత్యదానవులకు సుప్రసిద్ధ

శిల్పియగు మయుని దగ్గఱ శిల్పవిద్యనంతను గ్రహించి యాదానవుని దగ్గఱనే దాఁగుకొనెను. మయదానవుఁడు కూడ కురుక్షేత్రమునకే పారిపోయెను, అగ్నిహోత్రుఁడు వాయుసహాయముచే దానిని భక్షణము చేయుటకు వెంటఁబడెను. అగ్నిజ్వాలలను గాంచి మయుఁడు ఒక గుప్త మార్గమునఁ బారిపోయెను. అతఁడు తన యెదుట చక్రముతో ప్రాణి సంహారము చేయు కృష్ణునిఁగాంచెను. మయుఁడు పారిపోవుచుండఁగా శ్రీకృష్ణుఁడు చక్రము తీసికొని వెంబడించెను. రాజా! ఎవనిని అగ్నిహోత్రుఁడు తనజ్వాలలచే వెంబడించుచున్నాఁడో, శ్రీకృష్ణుఁడు చక్రము తీసికొని ఎవనిని దరుముచున్నాఁడో అట్టివానిని రక్షింపఁగల వాఁడెవఁడున్నాఁడు? శ్రీకృష్ణచక్రమునుండి రక్షింపగలవాఁడెవఁడు?

మయునకు లోకమున రక్షకులెవరును లేరని తెలియఁగానే అతఁడు నన్ను శరణు వేఁడెను. అతఁడు కరుణాభరితములగు వాక్యములతో నన్ను సంబోధించుచు నిట్లనెను:— "పాండవ నందనా! ప్రచండాగ్ని నుండియు, శ్రీకృష్ణచక్రము నుండియు, నన్ను రక్షింపుము."

నేనప్పుడు ఆవేశమున నిట్లంటిని:— "నీవు నిర్భయుఁడవైతివి ఇఁక నీవు ప్రాణభయమును జెందరాదు."

ఇంకొక వీరుఁడగునెడల నిది తన కవమాన మనుకొనును తోఁబుట్టిన వాఁడగుఁగాక తన శత్రువు విషయములో జోక్యము కలిగించుకొనెనా వ్యధచెంది తీరును. కాని అప్పుడు శ్రీహరి నవ్వి. ప్రసన్నుఁడై మయునితో నిట్లనెను:- "దానవోత్తమా! మయా! నీవిప్పుడిఁకఁ జింతింపవలదు. కుంతీ పుత్రుఁడు అభయదాన మొసంగిన వానిని శిక్షింపఁగలవాఁడీ లోకమున నెవఁడు కలఁడు?"

అతఁడు తన సేవకుల నెంతో కృపతోఁజూచును. వారి వాక్యములను గౌరవించును. తన ప్రతిజ్ఞను భంగపఱచుకొనియైన నాతని

ప్రతిజ్ఞను నెఱవేర్చెను. ఆతని భగవత్తత్వమున కిది అనురూపముగనే యున్నది. మానవులలో నీశక్తి యెవరికుండును? ఇట్టి సహనము చూపించు శక్తి ఆతనికే తగినది.

ఈ యుపకారమునకై మయుఁడు ప్రత్యుపకారము సేయఁదలఁచెను. అంత నే నాతనితో నిట్లంటిని:- "మయా! నాకు ముఖ్యమగు కార్యము శ్రీకృష్ణ ప్రసన్నత. ఆతఁడు ప్రసన్నుఁడగు కార్యము నేదైనఁ జేయుము."

ఆతఁడంత శ్రీకృష్ణునిఁ బ్రార్థించెను. మయుని ప్రార్థన నంగీకరించి సర్వాంతర్యామియగు శ్రీకృష్ణుఁడు కొంచెము సేపూరకుండి యాలోచించుచుండెను. ఆ సమయమున నాతని చింతాయుక్తమగు ముద్ర యెంత యందముగ నుండెనో చూచితీరవలెను. ఆతఁడిట్లాలోచించుకొనెను:- 'నా కన్నిటి కంటె బ్రియమగు కార్యమేది?' అని యాలోచించి యిట్లనెను:- "మయా! నీవు నన్నుఁ బ్రసన్నుని జేయఁ దలచితివేని ధర్మరాజునకు ప్రపంచములో సాటిలేని ఒక సభను నిర్మించుము. దైత్య, దానవ, దేవగంధర్వాదు లెవరును దానిని నిర్మింపలేనట్లుగ నుండవలెను. ఇంతకంటె నాకీ ప్రపంచములోఁ బ్రియమైన కార్యము లేదు. ధర్మరాజు ఆ సభలో బంగారు సింహాసనమున చక్రవర్తియై కూర్చుండిన చూచి సంతోషించుటకంటె నా కింకొక సంతోషకరమగు కార్యములేదు."

రాజా! ఇదియే యాతని భక్తవత్సలత. ఇదియే ఆతనికి మనమీఁదఁగల ప్రీతి. ఇదియే ఆతనికి మనయెడలఁగల నిష్కపట ప్రేమపూర్ణమగు సద్వ్యవహారము. శ్రీకృష్ణకృపచేతనే మనకాసభ లభించినది. ఆ సభలోనేకదా మీకు రాజసూయ యాగసమయమున భూమియందలి రాజులందఱు నుపహారములు తెచ్చి సమర్పించిరి. ఆ సభలోనే కదా

దుర్యోధనునకు జలమున్నచోట స్థలముగను, స్థలమున్నచోట, జలము గను గనఁబడినది. శ్రీకృష్ణకృపచేతనే లోకములో సర్వశ్రేష్ఠమగు సభమీకు లభించినది. అతఁడు నన్ను ప్రేమతోఁ బాలించి, పోషించి ఆకాశమునకంటెఁ బైకి యెత్తిపట్టెను నాకు నా సౌభాగ్యమునకు గర్వము కలిగెను. ఆ సంగతి నేను చివరకు తెలిసికొంటిని హృదయమును గద లించి వేయునట్టియు, నాతని ఆంతరిక ప్రేమను ప్రకటించునట్టియునొక సంఘటన చివరకు జరిగినది.

ఇంద్రునకుఁ దాను దేవరాజునని గర్వము ఖాండవ వనమును దహించినతర్వాత, అగ్నిదేవుఁడు సంతుష్టుఁడైన తర్వాత నింద్రుఁడు మా దగ్గఱకు వచ్చి వరము లడుగుకొమ్మనెను. నాకు లోకములో సర్వ శ్రేష్ఠుఁడును, అద్వితీయుఁడునగు యోద్ధ కావలెనను కోరిక కలదు. నేను దేవేంద్రుని సర్వశస్త్రాస్త్ర సంపన్నునిగను, అద్వితీయ వీరునిఁగను జేయుమని వర మడిగితిని. అతఁడొసంగెను.

సమస్త వరదానము లొసంగు శ్యామసుందరుని గూడ వరము లడుగుమని కోరు సాహసమును దేవేంద్రుఁడు కనఁబరచెను. శ్రీకృష్ణుఁ డమరేంద్రునిఁ దిరస్కరింపలేదు. నేను నిన్ను దేవేంద్రునిఁగ నొనర్చి తినిగదా, నావద్ద నిట్టి సాహసము చేయుచున్నావు. నీవేమి వరము లీయఁగలవని యడుగలేదు. సరిగదా వినిన రోమాంచమగునట్టి వర దానమును అతఁడు దేవేంద్రు నడిగెను. నాకంట నీరు నిండెను. భగ వంతుని భక్తవత్సలతను కాంచఁగానే నా హృదయము కరిగిపోయెను. శ్యామసుందరుఁ డెన్నటికిని నన్ను వీడఁడని నా కాదినమున విశ్వాసము కలిగెను.

దేవేంద్రుఁడు వరములిత్తుననఁగానే భగవానుఁ డాతనితో

నిట్లనెను :- "దేవరాజా ! నీవు నాకు వరమీయవలెనని కోరునెడల నాకు, నర్జునునకు ఇట్టి ప్రగాఢమైత్రియే యుండునట్లు వరమిమ్ము."

రాజా ! ఇదెట్టి యద్భుతవాక్యము ! నిజముగ నీ వరము నే నడుగవలసినది. ఆ ప్రకాముఁడగు నాయదునందనున కెవరి మైత్రితో నేమి ప్రయోజనము? ప్రపంచములోని లక్ష్మియంతయు నెవని పాదములకడ పొరలాడుచుండునో, అట్లు పొరలాడుచున్నను ఎవఁడు దానివైపు కన్నెత్తైనఁ జూడఁడో అట్టి శ్రీపతికి క్షుద్రుఁడనగు నా మైత్రివలన నేమిప్రయోజనము ? ఆఁకలికొన్నవాఁ డాహారమునకై పరితపించునట్లు, మిక్కిలి దప్పికకొన్నవాఁడు నీటికై అలమటించునట్లు, ఘోరకామి కామినికొఱకు దేవులాడినట్లు నేను భక్తులకృపకై యట్లలమటించుచుందునని చూపుటకా యన్నట్లు శ్రీకృష్ణుఁడు తన భక్తవత్సలతను జూపించెను. రాజా! అతఁ డీమాటను ఊరక నోటితో ననలేదు. జీవితకాలమంతయు దానినిఁ జెల్లించుకొనెను. మన హితముకొఱ కాతఁ డెల్లప్పుడు సావధానముగ తత్పరుఁడై యుండెడువాఁడు. మనకేది హితమో దానిని సమస్తోపాయములచేఁ జేయుచుండెడివాఁడు. కాని చివరకు అతఁడు నన్ను మోసగించెను. స్వధామమునకు వెళ్లునప్పు డాతఁడు పాపినగు నన్ను అయోగ్యుఁడని గ్రహించి అతని వెంటఁ గొనిపోలేదు. న న్నిక్కడ ఏడ్చుటకై వదలి పోయినాఁడు."

# జరాసంధ వధ సమయమునఁ గృష్ణుని గృప

౫౨

శ్లో॥ య త్తేజసా నృపశిరోఽంఘ్రి మహన్మఖార్థే ।
అర్యోఽనుజ స్తవ గజాయుత సత్త్వవీర్యః
తేనాహృతాః ప్రమథనాథమఖాయ భూపా
యన్మోచితా స్తద నయన్ బలి మధ్వరే తే॥

—శ్రీభాగ. ౧ స్కం. ౧౫ అ. ౯. శ్లో.

అర్జునుఁడు విలపించుచు నిట్లనెను :- పదివేల యేనుఁగుల బలముగలిగి, సమస్త రాజసమూహముచేఁ బూజింపఁబడు పాదములు కలిగిన జరాసంధుని నీ తమ్ముఁడు భీమసేనుఁడు ఎవని ప్రభావముచే వధించెనో, జరాసంధుఁడు చేయఁదలఁచిన భైరవయజ్ఞమందు బలియిచ్చుటకు బంధింపఁబడిన భూపతులను ఎవఁడు బంధవిముక్తి కావించెనో, అట్టి వారందఱు నీ యజ్ఞములో వివిధోపహారములు కొనివచ్చి సమర్పించిరి. ఇదంతయు శ్రీకృష్ణ కృపవలననే సుమా ! శ్రీకృష్ణుఁడు మనలను వదలి వైకుంఠమునకుఁ బోయినాఁడు.

—శ్రీమదాంధ్రభాగవతము.

శోకవ్యాకులుఁడగుట వలనను, దుఃఖము పొంగిపొరలి వచ్చుట చేతను, వాక్కు గద్గదిక మగుటచేతను అర్జునుఁ డిఁక ముందునంగతి చెప్పలేకపోవుటను గాంచి ధర్మరా జిట్లనెను:- "సోదరా! అర్జునా! నీవు ఊరకుంటి వేమిరా? ఇప్పుడు మనమేమి చేయవలయును ? మనకు కేవలము కృష్ణకథయే ఆధారము. 'సంసారి యగువాఁడు నూఱుకార్యములను వదిలిపెట్టియైన భోజనము చేయవలెను. ఆవశ్యకములగు వేయి

కార్యములు వదలియైన స్నానము చేయవలెను. లక్షకార్యములను వదలి యైన దానమును జేయవలయును. సమస్తకార్యములను వీడి, సాంసారిక కార్యములలోని లాభనష్టములను జూడక హరిస్మరణములోను, శ్రీకృష్ణ చర్యలోను మునిఁగిపోవలెనని శాస్త్రవాక్యము' మన ఆఁకలి దప్పు లన్నియు శ్రీకృష్ణుని తోడనే వెళ్ళిపోయినవి. ఇప్పుడేదో విధముగ రాత్రి గడచినచో మనము ముందు కర్తవ్యమును నిర్ణయించుకొన వచ్చును ఈ ధరాధామమును వదలి శ్రీకృష్ణుఁ డెట్లు స్వధామమును జేరెనో అట్లే మన నిద్రకూడ కన్నులను వదలి పోయినది. శ్రీకృష్ణ కథాశ్రవణమున కాకులత చెందుచున్న యీకర్ణములే ఇంద్రియములలో శ్రేష్ఠములైనవి. కావున నీవు శ్రీకృష్ణ కృపను గూర్చిన కథనుజెప్పి సంస్మరణము కలుగునట్లు చేయుము"

ధర్మరాజు వాక్యములను విని గాండీవ ధనుర్ధారియు కుంతీనంద నుఁడగు నర్జునుఁడు కన్నుల నీరు తుడుచుకొని యిట్లనెను:- "రాజా? సుందర సంస్మరణము కావించుమందు వేమి? అతని సంస్మరణము సుంద రములలో సుందరమైనది. అసుందరతా వాసనయే అందులో లేదు. కలకండకు నాలుక నెక్కడ తాఁకించినప్పటికిని సర్వత్ర సమానముగ తీపి యెట్లుండునో అట్లె శ్రీకృష్ణుని సమస్తచేష్టలలో, సమస్తలీలలలో, సమస్తకథలతో నొకేరకమగు సుందరత కలదు. లోకములోని సుంద రత్వము లన్నియు శ్యామసుందరుని నుండియే యుత్పన్నములైనవి. కావుననే అతని సంబంధములో నెట్లు చెప్పినను, సంబద్ధములు, అసం బద్ధము లెన్ని చెప్పఁబడినను అన్నియు సుఖకరములు, శాంతిప్రదములు మనోహరములు, హృదయమును హరించునవిగ నుండును. గొప్ప యాశ్చర్య విషయ మేమనఁగా మాయామోహరహితుఁడై అఖిల భువన పతియగు శ్రీకృష్ణుఁడు ఒక కుటుంబములోని వృద్ధుఁడు తన కొడుకులు, మనుమలు మొదలగువారి యెడల నెట్టి మమత్వముతో నుండునో

అట్లే మనల నిరంతరము మమకారముతోఁ గాపాడినాఁడు. ఏకాంత మందుఁగూడ మన హితమునే కోరుచుండును. అతని కెల్లప్పుడు రెండే కోరికలు కలవు. పాండవులకు మేలెట్లు కలుగునా యనునదొకటి. ధర్మరాజు సర్వప్రపంచములో సర్వశ్రేష్ఠుఁడు యశస్వియగు చక్రవర్తి యగునా యనునది రెండవది.

మిమ్ములను బ్రసన్నులఁజేయుట కాతఁ డెంతగా తహతహలాడి నది మీకు తెలియును ప్రతిదినము మీరు చూచుచున్నవిషయమే. మీరు సర్వశ్రేష్ఠమగు రాజసూయ యజ్ఞమును చేయుదు ననఁగానే అతఁ డెంతగా సంతసించెనో మీకు తెలిసినదే. అత్యంతాహ్లాదముతో నాతఁ డిట్లనెను:— "రాజా! రాజసూయ యాగము భూమిలో సర్వశ్రేష్ఠుఁడగు చక్రవర్తియే చేయవలెనని నీ వింతగా పరితాపపడెదవేల ? నీకంటె శ్రేష్ఠుఁడగు రాజెవఁ డుండఁగలఁడు? నేను నీకు సేవకుఁడనై యుండఁగా నీకు కొదువేల?"

నీకు మనస్సులో జరాసంధుని భయమున్నది. అతఁడు పరమ పరాక్రముఁడగు నసురుఁడు. రాజాయై భూమిమీఁదఁబుట్టెను. రాజు లందఱు వానిపేరు చెప్పిన అదలిపోవుదురు. అతఁడు మూర్ఖతావశ మున శ్రీకృష్ణునిపైగూడ దండెత్తెను. అదియు నొక్కసారికాదు, పదు నెనిమిదిసారులు, వానిగర్వము వృద్ధిచేయుటకై శ్రీకృష్ణుఁడు బంధు పరివారసమేతముగా ద్వారకానగరమునకు వచ్చినాఁడు. ఈ మూల మున వాని గర్వము ప్రకుతిమించిపోయెను. ప్రపంచములో తనను మించిన వీరుఁడు లేఁ డనుకొనెను. వేలకొలఁది రాజులను భూతనాథు నకు యజ్ఞములో బలియివ్వవలెనని వారి నందఱను బంధించెను. ఇంతటి బలవంతుఁడుండగా రాజసూయ యజ్ఞ మెట్లు నెఱవేరునా యని మీకు భయముండెను. మీ భయమును అంతర్యామియగు భగవంతుఁడు గ్రహించెను. అప్పు డాతఁడు మిమ్ముల నోదార్చుచు మేఘగంభీర

స్వరముతో గర్జించుచు నిట్లనెను:- "రాజా, నీవేమాత్రము చింతింప వలదు. నేను నీ శత్రువగు జరాసంధుని జంపించెదను. శల్య శస్త్ర జ్ఞాత శరీరములో గ్రుచ్చుకొనిన అలుగును బయటకు తీసిపార వేసినట్లు నీహృదయకంటకుఁడగు రాజును ఈలోకములో లేకుండఁ జేసెదను. నాకు భీమార్జుల నిమ్ము."

అతని భక్తవత్సలతను గాంచి నీవా సమయమున నెంతో విలపించితివి. నీ ప్రేమాశ్రువులచే నాతని పీతాంబరము దడిపి వేసితిని. మా యిద్దర నాతనికి వప్పగించితివి. దారిలో నాతడెట్టి వినోదము లొనర్చెనో చెప్ప వీలులేదు. మొదట నాతో నిట్లనెను:- "అర్జునా! జరాసంధుఁడు మహాబలవంతుఁడు వాని నెట్లు జయింపఁ గలుగుదుము? నీవే యేదైన నుపాయమును జెప్పుము. నీవు వానితోఁ బోరాడగలవా?"

నే నిట్లంటిని :- "మీ యాజ్ఞయైనచో వానితోఁ బోరాడెదను. వానిని యుద్ధములో మూర్ఛపడఁగొట్టెదను. లేకపోతే అతఁడే నన్నుఁ జంపగలఁడు."

అంత నాతఁడు బాలకునివలె భయపడుచు నిట్లనెను:- "కాదయ్యా! నీ కేదైన అనిష్టము జరిగెనా ధర్మరాజుదగ్గఱకు నేనేమి ముఖము పెట్టుకొని పోవుదును? అతఁడు చాల బలవంతుఁడు. నేను వానికి భయపడి సముద్రములో నివసించుచున్నాను. వానినిఁ బరాక్రమము ద్వారా యెవరు నోడింపలేరు."

అంత నే నిట్లంటిని :- "అట్లే యగునెడల, తిరిగి పోవుదము. అట్టియెడ వానిదగ్గఱకు పోవుటెందులకు?"

అంత నాతఁడు అన్యమనస్కుఁడై యిట్లనెను :- "తిరిగి యెట్లు పోవుదము? ధర్మరాజు రాజసూయ యజ్ఞము నెఱవేఱదుకదా? అతని

ఆశ నీటఁ గలిసిపోవును. ఆతఁడు దుఃఖించును. ధర్మరాజు చింతించినను, దుఃఖించినను నా జీవనమంతయు వ్యర్థమే. నా సమస్తకార్యములు ధర్మరాజు సంతోషముకొఱకే."

నే నిట్లంటిని :— మీరు నరలీల చేయుచున్నారు. నన్ను యుద్ధము చేయనీయకపోయితిరి, ఆతని బలమును గుఱించి భూరిభూరి ప్రశంశలు చేయుచుంటిరి. మీకంటెఁగూడ ఆతఁడు బలవంతుఁ డనుచుంటిరి. తిరిగి వెళ్లుదమన, తిరిగి వెళ్ళనీయరు. ధర్మరాజు యజ్ఞమును బూర్తిచేయవలెననుచుందురు. మీరేమి చేయదలఁచినారో నాకేమియుఁ దోచుటలేదు."

అంత నాతఁడిట్లనెను:—"ఆతని నోడింపక రాజసూయ యజ్ఞము నెఱవేరదు. భీమసేనుఁ డాతని జంపఁగలఁడు కాని అతనివద్ద అస్త్రశస్త్ర కౌశలము భీముని దగ్గఱకంటె నెక్కుడుగ నున్నది." అంత భీమసేనునితో నిట్లనెను:— "భీమసేనా! ఇవ్వేళ నీకు పరీక్ష. ఇవ్వేళ నీవు జరాసంధుని చంపలేకున్నచో నిన్నందఱును దిండిపోతందురు. ఈతఁడు తిండి నతిగాఁదినును, పోరాడఁబోయినపుడు పిల్లియగునని యెగతాళి చేయుదురు. నీ దగ్గఱ మే మిద్దఱము పిల్లలము. మనలోఁ బెద్దవాఁడవు నీవే. నీవే ఆతనితో బోరాడవలయును."

భీమసేనుఁ డభిమానముతో నిట్లనెను:— "మంచిది. మీ రిద్దరు మెదలకుఁడు నేనే వానిపని పట్టెదను; వాఁ డెట్టివాఁడో?" ఇది వినగానే ఆతఁడు కిలకిలనవ్వెను. ఆతని నవ్వులో నెంతో మాధుర్యము కలదు. ఏదైన వినోదమున కాతఁడు బిగ్గఱగనవ్వెనా దిశలు ప్రతిధ్వనులిచ్చునట్లు నవ్వును. నోటినుండి ముత్యాలు రాలుచున్నట్లుండును నవ్వి నవ్వి కడుపుబ్బునట్లు నవ్వును. నేలమీఁద పొరలాడును. ఆతని అట్టహాసమున కందఱు నవ్వుదురు ఇట్లు భీముని జూచి చాలసేపటివఱకు నవ్వి

యిట్లనెను :— 'బావా! మేమిద్దరము దూరముగ నుండి మీ యుద్ధమును జూచుచుందెదము. వాని బలమెక్కువయ్యెనా మేము కాలికి బుద్ధి చెప్పి పారిపోయి వచ్చెదము. ఆ పరమ పరాక్రమము నెదుర్కొనుటకు మాలో నెవరికిని సామర్థ్యములేదు.'

అంత భీమన్నగారు కృష్ణుని ఎగతాళిచేయుచు నిట్లనెను :- "నీవు పారిపోవుట నేర్చుకొన్నావు. ఎప్పుడు యుద్ధమనునది యెఱుఁగవు. ప్రపంచమంతటిలోఁ బిరికివందవు. వానిని నేను రెండుగఁ జీల్చి పార వైచెదను. నేననిన నేమనుకొనుచున్నావు?" ఇది వినఁగానే యాతఁ డత్యానందము చెందెను. అంత నాతఁడు భీమసేనుని గౌఁగలించుకొని యిట్లనెను :— "బలవంతుఁడవగు నో భీమసేనా ! నీవు తప్పక వానిని జంపఁగలవు. నీ బలాధారమును జూచుకొనియే మేము బయలుదేరి వచ్చితిమి."

రాజా ! ఆతని కెవని బలాధారము కావలయును? చేయువాఁడు, చేయించువాఁడు నతఁడే. ఏ కార్యములోనైనను ఎవనినో ఒకనిని నిమిత్తముగఁ జేయును. భీమసేనుని నిమిత్తము కావించి పదివేల యేనుఁగుల బలముగల దైత్యాంశుఁడగు రాజును నిమిషములోఁ జంపించెను. అంత కారాగృహములో నున్న వేలకొలఁది రాజులను విడిపించెను.

చిరకాలము కారావాసములో ననేకయాతనల పడి దుర్బలులై, తమ జీవితాశను వదలుకొనిన రాజులందఱకును జీవనప్రదానము కావించి వారందరకు స్వాగతసత్కారములు కావించెను. విచిత్ర వాహనములమీఁద వారినిఁ దమదేశములకుఁ బంపునపుడు వారికిట్లు చెప్పెను:- "మీరందఱు ధర్మరాజ రాజసూయాయాగమునకు ఉత్త

మోత్తములగు సుపహారములను గొని రావలయును." అందు నొకా నొకనితో నిట్లనెను :-"మీవద్ద బంగారు గనియున్నది. మంచి బంగార మును దేవలయునుసుమా!" ఇంకొకనితో నిట్లనెను :- "నీవు పదివేల యేనుఁగులును, ఇరువదివేల మంచిగుఱ్ఱములను దేవలయును" వేఱొక నితో నిట్లనెను:- "నీవద్ద కంబళములు, మృగచర్మములు, పులిచర్మము లధికముగ నుండును. వాటిని నీవు వెలకొలది వాహనములందు వేసికొని అన్నింటికంటె మంచివి తేవలయును!" రాజా! ద్రవ్యలోభియగు రాజు తన ప్రజలపై పన్నులనువేసి వసూలు చేసినట్లు అతఁడప్పు డా రాజు లందఱ ననేక విధముల నాజ్ఞాపించెను. ఆ రాజులందఱు నాతని యాజ్ఞను శిరసావహించి మీరు చేసిన యజ్ఞమునకు వచ్చి సమర్పించిరి. అందఱు వారి కిరీటమణులచే మీ పాదపద్మములను చమత్కృతిగ శోభింపజేసిరి. రాజా! అట్టి శ్యామసుందరుఁడు నేఁడు మనలననాథలఁ గావించి వదలి స్వధామమునకుఁ బోయినాఁడు కదా! ఈ వసుంధరా దేవి విధవయైనది. ఈ లోకమంతయు నాకు శూన్యముగఁ దోఁచు చున్నది. ఏమి చేయుదును? ఎక్కడికి వెళ్ళుదును? నా ప్రియతముని నేనెక్కడ పొందగలను!" అనుచు నర్జునుఁడు మరల వస్త్రమును ముఖమునకుఁ గప్పుకొని వెక్కి వెక్కి యేడ్చుచుండెను.

## ద్రౌపది పలుపలుమాఱడ్చినపుడు కృష్ణ కృప

౩౪

శ్లో॥ యత్పాదపద్మమఖక్లుప్త మహాభిషేక
శ్లాఘిష్ఠచారు కబరం కితవైః సభాయాం।
స్పృష్టం వికీర్య పదయోః పతితాశ్రుముఖ్యాః,
యస్తత్ స్త్రియోఽకృత హతేశ విముక్తకేశాః॥

—భాగ. ౧ స్కం. ౧౫ అ. ౧౦ శ్లో.

"మ॥ ఇభజిద్వీర్య మఖాభిషిక్తమగు నీ యిల్లాలి ధమ్మిల్లమున్
సభలో శాత్రవు లీడ్చి తెచ్చినపుడా చంద్రాస్య దుఃఖింపఁగా
నభయంబిచ్చి ప్రతిజ్ఞజేసి భవదీయారాతి కాంతాశిరో
జభర శ్రీల హరింపఁడే విధవలై సౌభాగ్యముల్ వీడఁగన్॥"

—శ్రీ మదాంధ్ర భాగవతము

నిరంతరము భగవత్స్మరణ వలన కలుగు దుఃఖము అందఱకు, ఎల్లప్పుడు లభించిన బాగుండును. భగవత్సంబంధములో కలిగెడు దుఃఖము దుఃఖము కాదు. అది పరమ సుఖము. బృందావిహారి సంబంధములోఁ గలిగిన విరహవ్యథ మనఁబడదు. అది మానసిక ఘనిష్ఠ సంయోగమునకు జనని. అవినాశి యెన్నటికి నాశము కాఁడు పరోక్షమగును. ఈ చర్మచక్షువుల కాతఁడు కనఁబడకుండును. అతఁడు బాహ్యదృష్టిచేఁ గనపడకపోఁగానే అంతర్దృష్టిలో నాతనిని జూచుటకు ప్రయత్నింతురు. ఇదియేమోక్షము. ఇదియే పరమానంద సుఖము. శ్రీకృష్ణ సంబంధమగు రోదనము మోక్షమార్గ సోపాన స్వరూపము.

అర్జునుఁడు జరాసంధ వధాసమయమున శ్రీకృష్ణ కృపనుగూర్చి వర్ణింపఁగానే ధర్మరాజు కూడ అత్యంత గద్గదకుఁ డయ్యెను. అతఁడు రోదనముచేయుచు నిట్లనెను:—"అర్జునా! నీవీ విషయముల నన్నిటిని వినిపించి మరణమునుండి నన్నుద్ధరించుచున్నావు. నీవు చెప్పునది కథ కాదు. నీ వాక్కును పిచికారీ ద్వారా నా చెవులకుండా సంజీవనీ రసమును హృదయమును కెక్కించుచున్నావు. వాగ్రూపమగు పాత్రలో నింపి కర్ణములను నా కంఠములో ననుపమామృతమును బోయుచున్నావు. ఎంతవఱకు నీ విధముగ మధుమయ, ఆనందమయ, జీవనమయ, సారమయ కథారసమును ద్రావించెదవో అంతవఱకు నా హృదయము బ్రద్దలుకాదు, నా చేతనము విలుప్తముకాదు. నేను సంజ్ఞా

శూన్యుఁడను కాను. ఇంకను వినుపించుము నాయనా ! నా ప్రియ సోదరా ! అర్జునా ! పాపవర్జనా ! నన్ను రక్షింపఁదలచితివేని కథా తంత్రిని దెగ్గింపవలదు."

ధర్మరాజిట్లు పలుకఁగా నా వాక్యములను విని అర్జునుఁడు కన్నులు తుడుచుకొనెను. తన ప్రియులను గూర్చి చెప్పినను హృదయము స్వయముగ హర్షించును ఆ కారణమున నర్జునుఁడుకూడ ఎవరైన నవ్యగ్రచిత్తముతో వినువాడుండినచో యుగ యుగాంతరముల వఱకు ఇదేవిధముగ శ్యామసుందరుని సుఖద సంస్మరణనుగూర్చి చెప్పగోరుచుండెను. తనవలె ధర్మరాజు సభాసదులు. అక్కడనున్న బంధువులు శ్రీకృష్ణ కథా శ్రవణకుతూహలులై యున్నారను సంగతిని దెలిసికొని అర్జునుఁ డిట్లనెను :—"ఒక్క విషయమైనఁ జెప్పగలను. కాని ఆతనిది ఎన్నటికినీ అంతముగాని కృప.ఒక నమ్మకమైన సేవకునివలెను,స్వామి భక్తుఁడగు భృత్యుని వలెను మనలను, మన పరివారమును, మన పదవీ ప్రతిష్ఠలను, రాజ్యరక్షణమును జేయుచుండెడివాఁడు. ఎచ్చట స్మరించిన నచ్చటనే యుండెడువాఁడు. ఆతఁడు స్వయముగ నుండుట ఉపచార మాత్రమే ఆతడు సర్వాంతర్యామిసమస్తజీవులందును సమానముగ వ్యాపించియున్నాఁడు. ఆతఁ డొకచోటనుండి రావలసిన పనియు లేదు, ఒకచోటకు వెళ్ళవలసిన పనియులేదు. భక్తులు ప్రేమతోఁ బిలిచిరా ఆతఁ డక్కడనే ఆ క్షణముననే ప్రత్యక్షము. అయితే మనయొక్క అందఱ హృదయములలో అట్టి ప్రేమ లేదు. ప్రేమశూన్యులమగు మన సమ్ముఖమున నాతఁడు ప్రత్యక్షమగుట కేవలమాతని అహైతుక కృపవలననే.

అతుల వైభవోపేతమగు మీ రాజసూయాగమును గాంచి దుష్టులకు అపారమగు ఈర్ష్య కలిగినది దుర్యోధనునకు మయసభలో

జలమున్నచోట స్థలముగను స్థలమున్నచోట జలముగను గోచరించెను. అతఁడు మీ యైశ్వర్యమును గాంచి ఈర్ష్యావశమున దుఃఖితుఁడై దృష్టిహీనుఁ డయ్యెను. దుష్టులందఱును జేరి ద్యూతసభ నేర్పఱచిరి. నిన్నుఁ నీ సోదరులను జూదమాడఁ బిలిచిరి ధర్మానుసారముగా వారి యాహ్వానమును స్వీకరించి మనము దఱమును ఇంద్ర ప్రస్థము నుండి హస్తినాపురమునకుఁబోయి మన సర్వస్వము నోడి చివరకు ద్రౌపదినిగూడ ఓడిపోయితిమి దుర్యోధనుని మామయగు శకుని, అతని సోదరుఁడగు దుశ్శాసనుఁడు, కర్ణుఁడు వీరందఱును గలిసి అనేక కపటోపాయములచే మోసముచేసి మిమ్ములను బరాజితులఁ గావించిరి. సోదరులమగు మమ్ములనందఱ నోడిపోయితిరి. చివరకు ద్రౌపదిని గూడ నోడిపోవ, నియమానుసారముగ గెలిచినవారికి దాసి యయ్యెను. అప్పుడు వారికి వారి ఈర్ష్య నణఁచుకొనుట కవకాశము చిక్కెను. నిన్నెట్టైన నవమానము చేయబూని హేయ బుద్ధిచే హేయ కార్యములను జేయఁ ప్రారంభించిరి.

లోకములో నిట్టి పాపమెవరైనఁ జేయఁగలరా? స్త్రీ సదా అవధ్య. అది యేజాతిదైన నగుఁగాక, తన ప్రాణము లొడ్డియైనను ఆస్త్రీ నతీత్వమును రక్షింపవలయును. అదెట్టి స్త్రీయైన నగుఁగాక, దాని నందఱ ముందు అవమానము చేయరాదు. ఏ వర్ణములోనున్న స్త్రీయైన నగుఁగాక, అది దుఃఖములోఁబడెనా దానిని ప్రయత్నించి దుఃఖమునుండి బయట పడవేయవలయును. ఇట్లు శాస్త్రకారు లనేకచోట్ల చెప్పియున్నారు.

రాజులై, తన యింటిలోఁ తన అన్నభార్య, అంతే కాదు చక్రవర్తిని, చక్రవర్తియగు భర్తతోఁ గూర్చుండి రాజసూయ యజ్ఞ దీక్షను గొన్నది, చేత జింక కొమ్మును ధరించి భర్తతోఁ గూడి యజ్ఞమునకు సంబంధించిన కఠిన నియమములను పాలించినది— అట్టి దేవవంద్యయగు

రాజ మహిషిని నిండుసభలో నామె సిగ్గును దీసివేయవలెనని యవమానింపఁ గలరని ఎవరైన నూహింపఁగలరా? ఇట్టిపని క్రూరులగు రాక్షసులు కూడ చేయరు. దైత్య దానవులుకూడ తమ కులస్త్రీల నెల్లప్పుడూ నాదరించుచుందురు. వారి యవమానమే తమ యవమాన మనుకొందురు. ఆ ద్యూత సభలో నందఱు ఊరక స్మరించిననే రోమములు నిక్కఁబొడుచునట్టి ఘోరకార్యము నొనర్చిరి. ఆ సమయమున నందఱు బుద్ధుల మీఁద తెఱవడినది. అందఱు కులాగత ధర్మమును మఱచిరి అందఱు సదాచారమునకుఁ దిలాంజలు లొసంగిరి. దుష్టుఁడగు దుర్యోధనుఁడు ద్రౌపదిని నిండుసభలోనికిఁ దీసికొని రమ్మని దుశ్శాసనున కాజ్ఞాపించెను.

ఆతని యీ క్రూరాజ్ఞను విని మనమందఱము కిక్కురు మనకుంటిమి. మన కర్తవ్యమును నిశ్చయించుకొనలేక పోయితిమి. మీరు ధర్మపాశబద్ధులై నిశ్చేష్టులరై కూర్చుండిరి. క్రూరుఁడగు నాదుశ్శాసనుఁడు లోపలికిపోయి రాజసూయ యాగమందును, అశ్వమేధ యజ్ఞమందును మంత్రజలములచే నభిషిక్తము కావింపఁబడిన అలినీలాలకములగు కమనీయ కేశములను బట్టుకొని పట్టపురాణియగు ద్రౌపదిని యీడ్చుకొని వచ్చెను. ఆమెను సరిగా స్వచ్ఛందముగ దిరుగు పక్షులు కాని, గగన విహారియగు భాస్కరుఁడు గాని చూచి యెఱుఁగరు. ఉచ్చులలోఁ జిక్కుకున్న లేడిపిల్లవలె నీ ప్రియ గృహిణి చాలగ విలపించెను: వ్యాకులయై ప్రేలెను. ఆమె దీనతతో నా దుష్టుని దయాభిక్ష నడిగెను. కాళ్ళు పట్టుకొని యామె యిట్లనెను:— "మఱఁదీ! ఇట్టి పాపము నకు వడిగట్టుకొనకుము. నేనిప్పు డేకవస్త్రను, రజస్వలను. అందఱ సమ్ముఖమున రా వీలులేదు నన్నవమానింపకుము. నా సిగ్గును దీయకుము. నన్ను వారాంగనవలె సభలోనికిఁ గొనిపోవకుము. నేను నీకు నమస్కరింతును. పాదములఁ బట్టుకొందును. నేను పరాయిదానను

గాను. మీయన్న భార్యను. కాని యా దుష్టుఁడు ఒక్కమాటయైన విన లేదు. ఆమె నవమానపూర్వకముగఁ గొప్పు పట్టుకొని యీడ్చెను.

ఆ సమయమున సభాసదులందఱును దుఃఖించిరి. ఎవఁడు నొక్క మాటైనఁ బలుకలేదు. భీష్మ, ద్రోణ, ధృతరాష్ట్రాది గురుజనులందఱును మౌనముగ నుండిరి. ద్రౌపది మాటిమాటికి కాతర దృష్టితో భయభీత హరిణ శావకముపోల్కి మీవైపు చూచుచుండెను. ఆమె తన దీనదశను జెప్పుకొనుచు నీవు రక్షింతువని యెంచెను. కాని నీవామె వైపునఁ జూడనైనఁ జూడలేదు. సభాసదులందఱు తలలు వంచిరి. ద్రౌపది నేత్రములనుండి అగ్నికణములు రాలుచుండెను, కాని ఆమె మీశీతల ముఖమును గాంచఁగానే శాంతు రాలయ్యెడిది. ఆమె యా యధర్మసభను భస్మము చేయలేదు. ఆమె నిన్నుఁ జూచుచుండెను. మేమును మీ ముఖమును జూచుచుంటిమి, మీరు ధర్మము నాశ్రయించితిరి. ధర్మము అధర్మము రెండును సంసిద్ధముగ నుండెను. ఆ ధర్మము సచ్చరిత్రయు, ధర్మశీలయునగు ద్రౌపదిని రక్షించుట కసమర్థురాలయ్యెను.

ఎటుచూచినను ఆమెకు నిరాశకలిగెను. ఎవ్వరు నామెను రక్షింతురను నాశలేదు. అంత నామె అశరణ శరణుఁడు దీనబంధువు నగు కృష్ణునిఁ బిలిచెను. ఏడ్చి, కన్నుల నీరు గార్చి, దీనతతో నామె కేక వేసి యిట్లనెను:- "హా! శ్యామసుందరా! నాథా! ఎచ్చటికి పోయితివి? ప్రభూ! రక్షింపుము. దుష్టులు నానిగ్గు తీయఁదలచుచున్నారు. భక్త భయభంజనా! భగవాన్! నా భయము నేల తీసివేయవు? ఈ దుష్టుల నేల యమపురమునకుఁ బంపవు? ప్రభూ! నీ దాసీనని పిలువఁబడుచు నా కవమానము జరిగిన నది నాకు కాదు; నీకే! అశరణశరణా! ఎటు చూచినను దిక్కుమాలి నీ దిక్కు చేరితిని."

రాజా! ఆసమయమున భగవానుఁడు స్మరణమాత్రము చేతనే అచ్చటికి పరువిడి వచ్చెను. అందఱు కాతని ఘనశ్యామరూపము కనఁ బడలేదు. అతఁడచ్చట నత్యద్భుతమగు నవతారరూపమునఁ బ్రత్యక్ష మయ్యెను.ఆతడానమయముననీలవర్ణమునువదలిపెట్టివివిధవర్ణుఁడయ్యెను. ఆ సమయమున అండజ, పిండజ, ఉద్భిజ, స్వేదజాది శరీరములను వదలి యాతఁడు వసనరూపమును ధరించెను. అతని చేతనలవలన జడముకూడ చైతన్యమయ్యెను. సొంతములో ననంతదృశ్యమును జూపించెను. దుశ్శా సనుఁడు ద్రౌపదీవస్త్రముల నూడ్చిన కొలఁది అవి పెరిగిపోవుచుండెను. ఆమెనుండి చిత్ర విచిత్రములగు రంగులుగల సుందర వస్త్రములు ఒకే నూలుతో నేయఁబడినట్లు బయలుదేరి వచ్చుచుండెను. వాఁడు ద్రౌపదిని వస్త్రహీనను జేయవలెను. కాన వాఁడు బలహీనుఁడై పోయెను. ఆతఁడు చీరెలు విప్పి యెట్లైనను పాండురాజు కోడలును, మన ప్రియమైన భార్యయు, ద్రుపదరాజు పుత్రియునగు ద్రౌపదిని నగ్నంగా జేయవలెనను పట్టుదలతో నుండెను కాని యా చమత్కార మును గాంచఁగానే వాని మద ముడిగిపోయెను. వాఁడు సిగ్గుపడి కూర్చుం డెను. సభయంతయు స్తబ్ధమయ్యెను. ఆ విచిత్రవసనములు నిండుసభలో నా కాశమున ననేకములగు నింద్రధనస్సు లుదయించి ఒక్కచోటకు చేరి నట్లు పడియుండెను. పెద్ద గుడ్డల దుకాణము వలె నా సభ కనఁబడెను. దానిలో నేడ్చుచు నిలుచున్న కృష్ణ కృష్ణునిఁ బ్రత్యక్షముగఁ గాంచు చుండెను సభలోనికి వెంటనే కృష్ణుఁడు వచ్చెను. ఇప్పుడాతని పాదములు కడుగుటకు పాద్యజలముల నెక్కడనుండి తేవలయును? ఆమె తన కాటుకకంటఁ గారిన నేత్రాశ్రువులచే శ్యామసుందరుని శ్యామలారుణ పాదతలములను నడిగెను ఆ సమయమున నాతఁడామెపై నోదార్చుచు శ్యామసుందరుఁ డామెతో నిట్లనెను:- "దేవీ! ఇప్పుడు నీవు విజియ

బడిన నీకేశ పాశములను ముడుచుకొనుము. ఇంక నేను వచ్చితిని. నీకిక భయమేమియు నుండఁజాలదు."

రోదనము చేయుచు ద్రౌపది యిట్లనెను:— "శ్యామసుందరా! ఇప్పుడీ కేశములు వీడినవి. వీడినవేమో వీడినవి. ఏనుఁగు కోరలు బయటకు వచ్చినవేమో వచ్చినవి. కులీనకన్యకు ఒక్కసారి కన్యా దానము అయినదేమో అయినట్లే. పాలు ఒక్కసారి విరిగిన విరిగినట్లే. ముత్యమొక్కసారి పగిలినది పగిలినదే. వస్త్రమొక్కసారి చినిఁగెనా చినిఁగినట్లే. ఇవన్నియు మరలఁ దమ పూర్వరూపములను బొందనట్లే దుష్టుల కలుషితకరములచే స్పర్శింపఁబడిన యీ కేశపాశములు వెను కటివలె సౌభాగ్య చిహ్నములచేఁ జిహ్నితములై వేణీబంధనము చేయఁ దగవు."

మీగృహిణి యిట్లు దృఢ ప్రతిజ్ఞను జేయుటను విని శ్యామసుంద రుఁడు నవ్వుచు నిట్లనెను :— "దేవీ! వెనుకటివలె నా కేశముల నెప్పుడు మరల ముడిచెదవు? నీకిట్లు విరియఁబోసిన తల బాగుండ లేదు. అవి బంధింపఁబడి బాగినివలెఁ గనఁబడవలెనని నాకోరిక. నేను వేణీప్రియుఁడను. అందువలననే నాకు వేణిమాధవుఁడను పేరు కూడ కలదు. ఈ విరియబడిన వెంట్రుకలెట్లు వేణిగా నేర్పరచఁగలవో ఆ ఉపాయమును నాకుఁ జెప్పుము, ఏపని చేసిన నీకుటిల నీల కేశములు బంధింప వీలగునో ఆ ఉపాయములను నాకుఁ జెప్పుము."

అంత ద్రౌపది యిట్లనెను :- "ప్రభూ! ఈ కేశములు లాగిన వారి భార్యలు విధవలై యీ విధముగ తలలు విరియబోసికొని యెప్పు డేడ్చెదరో అప్పుడీ కేశములు బంధింపఁబడును. ఏ చేతులతో నీ కేశ ములు లాఁగఁబడినవో అట్టివాని చేతులు వాని బాంధవులతోసహా నిర్జీవ

ములై తెగఁగొట్టఁబడిననాఁడు ఈవేణి బంధింపఁబడును. ఈ కేశములు లాఁగినవాని శవమును కుక్కలు నక్కలు లాగి పీఁకుకొని తినుచున్నప్పుడీ కేశములకు సంస్కారము జరిగి బంధింపఁబడును. ఈ పవిత్ర కేశముల నేమూర్ఖుఁడు పీఁకెనో, వాని మృతశరీరమును కాకులు గ్రద్దలు పీఁకుచున్నప్పుడు జడగా బంధింపఁబడును."

క్రోధితయగు ద్రౌపదీదేవి కఠోర దృఢవచనములను విని శ్యామసుందరుఁ డామె నోదార్చుచు నిట్లనెను :— "పాండవపత్నీ! ద్రుపద కుమారీ! నీవు భయపడవలదు. అట్లే అగుఁగాక! నేను నీ శత్రువుల నందఱ సంహారము చేయించి వారి సమస్తకులమును నాశనముచేయించి వారి పత్నుల కేశములను విరియఁబోసికొను నట్లు చేసెదను. అప్పుడు నీ జుట్టు ముడి వేయించెదను. దేవీ! నే నింతవఱకు అసత్యమాడలేదు. ఇఁక నాఁడబోను."

మహారాజా! ఆ సమయముననే కౌరవు లంతమైరి. వారి శ్రీ లన్నియు నాశనమైనవి. వారు మృతతుల్యులైరి. మన ధర్మవృద్ధి కొఱకును, లోకములో మన పావనతను, ప్రసిద్ధిని స్థాపించుటకొఱకు శ్రీకృష్ణు డప్పుడు కౌరవులను జంపలేదు. అతఁడు తలఁచుకొనినయెడల సమస్తబ్రహ్మాండము నాతఁడు భస్మము చేసియుండెడువాఁడే; కాని అతఁడు మనలను ధర్మమందుంచి, మన చేతులతోడనే వారిని జంపింపవలయునని అతఁ డట్లు చేసెను. ద్రౌపదీదేవి ప్రతిజ్ఞను అక్షరశః నెఱవేర్చెను. ఎంత చెప్పెనో అంతయుఁ జేసి చూపించెను. సమస్త కౌరవుల పత్నులను విధవలఁ జేసి వారి సమ్ముఖముననే ఆమె కేశపాశములను బంధింపఁజేసెను.

అతని కృపనుగూర్చి యెంతని వర్ణింపగలను? ఏశబ్దములతో వర్ణించగలను? నా శిరస్సున శ్యామసుందరుని శ్రీహస్తము కలదని

నేను నిశ్చింతతో నుంటిని. ఘనశ్యాముని శీతల ఛత్ర ఛాయ కలదను కొంటిని. ఆ ఛాయ యెక్కడ విలీనమైనదో తెలియదు. నా శిరస్సు మీఁద నిప్పుడా శ్యామల శీతల, వరద కరకమలము కనఁబడుటలేదు. ఇప్పుడు నేను నిస్సహాయుఁడనైతిని. ఇప్పుడు నన్ను నేను రక్షించు కొనుటకు గూడ శక్తిలేనివాఁడ నైతిని. నా చాతురి యంతయు బోయి నది నా పరాక్రమమంతయుఁ బ్రభువు బోఁగానే సమాప్తమైనది. రాజా! ద్రౌపదిని రక్షించినవాఁడును, ఆమె కేశపాశములను మరల బంధించిన వాఁడు నగు వాసుదేవుఁ డెచ్చట విలీనమైపోయినాఁడో కదా! అయ్యో! నేనాతని పునీత ప్రేమ నిఁక నెట్లు చూరకొనఁగలను? అతని పాద పద్మములకుఁ బ్రణతుఁడనై ఎప్పుడు నాతల వ్రాల్చెదను?" అనుచు నర్జునుఁడు బిగ్గఱగ నేడ్వఁ బ్రారంభించెను.

## దుర్వాస శాపమునుండి రక్షించినవిధము

శ్లో॥ యో నో జుగోప వనమేత్య దురంత కృచ్ఛ్రాత్
దుర్వాససోఽరి విహితాదయుతాగ్ర భుగ్యః।
శాకాన్నశిష్ట ముపభుజ్య యతస్త్రిలోకీం
తృప్తా మమంస్త సలిలే వినిమగ్న సంఘః॥

—శ్రీభాగ. ౧ స్కం. ౧౫ అ. ౧౧ శ్లో.

"సీ॥ దుర్వాసుఁ డొకనాఁడు దుర్యోధనుఁడు పంపఁ
బదివేల శిష్యులు భక్తిఁ గొలువఁ

జనుదెంచి మనము పాంచాలియుఁ గుడిచిన
వెనుక నాహారంబు వేఁడికొనినఁ
బెట్టెద నవ్వుఁడుఁ బెట్టుకున్న శపింతు
ననుచుఁ దోయావగాహమున కేగఁ
గడవల నన్న శాకములు దీయుటఁ జూచి
పాంచాల పుత్రిక పర్ణశాల
గీ॥ లోనఁ దలఁచిన విచ్చేసి లోవిలోని
శిష్ట శాకాన్నలవముఁ బ్రాసించి తపసి
కోపముడిగించి పరిపూర్ణ కుక్షిఁజేసె
నిట్టి త్రైలోక్య సంతర్పి యెందుఁ గలఁడు?"
అట్టివాఁడు "మనలను విడనాడి చనియె మనుజాధీశా"

ఆంధ్రమహాభాగవతము

పరోక్షమున నున్నంత ప్రేమ, ప్రభావము సమీపమున నుండఁగా నుండదు. గుణము మానవుని అనుపస్థితిలోనే బయటపడును. ధర్మరాజుకు రాజసూయ యాగము చేయవలెనను దుష్కరమగు కోరిక కలదు. అదియు శ్రీకృష్ణకృపవలననే నెఱవేరినది. దుష్టులు కపటముచే రాజ్యమును హరించి నిండుసభలో ద్రౌపదిని దాసినిజేసి వివస్త్రను జేయఁ ప్రయత్నింపఁగా శ్రీకృష్ణుఁడు వచ్చి రక్షించెను. ఈ విషయము స్మరణమునకు వచ్చినప్పటికే ధర్మరాజునకు తన వనవాస విషయములన్నియు స్మరణకు వచ్చెను. అతఁడు అర్జునునితో నిట్లనెను :—"అర్జునా, శ్రీకృష్ణుఁడు మనలను సర్వత్ర రక్షించెను. వనవాససమయమున మన బంధువు లందఱు మనలను వదలిపెట్టిరి. శ్రీకృష్ణుఁడొక్కఁడే సదా వనమునకుఁ గూడవచ్చి మనకు ధర్మోపదేశము లొసంగుచు, తీర్థవ్రతములను గూర్చి చెప్పుచు, ధర్మసూక్ష్మముల నెఱింగించుచు మన కనేక విధముల ధైర్యమును జెప్పుచు మరల రాజ్యము లభించునను విశ్వాసము

కలిగించెను. మనకేదైన విపత్తు సంభవించెనా అతఁడు వెంటనే పరుగిడి వచ్చెడువాఁడు. వనవాస ప్రసంగమేదైనఁ జెప్పుము. తమ్ముఁడా! ఈ కథలచే నా శోకము కొంచెము కొంచెముగ తగ్గుచున్నది చిత్తమునకు ధైర్యము కలుగుచున్నది."

వనవాస ప్రసంగము వచ్చునప్పటికి అర్జునుని రెండు కన్నుల నీరునిండెను. అర్జునుఁడు తనకంటినీటిని వస్త్రములోఁ దుడుచుకొని యిట్లనెను:—"రాజా! వనవాసములో నా ప్రభువు అడుగడుగునకు కృపఁజూపు చుండెను, శరీరములో నాతఁడు ద్వారకా పురిలో నున్నప్పటికిని, మనస్సులో నాతఁడు మన సమీపముననే యుండెను. ఏదైన గొప్పవిపత్తు సంభవించెనా అప్పుడాతఁడు సశరీరుఁడై వచ్చి మనకు వచ్చిన విపత్తుల నన్నిటిని నిమిషములోఁ బోగొట్టి రక్షించెడువాఁడు. జయించిన రాజ్యమును, ధనమును ధృతరాష్ట్రుఁడు మరల పాండవుల కీయఁగలఁడని దుర్యోధనునకుఁదోచి యెట్లైనను వీరికి దక్కకుండ చేయవలెనని యాతఁడు కుటిలమును బన్ని పండ్రెండు సంవత్సరములు వనవాసము, ఒకసంవత్సరము అజ్ఞాతవాసము చేయు నట్లు పణమునుబెట్టి మరల జూదమాడెను. ఎవరోడెదరో వారు పండ్రెండు సంవత్సరములు సర్వస్వమును త్యజించి వనవాసము చేయ వలయును, చివరకు ఒకసంవత్సరము అజ్ఞాతవాసము ఎవరికిని తెలియ కుండ చేయవలయును. ఒకవేళ అజ్ఞాతవాస సమయమున కనుఁగొనఁ బడినచో మరల పండ్రెండు సంవత్సరములు అరణ్యవాసము, మరల నొకసంవత్సర మజ్ఞాతవాసము చేయవలయును. ఈ విధముగ నజ్ఞాత వాస నియమ మెల్లప్పుడు జరుగుచునే యుండును.

అసలీ పందెము పెట్టుటకు కారణము ఎల్లప్పుడు మనలను రాజ్య విహీనులఁ జేయవలెననియే. మీరు దానికి ఒప్పుకొంటిరి. చివరకు మీరే ఓడిపోయితిరి. దుర్యోధనుఁడు కట్టుగుడ్డలతో ద్రౌపదితోఁగూడ మనలను

రాజ్యమునుండి వెడలఁ గొట్టెను. ఆ సమయము వేలకొలఁది వేద పాఠకులు మీ వెంట వచ్చిరి. మీరా బ్రాహ్మణులతోఁ జేతులు జోడించి యిట్లంటిరి : భూసురోత్తములారా! నేను సమర్థుడనై యుండగ మీకు యథాశక్తిగ స్వాగత సత్కారములు కావించితిని. ఇప్పుడు నేను రాజ్య భ్రష్టుడనైతిని. ఇప్పుడు మీ యాహారము విషయమునఁ జింతింపవలసి యుండును. కావున మీరందఱును తిరిగి వెళ్ళి దుర్యోధను నాశ్రయింప వలయును. అతఁడు మీకు జీవనాధారము చూపఁగలడు. నావలెనే అతఁడు మీకు సమస్త సేవా శుశ్రూషలు చేయఁగలఁడు."

మీ రిట్లు పలుకఁగా బ్రాహ్మణులు వినయముతోనిట్లనిరి:—"రాజా! మేము దుష్టుడగు దుర్యోధనుని ఆశ్రయమున నుండఁజాలము. మాకు జీవనచింత లేదు. మేము స్వయముగ వనమునకు పోయి కందమూల ఫలాదులను దెచ్చుకొనియు, భిక్షించియు జీవననిర్వాహము కావించు కొందుము. మీరు మా యాహార విషయమునఁ జింతఁజెంద పనిలేదు. మేము మీ ధర్మాచరణమునకు సంతుష్టుల మైతిమి. మీ ధర్మ ప్రేమకు వశీభూతులమై మేము మిమ్ములను వదలఁజాలకున్నాము. మీకే గతియో మాకు నదియే గతి. కావున మీరు మమ్ముఁ బరిత్యజింపవలదు."

అంత మీరిట్లంటిరి:—"విప్రులారా! నేను స్వేచ్ఛగా మిమ్ములఁ ద్యజించుటలేదు. మిమ్ములను పోషింపఁజాలక పోవుటచేతనే నేనిట్లు మిమ్ములను ప్రార్థింపవలసి వచ్చినది. నేనుండఁగా మీరు భిక్షకు వెళ్ళుటయు కందమూలముల చింతయే యుండుటయు ఇట్లు చేయుటచే నేనుండియు వ్యర్థము. ఛీ! నేను క్షత్రియుఁడ నేలనైతిని? మంచిది. నేనింకొక ఉపాయమును ఆలోచించెదను."

ఇట్లని మీరు వారి నోదార్చితిరి. సూర్యనారాయణ మూర్తిని ఆరాధించియు, శ్రీకృష్ణ కృపవలనను నీకొక అక్షయపాత్ర లభించినది.

అది యెందఱికైన వంటలేకుండగనే భోజనము పెట్టఁగలదు. దానినుండి అనేక భోజన పదార్థములు వెలువడును. ఆ పాత్ర లభించుటచే మీరత్యానందమును బొందితిరి. ఆ పదార్థములచే మీరు దేవ, ఋషి పితృదేవతలను దృప్తినొందించుచుఁ బ్రతిదినము సహస్రబ్రాహ్మణులకు సంతర్పణయు, నింక ననేక మానవులను భోజనముచేఁ దృప్తి నొందించుచు వనములో నుండియు నింద్రప్రస్థములోవలె నతివైభవములో నుంటిరి. ఎక్కడ చూచినను మీ గుణగానమే. శ్రీకృష్ణకృపచే మీకు వనములోఁగూడ రాజ్యమునకంటె నెక్కువ కీర్తిప్రతిష్ఠలు కలిగినవి.

శత్రువుల హృదయములకు బాధ కలిగెను. వనములో మీకిట్టి వైభవము జరుగుటను గాంచి శత్రువులు వ్యాకులత చెందుచుండిరి. కాని యేమిచేయఁగలరు? మనతోఁ బోరాడుటకు వారికి సాహసము లేదు. ఇఁక జూద మాడలేరు. మన సోదరులకు కలహము కలిగింపఁ జాలకుండిరి. మన యుత్కర్షను గాంచి వారు మండిపోవుచుండిరి. ఎట్లైనను మనల నాశముచేయఁ జూచుచుండిరి ఇంతలో క్రోధావతారుఁడును, శాపములకు నిలయమును, పరమ తేజస్వియు నగు దుర్వాస మహర్షి హస్తినాపురమునకు వచ్చెను ఆతని రాకవలన వారికి మిక్కిలి సంతోషమయ్యెను వారి కార్యము నెఱవేరుట కాతని నుపయోగించుకొనఁ దలఁచిరి.

దుర్వాసమహాముని సహస్ర శిష్యులతో హస్తినాపురమునకుఁ జాతుర్మాస్య దీక్షకై వచ్చెను. అతఁడు దుర్యోధనునిఁ బరీక్షింపఁ దలఁచి, యాతని ననేక విధములఁ దిట్టుచుండెను. అసమయమున భోజనము కావలె ననుచుండెను. మంచిరుచిగల పదార్థములను సిద్ధము చేయించి వాటిని బనికిరావనుచు సేవకులను గద్దించి కోపపడు

చుండెను. అతఁడే విపరీతాచరణము చేసినప్పటికిని కౌరవుల నెట్లైనఁ గుపితులఁ జేయవలెననియే. కాని దుర్యోధనుఁడు చాల జాగ్రత్తగ నుండెను. అతఁడు మనోవాక్కాయకర్మలఁ దన శక్తిని ధారపోసి మునిని సేవించుచుండెను అతనిని ప్రసన్నునిఁ జేయుట కాతఁడెంతో తంటాలు పడుచుండెను. ముని ఉచితముగను, అనుచితముగను, అనుకూలముగను, ప్రతికూలముగను, సామయికముగను, అసామయికముగను ఆజ్ఞల నొసంగుచుండిన అతఁడు వెంటనే నెఱవేర్చుచుండెను. దానికి వ్యతిరేకముగ వొక్క శబ్దమైనఁ బలుకుటలేదు. ముని చెప్పిన దానికి ప్రతిదానికి అంగీకరించి చేతులుజోడించు చుండెను. అతఁడు తన సహన శీలతచే నెప్పుడు సంతుష్టుఁడే కాని మునినికూడ సంతుష్టుని జేసెను. దుర్వాసమహర్షి అతని సహన శీలతకు, సేవకు ప్రసన్నుఁడై యిట్లనెను :— "రాజా! నీవు నా మనస్సుకు వ్యతిరేకముగ నడువలేదు. అనుచిత, ప్రతికూలాచరణము వలనను నీవు విసుగుకొనలేదు. మిక్కిలి సంతుష్టుఁడనైతిని. నీవు నీకిష్టము వచ్చిన యెట్టి కఠినవరమైన నడుగుము. ఇచ్చెదను. నీకు ప్రియమగు కార్యమును నీ సంతోషము కొఱకు చేయఁదలఁచితిని."

దుర్యోధనునకు ధనైశ్వర్యములకు లోటులేదు. కావున నవి యవసరములేదు. అతని హృదయమునకు మన అన్నదమ్ములమైదుగురము కంటకములుగ నుంటిమి. మన వినాశము వలన నాతనికిఁ గలుగు సంతోషము త్రైలోక్యరాజ్యము లభించినను లభింపదు. దుష్టులకు పరుల సుఖనాశనమువలన సంతోషము కలుగును. అతఁడు మిక్కిలి వినయముతో మునిచరణములకు మ్రొక్కి కపట వచనములతో నిట్లనెను:— "మీరు ప్రసన్నులగుటయే నాకు వేయి వరదానములతో సమానము. నా సేవచే మీరు సంతుష్టులరైతిరి. అంతే చాలు. నాకు సమస్త వరములు లభించినట్లే మీరంతగా నన్ను వరమడుగు మను

చున్నారు. కావున నేనొక్క వర మడుగుచున్నాను. మీరు నాయం దనుగ్రహముంచి నాయాతిథ్యమునకెట్లు వచ్చితిరో అట్లేమాయన్నయగు ధర్మరాజు దగ్గఱకు మీ వేయిమంది శిష్యులతోఁ బోయి ఆతనిఁ గృపఁ జూడుఁడు. ఆతఁడు మావంశములో జ్యేష్ఠుఁడు, ధర్మాత్ముఁడు, ధర్మ పాశబద్ధుఁ డగుటచేతనే యాతఁడిప్పుడు వనవాసము చేయుచున్నాఁడు. అక్కడ కూడ ఆతఁడసంఖ్యాకులగు నతిథులకు సంతర్పణచేసి సంతోషపెట్టుచున్నాఁడు. మీరచ్చటకు శిష్యులతోఁబోయి నన్నెట్లు పరీక్షించితిరో ఆతని నట్లే పరీక్షింపుఁడు."

దుర్వాసునకుఁ గావలసిన దదియే. ఆతఁడిట్లనెను :— "మంచిది. మేమిప్పుడే వెళ్లెదము. మేము ధర్మరాజుని యాతిథ్యము నవశ్యము గ్రహింతుము."

దుర్యోధనుని హృదయములో పాపవాసనకలదు. ఆతఁడు చెడ్డ భావనతో మునినిఁ బంపుచున్నాఁడు ఆతని పన్నాగము మునికెట్లైనఁ గోపము వచ్చి మనలను శపింపవలయునని. కావున నాతఁ డిట్లనెను:— "స్వామీ! అట్లు కాదు. ద్రౌపదీదేవి భోజనముచేసిన తర్వాత మీరచ్చటికి చేరవలయును. వెళ్ళగానే మీరు భోజన మడుగుఁడు."

దుర్వాసునకు సంతోష మయ్యెను. ఆతఁడు దీని కంగీకరించెను. ద్రౌపది భోజనము చేసిన తర్వాత పోయిన సూర్యదత్తమగు నక్షయ పాత్రలో భోజనమేమియు నుండదు. ముని మఱునాఁటివఱకు కనిపెట్టుకొని యుండఁడు. వెంటనే భోజనము కావలెననును, ఆ ఘోరవనములో ధర్మరాజు సహస్ర బ్రాహ్మణులకెట్లు క్షణములో భోజన మేర్పాటు చేయఁగలఁడు! వెంటనే భోజన మిడక పోవుటచేఁ శాపమొసంగి పాండవుల భస్మము కావించును. ఈవిధముగా నాయాసముగానే

శత్రునాశము కాఁగలదు. "పాము చావవలెను, బడితె విరుగరాదు. తన కపకీర్తి రాఁగూడదు. తన శత్రువులు నశించి తాను సామ్రాట్టై రాజ్య మేలవలయును." అని దుర్యోధనుఁ డాలోచించుకొని దుర్వాసమునిని మన దగ్గఱకుఁ బంపెను.

ఆదినమున నేదియో పర్వము. వేలకొలఁది ఋషులు, మునులు, బ్రాహ్మణులు భోజనము చేయుటయే గాక ద్రౌపది కూడ భోజనము చేసివేసెను. ఆమె ఆ అక్షయపాత్రను బాగుగా తోమి యట్లుంచఁగానే దుర్వాసుఁడు శిష్యులతో వచ్చెను. ధర్మరాజు యథోచిత పూజాసత్కారములు కావించి భోజనము చేయవలసినదని ప్రార్థించెను. అతఁడు వచ్చిన దిందులకే కదా! అందువలన నాతఁ డిట్లనెను :- "రాజా! మాకు మిక్కిలి ఆఁకలి అగుచున్నది. నీవు త్వరగా వంట చేయించుము. ఇంతలో మధ్యాహ్న సంధ్యావందనము చేసికొని వచ్చెదము. వచ్చునప్పటికి భోజనము తయారు చేయించవలెను."

ఇట్లని ముని ప్రత్యుత్తరము నాశింపకయే పరీక్షించుటకై సరోవరమునకు స్నానమునకుఁ బోయెను.

అప్పుడు మీరెంతయో చింతించిరి. ఇక ఋషిచే శపింపబడి మనము భస్మము కావలసియుండునని మేముభయపడితిమి. పదివేలమందికిఒక్క గడియలోనే పదార్థములచేఁ ఎట్లు తృప్తి పెట్టఁ గలుగుదుము? ఏసామగ్రులతో వారల కాతిథ్య సత్కారము లొనర్పఁగలము? మన అందఱకంటె ద్రౌపది కెక్కుడు చింతకలిగినది. ఆమె గృహిణి. గృహలక్ష్మికి అతిథ్యభార మెక్కుడుగఁ గలదు. ఇంటికి వచ్చిన యతిథులకు సమస్త విధములగు నాహారపానీయముల నొసంగి సంతుష్టులఁ జేయుట మహిళలకుఁ దెలిసినట్లు మనకుఁ దెలియదు. ఆమె భోజనము చేయకున్న లక్ష మంది అతిథులు వచ్చినప్పటికిని చింతించవలసినపనిలేదు. కాని ఆదినమున

నామె భోజనము చేసినది.అక్షయపాత్రసిద్ధి ఆదినమునకుఅయిపోయినది. సౌమ్యఋషి అయియుండిన యెడల నాతని పాదములు పట్టుకొని పరిస్థితిని వివరించి చెప్పి సమాధానపరచ వచ్చును, కాని ఇక్కడ అంతా యెదురు తిరిగినది.వచ్చినది దుర్ధర్షుఁడగు దుర్వాస మహర్షి.ఆతనికి నచ్చ జెప్పుటయుఁ బ్రార్థించుటయు నంతయు వ్యర్థమే.ఆతని యభిప్రాయమునకు విరుద్ధ మెక్కడనైన కనఁబడెనా శాపము పెట్టితీరును. ద్రౌపదికి అప్పుడు ఉపాయమేమియుఁ దోఁచ లేదు 'దిక్కులేని వారికి రాముఁడే దిక్కు'— ఆమె ఆర్తితో నార్తిహరుని బిలిచెను. దుఃఖమనస్కయై ద్వారకాధీశుని శరణు వేఁడెను ఆమె కన్నుల నీరు నించి గద్గదకంఠముతో నేడ్చుచు నిట్లు పిలిచెను:— "శ్యామసుందరా! నా మొఱ విని నా పసుపు కుంకుమను నిలుపుము. నా మంగళ సూత్రము నక్షయము కావింపుము. నన్ను విధవను గాకుండఁ జేయుము. నా పతులకు వచ్చిన విపత్తులను దొలిగించుము. కోపిష్ఠియగు దుర్వాసుఁడు అసంతుష్టుఁడై శాప మొసంగకుండునట్లు చేయుము. అశరణశరణా! నీవే మాకు గతి. ఘోరాతిఘోర విపద్విభంజనా! నీవు మమ్ములను రక్షించితివి, కాని యీ విపత్తు అన్నిటికంటె భయంకరమైనది. బ్రాహ్మణ శాప దగ్ధులకు పరలోకములుకూడ లేవు. అందఱిలో నపకీర్తియుఁ గలుగును. నీకు భక్తులగు నాభర్తలకి దుర్దశ సంభవించినచో నది నీకు లజ్జాకరమగు విషయము. నీ భక్తవత్సలతా బిరుదమునకుఁ పెద్దదెబ్బ. మారాజ్యము, ఇల్లు, వాఁకిలి పోయి అడవులలోఁ దిరుగుచున్నప్పటికిని మాకు చింత లేదు. కాని మమ్ముల నీ విపత్తునుండి రక్షించుము.". ద్రౌపది యిట్లనుచుండఁగనే శ్రీకృష్ణుని అడుగుల చప్పుడు వినఁబడెను. తన యశ్రుజలముచేఁ గమలనయనుఁడగు కృష్ణుని కర్ఘ్య మొసంగెను ఆతని రెండు చరణములు తడిసిపోయెను అత్యంత వ్యగ్రతతో శ్యామసుందరుఁడు ద్రౌపదితో నిట్లనెను:— "ద్రౌపదీ! ద్రౌపదీ! నాకు మిక్కిలిగ ఆఁకలి

అగుచున్నదమ్మా! తినుట కేదైనఁ బెట్టుము." ద్రౌపది కన్నుల నీరు కార్చుచుఁ బ్రేమకోపస్వరమున నిట్లనెను: "నీ కెప్పుడును ఎగతాళియే. తినుటకు ఇంటిలో నేమైన నుండిన నిన్నీ రాత్రిలోఁ బిలుచుటెందులకు? ద్వారకనుండి ఇంత కష్టపెట్టి యెందులకు రప్పింతును?"

అతఁడీ ప్రత్యుత్తరమును విని నవ్వలేదు తన వ్యగ్రతను దగ్గించనులేదు. నేను బయటనిలుచుండి శ్యామసుందరుఁడే విచిత్రమును చేయునో చూతమని అతని నటనను జూచుచునేయుంటిని. అదేస్వరముతో నాతఁడిట్లనెను:- "ఈ ఇంటివారి కెప్పుడును కంటనీరే కారుచుండును. ఎప్పుడు తలఁచుకొనిన నప్పుడు కంటనీరు కార్చెదరు. విషయము చెప్పుము, ఎందుల కేడ్చుచున్నావో? నాకు భోజనము పెట్టుము. చాల దూరమునుండి వచ్చుచున్నాను. కంట నీరు పెట్టుచున్నావు. కంటనీరు పెట్టిన కడుపునిండునా యేమి?"

అత్యంత కాతరభావముతోఁ గుపితయై మమత్వమును బుంజీభవింపఁ జేయుచు ద్రౌపది యిట్లనెను:- "ఇప్పుడింకొక దుర్వాసుఁడు వచ్చియున్నాఁడు, నీ శాపమువలన నాకు భయములేదు. నీకిచ్చుటకు నావద్ద నొక గింజైన లేదు. ఈవిషయము నేను స్పష్టముగఁ జెప్పుచున్నాను. రేపు ఇష్టమువచ్చినట్లు తినవచ్చును. ఇవ్వేళ మమ్ముల నిజమగు దుర్వాసునినుండి రక్షింపుము. అతని శాపాగ్నికి మమ్ముల దగ్ధులుగాకుండఁ జేయుము."

అతఁడిదేస్వరముతో నిట్లనెను:- "ఆదుర్వాసుని సంగతి తర్వాత చూచుకొనవచ్చును. అతఁడిక్కడ లేఁడుకదా! చంకలో వానిని వదలి నావడలోని వాని చింతయెందులకు? అతఁడిక్కడికి వచ్చినప్పుడు చూచుకొనవచ్చును. ముందు నాకు దినుట కేమైన నిమ్ము."

ద్రౌపది మిక్కిలి దీనతతో నిట్లనెను:– "ప్రభూ! అధికముగ నుపహాసము చేయకుము. అసలు పరిహాసమునకుఁ దావుండదు. సూర్యదత్తమగు పాత్రను నేను తోమి పెట్టితిని. ఇంక నేటికి దానిలో నేమియు దొరకదు. నీకేమి పెట్టఁగలను?"

భగవానుఁ డిట్లనెను:– "దేవీ! నీ వెప్పుడు పూర్ణవు. నీ భాండారము అక్షయము. అదియెప్పటికి వట్టిపడదు. సూర్యనారాయణుఁ డిచ్చినదిగాన నిశ్చయము. నా తృప్తికొఱకు దానిలోఁ గొంచెమైనా గొప్పయో యుండకపోదు."

ద్రౌపది కుపితయై మిక్కిలి కోపముతో పాత్రను దెచ్చి శ్రీకృష్ణుని సమ్ముఖమునఁ బడవేసి యిట్లనెను:– "చూడుము. ఇప్పుడే బాగుగా తోమి పెట్టితిని. దీనిలో నేమున్నది?"

పాత్రను బాగుగా పరీక్షించి చూచెను. దైవయోగమున ద్రౌపది తోమినప్పుడు దానికి ఒకమూలను ఆకుకూర ఒకటి అతుకుకొని యుండెను. ద్రౌపది దానినిఁ జూడనేలేదు. దానిని గాంచి మిక్కిలి సంతోషముతో హరి యిట్లనెను:– "చూడుము. దీనిలో నేమియు లేదంటివి. దీనిలో నెంతకూర యున్నదో చూడుము. ఇది నాకడుపు నిండుటకేకాదు సమస్త చరాచర ప్రపంచమును తృప్తిపెట్టగలదు." ఇట్లని దానిని వ్రేలితోఁ దీసి కృష్ణుడు తన అఱచేతిలో వేసికొని 'యీ శాకమాత్రచే సమస్త బ్రహ్మాండము తృప్తి చెందుఁగాక!' యని నోటవేసికొనెను.

నిజముగా నా సమయమున దుర్వాసునకు అతని శిష్యులకును పొట్ట లుబ్బిపోయెను. స్నానము చేయుచున్న వారికి పెద్ద పెద్ద త్రేపులు వచ్చెను. వారిలో వారిట్లనుకొనిరి:– "మన పొట్టలో నొక్క మెతుకు పోవుటకుఁగూడా సందులేదు." మనము భోజనము చేయకపోయిన ధర్మరాజు కుపితుడై శపించునేమోనని దుర్వాసుఁడు కూడ భయపడెను.

అతనికి అంబరీషుని దగ్గఱ జరిగిన విషయము జ్ఞప్తికి వచ్చెను. భగవానుని సుదర్శన చక్రతేజము జ్ఞాపకము వచ్చునప్పటికి అతని ముఖము వాడిపోయెను. అప్పుడు వారెవరితోడను జెప్పకయే పారిపోయిరి. అతని శిష్యులుకూడ అతనితోబాటు కాలికి బుద్ధి చెప్పిరి.

కృష్ణుఁడు భీమునితో నిట్లనెను:-"భీమసేనా! నీవు శీఘ్రముగ వెళ్ళి మునులతోఁగూడుకొని దుర్వాసుని భోజనమునకు రమ్మని చెప్పుము, వంట సిద్ధమైనది."

ఆమాట వినఁగానే భీముఁడు పరువిడెను. భీముఁడువెళ్ళి చూచునప్పటికి మునులందఱును గోపీనములు పొడివి పెట్టుకొనకయే తడి గోఁచుల తోడనే పారిపోవుచుండిరి. భీముఁడు దుముకుచుఁ బరువిడి వారినిఁబట్టుకొని యిట్లనెను:-"స్వాములారా! ఈ పద్ధతి బాగుండలేదు. మీరు వంటచేయుమని చెప్పి పారిపోవుచున్నారు. మా సామాగ్రియంతయు నష్టమైపోయినది. అది యేమికావలయును?"

మిక్కిలి దీనముగా దుర్వాసుఁ డిట్లనెను :-"భీమసేనా ! నిజము చెప్పుచున్నాను. ఏమి జరిగినదో కాని పొట్టలో ఆవగింజ పట్టునంత సందుకూడ లేదు. అట్లు పొట్ట ఉబ్బిపోయినది. ఇప్పుడేమైనఁ దింటిమా యమలోకమునకుఁ బోవలసినదే. మమ్ములను క్షమింపుడు. ధర్మరాజుతో మామీఁదఁ గోపపడవలదని చెప్పుము : పరిస్థితి పెడ తిరగకున్నచో మేమాతని యాతిథ్యమును గొనెడువారమే."

భీముఁడింతనూ తమునకే ఒప్పుకొనునా? అతఁడిట్లనెను:-"అయితే స్వామీ! మీరిప్పుడు రాకపోయిన మమ్ముల నాశీర్వదించి వెళ్ళుఁడు."

దుర్వాసుఁడు ప్రసన్నుఁడై యిట్లనెను:-"నేను హృదయపూర్వకముగ నాశీర్వదించుచున్నాను. మీరు సమస్త భూమండలములను

ఏకచ్ఛత్రాధిపతులుగ నేలఁగలరు. మీరు బాగుగా వృద్ధి పొందుదురు గాక! మీ నాశము నాశించి యెవ్వరు పాపబుద్ధితో మీవద్దకు నన్నుఁ బంపిరో వారికి సర్వనాశము కలుగుఁగాక! వాని వంశములో వారికి నీరు విడుచువారు కూడ లేకుండఁ బోవుఁగాక!"

ఈవిధముగ నెవని కృపచే మనము దుఃఖ విముక్తులమైతిమో, శాపమునుండి రక్షింపఁబడితిమో, ఆపత్తులను గడచితిమో, ఆ పరాత్పర ప్రభువు మనల నందఱను వదలి వెళ్ళిపోయినాఁడు. మన కార్యము లన్నియు గుర్తులుగ నిలిచియున్నవి. ఇప్పుడు ఈ లోకమంతయు నరకముగఁ దోఁచుచున్నది. ఈ భోగము లనుభవించుటవలన మనకేమి సుఖము? రాజా! ఇప్పుడు మనము కూడ భగవానుని మార్గము ననుస రింప వలయును."

ఇట్లు చెప్పుచుఁ జెప్పుచు నర్జునుఁడు మరల దుఃఖితుఁడయ్యెను.

## పశుపతితో యుద్ధము- కృష్ణ కృప

శ్లో॥ యత్తేజసాథ భగవాన్ యుధిశూలపాణి
ర్విస్మాపితః సగిరిజోఽస్త్రమదాన్నిజం మే।
అన్యేఽపి చాహమమునైవ కలేవరేణ,
ప్రాప్తో మహేంద్ర భవనే మహదాసనార్ధమ్॥

—భాగ. ౧ స్కం. ౧౫ అ. ౧౨. శ్లో.

"సీ॥ వందికై పోరాడ ఫాలాక్షుఁ డెవ్వని
బలమున నాకిచ్చెఁ బాశుపతము
నెవ్వని లావున నీమేన దేవేంద్రు
పీఠార్ధమున నుండు పెంపుఁ గంటిఁ..."

అట్టివాడు "మనలను దిగనాడి చనియె మనుజాధీశా॥

— శ్రీమదాంధ్ర భాగవతము

భగవంతుఁ డనేక విభూతులలో విభక్తమై భక్తుల ననుగ్రహించును. ప్రపంచములో నేవ్యక్తిద్వారానైన మనకు మేలు కలిగెనా, అది శ్యామసుందరుఁడే ఆ రూపమునఁజేసెననియు, దనకృపావృష్టిని గురిపించెననియుఁ దెలిసికొనవలయును. ఆతఁడేమన మీఁదగల కృపచే సన్మార్గోపదేశము నిచ్చుచుండెను. ఇట్లాలోచించి ధర్మరాజిట్లనెను:- "అర్జునా! ఇంకొకరైనచో భగవానుఁడలక్ష్య భావముతో ననుగ్రహించునేమో గాని, మనమీఁద నాతఁడు సర్వదా సాక్షాత్తుగ ప్రత్యక్షమై కృపఁ జూపును. ఆయన కృపవలననే మనము విజయులమైతిమి, లేకున్న పరశురాము నెదిరించు సాహసముగల భీష్ముని నెదుర్కొను సాహస మెవరికి కలదు? నీవు నాకు వనవాసమునకు సంబంధించిన విషయములను జెప్పితివి. ఇంక నచ్చట నుండగా జరిగిన విషయములు కొన్నిటిని జెప్పుము. ఇవన్నియు నా ముఖమున జరిగినప్పటికి, నీనోట వినుచుండిన నాకవి నూతనములుగఁ దోచుచున్నవి. కృష్ణకథామృతమును వినిన నెవరికి తృప్తికలుగును?"

ధర్మరాజు వాక్యములను విని అర్జునుఁ డిట్లనెను:—"రాజా! అనంతస్మృతులను ఈ చిన్ననాలుకతో నీ యల్పకాలమున నెట్లు చెప్పఁ గలను? కాని, చెప్పఁదగినంతవఱకు చెప్పెదను. దీనిని చెప్పుటచేత

నా హృదయము తేలికపడుచున్నది. శోక సంతాపములు తగ్గుచున్నవి. వనవాస దుఃఖములు సహింపరానివి. వాటి నన్నిటిని మనము శ్యామసుందరుని కృపచేతనే దాటఁ గలిగితిమి. మీరు మీ పైతృక రాజ్యమును బొందవలెనని కోరెడువారు. కాని, దుర్యోధనుని దుష్టస్వభావమును కనిపెట్టి యుద్ధము లేనిది అతఁడు రాజ్యము నీయఁడని మీరు గ్రహించితిరి యుద్ధమనఁగానే మీకు రోమములు నిక్కబొడుచెడివి. ఆదాన, సంధాన విసర్గ, సంహారములను చతుర్విధ ధనుర్విద్యా చరణముల నెఱిఁగిన భీష్మ, ద్రోణ, కర్ణ, అశ్వత్థామాదుల బలపరాక్రమములను స్మరించి, రాజ్యము మీకు దక్కదని మీకు భయము. సమస్త దేవతలు కలిసి వచ్చినను ఆ వీరులను జయింపలేరనిన నింక మానవుల సంగతి చెప్పనేల? మీరిదే చింతలో దీర్ఘనిశ్వాసములు విడిచెడువారు. అజగరునివలె విషాదమున మునిఁగి ఉస్సురనుచుండెడివారు. ఇఁక గత్యంతరమేమియు లేకపోవుటచే వ్యాసుఁడిచ్చిన దీక్షను మీరు నాకిచ్చితిరి. దాని మూలమున చరాచర జ్ఞానము లభించి, ఇంద్రుని సమీపమునకు వెళ్ళి దివ్యాస్త్ర శస్త్రములను సవిధిగఁ బ్రాప్తింపఁ జేసికొనవచ్చును.

దీక్షనొసంగి మీరత్యంత దుఃఖిత మనస్సుతో నన్నరణ్యమునకుఁ దపస్సుచేయఁ బంపిరి. మీ యాజ్ఞ ప్రకారము అగమ్య నిర్జన వనములోనికి నేనొంటరిగా వెళ్ళితిని. నాకు కృష్ణుఁడే ఆధారము. అతఁడు సర్వత్ర నాకు మేలే చేయును. నా యనిష్టములను, విఘ్నములను నాశమొనర్చును. పక్షులుకూడ వెళ్ళఁజాలని గంధమాదన పర్వత ప్రాంత ఘోరారణ్యమునకు నేను తపస్సుచేయఁ బోయితిని. ఆ ఏకాంతస్థానమున నా తండ్రియగు దేవేంద్రుని దర్శనమయ్యెను. అతఁడు నాతో నిట్లనెను:- ఈ ప్రదేశమున పశుపతి శూలపాణియగు విశ్వేశ్వరుఁడు. నీవాతని నారాధించి ప్రసన్నునిఁ జేసికొనినచో నిన్ను

నేను సశరీరముతో స్వర్గమునకుఁ బిలిపించుకొని అస్త్రశస్త్రముల నుప దేశించెదను" ఇట్లు చెప్పి దేవేంద్రుఁ డంతర్ధానమయ్యెను.

నా శ్యామసుందరుఁడే శివరూపమును ధరించెను. నా యిష్టదైవ మున కాతఁడభిన్నరూపుఁడను భావనతో నేను త్రిశూలపాణియగు శివుని ధ్యానించి పూజించితిని. నాకు భయమునులేదు, చింతయునులేదు నిర్భయుఁడనై ఉమాపతి నీలకంఠుని ఆరాధనములో నిమగ్నుఁడ నైతిని.

ఒక దినమున నొక రాక్షసుఁడు వరాహ రూపమును ధరించి నన్ను జంపుటకు వచ్చుచుండుటను గాంచితిని. నాకు నా ద్వారకా నాథుఁడు కలఁడను నాశ; అందువలన నే నెవరి నెదుర్కొనుటకును భయపడ లేదు. తపస్సు చేయు సమయమున నే నెవరిని జంపఁదలఁప కున్నను, సూకరరూపమును ధరించి నా ప్రాణములు తీయుటకే వచ్చు నసురుని ఉసురులు గొనుటకై గాండీవధనస్సునకు కఱకు శరముల నెక్కించితిని. ఇంతలోనే నా ముందు భయంకరుఁడగు నొక భిల్లుఁడు, వాని భార్య ధనుర్బాణములు ధరించి నా వైపునకు వచ్చుచుండుటను గాంచితిని. అతఁడు కాలాంజన పర్వతసమానముగ నడ్డు పొడవు కలిగి నల్లగ భయంకరముగనుండెను. అతని కన్ను లెఱ్ఱగ మండిపోవు చుండెను. వేలకొలఁది కిరాతులు, కిరాత స్త్రీలు అతని వెనుక హూఁ హూఁ అనుచుఁ బరువిడివచ్చుచుండిరి. వారందఱా తపోయోగ్యమైన శాంత ప్రదేశమును తమ గగ్గోలుచే నశాంతముగను గోలాహలముగను నొనర్చిరి. వారు స్వచ్ఛందముగ నన్నే లక్ష్యముగఁ బెట్టుకొని నిర్భయ ముతో వచ్చుచుండిరి. రాఁగానే భయంకర కిరాత ధనుర్ధారి నన్ను గద్దించుచు నిట్లనెను:- "నీ వెవఁడవు? ఇక్కడికి ఎందులకు వచ్చి నావు? జాగ్రత్త! నీవు పొరపాటున నైన నీవావరాహముపై బాణము

విడువరాదు. ఇది నా వేఁటపంది. నీవు అహంకారముచే దీనిమీఁద బాణము వేసితివా నేనీ సూకరముతోబాటు నిన్నూ యమపురి కంపెదను."

ఒక సామాన్య ఆటవిక భిల్లుఁడిట్లు నిర్భయముగ నన్నుఁ గఠోరముగఁ బలుకుచున్నాఁడని నాకు మిక్కిలి కోపము వచ్చెను. నే నాతని మాటను లక్ష్యపెట్టక ఆ వారాహరూప ధారి యగు రాక్షసుని బాణమునఁ గొట్టితిని. ఆ భిల్లుఁడు కూడ ఒక బాణమును విడిచెను. రెండు బాణములు తగులుటచే మూఁకుడను నా దైత్యుఁడు తన వరాహరూపమును వదలి చచ్చి క్రిందపడెను. దైత్యుఁడు చచ్చెనుగాని కిరాతునకు మిక్కిలి కోపము వచ్చెను. అతఁడు నాతో నిట్లనెను:- "నీవు నేను కొట్టదలఁచిన జంతువు నేలఁ గొట్టితివి నేను మొట్టమొదట చంపఁదలఁచిన దానిపైని నీవు బాణము నేల విడచితివి?"

నేను క్రోధోద్రిక్తుడనై యిట్లంటిని:- "పో, పో, ఊరకే వాగుచున్నావు. నీవెవ్వఁడవైన నాకేమి? నన్నుఁ జంప వచ్చిన పశువును గొట్టితిని. వీఁడు దైత్యుఁడు. నన్నుఁ జంప వచ్చినాఁడు. ధర్మము నను సరించి వీనిని నేనే వధింపవలయును. నీవు వేటనియమములకు విరుద్ధముగ వర్తించు చున్నావు. ఇక్కడినుండి వెడలిపొమ్ము. లేకున్న నిన్ను యమపురికంపెదను. నేనర్జునుండనని నీ వెఱుఁగనట్లున్నావు. ఈ గాండీవ సహాయమున శ్రీకృష్ణ కృపచే దేవతలందఱను, ఇంద్రునిగూడ జయించితిని. నీ ప్రాణములమీఁద తీపియుండిన నిప్పుడే యిక్కడనుండి నడువుము."

నిర్భయుడై ఆభిల్లుఁడిట్లనెను:- "నాకు నీ గాండీవభయమును లేదు. నేను నీ మాటలను వినువాఁడనుగాను. నన్ను వెళ్ళుమనుటకు నీ వెవరు? ఈ యరణ్యము మాది. దీనిలో మా యిష్టమువచ్చినట్లు మేము

తిరిగెదము. మా రాజ్యములోనికివచ్చి మాకార్యములలో జోక్యము కలుగఁజేసుకొనుచు మమ్ములను వెళ్ళుమందువా? ఈసూకరము నా బాణముచేతనే చచ్చినది."

నేను కుపితుఁడనై యిట్లంటిని:— "ఊరకే వాగితివా, ఒక్క బాణమున మట్టుపెట్టెదను. వాగుడాగిపోవును. ఎక్కడో బయలుదేరి వచ్చినాఁడు రాజుకొడుకు. ఆరణ్య మందఱిసొత్తు. నిజమునకు నీబోటి మ్లేచ్ఛుఁడు రాఁగూడదు. నేనిక్కడ భూతనాథుఁడగు శివునిగూర్చి తపస్సు చేయుచున్నాను."

ఇదివిని యాభిల్లుఁడు నన్నవజ్ఞచేయుచు నిట్లనెను:- "నీవు భూతనాథుని, ప్రేతనాథుని, పిశాచనాథుని ఆరాధించిన నెవరికేమి? ఆ మృగమును నేను కొట్టవలదనిన నేల కొట్టితివి?"

నేను రోషమున హాస్యము చేయు నవ్వునవ్వుచునిట్లంటిని:- "నీవు చెప్పినమాట వినవు. నీకును ఈదైత్యుని గతియే పట్టవలయును. నేను తపస్సు చేయుచుండఁగా హింసింపఁదలఁచుట లేదు; కాని నీకు కాలము ముగిసినది కాచుకో" ఇట్లని నేనొక తీక్ష బాణమును భిల్లునిపై వైచితిని. బాణము వాని శరీరమునకుఁ దగులఁగానే రాతికి తుమ్మముల్లు గ్రుచ్చఁగానే విరిగిపోయినట్లు విరిగిపోయెను. ఇది చూచి నేనాశ్చర్య పడితిని. నా క్రోధ మింకనూ నధిక మయ్యెను. అంత నేను అర్ధచంద్రాకార బాణముచే నాతని శిరస్సు ద్రుంప విడిచితిని. అతఁడు నవ్వుచు దానినిఁ దనచేతఁ బట్టుకొనెను. అంత నేను అసంఖ్యాంకములగు బాణములను అతనిపై వదలితిని. నలువైపులను అతని బాణములచేఁ గప్పివైచితిని, కాని యాతఁడు మేరు పర్వతమువలె నచంచలుడై నిలిచెను. ఒక్క బాణమైన నాతని శరీరములో గ్రుచ్చుకొనలేదు. నా యక్షయ తూణీరములోని బాణములన్నియు సమాప్తమయ్యెను. అప్పుడు నేను

కొల్లగొట్టఁబడిన వ్యాఘ్రమువలెను, విషపుతిత్తిని పెరకివేసిన పాము వలెను, రెక్కలు విరిచిన పక్షివలెను, తెడ్డు, చుక్కాని, తెఱచాఁప కొయ్య విరిగిన నావవలెను, గోళ్లు, కోఱలు పెఱికివేసిన సింహమువలె నిస్సహాయుండనైతిని గాని సాహసమును విడలేదు. నా ధనుస్సు యొక్క కొనచే వాని నావలకుఁ ద్రోసితిని. ధనుస్సు నాయన శరీరములోఁ గ్రుచ్చునప్పటికి, ఆతఁడా ధనుస్సును సహజ స్వభావమునఁబట్టి లాగుకొనెను. ధనుస్సును లాగుకొనఁగానే నేను పగబట్టిన త్రాచువలె బుసలు కొట్టితిని. నడుమున కత్తితీసి నేనాతని గొట్టినప్పటికి అది తుంపులు తుంపులై క్రిందపడెను.

ఇఁక నాదగ్గఱ వస్త్రము లేమియు లేకపోవుటచే, నడుమునకు గుడ్డకట్టి, ఆతనితో ద్వంద్వయుద్ధముచేయ నను కట్టితిని. ఆతఁడుకూడ దానికి సిద్ధపడెను. నేనెంత పోరాడినను ఆతఁడచలమువలె నిలిచెను. శక్తికొలఁది నేను గ్రుద్దుచుంటిని, కాని ఆతనికి దెబ్బతగులటయే లేదు. పైగా నాచేయి నొప్పివేయుచుండెను. ఏదైన నొక లోహశిలపైఁ గొట్టుచున్నట్లు నాకు తోఁచుచుండెను. ఆతఁడచలుఁడై యున్నాఁడేయని నేనాతని నాబలముకొలఁది క్రిందఁబడ వేయఁ దలంచునప్పటికి, ఆతఁడు తన బాహువులచే నన్ను బిగించి పత్తెను. అప్పుడు నాకు కంబడి కప్పుకొన్నట్లు వెచ్చగనుండెను. ఇఁక నాప్రాణములు పోవుచున్నవనుకొనుచుంటిని. నా నోటినుండి రక్తము పడుచుండెను. నేను మూర్ఛితుడనై క్రిందఁ బడిపోయితిని. ఆతఁడు నవ్వుచు తన భిల్లపత్నితో నిలుచుండెను.

కొంచెము సేపటికి నాకు మూర్ఛ తెలిసెను. అంతనే నిట్లేడ్చితిని:— “ఓ శ్యామసుందరా! ఇవ్వేళ ఏ భిల్లునిచే నోడింపజేయుచున్నావా? నేను శంకరునిగూర్చి పార్థివపూజ చేయుచున్నాను.

మృణ్మయ ప్రతిమనుజేసి నే నాశుతోషుఁడగు పశుపతిని బూజించు చున్నాను." నేను పార్థివ శివలింగముపై మాల వేసితినా, ఆ మాలపోయి ఆతని మెడలో నుండెడిది. ఈ భిల్లవేషధారి శంకరుఁడని నేనప్పుడు గ్రహించితిని. నేను వెంటనే ఆతని పాదములమీఁదఁ బడితిని. కిరాత రూప ధారియగు నా శంకరుఁడు తన ఛద్మ వేషమును మార్చి సాక్షాత్తుగ శంకరరూపమునను, గౌరీరూపమునను ప్రత్యక్షమైరి. ఆ శ్యామ సుందరుని కృపచేతనే నేను శివుని సంతోషపరుపగలిగితిని. పినాకపాణి యగు పశుపతి నా పురుషార్థమునకు మెచ్చుకొని, నన్ననేక విధములఁ బ్రశంసించుచు నిట్లనెను:— "అర్జునా! నేను నీయెడలఁ బ్రసన్నుఁడ నైతిని. నీకు కావలసిన వరమడుగుము ఇచ్చెదను." నేను విశ్వవిజ యుఁడ నగునట్లు వరమడిగితిని. అతఁడు కృపతో నాకు ప్రసన్నతా పూర్వకముగ వరము లొసఁగి, తన పాశుపతాస్త్రమును గూడ యిచ్చెను. రాజా! ఎవని కృపచే నేనింత సాహసము చేసితినో, అతఁడీ ధరాధామ మును వదలి వెళ్ళిపోయెను. ఇప్పుడు నేను నిర్బలుఁడనైతిని. అక్కడే యింకొక విచిత్ర సంఘటన జరిగినది. అది ఇది—

## (౨)

## లోకపాలురద్వారా అస్త్రప్రాప్తి

ఛప్పయ

ఇంద్ర, వరుణ, యమ, ధనద ఆ, అస్త్ర సహితదర్శనదియే।
కరీ కృపా జిన కృపా తేఁ, కృష్ణ కహాఁ అబ చలి గయే॥

అర్థము

ఇంద్ర, వరుణ, యమ, కుబేరాదులు అస్త్రములతో వచ్చి కృప జూపినది ఏమహాపురుషుని కృపచేతనో అట్టి కృష్ణుఁ డెప్పటికో వెడలి పోయెను.

రాజా! శంకరుని అనుగ్రహమునుబొంది నేను మిక్కిలి సంతోషపడితిని ఏ దేవుని దర్శనము దేవతలకుఁగూడ దుర్లభమో, అట్టివాఁడు నాయెదుట పార్వతీదేవితోఁగూడి దర్శన మొసంగెను. గొప్పగొప్ప మహర్షులెవని వేదమంత్రములతోడను అనేక పావన ద్రవ్యములతోడను శ్రద్ధతోఁబూజింతురో, అభిషేకము కావించెదరో, ఆ నీలకంఠునిపై నేను అజ్ఞానవశమునఁ బుష్పవృష్టిని గురిపింప వలసినదిపోయి బాణవృష్టిని గురిపించితిని. పరమపావనులగు తపోధనులు ఎవని చరణములను బట్టుకొనుటకు భయపడుచుందురో, అట్టి త్రైలోక్యపూజిత శ్రీ విగ్రహుని నేను క్రోధవశమున ముష్టిప్రహారము కావించితిని. ఆ దేవాదిదేవునిస్పర్శసుఖమునాకు లభించినది. నేనెంత ధన్యుడను! నా యీ కార్యములకు కాలస్వరూపుఁడగు రుద్రుఁడు కోపపడక, నా యవజ్ఞకు అప్రసన్నుఁడై నాకుదారుణశాప మీయకపోఁగాఁ బ్రసన్నుఁడై పాశుపతాస్త్రము నొసంగి, నాయొద్ద కౌశలమున కాతఁడు పరమప్రసన్నుఁడగునట్లు చేసిన శ్రీకృష్ణప్రభుని కృపను ఏమని పొగడఁ గలను? నా ప్రయత్నమునను, ప్రయోజకత్వమునను ఆ పురాణ పురుషుఁడగు పశుపతిని ప్రసన్నుని జేసికొనఁగలిగిన క్షమత్వము నాకడ యెక్కడిది? శ్రీకృష్ణకృపచేతనే త్రిపురారియు, త్రిలోచనుఁడు నగు శివుఁడు సంతుష్టి చెందగలిగెను. నేనిట్లనుకొనుచుండఁగనే పశ్చిమ దిక్కునుండి గొప్ప ప్రకాశము నావైపునకు వచ్చుచున్నట్లు నాకు తోఁచెను. వైఢూర్యమువలెనున్న యాప్రకాశము ఆకాశమునుండి క్రమ క్రమముగా దిగినది. మొట్టమొదట అది మెఱపు మెఱిసినదనుకొంటిని.

కాని నాకు విమానము స్పష్టముగాఁ గనఁబడునప్పటికి, ఎవరో లోక
పాలుఁడు దిగుచున్నాడనుకొంటిని. వరుణదేవుఁడు తన కాంతులచే
దిక్కులు మిరుమిట్లు కొలుపుచు నావైపునకే వచ్చుచుండుటను గాంచి
తిని. ఆతని వెనుక దివ్యరూపమును ధరించిన జలచర జీవుల కధిష్ఠాత
యగు దేవుఁడుకూడ ఉండెను. నద, నదీ, సముద్ర, సరోవర, సర్ప,
సాధ్యాది దైత్యులుకూడ ప్రకాశముగ మూర్తిమంతములై ఆతని
ననుసరించుచుండిరి. నేను లేచి యాపశ్చిమాధిపతికి నమస్కరించి,
స్తోత్రములచే సత్కరించితిని. నేనింకను గూర్చుండనేలేదు, ఇంతలోనే
దక్షిణదిక్కునుండి సూర్యునివలె బ్రకాశించుచు నా వైపునకే వచ్చు
చున్న యముని గాంచితిని. ఆతఁ డా సమయమున తన దేవరూపమును
చాలించి మానుషరూపమును ధరించెను ఆతఁడు చేత దండమును
ధరించి పితర, గుహ్యకాది దేవతలు ఉపదేవతలు వెంటరాఁగా స్వభావ
మున నుగ్రుఁడయ్యు సౌమ్యరూపమును ధరించి వచ్చెను. ఆతని కృష్ణవర్ణ
మగు శరీరము కాంతిచే నీలమణివలెఁ బ్రకాశించుచుండెను, నేను రెండు
చేతులను జోడించి సమస్తజీవులకు సంహారకర్తయును దక్షిణ దిక్పా
లకుఁడు నగు యమునకుఁ బ్రణామము కావించితిని. ఆతఁడును ప్రస
న్నుఁడై నా వైపునకే వచ్చెను.

ఇంతలోనే తూర్పుదిశనుండి దివ్యగంధముతో సుఖద సంగీత
ధ్వనితో నొక విమానము నా వైపునకు వచ్చుచుండుటను గాంచితిని.
దానిలోఁ దల్లియగు శచీదేవితోఁ గూడ దేవేంద్రుఁ డుండెను. ఆయన
పైన వేలకొలఁది కుచ్చులుగల శ్వేతచ్ఛత్రమున్నది. స్వర్గములోని
దేవాంగనలు చామరములు వీచుచుండిరి. దేవతలు, గంధర్వులు,
ఋషులు మొదలగు వారు ఆతని స్తుతించుచుండిరి. ఒకరికి మించి
యొకరు మిక్కిలి లావణ్యయుక్తలై అసంఖ్యాకులగు అప్సరసలు ఆతనిని

జుట్టుకొనియుండిరి. అతఁడు దివ్యమగు హరితవర్ణమగు వస్త్రమును ధరింప శచీమాత అరుణవర్ణ మగు చీరెను ధరించెను. ఇద్దరును నందన వనములోని కల్పవృక్ష పుష్పములచేఁ గూర్పఁబడిన దివ్యమాలలను ధరించిరి. ఆ దివ్యమాలా సుగంధముచే దిక్కులు సువాసితము లయ్యెను. అనేకమంది దేవాంగనలు తాళస్వరములతో వివిధ వాద్యము లతోఁ దమకోకిలకంఠములతో విమానముమీఁద దివ్యగానము చేయు చుండిరి. ఈ విధముగ పూర్వదిశా దిక్పాలురు, త్రిలోకాధినాథులు, పూజ్యపితయగు దేవేంద్రుఁడు వచ్చుటను గాంచి నా హృదయము ప్రేమ ప్లావితమయ్యెను. నేను శ్రద్ధాభక్తులతో శచీదేవేంద్రులకు నమస్కరించితిని. అతఁడుకూడ ఆ గిరిపై నిలిచిన విమానము మీఁద పరివేష్టించెను. ఆ తరువాత ఉత్తర దిశాధిపతియు, సమస్త ధనరత్న ములకు ప్రభువును, దేవతలకు కోశాధిపతియునగు కుబేరుఁడు తన కాంతిచే నాకాశమండలమును ప్రకాశింపజేయుచు, వివిధ రత్నముల చేతను, మణులచేతను ప్రకాశించు నా పర్వత శిఖరముపైకి దిగి తన ఉత్తరదిశా శిఖరమున సుఖాసీనుఁడయ్యెను.

నల్గురు లోకపాలకులు వచ్చుటచే నేను యథాలబ్ధోప చారము లచే యథావిధిగ వారిని బూజించితిని. నా పూజల నన్నిటిని శాస్త్రవిధిచే గ్రహించి వారిలో దక్షిణ దిశాధిపతియగు యముఁడిట్లనెను:— "అర్జునా! మేమందఱమును నీ తపస్సునకు మెచ్చితిమి. మానవుల కత్యంత దుర్ల భమగు లోకపాలురమగు మమ్ముల నందఱను బాగుగా దర్శించు కొనుము. పుత్రా! నీ శీల స్వభావ, వ్రత, బ్రహ్మచర్యములకుఁ బ్రస న్నులమైతిమి. నీవు నీప్రబల పరాక్రమముచే పశు పతినాథుఁడగు త్రిలోచనుని సంతోషపరచి అతని కృపను బొందితివి. ఇదిగో, తీసి కొనుము. నా యమోఘ దండమును దీసికొనుము. దీనిచే నీవు శత్రు

సంహారము చేయఁగలవు. భీష్మ, ద్రోణ, కర్ణాదులెవరును నిన్ను జయింపఁ జాలరు ఏకర్ణుని బలపరాక్రమములను గాంచి ధర్మరాజు నిత్యము భయభీతుఁ డగుచున్నాఁడో ఆ కర్ణునిగూడ నీవు సంగ్రామములోఁ జంపఁగలుగుదువు" ఇట్లని ఆతఁడు నాకు తన యమోఘ దండము నొసంగెను. ఈ విధముగనే వరుణుఁడు తనపాశము నొసంగెను. కుబేరుఁడు కూడ తన ప్రస్వాపనాస్త్రమును ప్రసాదించెను. దేవేంద్రుఁడుకూడ నాకు సమస్త దివ్యాస్త్రముల నిచ్చునట్లు వాగ్దానమొనరించెను. ఆతఁడిట్లనెను:- "పుత్రా! నేను నీకు సమస్తములగు నమోఘాస్త్రముల నొసంగెదను. అయితే నీవు దేవతలకు మిక్కిలి ప్రియమును, దుష్కరకార్యమును చేయవలసి యుండును. నేను నీ యీ మానుషశరీరముతోడనే స్వర్గమునకుఁ బిలిపించుకొందును. నీ గౌరవము నినుమడింపఁ జేసెదను. సర్వత్ర నీబలఖ్యాతిని వ్యాపింపఁ జేసెదను. మరల నీ శరీరము తోడనే నీ సోదరుల దగ్గఱకుఁ జేర్చెదను. నీవు చింతను వీడి స్వర్గమునకు వచ్చుటకు సిద్ధముగ నుండుము. నేను రథము నిచ్చి నా సారథియగు మాతలిని బంపెదను. ఆతని వెంబడి నీవు రావలెను." ఇంద్రుఁడిట్లని లోకపాలురతో నచ్చటనే అంతర్ధానమయ్యెను. నేను నలుదిక్కులను నిర్ఘాంతుఁడనై చూచుచుంటిని. ఏమున్నది? ఇదంతయు నాకు స్వప్నముగఁ దోఁచెను. ఈ లోకపాలుర కృపను నేను వాసుదేవుని అవ్యాజానుగ్రహకారణముననే బొందితిని.

రాజా! ఒక్కసారిగా శంకరుని యొక్కయు, సమస్త లోకపాలుర యొక్కయు అనుగ్రహమువలన అస్త్రములను బొంది నేను మిక్కిలి సంతసించితిని. నేను స్వర్గ స్వప్నములు చూచుచుంటిని. స్వర్గమెట్లుండునో గదా! అచ్చటి నందనవన మత్యద్భుతముందురే. అక్కడ అందఱును విమానము లందుననే యుందురని వినికిడి. ఆ విమానములు కామగములఁట. దేవేంద్రుని పురము దివ్యము అచ్చటి

సమస్తభోగములు దివ్యములు. అచ్చట ఐరావతమున్నది. మూర్తిమంతములగు తీర్థములు, నదీనదములయొక్క అధిష్ఠాతృదేవతలు అచ్చటనుందురు. ఘోరతపస్సు చేసినవారును, చిరకాలము శమ, దమ సంయమాది సద్గుణాచరణము చేసినవారు, ధర్మాచరణము చేసినవారు మాత్రమే ఆ స్వర్గమును జూడఁగలుగుదురు గొప్పగొప్ప రాజర్షులును, మహర్షులును, బ్రహ్మర్షులును, దేవర్షులును, యశస్వులును, తపస్వులును, సత్పురుషులును మాత్రమే స్వర్గమును దర్శింపఁగలరు. అదియును ఈ మానవ శరీరమునగాదు. చచ్చిన తర్వాత దివ్యదేహమును ధరించి చూడఁగలరు, నేని పాంచభౌతికమగు నీ మానవ శరీరముతోడనే స్వర్గమును జూచుటకు నేనేమి సుకృత మొనర్చితిని? స్వర్గగామియగువాడీ శరీరముతో మరల భూమి మీఁదకు రాఁడు. క్షీణపుణ్యుఁడై అన్య యోనులలో జన్మించును, పుణ్యమైపోఁగానే అసత్కారపూర్వకముగఁ గ్రిందకుఁ ద్రోసివేయుదురు. నేనీ శరీరముతో స్వర్గమునకు వచ్చి మరల నాసోదరులను గలిసికొనవచ్చునని దేవేంద్రుఁడనెను. నేనీమేనితోడనే స్వర్గమును జూచివచ్చుట కేమి పుణ్యకార్యము లొనర్చితిని, ఏమి సుకృత ఫలమిది? నేను జేసిన పుణ్యమేమియును లేదు. శ్రీకృష్ణ కృప వలననే యిట్టి దేవ దుర్లభమగు సుయోగము ప్రాప్తించినది. దేవకీ నందనుని దయ, అనుగ్రహములు కలవానికి ఏ కార్యమును అసంభవము కాదు. ఇట్లనుకొనుచుండఁగనే ద్వీపమువలెనున్న గొప్ప దివ్యరథము ఆకాశమునుండి మందరాచలము మీఁదకు దిగుట కనబఁడినది.

ఆ రథము సూర్యునికంటె మిక్కిలిగఁ బ్రకాశించుచుండెను. చిన్న చిన్న గంటలు కట్టఁబడినవి అవి రథము నడుపునపుడు మధుర ధ్వని చేయుచుండును. దానిలో ననేకములగు నాయుధములు పెట్టఁబడియుండెను. అది యిచ్ఛానుసారముగఁ జిన్నదిగఁ బెద్దదిగ కాఁగలదు.

అది తన దివ్యకాంతులచే మందరాచలమును శోభకావింపఁ జేయుచు నా ముందునకు వచ్చి వ్రాలెను. అది నేలమీఁద నానలేదు. మధ్యలోనే నిలిచినది. వందలకొలఁది హరితాశ్వములు దానికి కట్టఁబడినవి. వాటి కళ్ళెములు ఒకదానికొకటి కట్టఁబడినవి, వాటిని మాతలి యను ఇంద్ర సారథి నడుపుచుండును. నా సమీపమునకువచ్చి రథము నిలువఁగానే సారథ్యకర్మవిశారదుఁడగు మాతలి దిగి నా దగ్గఱకు వచ్చెను అతఁడు రాఁగానే నాకు నమస్కరించి నిలుచుండఁగా నే నాతని నభినందించితిని. అతఁడు నాతో నిట్లనెను:-"కురుకులనందనా! నిన్ను నీతండ్రియగు దేవేంద్రుఁడు పిలిచెను. అతఁడు స్వర్గములో నిన్నుఁ జూడఁదలఁచినాఁడు. అచ్చట నీ యెడల వాత్సల్య స్నేహములఁ బ్రకటింప నుత్సహించుచున్నాఁడు. నీవు వచ్చి ఆతనిని సంతోషపెట్టుము. నీవు నీ సద్గుణములచే చరాచర ప్రపంచమునకు స్వామియగు వాసుదేవుని సంతోషపెట్టితివి. అందువలననే యితరులకు లభింపని ప్రాప్తి నీకుఁ బ్రాప్తించినది నీవు స్వర్గమునకు వచ్చుటకు పార్థివదేహమును వదలి దివ్యదేహమును ధరించవలసిన పనిలేదు. నీ వీ శరీరముతోడనే స్వర్గసుఖమును బొందఁ గలవు మరల నీ యిచ్చానుసారముగ మర్త్య లోకమునకు రాఁగలుగుదువు. నీ వాలస్యము చేయక నా వెంట స్వర్గమునకు రమ్ము."

నేను వినయముతో మాతలితో నిట్లంటిని:- "ఇంద్రసారధీ! నేను నీకు స్వాగతమిచ్చుచున్నాను. నీ వినయవాక్కులకు అభినందించుచున్నాను. ధర్మజ్ఞా! మానవులకు మిక్కిలి దుర్లభమగు నీ దర్శనము, నీ దివ్యరథ దర్శనము లభించినది. ఇది నా యదృష్టము. ఈ రథముమీఁద అశ్వమేధ, రాజసూయాది యజ్ఞములు చేసిన రాజర్షు లెక్కి పోవుచుందురు శ్రీకృష్ణకృపచే నేను దీని నెక్కఁగలుగు

చన్నాను ముందు నీ వెక్కిన తర్వాత నే నెక్కెదను" నా మాటలను విని మాతలి రథముపై నెక్కి గుఱ్ఱపు కళ్ళెములను సరిచేసెను.

నేను దశ దిశలలోని దేవతలకు నమస్కరించితిని. బ్రహ్మర్షులు దేవర్షులు, సిద్ధులద్వారా సేవింపఁబడుచుఁ బరమ రమణీయములగు శిఖరములుగల మందరాచలమును ఆజ్ఞ అడిగితిని నా సమీపమునఁగల పశు, వృక్ష, లతాగుల్మాదులకడ శలవు తీసికొని, ఆదివ్యరథమును బరిక్రమించి, దానిపై నెక్కితిని. అబ్బ! ఆ రథమెంత సుందరమైనది! దానిమీఁది పనితనమెంత గొప్పది! అది దివ్యగంధముచే సువాసితమయ్యెను. దానిమీఁదఁ గూర్చుండఁగానే నాకత్యంతాహ్లాదము కలిగెను. భగవత్కృపచేతనే యీమానుష శరీరముతోడనే దేవేంద్రుని రథముపై గూర్చుండఁ గలిగితిని నా యానందమునకు మేఱ లేకుండెను. నేను సమస్త శోకమును, చింతను, గ్లానిని, సంతాపమును, వ్యాకులతను వీడి మిక్కిలి ప్రముదితుఁడనైతిని. ఇంతలో స్వర్గవిమానములు వచ్చెను. నందన వనము సమీపించెను. అంత మాతలి యిట్లనెను:- "మహాభాగా! నీవు వచ్చితివి ఇఁక స్వర్గమును జూడుము." నిమిషములో మేము అమరావతీ నగరసమీపమునకు వచ్చితిమి. వందలకొలఁది దేవతలు, గంధర్వులు, అప్సరసలు నాకు స్వాగతమొసంగిరి. అందఱును మిక్కిలి సత్కారముతో నన్ను దేవేంద్రుని దివ్యసభకుఁగొనిపోయిరి. ఇది నాకు లభించిన దుర్లభ సౌభాగ్యము. అదేమనఁగా:—

(౩)

# దేవేంద్రుని అర్ధసింహాసనము లభించుట

ఛప్పయ

దేఖి దేవపతి ముదిత మన, పుత్ర ప్రేమ పరగట కియో।
సిర సూఁఘ్యోఁముఁహచూమికే, అధో సింహాసన దియో॥

అర్థము

నన్ను సంతోషమనస్కుఁడై పుత్ర ప్రేమను ప్రకటించుచు దేవేంద్రుఁడు చూచెను. శిరస్సు మూర్కొని, ముద్దుపెట్టుకొని అర్థ సింహాసనమునఁ గూర్చుండఁ బెట్టుకొనెను.

దూరమునుండి నారాకఁ జూడ.గానే దేవేంద్రుని ముఖకమలము వికసించెను. నేను త్వరత్వరగాఁ బోయి అతని పరమపావన చరణ ములపై నా శిరస్సునుంచి మ్రొక్కితిని. ఏ చరణములను నిత్యము అసంఖ్యాకములగు మకుట మణికాంతులచే దేవతలు, రాజర్షులు శోభాయమానము కావించెదరో త్రైలోక్యవందితములగు నా చరణము లను నేను బట్టుకొని నా మస్తకమునకు రాచుకొని, ఆనందాశ్రువులచే వానిని గడిగితిని. దేవేంద్రుఁ డత్యంతప్రీతితో తన దీర్ఘబాహువులతో నన్ను బలపూర్వకముఁగ లేవఁదీసి, కౌఁగలించుకొనెను. అతఁడు నా శిరస్సును మూర్కొని, తన కోమలకరములతో నా ముఖమును దుడి చెను. వెంద్రుకలు సరిచేసి, ఎత్తుకొని తన అర్థాసనమునఁ గూర్చుండఁ బెట్టుకొనెను. పితాపుత్రుల మిరువురమొక్క యాసనమునఁ గూర్చుండు టను గాంచి, స్వర్గములోని సమస్త దేవతలు, ఋషులు, గంధర్వులు, రాజర్షులు, దేవర్షులు మిక్కిలి సంతసించిరి. అందఱును దదేక దృష్టితో

మమ్ముల నిద్దరను జూచుచుండిరి. నా యీ సౌభాగ్యమునకు నేను చాల గర్వించితిని. మానవశరీరముతో దేవేంద్రుని అర్ధసింహాసనమునఁ గూర్చుండుటకు నేను చాల లజ్జించితిని. సిగ్గుచే నేను తలయెత్తి అంద అను జూడనైనఁ జూడలేదు సిగ్గుతో నింద్రుని వడిలోఁ గూర్చుంటిని. అనుపమ రూపలావణ్యయుక్తలగు స్వర్గములోని దేవాంగనలు నాకు చామరముల వీఁచుచుండిరి. ఆకాశములో వేలకొలఁది మెఱుపు లొక్క సారిగా మెఱసినట్లు వేలకొలఁది అప్సరసలా యింద్రసభలో నుండిరి.

దేవేంద్రుని యాజ్ఞచే అప్సరసలు, గంధర్వులు నా పాదములను గడిగి విధ్యుక్తముగఁ బూజించిరి. స్వర్గములో అసమానవీయ సత్కారము లను బొందుటచే నా యానందమునకు మేఱలేకుండెను. నేను మిమ్ము లను మఱవలేదు. నేను సన్మానింపదగిన వాడఁను బొత్తుగాఁ గానని నాకు బాగుఁగాఁ దెలియును. ఇది యంతయు నా శ్యామసుందరుని కృపాఫలమే. అతఁడు నన్ను గాడిదమీఁదనుండి యెత్తి ఐరావతముపైఁ గూర్చుండబెట్టఁగలఁడు అతఁడే తృణమును మేరువును జేయఁగలఁడు ఆతని కృపయుండినచో స్వర్గలోకమేయేల, బ్రహ్మలోకమే తుచ్ఛముగఁ దోఁచును. సర్వలోక పితామహుఁడగు బ్రహ్మకూడ ఆతని కృపకై దేవులాడుచుండును.

రాజా! ఎవఁడు మానవులమగు మనలను దేవతలఁ గావించెనో, నిర్బలులను బలవంతులజేసెనో, రాజ్యభ్రష్టులమై నప్పటికిని చక్ర వర్తుల నొనర్చెనో, అసహాయులమైనప్పటికిని సర్వవిధముల సహాయ మొనర్చెనో, అన్నయగు బలరాముఁడు కాదనుచున్నను గౌరవులను వీడి మనపక్షమునే వహించెనో, నిశ్శస్త్రుఁడయ్యును. నన్ను నిమిత్తముగాఁ బెట్టుకొని సర్వశత్రు సంహార మొనర్చెనో, అట్టివాఁడు మనలను నడి సముద్రములో వదలి మాయమయ్యెను. ప్రభూ! ఆతఁడీ ప్రపంచమున

నుండరాదు. దేవతల వలనగూడ చావని నివాతకవచులను నేను స్వర్గములోఁ జంపితిని. ఎవ్వనిబలమున వారిని జంపుటచే నాకీ మర్త్యలోకములోను, స్వర్గములోను కీర్తిప్రశంసలు లభించినవో, అట్టి శ్రీకృష్ణుఁడు లేకపోవుటచే నన్నాటవికు లోడించిరి. కావున రాజా! మనము శీఘ్రాతిశీఘ్రముగ అతని మార్గము ననుసరింపవలెను.

ఇట్లని యర్జునుఁడు మూర్ఛిల్లెను.

## నివాతకవచుల జంపునపుడు కృష్ణకృప

శ్లో॥ తత్రైవ మే విహరతో భుజదండ యుగ్మమ్,
గాండీవ లక్షణ మరాతి వధాయ దేవాః।
సేంద్రాః శ్రితా యదను భావిత మాజమీఢ
తేనాహమద్య ముషితః పురుషేణ భూమ్నా॥

—భాగ. ౧ స్కం. ౧౫ అ. ౧౩ శ్లో.

"కాలకేయ నివాత కవచాది దైత్యులఁ
జంపితి నెవ్వని నంస్మరించి..."

అట్టివాఁడు "మనలను దిగనాడి చనియె మనుజాధీశా॥"

శ్రీమదాంధ్ర భాగవతము

'దేవ దానవ యక్షరాక్షసులుకూడ నన్ను గెలువఁజాలని ఆ రోజు లేవి? అవి అయిపోయినవి ఇప్పుడో సాధారణభిల్లులు నన్నుఁ గొట్టి వెడలఁగొట్టిరి' అనుచు నర్జునుఁ దేడ్చుచు ధర్మరాజు అడుగక

పూర్వమే యిట్లని చెప్పఁదొడఁగెను:- "రాజా! ఇప్పుడు చెప్పవలసినది యును లేదు. వినవలసినదియు లేదు. నాకు స్వర్గములోని విషయములు జ్ఞాపకమునకు వచ్చుచుండిన, నా యాశ్చర్యమునకు మేఱయుండుట లేదు. అవి చిరకాలము క్రిందట వచ్చిన స్వప్నములవలెను, పూర్వ జన్మములో జరిగిన విషయములవలెను దోఁచుచున్నవి. నే నైదు సంవత్సరములు స్వర్గములో నుంటిని. నే నచ్చట శ్రీకృష్ణకృపచే దేవ తలుకూడ చేయఁజాలని కార్యము లొనర్చితిని.

నే నచ్చట సమస్త విధముల దివ్యాస్త్ర ఆరాధన సంధాన, విసర్గ, సంహారములను నేర్చుకొని, వాటిని ప్రయోగించుటలో నిపుణుఁడనైన తర్వాత నేను మీ చరణ సన్నిధికి వచ్చుటకు ఇంద్రుని అనుజ్ఞ నడిగితిని భరతవంశావతంసా! ధర్మరాజా! నేను స్వర్గములో నివసించుచున్నప్పటి కిని, స్వర్గీయ దివ్యభోగముల ననుభవించుచున్నప్పటికిని నా మనస్సున శాంతిలేదు. నాకు ఉంటి ఉంటి జూదము విషయములన్నియు జ్ఞాపకము నకు వచ్చుచుండెడివి. నిండు సభలో ద్రౌపదిని అవమానము చేసిన సంగతి తలఁచుకొనిన క్రోధముచే నా శరీరము కంపించెడిది వెంటనే ఒక్కఁడనే బయలుదేరివచ్చి, యీ దివ్యాస్త్రములచేఁ గౌరవులనందఱను భస్మము చేయవలయునని యుండెడిది. కాని వెంటనే మీ ప్రతిజ్ఞ నాకు జ్ఞాపకమునకు వచ్చెడిది మీరు ధర్మాత్ములరు. ధర్మవిరుద్ధముగ మీరే పనియును జేయరు. వనవాసము గడువు పూర్తికానిది మీ రేవిధమునను దిరిగిపోరు ఒకవేళ నేను తొందరపడి కౌరవులను జంపియుండిన, మీరు నిశ్చయముగనే నధర్మిననియు, మోసకాడననియు భావించి నన్ను బరిత్య జించెదువారే. ఈ భయముచే నేను నా క్రోధమును దిగమింగి, మనస్సు కుదుట పరచుకొని సమయము కొఱకు ప్రతీక్షించు చుంటిని. మీరు లేక స్వర్గములో నాకు సుఖము కనఁబడలేదు. మీ రరణ్యములలో నానాయిడుములు పడుచు, నేను స్వర్గభోగము లనుభవించుచుండిన నా

భోగము లనుభవించి యేల? అనుభవించ కేల? ఇట్టి స్థితిలో ఇంద్ర లోకమే కాదు బ్రహ్మలోకమే నాకు సుఖప్రదముగ నుండఁజాలదు. కాని, కార్యవశమున, మీ యాజ్ఞను బరిపాలించుటకు నే నచ్చట ఉండ వలసి వచ్చినది. దేవేంద్రుని బలవంతముచే స్వర్గసుఖములను గూడ సరిగా ననుభవింపలేదు.

నేను అస్త్రశస్త్రములలో బాగుగాఁ బారంగతుఁడను కాగానే ఒకదినమున దేవేంద్రుడు నన్నత్యంత మమకారముతో దగ్గఱకు పిలిచి యిట్లనెను :- "వత్సా ! అర్జునా ! నీవు త్రైలోక్య విజయుడవైతివని నాకు నమ్మకము కలిగినది. ఇప్పుడు మూడు లోకములలో నిన్ను జయింప గలవాడు లేడు. నీవు శ్రద్ధగా సమస్త శస్త్రాస్త్రములను నేర్చుకొంటివి. నీ ధారణాశక్తికిని, హస్తలాఘవశక్తికిని నేను మిక్కిలి సంతోషము చెందితిని. నీవు నా కార్యమొకటి నెఱవేర్పవలసి యున్నది. నేర్చు కొనిన విద్యకు గురుదక్షిణ నిచ్చుట కిదియే సమయము."

నేను చేతులు జోడించి యిట్లంటిని :- "ప్రభూ ! మీరిచ్చిన ఆజ్ఞ నా శక్తికి మించినది కాకున్నయెడల నది నెఱవేరినదనియే నమ్ముడు. మీ కే ప్రియకార్య మొనర్పవలయునో నా కాజ్ఞాపింపుడు."

దేవేంద్రుఁ డానందముతో నిట్లనెను :- "అర్జునా ! ఇప్పుడు మేమందఱమును నీ బాహుబలమును అధారముగఁ జూచుకొన్నాము. మేము, దేవతలందఱమును గలిసి చేయలేని పనిని నీవు చేయవలసి యున్నది. నాకు నివాతకవచులను దైత్యులు శత్రువులై యున్నారు. వారు సముద్రమధ్యమున బాతాళమున నుందురు. వారు షుమారు మూఁడుకోట్లమంది కలరు. వారు దేవ, దానవ, గంధర్వ యక్షాదులచేఁ జావరు, కావున నీవు వారిని జంపి, దేవతలకు మేలొనర్పుము."

దేవేంద్రుని నోట యిట్టి ప్రశంసను వినఁగానే నాకు కొంత గర్వమతిశయించెను. నే నిట్లనుకొంటిని :- "దేవేంద్రుఁడు నా బాహు బలముపై, నా గాండీవ ధనస్సుపై, నాయస్త్ర విద్యపై సంతటి విశ్వాస ముంచినాఁడు. నాలో అంతటి బలమెక్కడిది ? దేవతలచే నవధ్యులైన వారు నాచేతఁ జత్తురా? ఆ సమయమున నేను, ఈ బలము నాది కాదు. శ్యామసుందరునదను నంగతి మఱచియేపోయితిని. నివాతకవచులను, హిరణ్యపుర వాసులగు దైత్యులను జంప నాలో నిజముగ శక్తిలేదు. కాని ఆ సర్వాధారుఁడిచ్చిన శక్తితోఁ జావఁగఁరు. నేను దేవేంద్రుని యాజ్ఞనుబొంది, మాతలి నడుపు ఆ దివ్యరథముమీఁద దైత్యులను జంపుటకు స్వర్గమునుండి బయలుదేరితిని. ఆ సమయమున స్వర్గవాసుల ఆనందమునకు మేఱలేదు. దేవతలు, ఋషిగణము నా పరాక్ర మముగూర్చి ప్రశంసించిరి. గంధర్వులు నా గుణగానము చేయుచుండిరి. అప్సరసలు నందన వనములోని దివ్య పుష్పములచే నా మీఁద వర్ష మును గురిపించిరి. అందఱకు యథోచిత సత్కారములను గావించి దేవేంద్రుని దివ్యరథముపై గూర్చుండి అనేక జల జంతువులతో నిండిన సముద్రతీరమునకు వచ్చితిమి. సారథి యగు మాతలికి రథము నడుపుటలో నెంతటి కుశలత్వము కలదో నాకప్పుడు తెలిసినది. నిముష ములో సహ సాకములగు పచ్చని గుఱ్ఱములచే లాగఁబడుచున్న నా రథము అనేక వంకరలుగఁ ద్రిప్పి భూమిక్రింద నున్న నివాత కవచుల దివ్యపురికిఁ గొనిపోయెను. అక్కడగల సుఖసామగ్రులు, వైభవము స్వర్గమునకు మించియుండెను. స్వర్గవైభవములు వాటిముందు వెలు వోయినవి. ఆ పురము పూర్వము దేవతలదని నాకు మాతలివలనఁ దెలిసినది. పూర్వము దేవతలచ్చట నివసించెడివారఁట. పరాక్రమవంతు లగు దైత్యులు దానిని లాగుకొనిరఁట. ఈ దైత్యులు గొప్ప బల

వంతులు. బ్రహ్మదేవుని వరముచే వీరు దేవతల చేతను, ఇతర జీవులచే నవధ్యులైరి.

నన్నుఁ జూడగానే దైత్యులు క్రోధోద్రేకమున శూల, పట్టిశ, ఖడ్గ, తోమర, భుసుండి మొదలగు నానాయుధములను గొని నాపైకి విరుచుకొనిపడిరి. నేనుగూడ వారిపై సహస్ర బాణములను విడిచి గాయపరచితిని. చాలమంది నా బాణములకు చచ్చిరి. చాలమంది వారి ప్రాణములను గుప్పిట పెట్టుకొని పారిపోయిరి. కాని కొంతసేపైన తర్వాత మరల వారు అస్త్రశస్త్రములను గైకొని నాతోఁబోరాడ వచ్చిరి. ఈసారి వారు ఆసురీమాయను ప్రయోగించిరి. ఒక్కొక్కప్పుడు, రాళ్ళవాన గురియించిరి. ఒక్కొక్కప్పుడు ఎటుచూచినను అగ్నియే కనఁబడుచుండెను. ఒక్కొక్కప్పుడు ఘోరాంధకారము క్రమ్మెడిది. మాకేమియుఁ గనఁబడెడిది కాదు. ఆ సమయమున వారు అలక్షిత భావముతో వివిధాస్త్రములను వర్షించిరి. ఆ ఘోరాంధకారములో నామాతలికికూడ రథమునడుపుట కష్టమై తికమకపడెను. అతఁడిట్లనెను :— "అర్జునా! దైత్యులు ప్రబలులు. ఇంతటి ఘోరయుద్ధము నేనెన్నడును జూడలేదు. నీవు వజ్రాస్త్రముచే నీమాయను గొట్టుము."

మాతలి భయభీతుఁడగుటను గాంచఁగానే నాహృదయముకూడ కంపించెను. నాకేమియుఁ గనఁబడుట లేదు. నాయస్త్రగతి ఆగిపోయెను. అప్పుడు నేను శ్యామసుందరుని స్మరించితిని. ఆ లీలామానుష స్వరూపిని నేను లోలోన స్తుతించితిని. స్మరింపఁగానే అతఁడు నాకు బుద్ధియోగమును ప్రసాదించెను. నేను వజ్రాస్త్రమును ప్రయోగించి రాక్షసమాయను నాశనము చేసితిని. ఇప్పు డంధకారము లేదు. ఎటుచూచిన దివ్యప్రకాశమే. మాతలియు జాగ్రత్తగ నుండెను. అతఁడు గుఱ్ఱపు కళ్ళెములను లాగిపట్టుకొనెను. అంత నేను శబ్దభేది బాణములను విడిచి దాఁగిన దైత్యులను గొట్టితిని. నా దివ్యాస్త్రముల దెబ్బచేఁ జచ్చి దైత్యులంద

ఋను నిర్జీవులై క్రిందపడిరి. వారినగరములో నెచ్చట చూచినను హాహా కారములు వ్యాపించెను. మాతలి నా బలపరాక్రమములను ప్రశంసించెను. నేనింద్రునికంటె శూరుఁడననియు బలపరాక్రముఁడననియు బలికెను. ఈ శక్తి నాది కాదనుసంగతి అతని కేమి తెలియును ? శ్యామసుందరుఁడే కాలపాశమునఁ జిక్కి చచ్చిన దైత్యులను నన్ను నిమిత్తమాత్రునిగఁజేసి చంపించెను. అతని శక్తిచేతనే నేను అస్త్రశస్త్రములను సవిధిగఁ బ్రయోగించు చుంటిని. అది నిజముగ నా బలమేయగు నెడల నేను ఆటవిక భిల్లులచే నేల్లయోడిపోవుదును? నివాతకవచులను హిరణ్యపురవాసులగు దైత్యులను జంపిన బాణము లిప్పుడు సాధారణ మానవులకడ నేల కుంఠితము లగుచున్నవి ?

రాజా ! ఈ విధముగ సమస్త నివాతకవచాది రాక్షసులను జంపి, విజయశంఖమును మ్రోగించి నే నత్యంత హర్షముతో ఆ పాతాళ పురి నుండి బయటకు వచ్చితిని. మార్గమధ్యములో నాకాశమధ్యమున గ్రిందకు వేలాడుచున్న నొక దివ్యపురము నొకదానిని గాంచితిని. అది ఆకాశముననే వ్రేలాడుటను గాంచి నేనాశ్చర్యము చెంది మాతలితో నిట్లంటిని:—"మహాభాగా ! నీవు దేవేంద్రునకు సారథివి. సర్వజ్ఞుడవు. ఈ యాశ్చర్యకరమగు నగరమేదియో తెలుపుము. ఇది యింత దేదీప్యమానముగను. ఏమియు నాధారము లేకుండగనున్నది, యిది యెవరి వరము వలననో చెప్పుము."

అంత మాతలి నాతో నిట్లనెను:- "పాండునందనా ! ఇది పౌలోమ, కాలకేయాది దైత్యులు నివసించు హిరణ్య పురము. ఈ దైత్యుల తల్లులగు పులోమి, కాలికాయనువారు అనేక దివ్యవర్షములు ఘోర తపస్సు జేసిరి. ఆ తపస్సునకు మెచ్చి బ్రహ్మ వరములను గోరుకొనుమనెను. వారిట్లు వరముల నడిగిరి:— "మా పుత్రులను

దేవతలు, రాక్షసులు, యక్షులు, గంధర్వులెవ్వరును జంపరాదు. వారు నివసించుటకొక సువర్ణమయమగు పురమును సమస్త విమానములను మించియుండునట్లును; ఎచ్చటికి వెళ్ళందలంచిన నచ్చటకు వెళ్ళకలిగి యుండునట్లును, ఆకాశమున నాధారము లేకయే వ్రేలాడుచుండ గలిగినట్లును నిర్మింపవలయును."

బ్రహ్మదేవుడు "తథాస్తు" అని అట్టి వరమునే యొసంగెను. పితామహుని వరముచేతనే యీనగర మిట్లు ఆకాశమధ్యమున వ్రేలాడు చున్నది. దీనిలో నివసించు దైత్యులతి బలవంతులు వీరు దేవతలకు శత్రువులు. ఎప్పుడును దేవేంద్రునకు బాధ కలిగించుచుందురు. ఈ వరము వలన వీరు దేవతలచే జావరు. అందువలన వీరిని దేవతలు చంపజాలకుండిరి. ఆ కారణమున వీరికి గర్వము హెచ్చి నిత్యనూత నోపద్రవము లొనర్చుచుందురు."

నేనిట్లంటిని:-"మాతలీ! నారథము నీపురములోనికి గొనిపొమ్ము. వీరు దేవేంద్రునకు శత్రువులైనప్పుడు నాకును శత్రువులే. చేతులు న్నవి. వీరినిగూడ చంపియే పోవుదుము"

మాతలి యిట్లనెను:-"మహాభాగా! నీవు వీరిని తప్పక చంప గలవు. వీరు దేవతలచే జావరనియు, ఒక మనుష్యుని చేతులలో జత్తురనియు బ్రహ్మనోట నేను వినియుంటిని. కావున నీవు వీరిని జంపి అవశ్యము దేవతల బాధను దొలిగించుము."

ఇది వినంగానే వారిని జంపుటకు నేను నిశ్చయించుకొంటిని. ఆ పురములో బ్రవేశింపగానే ఘోరయుద్ధము జరిగెను. దైత్యులంద ఱును నామీద నస్త్రశస్త్రములను గైకొని విరుచుకొని పడిరి. నేనుకూడ నా దివ్యాస్త్రములచే వారి యస్త్రము లన్నిటిని వ్యర్థము కావించి, నిమిషములో వారి నందఱను జంపివేసితిని. అంత వారందఱు నా

దివ్య నగరములో దూరిరి. నేననేక తీక్ష్ణబాణములను సంధించి, ఆ సువర్ణనగరములను ముక్కల ముక్కలుచేసి దైత్యుల నందఱను నేలమీదకు బడగొట్టితిని. అప్పుడు వారు నారథగుఱ్ఱముల కాళ్ళను బట్టుకొనిరి. అంత వజ్రాస్త్రముచే వారిని గూడ పడగొట్టితిని.

ఈ విధముగ నా వాసుదేవుని కృపచే దేవతలకు గూడ దుర్జయులగు దైత్య దానవులను జంపి, విజయుడనై దేవేంద్రుని అమరావతికి వచ్చితిని. అక్కడ అందఱును నాకు మిక్కిలి వైభవములో స్వాగత సత్కారములు కావించిరి.

ఎవని కృపచే నిదియంతయు జరిగెనో, ఎవని బలముచే నేనజేయులగు దైత్యులతో నిర్భయుడనై పోరాడగలిగితినో ఆ సర్వాంతర్యామియగు శ్యామసుందరుఁడు ఈ ధరాధామమును వదలిపోయెను. ఆతడు నన్ను మోసముచేసి వైకుంఠమునకుఁ బోయెను. రాజా! ఇప్పుడు మనకాశ్రయము పోయినది. మనము హతవీర్యులమై, పరాక్రమ హీనులమైతిమి ఇక మన జీవితము వ్యర్థము. ఇప్పుడు మనల నొక సామాన్య మానవుడు కూడ ఓడింపగలడు. నీచాతినీచులకంటె మనము నీచులము కాగలము." ఇట్లు పలుకుచు నర్జునుడు గద్గదికుడై, తర్వాత పలుకఁజాలకపోయెను.

## గోధన హరణ సమయమునఁ గృష్ణ కృప

౫౩

శ్లో॥ యద్బాంధవః కురుబలాబ్ధి మనంతపార
మేకో రథేన తతరేఽహమతీర్య సత్వమ్।
ప్రత్యాహృతం బహుధనం చ మయా పరేషాం
తేజాస్పదం మణిమయం చ హృతం శిరోభ్యః॥

—భాగ. ౧ స్కం. ౧౫ అ ౧౪ శ్లో.

"గోగ్రహణము నాఁడు కురుకులాంభోనిధిఁ
గడచితి నెవ్వని కరుణఁ జేసి
గీ॥ కర్ణ సింధు రాజ కౌరవేంద్రాదుల
తలలపాగ లెల్లఁ దరవి తెచ్చి
యే మహాత్ము బలిమి నిచ్చితి విరటుని
పుత్రి యడుగ బొమ్మ పొత్తికలకు॥"

అట్టివాఁడు "మనలను దిగనాడి చనియె మనుజాధీశా !"

—శ్రీ మదాంధ్ర భాగవతము.

సమృద్ధిశాలియగు రాజధాని నగర కవాటము తెరవబడినప్పుడు దానినుండి చిత్రవిచిత్ర వేషములుగల స్త్రీ పురుషులు బయలుదేరి వచ్చునట్లు, అర్జునుని స్మృతియను నగరకవాటము తెరవబడగానే దాని నుండి ఒక కథ తర్వాత నింకొక కథ బయలుదేరి వచ్చుచున్నది. శ్రీకృష్ణ కృపచే నాతఁడేయే కార్యము లొనర్చెనో, ఏ అమానుషిక పౌరుషమును జూపించెనో వాటిని జ్ఞాపకము చేసికొనిన అతని హృదయము కరిగిపోయెడిది. ఆ కార్యము లన్నిటిలో నాతనికి మూర్తిమంతమగు నచ్యుతుని అనుగ్రహము కనఁబడుచుండెను.

వనవాసాంతరమున నాతనికి అజ్ఞాతవాసస్మృతి కలిగెను. అతఁడు కరుణాస్వరములో తన యన్నయగు ధర్మరాజుతో నిట్లనెను:— "రాజా ! ఎంతని చెప్పుదును ? శ్రీకృష్ణకృపకు అంతులేదు. మన అందఱిమీఁద ఆతనికి అపారకృప హస్తినాపుర సమీపముననే మత్స్యదేశరాజధానిలో విరాట్రాజు దగ్గఱ మనము మారువేషములతో అజ్ఞాతవాసమును గడుపుచుంటిమి. దుర్యోధనుడు మనలను నలుదిక్కుల వెదకి వేసారెను. కాని జాడ దొఱకలేదు. వనవాస దుఃఖమున మనము ఆత్మహత్యలు చేసికొంటిమని అతఁడనుకొనెను. కాని మనము

తాఁబేలువలె నంగములు ముడుచుకొని యుంటిమి. కొంగవలె ధ్యానమును నటించుచు రాజ్య మను నాహారము కొఱకు ప్రతీక్షించుచుఁ గన్నులు మూసుకొని మృషాసమాధిని నటించుచుంటిమి. నేతికొఱకు నంద బ్రాహ్మణునివలెఁ గాలక్షేపము చేయుచుంటిమి. ఆ సమయములోఁ గౌరవ; త్రిగర్త నరపతులు కలిసి మత్స్యదేశముపై దండెత్తిరి. తన సేనాపతి కీచకుని సహాయమున మత్స్యాధిపతియగు విరాటరాజు త్రిగర్తాధిపతిని చాల బాధించెను. ఆ పూర్వవైరమును పాటించి కసి తీర్చుకొనుటకు సుశర్మ కౌరవుల సహాయమును బొంది మత్స్యదేశము పైకి దండెత్తి వచ్చెను. అతఁడొక ప్రక్కను దండెత్తెను ఇది కనిపెట్టి కౌరవులు, విరాటరాజు తన సేనలతో త్రిగర్తరాజుతోఁ బోరాడు చున్నప్పుడు తాము ఇంకొకవైపున ముట్టడించి శూన్యనగరమునుండి గోధనమును, రత్నభూషణములను హరించుకొని పోవచ్చుననుకొనిరి. చివరకట్లే చేసిరి. మీరు భీమసేనుని దీసికొని విరాటరాజుతో త్రిగర్తులతో బోరాడఁ బోయితిరి. ఇచ్చట విరాటరాజు కుమారుడు ఉత్తరుఁడు ఒంటరిగా నగర రక్షణ కొఱకు ఉండెను. ఆ సమయమునఁ గౌరవులు సమస్త గోవులనపహరించిరి. గోరక్షకులు వచ్చి యీ సమాచారమును రాజకుమారుఁడగు ఉత్తరునకుఁ జెప్పిరి. ఉత్తరకుమారుఁడు రాణివాసములో నిట్లు ప్రగల్భములు పలుకుచుండెను:—"నాకు తగిన సారథి యుండిన యెడల నే నిప్పుడే వెడలి సమస్తకౌరవసేనను ఓడఁగొట్టి గోవులను విడిపింపఁగలను."

ఆ సమయమున నీ భార్యయగు ద్రౌపది సైరంధ్రి వేషమును ధరించి అంతఃపురములో నుండెడిది. నేను నపుంసకుఁడగు బృహన్నల వేషమును ధరించి విరాటరాజు కూఁతురగు ఉత్తరకు నృత్యగానములను నేర్పుచుంటిని. నేను సారథ్యములలో జాల గొప్పవాఁడనని

ద్రౌపదిద్వారా ఉత్తరకుమారునకుఁ దెలిసెను. అతఁడు నా యథార్థస్వరూపమును దెలిసి కొనఁజాలక పోవుటచే నన్నుఁ తనకు సారథికావలసినదని బలవంతము చేసెను. అజ్ఞాతవాసము గడువు ముగియుటచే, ఇదియే యుద్ధమునకు మంచి సమయమనుకొని అంగీకరించి, రథమును గట్టి ఉత్తరుని యెదుట నిలుచుంటిని.

మేము సిద్ధపడి పోఁబోవఁగా బాలచాపల్యముచే ఉత్తరుని చెల్లెలు ఉత్తర నాతో నిట్లనెను:— "బృహన్నలా! మా అన్న కౌరవులను గెల్చి, వచ్చునప్పుడు నాబొమ్మలకు రంగుల రంగుల పొత్తికలను తేవలయును" నేనును వినోదముతో నిట్లంటిని:— "దుర్యోధన, కర్ణాది వీరుల వస్త్రములను నీకొఱకు తెచ్చెదము." నవ్వులాట కిట్లని నేనుత్తరకుమారుని రథమును నడుపుచుఁ గౌరవసేనా సమూహము వైపునకుఁ బోయితిని. వర్షాకాలమున నున్న ఘనఘోర మేఘజాలములవలె సర్వత్ర వ్యాపించి సముద్రమువలె నుప్పొంగుచున్న అపార కౌరవసేనను గాంచునప్పటికి ఉత్తరునకు గుండెలదరెను. వానికి శరీరమంతటను జెమట పోయుచుండెను. భయముచే నాతఁడు గడగడ వణఁకుచుండెను. భయపడుచు నాతఁడిట్లనెను:— "బృహన్నలా! నీవు త్వరగా రథమును నగరము వైపునకు ద్రోలుము. ఈ యోధులతో నేను బోరాడఁజాలను. మన గోవులను దీసికొని పోయినఁ దీసికొనిపోనిమ్ము. ఇంక కావలసినన్ని గోవులు వచ్చును. బ్రతికియుండిన బలుసుఆకు ఏరుకొని తినవచ్చును. ఐశ్వర్యములవే రాఁగలవు"

నే నా పుఱ్ఱవానికి అనేక విధముల జెప్పిచూచితిని. వివిధ విధముల ధైర్యము చెప్పితిని. వీరతావాక్యములను బలికి ఆతని నోదార్చితిని. వీరధర్మములను జెప్పితిని. యుద్ధ మర్మమును బలికితిని. యుద్ధ పరాఙ్ముఖుఁడగుట క్షత్రియులకు గొప్ప యధర్మమని చెప్పితిని; కాని

అతఁడు వినలేదు. అతఁడంతగా భయకంపితుఁడయ్యెను. నేను రథమును వెనుకకుఁ ద్రిప్పకపోవుటను గాంచి, అతఁడొంటరిగా రథమునుండి దుమికి పాఱిపోవుచుండెను. నేను రథమునాపి పరుగెత్తి వానిని బట్టుకొంటిని అతఁ డత్యంతాకులుడై నన్ననేక విధముల బ్రతిమలాడుకొనెను. వివిధ ప్రలోభములఁ బెట్టుచుండెను. అంత నాకు నవ్వువచ్చి యిట్లంటిని:— "వత్సా! నీవు భయపడవలదు. నేనే యుద్ధము చేయుదును. నీవు నా రథమును ద్రోలుము."

అతఁడు భయపడుచు నిట్లనెను:— "నీవు నపుంసకుఁడవు ఆట, పాటలు నేర్పినవాఁడవు యుద్ధమేమి చేయఁగలవు? నీవు మునిఁగిపోవుదువు. నన్ను ముంచెదవు"

అతఁడత్యంత భయభరితుఁడగుటను గాంచియు, వణఁకుటను గాంచియు నేను నా పరిచయమును గావించుచు నిట్లంటిని:— "నేను నపుంసకుఁడనుగాను. నేను గాండీవ ధనుర్ధారిని. శ్రీకృష్ణ సఖుఁడగు నర్జునుఁడను. వాసుదేవుని కృపచే నేను సమస్తము చేయఁగలను. సుసజ్జితమగు నీ సేననంతను నే నొక్కఁడనే యోడింపఁగలను. కృష్ణకృపచే నాకేపనియు కఠినము కాదు. చేయఁజాలని పనిలేదు. అసంభవమేమియును లేదు. నిర్భయముగ నుండుము."

అనేక ప్రశ్నలడిగిన మీఁదట, శమీవృక్షము మీఁద దాఁచియుంచఁబడిన గాండీవ ధనస్సును గాంచగానే అతనికి నమ్మకము కలిగెను. నే నర్జునుఁడనేనని తెలిసికొని నాకు సారథ్యము వహించుటకు అంగీకరించెను.

నేను నా గాండీవ ధనుస్సునకు నారి తగిలించి ధనుష్టంకారము కావించితిని. నా ధనుష్టంకారమును విని కౌరవులు హడలిరి. ప్రళయకాలాంతకుఁడగు నర్జునుఁడే మనతో యుద్ధము చేయ వచ్చుచున్నాఁడని

వారు గ్రహించిరి. ఆ సమయమున గాండీవధనస్సుగొని త్రైలోక్య విజయులగు భీష్మ, ద్రోణ, కర్ణ, దుర్యోధనాది ప్రబల పరాక్రములును, ప్రసిద్ధయోధులు నగు వారి సమ్ముఖమున నొక్కఁడనే యుద్ధముచేయ సిద్ధపడితిని. అనేకాక్షౌహిణీసేనతో సుసజ్జితమై సకల ప్రపంచమును సంహారముఁ చేయఁగల వందలకొలది శూర వీర సేనాపతి సమూహ మెక్కడ, రెండవప్రక్కనే నొక్కడ నెక్కడ? అయితే నాకు శ్రీకృష్ణుఁడాధారము కలఁడు. ద్వారకాధీశుని ఆశ్రయము కలదు. బలరామ సోదరుని బలమున్నది. కృపావలంబనము కలదు. నేను భయపడలేదు. నిర్భయుఁడనై వారినందఱను యుద్ధమునకు, బిలిచితిని.

నేను యుద్ధమునకు వచ్చుటను గాంచి కౌరవసైనికులు వారిలో వారు వాదవివాదములు పడసాగిరి. కర్ణుఁడు నన్ను తుచ్ఛుఁడనెను. కృపాచార్యుఁడుఁ నన్నుఁ బ్రశంసించెను. నలుగురు నానావిధముల నను కొనఁజొచ్చిరి. ఇట్లు వాద వివాదములు పడుచుండఁ గాంచి భీష్మ పితామహుఁడు అందఱను శాంతింపఁ జేసెను. అంత నందఱును గలిసి యుద్ధమునకు వచ్చిరి.

రాజా! ఆ సమయమున ఘోరయుద్ధము జరిగెను. సైనికులందఱును బూర్ణశక్తితో నన్ను బరాజితునిఁ జేయ యోజించుచుండిరి. అందఱును గలిసి నన్నుఁ బడఁగొట్టఁదలఁచిరి. కాని ఆనందకందుఁడగు నందనందనుఁడు తన అపారమగు ప్రేమచే వారికోరికలు నెఱవేరనీయలేదు. కర్ణ, కృపాచార్య, ద్రోణాచార్య, అశ్వత్థామ, భీష్మ, దుర్యోధనాదుల. ఒకరి నొకరు నాతోఁ బోరవచ్చిరి. కాని నేనందఱ నోడించితిని. అందఱును యుద్ధమునకు భయపడి పారిపోయిరి. అందఱు పరాజితులైన తర్వాత కర్ణుఁడు సంబాళించుకొని మరల నాతో యుద్ధము చేయవచ్చెను. ఆ సమయమున నెవరిని జయపడెనని నాకులేదు. వారి

నైనఁబరాజితుల గావించి విరాటరాజు గోవులను గొని రావలెననియే నా ముఖ్యాభిప్రాయము. అందువలన నొక్క సేనాపతినైన నేను జంప లేదు. సైనికులు మాత్రము చచ్చిరి. అందరు పరాజితులైన తర్వాత వారిమీఁద నేను సమ్మోహనాస్త్రమును విడిచితిని. దానికి వారందరు మోహితులై సంజ్ఞాహీనులై యుద్ధభూమియందు చచ్చినవారివలెఁ బడి పోయిరి. నేనుత్తర కుమారునితో నిట్లంటిని:- "వత్సా! నీవు వెళ్ళి మోహితులై మూర్ఛనొందిన ముఖ్య ముఖ్య వీరుల మణిమయ మకుటములను, బాగుగాఁ బ్రకాశించుచున్న పట్టు ఉత్తరీయములను ఉత్తర బొమ్మ పొత్తికలకై తీసికొనిరమ్ము. వీటిని తీసికొనిపోయి నీచెల్లెలు ఉత్తర కిచ్చిన నామె చాల ఆనంద పడఁగలదు. ముదిత మనస్కయై వీటిని గొని తన బొమ్మలకు వీటిని గట్టి ఉల్లాసముతో నాడుకొనఁగలదు"

నా యాజ్ఞను బొంది ఉత్తర కుమారుఁడు రథము నాపి అమూల్యములగు వస్త్రభూషణములను వలుచుకొనెను. అన్నిటిని దీసికొని భీష్మ పితామహుని దగ్గఱకు వెళ్ళుచుండఁగా వానిని వారించి నేనిట్లంటిని:- "వత్సా! అచ్చటకు వెళ్ళవలదు. ఈ భీష్ముఁడు నాకు రక్షకుఁడగు శ్రీకృష్ణునకు పరమభక్తుఁడు. లోకములో నీతనిని బరాజితుని గావింపఁ గలవాఁడుకాని సమ్మోహితునిఁ జేయగలవాఁడు కాని లేఁడు. ఈ సమ్మోహనాస్త్రముచే భగవత్కృపచే నీతఁడు సమ్మోహితుఁడు కాలేదు. జాగ్రతతోనే యున్నాఁడు. అతని వైపు చేయి జాపితివా నీ ప్రాణములు సున్న."

నా మాటను విని ఉత్తరుఁడు వెళ్ళినవాఁడల్లే తిరిగి వచ్చెను. అతఁడు పితామహుని వస్త్ర మకుటములను గొనవలెనను యూహను మానుకొనెను.

రాజా! ఆ సమరమున నెంతటి యద్భుత కాండము జరిగినది.

దుర్యోధనుని గర్వ ముడిగిపోయెను. కౌరవుల మనోరథము విఫలమయ్యెను. త్రిగర్తునితోఁ జేసికొనినసంధి సఫలముకాలేదు. వారిచేతికి విరాటుని ధనమును జిక్కలేదు. ఆవులును చిక్కలేదు. పైగాఁ బరాజయము పొందవలసి వచ్చినది. సైనికులందఱు మూర్ఛపడిపోఁగానే గోపాలకులతో తమ గోవులను తోలుకొని పొమ్మంటిని. నేనన్నదే తడవుగా గోపాలకులు గోవుల నన్నిటిని దోలుకొని పోయిరి. గోవులు కూడ శత్రువిముక్తములై తోఁకలెత్తుకుని నగరము వైపునకుఁ బరువిడుచుండెను.

ఈ విధముగ రాజా! ఇంత యపార కౌరవసేనా సమూహమును ఎవని కృపచే నవ్వుచు నవ్వుచు, హేలాపూర్వకముగ నిమిషములో దాఁటఁగలిగితినో, ఎవని యనుగ్రహముచేభీష్మ, ద్రోణ, కర్ణ, కృపాశ్వత్థామ దుర్యోధనాది వీరులు నాకు తృణసమానముగఁ గనఁబడిరో అట్టి వాసుదేవ భగవానుఁడు మనలను వదలి స్వధామమునకుఁ బోయెను. ఇప్పుడు నాకా తేజస్సు గాని, బలముగాని లేదు. ఆ శక్తియులేదు; ఆ సాహసమును లేదు. ఇప్పుడు నేను నిర్బలుఁడను, సాహస విహీనుఁడనైతిని రాజా! మనముకూడ ఇఁక నాతని ననుసరింపవలయును." ఇట్లు చెప్పుచుండఁగా అర్జునుని కంఠము రుద్ధమయ్యెను.

## మహాభారత యుద్ధములోఁ గృష్ణ కృప

౫౧

శ్లో॥ యుద్ధేషు మా ప్రణిహితం గురు భీష్మ కర్ణ
ద్రౌణి త్రిగర్తశల సైంధవ బాహ్లికాద్యైః

అస్త్రాణ్యమోఘ మహిమాని నిరూపితాని
నోపస్పృశుర్నృహరిదాస మివాసురాణి॥
—భాగ. ౧ స్కం. ౧౫ అ ౧౬. శ్లో.

"మ. గురు భీష్మాదులు గూడి పన్నిన కురుక్షోణీశ చక్రంబులో
గురుశక్తిన్ రథయంతయై నొగలపై గూర్చుండి యామేటి నా
శరముల్ వాఱక మున్న వారల బలోత్సాహాయురుద్యోగ త
త్పరతల్ చూడ్కుల సంహరించు సమితోత్సాహంబు నాకిచ్చుచున్."

"మ. అసురేంద్రుం డొనరించు కృత్యములు ప్రహ్లాదుం బ్రవేశించి గె
ల్వ సమర్థంబులు గాని కైవడిఁ గృపాశ్వత్థామ గాంగేయ సూ
ర్యసుత ద్రోణ ధనుర్విముక్త బహుదివ్యాస్త్రప్రపంచంబు నా
దెసకున్ రాక తొలంగు మాధవు దయాదృష్టిన్ నరేంద్రోత్తమా."

అట్టివాఁడు "మనలను డిగనాడి చనియె మనుజాధీశా!"

—శ్రీమదాంధ్ర భాగవతము

శస్త్రమును విధ్యుక్తముగఁ బ్రయోగించువాఁడు లేకుండిన నది తానుగాఁ జంపఁజాలదు. ఆడించువాఁడు లేనంతవఱకు కొయ్యబొమ్మ ఆడదు- అని యాలోచించుకొని మహాభారత యుద్ధములోఁ జూపిన శ్రీకృష్ణ కృపను స్మరించుకొనుచు నర్జునుఁడు మరల కన్నీళ్ళు తుడుచుకొని ధైర్యమును వహించి యిట్లనెను:—

"రాజా! భగవంతుఁడీ భూమి మీఁద నున్నంతవఱకు మనను గనిపెట్టని క్షణము లేదు. విపత్తులనుండి రక్షింపని నిమిషము లేదు. విపత్సాగరము దాఁటుటకు సహాయపడని సమయములేదు. కంసుని జంపఁగానే ఆతఁడు వెంటనే మన క్షేమసమాచారములు కనుగొని మ్మని మామయగు నక్రూరుని బంపెను. అప్పటికి మనము తండ్రిని

లేని వారమైతిమి. మన శిరస్సున నాథని వరదహస్తము కలదనియు గ్రహించితిమి.

మహాభారతయుద్ధములో నాతఁడు నిశ్శస్త్రుఁడయ్యు నసంఖ్యాకులగు అస్త్రశస్త్రధారులగు యోధులకు మించిన కార్యము లొనర్చెను. పోరాడక పోయినప్పటికిని యుద్ధములో ముఖ్యపాత్ర అతఁడే. కొయ్యబొమ్మ ఆడును. అనేకములగు హావభావములను జూపించును. ఒక మనుష్యుఁడచ్చట మెదలక కూర్చుండి ఆశ్చర్యమేమియును లేక నృత్యమును జూచుచుండును. ఇతర దర్శకులందఱు నీతఁడుకూడ మనవలె దర్శకుఁ డనుకొందురు. కాని వానిచేయి ఒకటి దాఁగియుండును. ఆ దాఁగిన చేతిలోనే ఆ బొమ్మనాకించు త్రాడుండును. దాని ననుసరించియే అది ఆడును. గతి హీనమగు నా బొమ్మలోనికి గతి యా యుదాసీనునివలెఁ గూర్చుండిన పురుషునివలనఁ గలుగుచున్నది. ద్రష్టలా నిర్జీవ కొయ్యబొమ్మ వివిధములగు హావభావములనుజూచి ఆడుచుండుటను గాంచి ఆశ్చర్యపడుచుందురు. వీరాశ్చర్యపడుచుందురు. గాని అచ్చట నిశ్చేష్టుఁడుగఁ గూర్చుండిన వ్యక్తియే నిదియంతయు నాడించుచున్నాఁడను సంగతియు, ఊరక మంత్రములు పలుకుచున్నాఁడను సంగతి వారికి తెలియదు. ఆ దాగిన చేయియే వెంట వెంటనే ఆ కౌతుకమును జూపించుచున్నది. అట్లే మహాభారత యుద్ధములో నర్జునుఁడే జయించెను. అంతటి గొప్పవీరుల నాతడే జయించి స్వర్గమున కంపెనను కీర్తిమాత్రము నాకు లభించినది. రాజా! నిజమునకు నా ప్రయోజకత్వమేమి కలదు ?

విరాట్ నగరమున గోధన హరణ సమయమునకు మనము బయట పడితిమే అప్పటికి అజ్ఞాతవాసము గడువు తీరిపోయినది. దుర్యోధనుని హృదయము పాతకముతో నిండియుండెను. అతఁ డేవిధమున నైన మనలను రాజ్యభ్రష్టులఁ జేయ వలెననియే మన పైతృక

రాజ్యమును మనకీయు నాతనికి లోపల యిష్టములేదు. అందువలన నాతఁడనేక నెపములు పెట్టమొదలిడెను. ఆతఁడిట్లన మొదలిడెను :- "అజ్ఞాత వాసము గడువు పూర్తి కాకమునుపే పాండవులు బయట పడిరి. కావున వీరు నియమానుసారముగ బన్రెండు సంవత్సరములు వనవాసము, ఒక సంవత్సర మజ్ఞాతవాసము చేయవలయును." భీష్మ పితామహుఁడుఁ లెక్కవేసి పాండవులు గడువునకు ముందు బయటకు రాలేదని నచ్చచెప్పెను. అదియును గాక అజ్ఞాతవాసము సంవత్సరము కంటె చాల మిగిలినది. కాని యాతఁడెవరి మాటను వినక తాను బట్టిన కుందేటికి మూఁడే కాళ్ళని మొండిపట్టు పట్టెను. చివరకు యుద్ధమే నిశ్చయమయ్యెను. రెండు పక్షములవారము సైన్యమును ప్రోవుచేయు చుంటిమి. దుర్యోధనుఁ డధికారా రూఢుఁడు. మనము రాజ్యభ్రష్టులము. సాధనహీనులము. అయితే ధర్మాత్ములగు రాజులు శ్రీకృష్ణ సహాయముచే మన పక్షమునఁ బోర సిద్ధపడిరి. మిగిలిన బలవంతులగు వీరులను సేనా సహితముగ తనవైపునకుఁ గలుపుకొనెను. ఈ విధముగ నాతనివైపు పదునొకండు అక్షౌహిణీ సేనయు, మన ప్రక్కన ఏడు అక్షౌహిణీ సేనయు నయ్యెను. నారథమునకు సారథి గోపీజన వల్లభుఁడు బృందా వన విహారి యయ్యెను. నే నాతనితో నిట్లంటిని:-"వాసుదేవా! నా రథమును రెండు సేనల మధ్యను నిలుపుము. నే నెవరితోఁ బోరాడ వలయునో చూచుకొనవలయును"

నా యాజ్ఞను బొందగానే యాతఁడు వెంటనే గుఱ్ఱపు కళ్లెములను లాగిపట్టి, నిముషములో నా రథమును రెండు సేనల మధ్యను నిలువఁ బెట్టెను. రెండు సముద్రములు కలిసికొనుటకు సిద్ధముగా నున్నట్లు నేను తెలిసికొంటిని. నేను కౌరవ వీరులను జూచునప్పటికి నా ఉత్సాహము చప్పఁబడెను. భయమువలనఁ గాదు. పిరికితనమువలనఁ గాదు. నాకు వారందఱును సంబంధులు, బంధువులుగఁ గన్పట్టిరి. అందఱ

కంటెముందుగా నందలకును, సేనాపతియు, తెల్లని గడ్డమును, తెల్లని వెంట్రుకలును గలిగి సాక్షాత్తుగ వీరతా మూర్తియై ప్రధాన సేనాధిపతియగు భీష్మ పితామహుఁడు నిలువఁబడి యుండెను. ఈతఁడు మనకు తాత. ఈతఁడు మనలను పుత్రులవలెఁ బెంచెను. మనము దుమ్ములో నిండిన వస్త్రములతో నిశ్శంకతో ఈతనిపడిలోనికి బోవ, ఈతని స్వచ్ఛమగు వస్త్రములు మలినము లగుచున్నను మన మీఁదఁ గోపపడక ఎంతో ప్రేమతో మనలను ముద్దు పెట్టుకొనెను. ఈతఁడెంతో మనలను హృదయమునకు హత్తుకొనెడువాఁడు. అట్టిది నేఁడాతనితోఁ బోరవలసివచ్చినది. ఈతని ఱొమ్ములో తీక్ష్ణబాణములు నాటవలసి వచ్చెను. ఇది నా వలనఁ గాదనుకొంటిని. నేను రాజ్యము కొఱ కిట్టి కూరకర్మను జేయఁజాలనంటిని.

ఈతని సమీపమున వీరత్వమునకు, బ్రహ్మతేజమునకు సాకార మూర్తియై సన్నగానుండిన కఠోర పూజనీయ బ్రాహ్మణుఁడు నిలువఁబడియుండెను. ఈతఁడే నా గురుదేవుఁడగు ద్రోణుఁడు. ఈయాచార్య చరణానుగ్రహముననే మనము సమస్త శస్త్రాస్త్రములను సంపాదించితిమి. నన్ను బలవంతునిఁగఁ జేసినవాఁడును. త్రిలోక్య విజయునిఁగా నొనర్చినవాఁడీ గౌతమ నందనుఁడే. మనమీఁద నీతడెంతో స్నేహముం చెడువాఁడు. ఈ సమదర్శియగు నాచార్యుఁడు నామీద నెంతో పక్షపాతము జూపెడువాఁడు. మనము శ్రద్ధాంజలి పుష్పముల నీతని శ్రీ చరణములమీఁద నుంచి మన మెఱుపు కిరీటములతో నీతనికి నమస్కరించినప్పుడు ఆతఁ డెంతో ప్రేమతో నిట్లనెడువాఁడు:— "వత్సా! ఆయుష్మాన్భవ!" ఇట్టి గురుదేవునితోనా నేఁడు పోరాడుట! మన బాణపు పోట్లచే నాతని శరీరము రక్తరంజిత మగుటను మనము చూడఁగలమా? ఇట్టిపాపము నా చేతులతోఁ జేయఁజాలను.

సూతపుత్రుఁడగు కర్ణుఁడు కూడఁ దైనప్పటికి ఎల్లప్పుడు మనకు ప్రతిస్పర్ధి యైనప్పటికి, మనకు సహాధ్యాయి సోదరుఁడు. మనమందఱ మొకే యాచార్యుని శిష్యులము. రాజా! అప్పటికి నాకు తెలియదు గాని అతఁడు సహాధ్యాయియే కాదు మన కందఱకు అన్న. ఆ మహాభాగుఁ డగు కర్ణుఁడు సూతపుత్రుఁడు కాఁడు. మీకంటెఁ బెద్దవాఁడు. శ్రేష్ఠుఁడు. సమ్మాననీయుఁడగు ఆత్మబంధువు. నేనప్పటికి అతఁడొక యద్వితీయ ధనుర్ధరుఁడనియు, నాకు ప్రతిస్పర్ధియనియు మాత్రమే యెఱుఁగుదును ఆతనికి కలుగుచున్న కీర్త్యతిశయమునకు నేను భయపడుచున్నను ఆతనిఁ జంపవలెనని నా హృదయములో లేదు. ఇంతటి మహామహుఁ డగు వీరుని ప్రాణమేల తీయవలెనని నా యభిప్రాయము.

ఇఁక నశ్వత్థామ అతఁడు నా గురుపుత్రుఁడు సోదరుని వంటి వాఁడు. విద్యలోను, వర్ణములోను, వయస్సునందును, బలపరాక్రమ మందును జ్యేష్ఠుఁడు, శ్రేష్ఠుఁడు. నాకు పూజనీయుఁడు సమ్మాన నీయుఁడు. బ్రాహ్మణుఁడయ్యు నీతఁడస్త్రశస్త్రములతో యుద్ధముచేసిన నిలువలేము. ఒకవేళ నాతనిఁజంపి రాజ్యము పొందిన బ్రాహ్మణరక్త రంజితమగు నా రాజ్యము భూత, ప్రేతముల కాహారమగును. ఆతని నెట్లు చంపఁగలను? గురుపుత్రుని, మఱియు బ్రాహ్మణుని నేను జంప లేను. నేను చచ్చినను నా కిష్టమే.

మనమామ శల్యుఁడు నిలువఁబడి యున్నాఁడు. మన మీతనిని స్వంతమేనమామకంటె నెక్కుడుగఁ బ్రేమింతుము. ఈతఁడు మన నకులసహదేవుల తల్లియగు మాద్రికి అన్న. ఈతఁడు మద్రదేశమునుండి మనలను జూడ ననేకోపహారములను గొనివచ్చునప్పుడు పరుగెత్తుకొని వెళ్ళి అమ్మయగు కుంతికి మామ వచ్చుచున్నాఁడని చెప్పి మరల పరుగి డిడి ద్వారమున నాతని కౌఁగిలించుకొనెడు వారము. అప్పుడాతఁడు

మనల నందఱను ముద్దాడి, తెచ్చిన ఉపహారములను మన ముందుంచి యిట్లనెడువాఁడు:— "అర్జునా! నీకేవస్తువు యిష్టము నాయనా! నీవు వీనిలో నేవస్తువులను గైకొందువో చెప్పుము" నేనొకటిరెంటిని వెంటనే తీసుకొనెడు వాడను. అతఁడు నవ్వి, లాలించి, ముద్దిడుకొనును. అట్టి వానిని నేను ప్రాణములు తీయుటకు అస్త్రశస్త్రములతో నిలువఁబడెను. అతఁడు మేనల్లుండ్రను జంపఁడు ఒక వేళఁ జంపినను నేనాతనిపై నస్త్రశస్త్రముల నెట్లు ప్రయోగింపఁగలను?

ఇఁక దుర్యోధనుఁడున్నాఁడు. వీని ప్రకృతి క్రూరము. స్వభావము నిందితము. కాని యేమి చేయుదుము? మన వ్రేలి ఉంగరము బిగిసి రాకున్న దానిని తెగగొట్టి తీయుదుము. కన్నులు చెడినను, కుళ్ళినను వాటిని బెలికి వేయుదుము ఏమైనఁగానిండు. ఈతఁడు మన పెద తండ్రి కొడుకు. వయస్సునఁ బెద్దవాఁడు. అనేక సారులు ఈతని పాద ములనంటితిని పైకియే కాని ఈతఁడు నన్నుఁ బ్రేమించెను. నేఁడీతఁడు చక్రవర్తి. పదునొకఁడు అక్షౌహిణీసేనకు అధిపతి. ఈతనిఁజంపి ఈతఁడు భోగించి వదలిన ఉచ్ఛిష్టరాజ్యమును మనము పొందినచో దానివలన మనకు సుఖమేనా? ఈతని రాణులు విధవలై ఉష్ణ నిశ్వాన ములు విడిచిన మన హృదయముమీఁద బొబ్బలెక్కవా? ఈతఁడు చక్రవర్తి కాఁదలచిన కానిండు ఇప్పుడు మనమెట్లు బిచ్చమెత్తుకొని జీవించుచుంటిమో యిప్పుడు నట్లే జీవింపవచ్చును. జీవితమెన్నాళ్ళు? ఈ క్షణభంగుర దేహమునకీ క్రూరకర్మ యేల చేయవలయును? ఒక రక్తమునఁ బుట్టిన సోదరులను వధించి కులహత్యను, కళంకమును నే నేల మోయవలెను?

ఈ విధముగ బంధువు లందఱను గాంచగాఁనే నాకు మోహము కలిగెను నేను గాండీవమును జారవిడిచితిని. అంబులను, అంబుల

పోములను తీసి పాఱవైచి, నా సారథియగు శ్యామసుందరునితో నిట్లంటిని:— "వాసుదేవా! నా రథమును హస్తినాపురమునకుఁ గొనిపొమ్ము."

చకితుడై యాతఁడిట్లనెను — "ఏల! అక్కడేమైన మఱచిపోయితివా! యుద్ధారంభమున నీకేమి జ్ఞాపకమునకు వచ్చినది?"

అన్యమనస్కుఁడనై నేనిట్లంటిని:— "నేను యుద్ధము చేయను."

గుడ్లురిమి, శుష్కమగు నవ్వు నవ్వుచు, నన్నవజ్ఞ చేయుచు నా జగన్నాటక సూత్రధారుఁ డిట్లనెను:— "భయపడితివా యేమి? బడాయిలు కొట్టితివే? ఇట్లైతివేమి?"

నేను మిక్కిలి రోషముతో నిట్లంటిని:— "కృష్ణా! నన్నెగతాళి చేయకుము. శివునితో యుద్ధముచేసి మెప్పించిన అర్జునుఁడు మానవులకు భయపడునా? నివాతకవచులను, హిరణ్యపురవాసులను, దేవతలకు కూడ నవధ్యులైన వారిని లీలగాఁ జంపిన యర్జునుఁడు మానవులకు భయపడునా? భయముచేఁగాదు, దయచే నీ బంధులను జంపఁజాలకున్నాను."

కొంచెము వ్యంగ్యస్వరముతో శ్రీకృష్ణుఁ డిట్లనెను:— "అబ్బో! చాలా దయగలవాఁడవు. దయచే నీవు పాండురాజును బ్రదికించలేదేమి?"

నే నిట్లంటిని:— అప్పటికి నేను పసివాఁడను. పెద్దవాఁడనైనచో యమునిపెత్తన మేమి సాగును? మృత్యువు వాసమైనప్పు డెవరు రక్షింపఁగలరు?"

అతఁ డిట్లనెను:— "అయితే నీవు మృత్యువునుండి రక్షింపఁ జాలకున్న భయపడెద వేల? వీరంత తెల్లప్పుడు నివసించెదరా? నీవు దయదలఁచి వదలిన వీ రజామరులై యుందురా?"

నేను బలమును జూచుకొని యిట్లంటిని:— "మృత్యు సమయము వచ్చి చచ్చిన నది వేఱువిషయము. మనము వ్యర్థముగ జేతులార జంప నేల? కాలవశులై వారు చచ్చిన మనకు పాపమురాదు."

అప్పుడాతఁడు పకపకనవ్వి యిట్లనెను:— "అర్జునా! నీకు తెలియ లేదు. నీ విన్నాళ్ళు నాసహవాసము చేసియు నజ్ఞానివిగానే యుంటివి. నేనే కాలస్వరూపుఁడను. నేనే నేడు సమస్త లోకమును సంహారము చేయఁ గూర్చుంటిని. నేనే నిన్ను నిమిత్తమాత్రునిఁగఁ జేసి సంహారము చేయఁబోవుచున్నాను. భీష్మ, ద్రోణాదుల నెదుర్కొను శక్తి నీకేది? నీ రథముపై గూర్చుండి అందఱను నిస్తేజులను, మృతప్రాయుల నొనెర్చెదను, నీవు యుద్ధము చేయకున్నను వీరు చావఁగలరు. నేనే నీమూలమున వీరికి మృత్యువు వ్రాసిపెట్టితిని. నీ వహంకారమున యుద్ధ భూమిని వదలిపోయిన నా ప్రకృతి నిన్ను బలాత్కారముగ యుద్ధమునకు లాఁగఁగలదు వీరందఱు చచ్చిరి. కేవలము నీకు ప్రతిష్ఠ కలుగ జేయుటకై చచ్చినవారిని మరల నీచేఁ జంపించుచున్నాను. కావున వీరా! పిఱికితనమును వీడి నేను చెప్పినట్లు యుద్ధము జేయుము."

అప్పుడు నా కిష్టము లేకున్నను యుద్ధము చేసితిని. అతని తర్కమునకుఁ దలవంచితిని. రాజా! అతఁడు నారథమును నడుపు చుండిన రెండు కాలచక్రములను నడుపుచున్నట్లుండెను. పిడుగు పడిన తప్పక చచ్చినట్లు అతని దృష్టిపడిన నాతఁడు హతవీర్యుఁడై మృతుని వలె నగును.

కౌరవయోధు లందఱు బలముకొలఁది నాపై ప్రహారములు గావించిరి. ఆ యస్త్రశస్త్రములన్నియు నమోఘములు వ్యర్థముకానివి. కాని కృష్ణకృపచే నవి నన్నుఁదాఁకలేదు. నా దగ్గఱకువచ్చి వ్యర్థమై పోయెడివి. మహారథులందఱును నామీఁద బాణవర్షములు కురిపించిరి. కాని గోవర్ధన ధారణ సమయమున నింద్రుని వర్షమట్లు అన్నియు వ్యర్థము లయ్యెడివి. నృసింహదేవుఁడు తనగోళ్ళతో హిరణ్యకశిపుని జీల్చెను. కాని యీతఁడు తన దృక్కులచే నందఱ హృదయములను జీల్చెను. అందఱు హృదయహీనులు, బలహీనులు, క్షీణాయుష్కులైరి. హిరణ్యకశిపుఁడు ప్రహ్లాదుని జంపుటకు విషము తినిపించెను. సముద్రమున బడవేసెను. కొండలనుండి దొరిలించెను. అగ్నిలోఁ బడవేసెను. పాములఁ గఱపించెను ఎన్ని యాతనలు పెట్టినను అత నికి బాధకలుగనట్లు భీష్మ, ద్రోణ, కర్ణ, శల్యాది సేనాపతులు దుర్యో ధనుని సంతోషపెట్టుట కనేకములగు నమోఘాస్త్రములఁ బ్రయోగించిరి. కాని అతని దయచే నన్నియు వ్యర్థములయ్యెను నన్నేమియుఁ జేయ లేకపోయెను. అట్లు నారథము మీఁదఁగూర్చుండి నన్ను సదా రక్షిం చుచు, శత్రువుల తేజోబలములను హరించుచు, నన్ను బాణములనుండి రక్షించుచుండిన శ్యామసుందరుఁడు నన్ను, నట్టనడి సముద్రములోఁ బడి కొట్టుకొనుచుండ వదలిపోయెను. నాముందే అదృశ్యుఁడయ్యెను. అతఁడు లేక నీ ప్రపంచమంతయు శూన్యముగఁ దోఁచుచున్నది. రాజా! ఇప్పుడీ ప్రపంచము సారహీనమగు బియ్యములేని తాలువలె నైనది. ఇప్పుడు మనలను దలఁచు కొనువాడు లేడు." అర్జునుఁడిట్లనుచు వికలు డయ్యెను.

## అయ్యో! హరిచే రథమును తోలించితిని గదా!

శ్లో॥ సౌత్యే వృతః కుమతి నాత్మద ఈశ్వరో మే
యత్పాదపద్మ మభవాయ భజంతి భవ్యాః।
మాం శ్రాంత వాహమరయో రథినో భువిష్ఠమ్,
న ప్రాహరన్యదనుభావ నిరస్త చిత్తాః॥

—శ్రీ భాగ. ౧ స్కం. ౧౫ అ. ౧౭ శ్లో.

"చ॥ వసుమతి దివ్యబాణముల వ్రక్కలువాపి కొలంకు సేసినా
రసములు మాటుగాఁబఱపి రథ్యములన్ రిపులెల్లఁజూడ సా
హసమున నీటఁబెట్టితి రణాంగణ సైంధవుఁ జంపునాఁడు నా
కసుర విరోధి భ.దగతి నండయి వచ్చినఁగాదె భూవరా॥"

—శ్రీ మదాంధ్ర భాగవతము.

నిరంతరము దగ్గఱ ఉండుటచే పెద్దవారిదగ్గఱ కూడ మనము నిర్భీకుల మగుచుందుము. వారివద్ద నంతగా సంకోచింపము. ఇఁక నాగొప్పవ్యక్తి తాను గొప్పయనుకొనక సమానులుగానే వ్యవహరించు చుందురు. వారికి భేదభావముండదు మనమాతని ఉదారకృపలచే అతని మహత్వమును మఱచిపోవుచుందుము సమానులుగానే వ్యవహరించు చుందుము. వారు మనలను వదలి వెళ్ళిపోఁగానే వారిమహత్వము స్మరణకువచ్చి, వారి విషయము లన్నియు మన హృదయ పటలమున చలనచిత్రమువలె వచ్చి నాట్యము చేయుచుండును. ఒకవేళ స్వార్థ వశమున పొరపాటున నేదైన అయోగ్యకార్యమును వారిని చేయుమనిన,

అప్పుడు వారు స్నేహపూర్వకముగ "నాయనా! ఈ కార్యము నా పదవీ ప్రతిష్ఠతకు ప్రతికూలమైనదనియు, దానిని తనచే చేయింపవలెను దనియుఁ జెప్పిన తర్వాత మనము, అప్పు డాతఁడు మనలను పాపము నుండి రక్షించినాఁడని సంతోషింతుము. అట్లుగాక అతఁడు నిషేధించక తన ఉదారతా వశమున నాయనుచిత కార్యమును గూడ మనమీఁదఁగల ప్రీతిచే సంతోషముతోఁ జేసినతర్వాత "అయ్యో! నేను స్వార్థవశమున నా మహావ్యక్తిచే నెట్టి నిందిత కార్యమును జేయించితిని! అతని కీర్తి ప్రతిష్ఠలపైఁ గొంచెమైన లక్ష్యముంచనైతిని" అని పశ్చాత్తాప పడుదుము. ఇట్టిది హృదయమున ఉండి యుండి పొంచుచుండును మార్మిక పీడ కలుగఁ జేయును

శ్రీకృష్ణునిచే సారథ్య కార్యమును చేయించి యిప్పు డర్జునుఁడు పశ్చాత్తాపము పడుచున్నాఁడు. భగవానుని మహత్వ మాతనికిప్పుడు తెలిసినది. ఎవనిని బూజ చేయవలసి యుండెనో, అతనిచే నేను భృత్య, సేవక సూతాదులు చేయవలసిన కార్యములు చేయించితిని. పూర్వము యుద్ధరథములలో మధ్య ఉన్నతాసనమున రథికుఁడు కూర్చుండెడు వాఁడు. రథి వెనుక దృఢ రథధ్వజ దండముండెడిది. దాని పైన వారి వారి చిహ్నములతో విశాలధ్వజ మెగురుచుండెడిది. ఆ ధ్వజమును జూచి, యిది ఫలానావారి రథమని చెప్పవచ్చును. ధ్వజము యోజనముల దూరమునఁగూడ కనఁబడునంతటి విశాలముగ నుండెడిది. ధ్వజదండమునకు వెనుక కొందఱు నిలుచుండుట కవకాశ ముండెడిది. రథికునకు పృష్ఠ రక్షకులు అస్త్రశస్త్రములను గైకొని రక్షించుచుందురు. ప్రక్కలందుకూడ పార్శ్వరక్షకులుండి రక్షించుటకు స్థలముండెడిది. ఇఁక ముందు సారథి కూర్చుండు స్థలము రథికుని పాదములు పేర్చిలాడ వేసిన నచ్చట నుండును. సారథికి ఆటునిటు అతనిని, గుఱ్ఱములను రక్షించుటకు సైనికులుందరు. రథమునకు ఇంకొకటి చిన్నరథము వంటిది

తగిలింపఁబడి యుండును. దానిమీఁద వివిధాస్త్రశస్త్రము లుండును. రథికునివద్ద అస్త్రశస్త్రము లైపోయినచో పృష్ఠరక్షకులు వాటినుండి తీసి యిచ్చుచుందురు. రథము మీఁదనుండు సైనికులు ధర్మానుసారముగ నెవరితోఁడను యుద్ధము చేయరు. వారిపని వచ్చెడి బాణములనుండి రథిని, రథికులను రక్షించుటయు, వచ్చెడు అస్త్రములనుండి ప్రతీకారముగ నస్త్రములు వేయుటయునై యున్నది. యుద్ధము రథికుఁడు మాత్రమే చేయును. యుద్ధ కోలాహలములో రథికుఁడు సారథికి నోటితో రథమును కుడి యెడములకు పోనిమ్మని ఆజ్ఞలొసంగరు. నోట నాజ్ఞలొసంగక పోవుటకు చాల కారణము లున్నవి. ఒకటి కోలాహలములో వినఁబడదు. రెండవది రథికుని ధ్యానము శత్రు సంహారమందే యుండును. మూఁడవది వాని మాటలు విని ఎదుటనున్న శత్రువు ప్రతీకార మొనర్పవచ్చును. నాలుగవది రథము మీఁదనున్న యితర సైనికుల దృష్టియు మరలవచ్చును. ఈ కారణములచే రథికుఁడు మౌనియై ఆజ్ఞల నొసంగును. మాటలు మాటలాడుట శత్రువులతోనైన జరుగును కాని రథముమీఁద వారితో కేవలము సంకేతముతోనే మాటలు జరుగుచుండును.

సారథియొక్క రెండు కణఁతలకు రథికుని కాలిబొటన వ్రేళ్ళు రెండును తాఁకుచుండును. రథము నెటు త్రిప్పవలెనని ఆ వైపు కణఁతను బొటనవ్రేలితో నొక్కిన నాతఁడా వైపునకు రథము నడుపును. ఒక్కసారిగా వెంటనే రథమును త్రిప్పవలయుననిన రథికుఁడు రెండు బొటనవ్రేళ్ళతో గట్టిగానొక్కి సారథి ముఖమును త్రిప్పిన వెంటనే రథమును త్రిప్పి పారిపోవును. అర్జునుఁడుకూడ ఇట్లు చేసెడువాఁడే. అతని కాలి బొటనవ్రేళ్ళ రెంటిని శ్యామసుందరుని ఉంగరములు తిరిగిన ముంగురులు కల కణఁతలమీఁదనే పెట్టెను నిరంతరము బొటన వ్రేళ్ళచ్చటనే యుండుటచే నచ్చట గుంటలుకూడ పడినవి. ఆ గుంటలు

అంగుష్ఠ నిలయములా యనునట్లుండెను. నేఁడు దానిని దలఁచుకొని అర్జునుఁడేడ్చుచుండెను. ఏ పాదపద్మములను ఋషులు, మునులు జ్ఞానులు, ధ్యానులు, బ్రహ్మర్షులు, రాజర్షులు, దేవర్షులు మొదలగు తపస్వులగువారు మోక్షముకొఱకై పూజింతురో, తన కఠిన చేతులు తగిలిన ఎక్కడ నొచ్చునో యని లక్ష్మిదేవి యెవరి పాదములను బట్టుకొనుటకు భయపడునో,ఏ పాదపద్మ పావన పరాగమును బొంది బ్రహ్మదిదేవతలు తమ్ము కృతకృత్యులుగ దలతురో, ఎవని కాళ్ళు కడుగు నీరు త్రైలోక్య పావనమగు గంగ యైనదో, ఆ ప్రభుని అరుణ చరణములను నేను శిరస్సుతోఁ బూజింప లేదు. ఆ జగత్పావన పరాగమును మస్తకమున ధరింపలేదు. పైగా నా జగద్వంద్యుని మస్తకమున నా కలుషిత పాదములనుంచి పాపమున కొడిగట్టితిని.

అతఁడెంత గొప్పవాఁడు అతనితో సమానమగు గొప్పవాఁడీ లోకమున నెవఁడుండఁగలఁడు? నేనాతని నెట్లు చేసిన నట్లయ్యెను. ఏమి చేయించిన దానిని జేసెను. ఏమి చెప్పిన దానిని వినెను. నాతో నెంత ప్రేమగా మాట లాడెడువాఁడు! 'అర్జునా! పృథానందనా! మిత్రవరా! కురుకుల తిలకా!' అని నోటినిండ పలుకుచు నిట్లు నంబోధించు నప్పుడును, 'బావా!' యని పిలుచునప్పుడును ఆ పలుకులలో ప్రేమ ఒలుకుచుండెడిది. ఆతని యుచ్చారణలో నెంతటి సారస్య మున్నది? ఇప్పుడట్లు నన్నెవరు పిలువఁగలరు? నన్నిట్లు పిలిచి ఉత్సాహము నినుమడించువారేరీ? ఇవి జ్ఞాపకమునకు వచ్చిన హృదయము చూర్ణమగుచున్నది. గుండె బ్రద్దలగుచున్నది. చిత్తము కలత చెందుచున్నది.

హస్తినాపురములో నొకదినమున రాత్రి చాల ప్రొద్దుపోవువఱకు శ్రీకృష్ణుఁడు నిద్రపోలేదు. నే నంతఃపురమునుండి వచ్చుట ఆలస్యమైనది. ఆతఁడట్లు కూర్చుండుటను గాంచి 'శ్యామసుందరా! ఇంకను నిద్రపోలేదేమి?' అంటిని. 'అర్జునా! నీవు లేకపోవుటచే నాకు నిద్ర

లేదు' అని అతఁడతి స్నేహ స్వరమున ననెను. ఆ వాసుదేవునకు నావలన నేమి ప్రయోజనము? కాని ఆతని స్నేహమట్టిది. తిరుగఁబోయి నప్పుడు పిల్లలవలె భయపడుచు మీదగ్గఱకు వచ్చును. చిన్నపిల్లలు భయ పడుచు తల్లి, తండ్రి, గురువుల యొద్ద నిలుపఁబడి యాజ్ఞ అడుగునట్లు మీ ముందఱ లేచి నిలువఁబడి సంకోచస్వరముతో 'మేము వాహ్యాళికి వెళ్ళవలెనని యున్నది. ఆజ్ఞ యగుచోఁ త్వరగా వెళ్ళి తిరిగి వచ్చెద" మనును. మీ యాజ్ఞయైనచో వెంటనే సంతోషముతో నా భుజముమీద చేయివైచి తీసికొనిపోవును అనఁ యమున నాతఁ డెంతో కలిసి మెలిసి మాటలాడును.

ఎక్కడనైన కూర్చుండవలసి వచ్చిన మా యిద్దఱకు రెండు వేఱు వేఱాసనములు వేసిన నాతఁడు తన యాసనమునఁ గూర్చుండఁడు. నా యాసనము మీఁదకు వచ్చి కూర్చుండి నన్నాపలకు జరిపి నవ్వును. "పిల్ల చేష్ట లింకను బోవనేలేదు కృష్ణా!" యని నేననఁగా విని కిలకిల పకపక నవ్వి క్రింద దొర్లుచుఁ బ్రేమతో నిట్లనును :- "అర్జునా! నా బాలత్వము పోవలెనని నేను కోరను నేనిట్లు పిల్లవానివలె నవ్వుచు నాడుచు పాడుచు నుండవలెనని నా కోరిక. ఈ బాలత్వము నాకు సంపత్తు. నా జీవన వ్యాపారము నవ్వుటే. నాయనమ్మ చచ్చినవాఁ డేడ్వవలెను. నాకు నాయనమ్మ ఉన్నది తాత ఉన్నాఁడు. ఒక్క తల్లి కాదు. ఏడ్గురు తల్లులు బ్రతికియే యున్నారు. అందఱు నన్నుఁ బ్రేమింతురు. ఇఁక నేనేల నేడ్వవలెను?"

అంత నేను నవ్వుచు "పదునాఱువేలమంది పూరీసేనను సిద్ధము చేసి పెట్టినచో నేమగు" ననఁగా విని నవ్వును. ఇది చెడ్డయని యను కొనఁడు, అప్రసన్నుఁడును గాఁడు. మాట మాటకు, మాటిమాటికి నవ్వుటే ఆతని స్వభావము.

ద్వారకలో మేమున్నప్పుడు భోజనసమయములందు ఎంత

పిలిచినను మహలునుండి రాఁడు. అతఁ డెల్లప్పుడు 'అర్జునుఁడు ఎక్కడికి వెళ్ళినాఁడుఁ అర్జునుఁడు ఎక్కడికి వెళ్ళినాఁ'డని అడుగును. నేను రాఁగానే నన్ను వెంటఁ గొనిపోవును ఇద్దరము ఒక్కసారిగా తినెడు వారము కులాసాగా యున్నప్పుడు తనకు సంబంధించిన గొప్ప విషయములు చెప్పును. "నే నిది చేసితిని. అది చేసితిని, వానిని గొట్టితిని, వీనిని జంపించితిని, వానిని బడఁగొట్టితిని. వీనిని యమపురి కంపితిని" అని చెప్పును. అప్పుడు నేనిట్లనెడివాడను-"ఇవన్నియుఁ గట్టిపెట్టుము. ఏమి బడాయిలు కొట్టెదవు? మన్ను తిన్నప్పుడు యశోద దగ్గఱ అబద్ధము లాడితివి. భయపడి మధురను వదలి సముద్రములో దాఁగితివి. గొప్ప సత్యవాదివే. నీవు బడాయిలు కొట్టఁదలఁచిన గొఱ్ఱెలమందలవలె చేరిన ఈ రాజులవద్ద కొట్టుము, నా వద్ద ఈ ఆకాశ పాతాళముల నొక్కటి చేయకుము" అతని భార్యల ముందిట్టి మాట లనినప్పటికిని అతఁడు నొచ్చుకొనెడువాఁడు కాఁడు. ఇట్టి మాటలను పసి పిల్లవాఁడు కొట్టిన తల్లి సహించినట్లును, యువకుఁడగు పుత్రుఁడు బడాయిలు కొట్టుచుండిన తండ్రి విని విననట్లూరకొన్నట్లును ఉపేక్షించును.

మహాభారత యుద్ధము జరుగునట్లు నిశ్చయము కాఁగానే మీరు నన్ను శ్రీకృష్ణుని దగ్గఱకు రణనిమంత్రణమునకై పంపితిరి దుర్యోధనునకు లోకములోని యోధులందఱును దనవైపునకుఁ దీసికొని పోరాడవలెనని అతని యూహ. మనవైపున నొక్కఁడు నుండకూడదనియు నాతని కోరిక. రాజులలో యుద్ధనియమ మేమనఁగా ముందుగా యుద్ధమున కెవరు పిలుతురో వారు వారిపక్క పోరాడవలయును. ఎట్లైనను శ్యామసుందరుని తన వైపునకుఁ ద్రిప్పుకొనవలెనని, నేను వెళ్ళుదునని ముందుగానే తెలిసికొని, నాకంటె ముందుగా రథముమీఁద రాత్రులందే ప్రయాణముచేసి నా కంటె ముందే ద్వారకకు చేరెను.

అప్పటికి కృష్ణుఁడు నిద్రించుచుండెను. అప్పుడు దుర్యోధనుఁ డభిమాని యగుటచే శ్రీకృష్ణునకు శిరస్సుకడ శయన గృహములోఁ గూర్చుండెను. నేను వెళ్ళునప్పటికి యిదివఱకే దుర్యోధనుఁడు వచ్చినాఁడను సంగతి తెలిసికొని త్వరత్వరగాఁబోయి కృష్ణుని పాదములకడ కూర్చుంటిని. ప్రతిదినము కృష్ణుఁడు అరుణోదయమునకుఁ బూర్వమే లేచెడువాఁడు. అప్పుడు 'రామ, రామ, నారాయణ నారాయణ' యనుకొనుచు విశాలపద్మాక్షులను నలుపుకొనుచు లేచెను. అతఁడు దుర్యోధనుఁ డున్నాఁడని తెలిసియుఁ జూడలేదు. లేవఁగానే నన్నిట్లడిగెను:- "ఓహో! నేఁడర్జునుఁడు వచ్చినాడే? స్వాగతమ్, స్వాగతమ్!" ఇంతలో దుర్యోధనుఁ డిట్లనెను :-"మహారాజా! నే నర్జునుని కంటె ముందుగానే వచ్చి నిరీక్షించుచుంటిని."

ఇది వినఁగానే వెనుకకుఁ దిరిగి తెలియనివానివలె సంభ్రమముతో నిట్లనెను :- "అహా! మంచిది! దుర్యోధన మహారాజులు కూడ వేంచేసిరి. ధన్యవాదములు! ధన్యవాదములు!"

దుర్యోధనుఁడు దృఢముగా నిట్లనెను:- "ధన్యవాదములు తర్వాత. ధర్మవేత్తలగు క్షత్రియులు మొదట వచ్చిన వాని నిమంత్రణమునే స్వీకరింతురు. కావున నీవు మావైపునఁ బోరాడవలయును."

భగవానుఁ డిట్లనెను:- "అవును బావా! యుద్ధనియమమంతియే రెండు పక్షములలో ముందు వచ్చినవారి పక్షముననే ధర్మాత్ములగు క్షత్రియులు యుద్ధము చేయుదురు."

ఉ. "ముందుగ వచ్చితీవు మునుముందుగ నర్జును నేను జూచితిన్
బందుగు లన్న యంశమది పాయకనిల్చె సహాయ మిర్వురన్
జెందుట పాడి, మీకునయి చేసెద సైన్యవిభాగ మందు మీ
కుందగుదానిఁ గైకొనుఁడు కోరుట బాలుని కొప్పు ముందుగన్."

—శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల పాండవోద్యోగము.

దుర్యోధనుఁ డిట్లనెను:- "కాదు, మహారాజా! మీరన్యాయము చేయుచున్నారు. అంచట నడుగుఁడు. నేను ముందుగా వచ్చి కూర్చుంటిని."

భగవానుఁడు కొంచెము విసుగుకొని యిట్లనెను:- "ఆహా! మీరెట్టి పలుకులు పలుకుచున్నారు? నా కింకొకరు సాక్షులెందులకు? నీ మాటమీఁద నాకు విశ్వాసము కలదు. నీవు నిజముగ మొదటనే వచ్చి యుండవచ్చును. నా దృష్టి మొదటలో నర్జునునిమీఁద పడినది. నా దగ్గఱ అపరాజితులగు గోపకులు కోటిమంది కలరు వారిని నారాయణ సేన యందురు. వారందఱొకప్రక్కన, నిశ్శస్త్రుఁడనై నేనొక ప్రక్కన నేను శస్త్రము పట్టను, యుద్ధము చేయను ఊరక పైపై సలహాల నిచ్చుచుందును. ఈ రెంటిలో మీ యిష్టము వచ్చినది గైకొనవచ్చును. అర్జునుఁడు చిన్నవాఁడు పిల్లవాండ్రకు పోఁగా మిగిలినది పెద్దవారికి. కావున నర్జునుని ముందు కోరుకొననిమ్ము."

నేను సమస్త నారాయణసేనను కోరుకొనిన సర్వముచెడి పోవునని ఆతని భయము. కాని సేన నా కెందులకు? నేను వెంటనే "నాకు సేన అక్కఱలేదు నీవే కావలెనంటిని."

భగవానుఁడు నావైపు ఆశ్చర్యచకితుఁడై చూచుచు నిట్లనెను:- "బాగుగా చెవులు పెట్టుకొని విను. నేను యుద్ధము చేయను. ఆయుధము పట్టను నీవు మోహములో పడవలదు. నీహితాహితము నాలోచించుకొని నీయిష్టము వచ్చిన వస్తువు నెన్నుకొనుము."

ఇంతలో దుర్యోధనుఁ డిట్లనెను:- మహారాజా! మీరు అంతయు తలక్రిందులు చేయుచున్నారు. అతఁడు నిన్ను కోరుకొనఁగా మరల దానిని మార్పఁజూచెదరేల? మీరనినట్లే మీసేనయంతయు నా పక్షమైనది మీరు అర్జునుని పక్షమైతిరి. ఇఁక దీనిని మార్పఁగూడదు. నాకీ నిర్ణయము ముమ్మాటికి నంగీకారమే."

భగవానుఁడు మరల నవ్వి నాతో యిట్లనెను:- అర్జునా! నిరాయుధుఁడనగు నన్నుఁ గైకొని నేఁడు నీవు మోసపోయితివి. బాగుగా పోరాడు నారాయణసేన నేల నెన్నుఁకొనలేదు?"

నేను దృఢముగ నిట్లంటిని:- "వాసుదేవా! నాకు సేనతో నవసరములేదు. నాకు నీవు కావలయును."

దుర్యోధనుఁడు శీఘ్రముగా నాసనమునుండిలేచి యిట్లనెను:- "మంచిది. యదునందనా! నీవు నీ ప్రతిజ్ఞను గాపాడుకొనుము. నీసేన యంతయు నావంతు" అని అతఁడప్పుడే లేచి వెంటనే బలరాముని కడకు వెళ్ళెను

దుర్యోధనుఁడు వెళ్ళిపోఁగానే కృష్ణుఁడు పట్టుశాలువ కప్పుకొనియే గట్టిగా నన్నుఁ గౌఁగిలించుకొని యిట్లనెను:- "అర్జునా! నీవు నాచే నేమి చెయింపఁ దలఁచినావు?"

అయ్యో! ఆ సమయమున నా బుద్ధి బుగ్గియైనది. ఆ సమయమున శ్యామసుందరుఁడు నా వివేకమును హరించెను. నాముందు తన యైశ్వర్యము నంతను అతఁడు దాఁచెను. ఆ సమయమున నేనిట్లన వలసినది:— "ప్రభూ! నేను ప్రతిదినము నీపూజ చేయుచుందును. ప్రతిదినము నీ అరుణచరణములను గడిగి పుచ్చుకొనుచుందును. యుద్ధమునకు బోవునప్పుడును, యుద్ధమునుండి రాఁగానే నా కనుఱెప్పలతో నీ పాదపద్మ పునీతరాగమును దులిపెదను. నిన్ను నా హృదయ మందిరమునఁ గూర్చుండఁబెట్టి సర్వదా నిన్ను ధ్యానించెదను." నేనిట్లనక "శ్యామసుందరా! నీవు నాకు సారథివి కావలెను. వాసుదేవా! నీవంటి సారథి చిక్కి, నా రథమును నడిపించో నేనొక్కఁడనే త్రైలోక్యవిజయుఁడను కాఁగలను."

రాజా! ఆసమయమున నాతఁడు నన్ను గద్దించి స్నేహముతో నిట్లనవలసినది!— "అర్జునా! ఈ పని నాకనురూపముగ లేదు. ఈ పని హీనవర్ణుఁడగు సూతుఁడు చేయవలసినది." కాని ప్రభూ! అతఁ డట్లన

లేదు. మిక్కిలి ఉల్లాసముతో నన్నుఁ బ్రశంసించుచు నిట్లనెను:- "వహ్వా! నీకు యాలోచన తట్టినదోయి! రథము నడుపుటలో నేను పరమ ప్రవీణుఁడను. నేను నీ రథము నడిపెదను."

మహారాజా! అల్పవిజయము కొఱకును, ప్రశంసా ప్రతిష్ఠల కొఱకును ఎవని పాదపద్మములను గొప్ప గొప్ప ఋషులు, మునులు, మోక్ష ప్రాప్తికొఱకు పూజింతురో అట్టివానిచే తుచ్ఛాతితుచ్ఛ సారథ్యమును జేయించితినే యని చింతిల్లుచున్నాను, అతని తలపై పాదములను మోపి అజ్ఞల నిచ్చితిని. అతఁడును నా యాజ్ఞలను నిజసేవకుని వలె జీతము పుచ్చుకొన్న భృత్యునివలెఁ బాలించెను.

మహారాజా! నా కుమారుని జంపిన జయద్రథుని జంపుదునని ఘోర ప్రతిజ్ఞను జేసిన ఆ దినమును మఱవఁజాలను. నాఁడు సూర్యాస్తమయములోగా జయద్రథుని జంపకున్న నే నగ్నిప్రవేశమును నీ జీవములతోడనే చేసెదనని భీషణ ప్రతిజ్ఞ జేసితిని. ఆ విపులసేననుంచి ద్రోణ, కర్ణ, శల్యాది వీరులతో సమానమగు యోధులచేఁ జుట్టుకొనబడిన జయద్రథుని బట్టుకొనివచ్చుట, మేరుపర్వతము క్రిందనున్న కలుగులో దాఁగిన యెలుకను బట్టుట సర్పమున కెంతటి కష్టమో అంతటి కష్టము. కాని కృష్ణకృపచే నాయీ అసంభవ ప్రతిజ్ఞకూడ సంభవమైనది. నెఱవేఱని ప్రతిజ్ఞ నెఱవేరినది.

అతఁడూరక సారథియైనను అతని విద్యుక్తధర్మమును చాల తెలివితేటలతో నిర్వహించెను, కులపరంపరాగతమగు సారథ్యమును జేయువానికంటె మిన్నగ సారథ్యమును నెఱపెను. జయద్రథుని వధ రోజుననే యోధులందఱు నన్నొక్కుమ్మడిగఁ జుట్టుకొనిరి. అందఱు నొక్కసారిగ నసంఖ్యాకములగు బాణములను బ్రయోగించుచుండిరి. ఆ దినమున నందఱును గలిసి నన్నుజంపి జయద్రథుని రక్షింపఁ బ్రయత్నించిరి. జయద్రథుని కోసుల దూరమున అనేక వ్యూహములను బన్ని సురక్షితుని జేసి దాఁచియుంచిరి. అతని దగ్గఱకు నేను చేరకుండునట్లు నా చుట్టును అందఱు క్రమ్ముకొని మధ్యలోనే ఆపఁజూచిరి. నా దివ్యరథమును విఱుగఁగొట్టలేకపోయిరి కాని నా గుఱ్ఱములను నొవ్వఁజేసిరి.

రణక్షేత్రమధ్యమున నాలుగువైపుల గొప్ప గొప్ప శూరులగు యోధులు నన్ను ముట్టడించినప్పుడు నా సారథియగు శ్యామసుందరుఁడు "అర్జునా! ఇక గుఱ్ఱములు నడువవు" అనెను.

ఇది వినఁగానే నా ముఖము మలినమయ్యెను. 'ఈ దినమున నా ప్రతిజ్ఞ నెరవేరదు. నే నగ్నిప్రవేశము చేయవలసినదే' యనుకొంటిని. భయభీతుఁడనై వినయభావముతో నే నిట్లంటిని :-"శ్యామసుందరా! ఎట్లైన నా రథమును జయద్రథుని సమ్ముఖమునకుఁ గొనిపొమ్ము." అతఁడు వెనుకాడుచు నిట్లనెను:-"బావా! నీవేమి మాటలాడుచున్నావు? గుఱ్ఱములలో నేదైన శక్తియుండిన గదా నేమైనఁ జేయుట? వాటి శరీరముమీఁద బాణము తగులనిచోటు నువ్వుగింజంతైన లేదను సంగతి నీవు చూచుటలేదా? యుద్ధము చేసి చేసి యివి యలసినవి. ఇఁక నివియొక అడుగైనఁ బోఁజాలవు"

చింతిత స్వరముతో నే నిట్లంటిని :-"ప్రభూ! అయితే యింకే మైన నుపాయము కలదా? ఇవ్వేళ మన ప్రతిజ్ఞ నెఱవేఱున దెట్లు?"

అతఁ డిట్లనెను:-"అవును, ఉపాయ మొకటి కలదు. గుఱ్ఱములకు నీరు దొరకవలెను. గుఱ్ఱములు లీదఁగలిగినంత విపుల జల ముండవలెను. నేను వీటికి మాలీసు చేసెదను. బాణములను బెఱికివేయుదును. అవి స్వస్థత చెందిన తర్వాతఁ బరుగెత్తఁ గలవు."

రణమధ్యమున శత్రుమధ్యమున నింతటి నీరెక్కడ నుండి వచ్చును? కాని యాతఁడు నా యంతఃకరణములోనికిఁ బ్రవేశించి ప్రేరేపించెను. నేనిట్లంటిని:-"వాసుదేవా! నీవు రథమునుండి గుఱ్ఱములను విప్పుము. నేనిక్కడనే సరోవరమును నిర్మించెదను."

ఆశ్చర్యమును ప్రకటించుచు నాతఁడిట్లనెను :- "నీకు నలువైపుల గొప్ప గొప్ప బలవంతులగు శత్రువులున్నారు. నీవు క్రిందకు దిగుటను గాంచి చంపివేయుదురు ఇట్లు మాటలాడెదవేల?"

సదా రక్షించుచుండెడివాఁడు. ఇట్టి జగత్పతిని నేను లోభవశమున, ప్రశంసా ప్రతిష్ఠలకొఱకుఁ క్షణమాత్రము సమ్మానము కొఱకు యుద్ధమున సారథిగా నొనర్చితిని. మహాభారత యుద్ధములో నా బాహుబలము చేతనే విజయము సిద్ధించినదనియు, నేనే నా తీక్ష్ణబాణములచే భీష్మ, ద్రోణ, కర్ణాది మహారథుల నోడించితిననియు నాకు ఇప్పటివఱకు గర్వము కలదు. కాని అది నిజము కాదు. శ్యామసుందరుని విజయమని నాకిప్పుడు బాగుగాఁ దెలిసినది. వారిని నేను జంపలేదు. కాలస్వరూపుఁడగు శ్రీకృష్ణుఁడే తన దృష్టిమాత్రముచేతనే చంపెను. అతఁడు లేకుండిన నేనేమియుఁ జేయఁగలవాఁడను కాను. నే నా అర్జునుఁడనే కాని నేఁడు నన్ను ఆటవిక భిల్లు లోడించిరి. శ్రీకృష్ణుఁడు లేకపోఁగానే నా ధనుర్బాణము లన్నియు దేనికి బనికిరాకుండ పోయినవి. నాయస్త్రశస్త్రములన్నియుఁ గుంఠితములైనవి. నేఁడా తపస్వినీ శాపము నిజమయ్యెను. నేఁడు నేను ఊరుపేరు లేనివారిచే నోడపోతిని. నేఁడు పెచ్చుపెరిగిన నా యభిమాన గర్వముడిగి పోయినవి. రాజా! ఇఁక ముందీ లోకములో నవమానమునే చూడవలసి వచ్చును. పాపులచేఁ బరాజితులము కావలసి యుండును. దానికి ఒప్పుకొనిననే యీ భూమిపై నుండవలెను లేదా శీఘ్రముగ నుత్తరాఖండము వైపునకుఁ బ్రస్థానింపవలయును. ఇప్పుడు కలియుగము వచ్చినది. ఇఁక భూమిపై నుండరాదు."

ఇట్లని అర్జునుఁ డేడ్వఁ బ్రారంభించెను.

— o —